ఈనాడు

విజయవాడ 18-1-2026 ఆదివారం సిటీ సంపుటి 52 . సంచిక 158

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 8-00 పేజీలు 16+28

www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

మీరు బతకాలి బ్రో

- ఒత్తిళ్లు, మానసిక సమస్యలతో వైద్య విద్యార్థుల బలవన్మరణాలు
- ఎంతోమందిలో ఆత్మహత్యల ఆలోచనలు
- పరిష్కారానికి ప్రభుత్వ కార్యాచరణ
- మొదటి ఏడాది వారికి ప్రత్యేక శిక్షణలు

ఈనాడు – అమరావతి

వారు వైద్య విద్యార్థులు...
చదువు పూర్తిచేస్తే వైద్యులై అనారోగ్యాల్ని పారదోలతారు..
ఎంతోమంది ప్రాణాల్ని నిలబెడతారు..
ఎన్నో కుటుంబాల్లో వెలుగులు నింపే దేవుళ్లవుతారు.

రాబోయే రోజుల్లో ఉన్నతస్థాయికి ఎదిగే అవకాశమున్నా... ఒత్తిళ్లను ఎదుర్కోలేక, సమస్యలు అధిగమించలేక కొందరు కుంగిపోతున్నారు. చావే శరణ్యం అని భావిస్తున్నారు. విలువైన జీవితాలను అర్ధంతరంగా ముగిస్తున్నారు. బలవన్మరణాలకు పాల్పడుతున్న వారిలో ఎక్కువ మంది వైద్య విద్యార్థులతో పాటు కొందరు వైద్యులు ఉండటమూ కలవరపెడుతోంది. వైద్యవిద్యలో చేరిన వారిలో చాలామంది మొదటి ఏడాది మానసిక ఒత్తిడికి గురవుతున్నారని తాజా అధ్యయనాల్లో తేలింది. సమస్య పరిష్కారం దిశగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది.



■ 2010-19 మధ్యకాలంలో దేశంలో వైద్య విద్యార్థులు/రెసిడెంట్లు/వైద్యులు 358 మంది ఆత్మహత్య చేసుకున్నారు.

సమస్య ఎక్కడుంది?

గత ఐదేళ్లలో 122 మంది వైద్య విద్యార్థులు ప్రాణాలు తీసుకుంటే.. 1,270 మంది విద్యార్థులు ఒత్తిడి తట్టుకోలేక చదువు మధ్యలో మానేశారు.

■ వైద్య విద్యలో చేరేవారు కొత్త వాతావరణానికి అలవాటు పడలేకపోవడం.. సీనియర్ల ర్యాగింగ్ లాంటి సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు.

■ పాఠ్యాంశాల భారం, తరచూ పరీక్షలు.. కుటుంబసభ్యుల అంచనాలు అందుకోలేక, ఆర్థిక ఇబ్బందులతో సతమతం అవుతున్నారు.

■ పీజీలకు సరైన సెలవులు లేకపోవడం, క్లినికల్ బాధ్యతలు.. వరుస విధులు, సరైన విశ్రాంతి లేకపోవడం ఒత్తిడి పెంచుతోంది.

■ వైద్య కళాశాలల్లో సరైన కౌన్సెలింగ్, ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థల లేమితో సమస్య తీవ్రమవుతోంది.

■ మానసిక ఆరోగ్య సిబ్బంది.. సరైన శిక్షణ ఉన్న నిపుణులు లేక సమస్యలు వస్తున్నాయి.

(మిగతా 3లో)

గ్రీన్ హైడ్రోజన్ హబ్‌గా ఏపీ

- హరిత ఇంధనం అనగానే కాకినాడ గురించి ప్రస్తావించే రోజొస్తుంది
- 2027 జూన్‌కు 5 లక్షల టన్నుల ఎగుమతి
- త్వరలోనే హోప్ ఐలాండ్ నుంచి ఉపగ్రహ ప్రయోగం
- ఏఎం గ్రీన్ అమ్మోనియా ప్లాంట్ శంకుస్థాపనలో సీఎం చంద్రబాబు

ఈనాడు, కాకినాడ, రాజమహేంద్రవరం: రాబోయే రోజుల్లో ఆంధ్రప్రదేశ్.. గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా మారబోతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. భవిష్యత్తులో గ్రీన్ ఎనర్జీ అంటే ప్రపంచమంతా కాకినాడ గురించి చర్చించుకుంటారని చెప్పారు. 2025 జనవరి 6న గ్రీన్ అమ్మోనియాకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చామని.. వచ్చే ఏడాది జూన్ నాటికి కాకినాడ నుంచి 5 లక్షల టన్నుల ఉత్పత్తులను విదేశాలకు ఎగుమతి చేస్తామనే నమ్మకం తనకుందన్నారు. కాకినాడలో గ్రీన్ కో, ఏఎం గ్రీన్ ఆధ్వర్యంలో ప్రపంచంలోనే అతి భారీ గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి ప్లాంటు నిర్మాణానికి ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌తో కలిసి ముఖ్యమంత్రి శనివారం శంకుస్థాపన చేశారు. ఆ సంస్థ భాగస్వాములైన ఏఎం గ్రూప్ ఛైర్మన్ చలమలశెట్టి అనిల్‌కుమార్, ఏఎం గ్రీన్ ప్రెసిడెంట్ కొల్లి మహేశ్‌లను చంద్రబాబు అభినందించారు. మూడు విడతలుగా ప్లాంటు విస్తరణకు లక్ష్యాలు నిర్దేశించుకుని ముందుకు వెళ్తున్నారని.. కాకినాడలో 2 గిగావాట్ల ఎలక్ట్రోలైజర్స్ తయారీకి రూ.2వేల కోట్లు ఖర్చుపెట్టడం మంచి పరిణామమన్నారు. గ్రీన్‌కోలో ఇప్పుడు పెట్టిన పెట్టుబడి కాకుండా మరో 10 బిలియన్ డాలర్లు ఖర్చు చేయబోతున్నారని.. వీరికి ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందన్నారు. 2016-17లో అనిల్‌కుమార్ పంప్డ్ స్టోరేజీ కేంద్రం ఏర్పాటుకు (మిగతా 3లో)



గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా ప్లాంట్ నిర్మాణ పనులను స్విచ్ నొక్కి ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్. చిత్రంలో భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ఏఎం గ్రూప్ ఛైర్మన్ చలమలశెట్టి అనిల్‌కుమార్, ఏఎం గ్రీన్ ప్రెసిడెంట్ కొల్లి మహేశ్, ఇన్‌ఛార్జి కలెక్టర్ అపూర్వ భరత్ తదితరులు

పెట్టుబడుల కోసం దావోస్‌కు చంద్రబాబు

నేటి నుంచి 4 రోజుల పర్యటన

మొత్తంగా 36 కార్యక్రమాలు

ప్రపంచ ఆర్థిక సదస్సులో దిగ్గజ పారిశ్రామికవేత్తలతో వరుస భేటీలు

13లో

మనకూ అధునాతన రైళ్లు

- ఒకనాటి కలలన్నీ సాకారమవుతున్నాయి
- ఆధునిక భారత్‌లో ఇదో పెద్ద అడుగు
- వందేభారత్ స్లీపర్ రైళ్ల ప్రారంభోత్సవంలో మోదీ
- బెంగాల్‌కు చొరబాట్లే అసలు సవాల్ అని వ్యాఖ్య



మాల్దాలో శనివారం హావ్‌డా-గువాహటి మధ్య వందేభారత్ స్లీపర్ రైలును జెండా ఊపి ప్రారంభిస్తున్న ప్రధాని మోదీ

మాల్దా, గువాహటి


అభివృద్ధి చెందిన దేశాలను గమనిస్తూ మనకూ అలాంటివి వస్తాయా అని ఒకప్పుడు అనుకునేవాళ్లమని, ఇప్పుడు ఆ కలలన్నీ సాకారం అవుతున్నాయని ప్రధాని నరేంద్రమోదీ పేర్కొన్నారు. దేశంలోనే మొట్టమొదటిదిగా హావ్‌డా-గువాహటి మధ్య నడిచే వందే భారత్ స్లీపర్ (ఏసీ) రైలును శనివారం మాల్దా టౌన్ రైల్వేస్టేషన్లో ఆయన ప్రారంభించారు. దీంతోపాటు న్యూజల్పాయ్‌గుడి నుంచి నాగర్‌కోయిల్, తిరుచిరాపల్లిలకు; అలీపుర్‌ద్వార్ నుంచి బెంగళూరు, ముంబయి (పన్వెల్)లకు వెళ్లే నాలుగు అధునాతన 'అమృత్‌భారత్ ఎక్స్‌ప్రెస్' రైళ్లకు వర్చువల్‌గా పచ్చజెండా చూపించారు. గువాహటి నుంచి హావ్‌డాకు వచ్చే వందేభారత్ స్లీపర్ రైలుకు కూడా ఆయన వర్చువల్‌గా జెండా ఊపారు. పూర్తి ఏసీ పెట్టెలతో నడిచే వందేభారత్ స్లీపర్ రైళ్లవల్ల ఈ మార్గంలో ప్రయాణ సమయం రెండున్నర గంటలు ఆదా అవుతుంది. పశ్చిమబెంగాల్‌లో రూ.3,250 కోట్ల వ్యయమయ్యే వివిధ రోడ్డు, రైలు ప్రాజెక్టులకు మోదీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ- బెంగాల్లో చేపట్టిన ప్రాజెక్టులు, ముఖ్యంగా నూతన రైళ్లు ఈ ప్రాంత యువతకు సాధికారత కల్పిస్తాయన్నారు.

అమెరికా, ఐరోపా కంటే ఎక్కువగా ఉత్పత్తి

రవాణా సదుపాయాలను ఆధునికీకరించడంతో పాటు దేశం స్వయంసమృద్ధి సాధించేలా చేస్తున్నామని మోదీ చెప్పారు. ఇప్పుడు అమెరికా, ఐరోపా కంటే మన దేశంలోనే (మిగతా 3లో)

మద్యం కుంభకోణం కేసులో.. విజయసాయిరెడ్డికి ఈడీ పిలుపు

22న విచారణకు హాజరు కావాలని నోటీసు



ఈనాడు, అమరావతి: వైకాపా ప్రభుత్వ హయాంలో జరిగిన రూ.వేల కోట్ల మద్యం కుంభకోణం కేసులో మాజీ ఎంపీ విజయసాయిరెడ్డికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నోటీసులు జారీ చేసింది. ఈ నెల 22న విచారణకు హాజరు కావాలని పేర్కొంది. ఈ కేసుకు సంబంధించి గతేడాది మే నెలలోనే ఈడీ మనీలాండరింగ్ చట్టం కింద అభియోగాలతో ఈసీఐఆర్ (ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్) నమోదు చేసింది. అందులో 33 మందిని నిందితులుగా చేర్చింది. గతేడాది సెప్టెంబరులో 5 రాష్ట్రాల్లోని 20 ప్రాంతాల్లో సోదాలు చేసి, కీలక ఆధారాలు సేకరించింది. ఈడీ పెట్టిన కేసులో వైకాపా తరఫున కీలకంగా (మిగతా 3లో)


వ్యాధి నివారణే ప్రధానం

- వైద్య, ఆరోగ్య రంగంలో దానిపై పెట్టుబడులు పెరగాలి
- డాక్టర్లూ దీనిపైనే ఎక్కువ సమయం వెచ్చించాలి
- జబ్బుపడక ముందే ఆరోగ్యాన్ని కాపాడుకోవడం అందరి విధి
- ఆరోగ్య సంరక్షణపై వైద్యుడు, రోగి మాట్లాడుకోవాలి

'ఈనాడు- ఈటీవీ'తో అమెరికన్ మెడికల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ బాబీ ముక్కామల

ఈనాడు – అమరావతి

జబ్బు పడిన తర్వాత ఆసుపత్రికి వెళ్లడం కాదని, ముందు నుంచీ ఆరోగ్యాన్ని కాపాడుకోవడమే ప్రతి ఒక్కరి లక్ష్యం కావాలని అమెరికన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు బాబీ (శ్రీనివాస్) ముక్కామల సూచించారు. గుండెపోటు వచ్చిన రోగికి చికిత్స కంటే గుండెపోటు నివారించడం తేలికని, డబ్బు కూడా తక్కువ ఖర్చవుతుందని అన్నారు. అమెరికా అయినా, భారతదేశమైనా వ్యాధి నివారణపై ఎక్కువ పెట్టుబడులు పెట్టాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. 'ఏదైనా తప్పు జరిగాకే మనం డాక్టర్‌ను కలుస్తాం. దానికి చాలా ఖర్చు చేస్తాం. ఉదాహరణకు స్టేజ్-1 రక్తపోటు ఉందని తెలుసుకోకుంటే అది సమస్యగా మారి స్టేజ్-2 లేదా స్టేజ్-3కి దారి తీస్తుంది. అప్పుడు గుండెపోటు వస్తుంది. ఆసుపత్రికి వెళ్తారు. ఆరోగ్య సంరక్షణలో అది మంచి పెట్టుబడి కాదు' అని పేర్కొన్నారు. 178 ఏళ్ల చరిత్ర కలిగిన ప్రతిష్ఠాత్మక అమెరికన్ మెడికల్ అసోసియేషన్ (ఏఎంఏ) అధ్యక్షుడిగా ఎన్నికైన ఈఎన్‌టీ వైద్య నిపుణులు డాక్టర్ బాబీ ముక్కామల 'ఈనాడు- ఈటీవీ'తో మాట్లాడారు. తెలుగు మూలాలున్న వైద్యుడికి లభించిన అసాధారణ గౌరవం ఇది. తక్కువ సాంకేతికత ద్వారా అవసరంలో ఉన్న కోట్ల మంది ప్రజలకు సహాయం అందించడమే లక్ష్యంగా ఏఎంఏ పనిచేస్తోందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఇంటర్వ్యూలోని ప్రధానాంశాలివీ..



డాక్టర్ బాబీ ముక్కామల

అలాంటి ఆహారం.. ఇలాంటి నిద్ర

మొక్కల ఆధారిత ఆహారాన్ని ఎక్కువగా తీసుకోవాలి. మాంసాహారం తక్కువగా తీసుకోవాలి. రోజూ ఏడుగంటల నిద్ర మన ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. ధూమపానానికి, మద్యపానానికి దూరంగా ఉండాలి. వీటినే లైఫ్‌స్టైల్ మెడిసిన్ అని పిలుస్తాం. (మిగతా 10లో)

విశాఖలో బ్యూరో ఆఫ్ ఇమిగ్రేషన్ కార్యాలయం

కేంద్ర ప్రభుత్వం సన్నాహాలు

ఈనాడు, విశాఖపట్నం : కేంద్ర ప్రభుత్వం విశాఖలో బ్యూరో ఆఫ్ ఇమిగ్రేషన్ కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తోంది. విశాఖలో పోర్టులు, విమానాశ్రయం ఉండటంతో దేశవిదేశాల నుంచి ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. ఎగుమతులు, దిగుమతులు గతంలో కన్నా బాగా పెరిగాయి. భోగాపురం విమానాశ్రయం అందుబాటులోకి వస్తే ఇవి మరింత ఊపందుకోనున్నాయి. ఈ నేపథ్యంలో పూర్తిస్థాయిలో ఇమిగ్రేషన్ సేవలకు ప్రత్యేక కార్యాలయం అవసరం కానుంది. దీంతో కేంద్ర హోంశాఖ విశాఖ నగరం మారికవలస సమీపంలోని వీఎంఆర్‌డీఏకు చెందిన ఓజోన్ వ్యాలీ లేఅవుట్‌లో కార్యాలయం ఏర్పాటుకు చర్యలు తీసుకుంది. ఇప్పటికే స్థలం కొనుగోలు ప్రక్రియ పూర్తయింది. (మిగతా 3లో)

ఇదీ సంగతి!



మనకెవరిస్తారు మెడల్స్!
అందుకే కొట్టుకొచ్చా.
నీకు గిఫ్ట్‌గా ఇద్దామని.. ఎలా ఉంది!!

జాతీయ రహదారుల యోగం ఎప్పుడు?

- కేంద్రం వద్ద 31 ఆర్అండ్‌బీ రోడ్ల ప్రతిపాదనలు
- నాలుగున్నరేళ్లుగా ఒక్క రోడ్డుకూ ఎన్‌హెచ్ భాగ్యం లేదు
- ఆ రోడ్లు జాతీయ రహదారులైతే మారనున్న రూపురేఖలు
- ప్రమాదాలు తగ్గించేలా విస్తరణ, బైపాస్‌ల నిర్మాణానికి వీలు



ప్రకాశం జిల్లాలోని చీమకుర్తి వద్ద రహదారి దుస్థితి


■ గుంటూరు నుంచి నారాకోడూరు, చేబ్రోలు, పొన్నూరు మీదుగా బాపట్ల వరకు ఉన్న రాష్ట్ర రహదారిలో రోజుకు సగటున 33,879 పాసింజర్ కార్ యూనిట్లు (పీసీయూలు) రాకపోకలు సాగిస్తున్నాయి. ఇది గుంటూరు వద్ద కోల్‌కతా-చెన్నై హైవేని, బాపట్ల వద్ద కత్తిపూడి-ఒంగోలు హైవేని అనుసంధానం చేస్తుంది. దీనిని జాతీయ రహదారిగా గుర్తించి, నాలుగు వరుసలుగా విస్తరించాలి. కానీ కేంద్రం నుంచి స్పందన లేదు.

■ బేస్తవారపేట నుంచి పొదిలి, ఉప్పలపాడు, చీమకుర్తి మీదుగా ఒంగోలు వరకు ఉన్న రాష్ట్రరహదారిపైనా రోజుకు సగటున 20,611 పీసీయూల వాహనాల పరుగులు పెడుతున్నాయి. దీన్నీ నాలుగు వరుసలుగా విస్తరించాలి. కానీ కేంద్రం కనీసం జాతీయ రహదారిగా గుర్తించలేదు.

ఈనాడు – అమరావతి

ఏవైనా రెండు జాతీయ రహదారుల మధ్య కనెక్టివిటీ కల్పించే ఆర్అండ్‌బీ రోడ్లను.. జాతీయ రహదారులుగా కేంద్రం గుర్తిస్తుంది. వాటిలో వాహన రద్దీ ఆధారంగా 10 మీటర్ల వెడల్పుతో రెండు వరుసలుగాను, అత్యధిక ట్రాఫిక్ ఉంటే నాలుగు వరుసలుగా విస్తరిస్తుంది. ఇలాంటి 31 రోడ్లను ఎంపిక చేసి.. రాష్ట్రం నుంచి కేంద్రానికి పంపారు. ఈ ప్రతిపాదనలను కేంద్రం ఆమోదించాలి. నాలుగున్నరేళ్లుగా కేంద్రం పట్టించుకోవట్లేదు. 2021 సెప్టెంబరు తర్వాత ఒక్క ఆర్అండ్‌బీ రహదారికీ ఎన్‌హెచ్ భాగ్యం కల్పించలేదు. ఆయా రాష్ట్ర రహదారుల్లో మరింత వాహనరద్దీ పెరిగి, ప్రమాదాలు చోటుచేసుకుంటున్నా.. కేంద్రం తనకేమీ పట్టనట్లు వ్యవహరిస్తోంది.

ఓ రోడ్డులో రాకపోకలు సాగించే వాహనాలను పాసింజర్ కార్ యూనిట్లతో లెక్కిస్తారు. ఒక కారును ఒక పీసీయూగా, బస్సు లేదా లారీలైతే (మిగతా 10లో)


ALLEN KOTA
Now also in Vijayawada
Start your JEE & NEET success journey today
ALLEN
Physics
Champions of NEET (UG) 2025
AIR 4
Mrinal Kishore Jha
Classroom Course
AIIMS, Delhi
AIR 7
Keshav Mittal
Classroom Course
AIIMS, Delhi
AIR 8
Jha Bhavya Chirag
Classroom Course
AIIMS, Delhi
AIR 10
Aarav Agarwal
Distance Learning
AIIMS, Delhi
Champions of JEE (ADV.) 2025
AIR 1
Rajit Gupta
Classroom Course
IIT, Bombay (CSE)
AIR 2
Saksham Jindal
Classroom Course
IIT, Bombay (CSE)
AIR 6
Akshat K. Chaurasia
Classroom Course
IIT, Bombay (CSE)
AIR 8
Devesh Pankaj Bhaiya
Classroom Course
MIT, US
Admissions Open for Class 11th & 12th (Session 2026-27)
NEET UG | IIT-JEE | AP EAPCET | Olympiads | Classes 8th to 10th
Don't Miss Your Special Fee Benefit 2!
Additional Scholarship* on NEET & JEE Courses only
TALLENTEX, SHARP & ASAT Scholars Receive a Dual Advantage: Scholarship* + SFB*
Valid till: 20 JANUARY 2026
ASAT
Test Dates: 18 & 25 Jan.
Appear for Scholarship Test and Get up to 90% Scholarships*
SCAN TO REGISTER
*Subject to T&Cs of scholarship, rewards and other fee benefits.
ALLEN VIJAYAWADA
96060 45068, 92570 60728, 99125 14555
allen.ac.in/vijayawada
GAYATRI NAGAR
BENZ CIRCLE
Address: 59-13-34 & 34/1, Shiva Yogiswari Estate, Gayatri Nagar
Zonal Office ALLEN BENGALURU
95137 63144 allen.ac.in/bengaluru
Regd. & Corporate Office ALLEN KOTA
86906 60111 allen.ac.in
Disclaimer: We provide an academic ecosystem and environment for the students to prepare for their target examinations. Studying at a coaching institute does not guarantee selection in the examinations. Selection also depends on other factors like preparation, available admission seats in the competitive exam, and the number of applicants appearing. All the students mentioned are part of paid and full time classroom course.

గ్రీన్ హైడ్రోజన్ హబ్‌గా ఏపీ

(మొదటి పేజీ తరువాయి)

అనుమతులు కోరగా ప్రోత్సహించానని, ఇంధన రంగంలో గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా ప్లాంట్ ఏర్పాటు గేమ్‌ఛేంజర్ అయిందని చంద్రబాబు పేర్కొన్నారు. ఆయన ఏమన్నారంటే..

"విద్యుత్తు రంగంలో సంస్కరణలు తెచ్చిన తొలి రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. 2014లో గ్రీన్ ఎనర్జీకి, 2025లో గ్రీన్ హైడ్రోజన్‌కు, గ్రీన్ అమ్మోనియాకు నాంది పలికాం. సాంకేతికతను సక్రమంగా ఉపయోగించడం వల్ల ఈ ఏడాది యూనిట్ ప్రొక్యూర్‌మెంట్ ధర రూ.5.19 ఉంటే రూ.4.20కి తగ్గించాం. మూడేళ్లలో మరో రూ.1.19 మేర తగ్గించే పనిలో ఉన్నాం.



కాకినాడలో నిర్వహించిన గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా ప్లాంట్ శంకుస్థాపన కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు. వేదికపై ఏఎం గ్రీన్ ప్రెసిడెంట్ కొల్లి మహేశ్, ఎంపీ సానా సతీష్, ఏఎం గ్రూప్ ఛైర్మన్ చలమలశెట్టి అనిల్‌కుమార్, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, మంత్రి సుభాష్, ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్, ఎమ్మెల్యే నానాజీ

20 పోర్టులు రాబోతున్నాయి

రాష్ట్రంలో ఉన్నట్లు వెయ్యి కిలోమీటర్ల తీరం మరెక్కడా లేదు. హబ్ అండ్ స్పోక్ మోడల్‌లో 20 పోర్టులు రానున్నాయి. సన్‌రైజ్ ఆంధ్రప్రదేశ్‌కు ఏఎం గ్రీన్ కో వెలుగులివ్వనుంది. ప్రపంచం మొత్తం బొగ్గు, చమురు, సహజవాయువు లాంటి సంప్రదాయ ఇంధనాలపై ఆధారపడ్డాయి. దీని వల్ల అభివృద్ధి జరిగినా పర్యావరణానికి ముప్పు వాటిల్లింది. ఈ విషయంలో యూరప్ స్పష్టమైన నిర్ణయాలు తీసుకోగా, దానికి అనుకూలంగా ప్రధాని మోదీ స్పందించి దేశంలో 500 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తికి నిర్ణయించారు. రాష్ట్రంలో 160 గిగావాట్లు ఉత్పత్తి చేస్తున్నాం.

ఈ ఏడాది నుంచే డ్రోన్ అంబులెన్స్‌లు

మనకు డ్రోన్‌సిటీ వస్తోంది. ఏడాదిలో డ్రోన్ ట్యాక్సీలు రావాలి. తమిళనాడు అన్నామలై విశ్వవిద్యాలయం నిపుణులు డ్రోన్ అంబులెన్స్‌లు తయారుచేసే సామర్థ్యముందని చెప్పారు. ఈ ఏడాదిలోనే వీటిని అందుబాటులోకి తెస్తాం.

హోప్ ఐలాండ్ కేంద్రంగా ఉపగ్రహ ప్రయోగాలు

రాష్ట్రంలో స్పేస్ సిటీ నుంచి త్వరలో ఉపగ్రహాలను ప్రయోగించగలం. ఆ రంగంలోనూ అనిల్ ఆసక్తి చూపిస్తున్నారు. త్వరలోనే కాకినాడ హోప్ ఐలాండ్ నుంచి పంపుతారు. రాష్ట్రంలో గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ, క్వాంటమ్ వ్యాలీ ప్రకటించాం.

నాడు ఎన్టీఆర్ హామీ ఇచ్చి నెరవేర్చారు

ఎన్టీ రామారావు 1982-83లో రాష్ట్రంలో పర్యటిస్తున్నప్పుడు.. ఎరువుల కర్మాగారం ఏర్పాటుచేయాలన్న డిమాండ్ వచ్చింది. నాగార్జున ఫెర్టిలైజర్ ఏర్పాటుకు హామీ ఇవ్వడంతో ఇక్కడ ఏర్పాటైంది. అప్పుడు గ్రే అమ్మోనియా ఉత్పత్తి చేసిన ప్రాంతంలోనే ఇప్పుడు గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి చేసి ప్రపంచ దేశాలకు పంపించేందుకు సిద్ధమవుతోంది.

■ ఇటీవల నీటి నాణ్యతలు పరీక్షిస్తే నత్రజని అధికంగా ఉన్న రాష్ట్రాల్లో ఏపీ ఏడో స్థానం, లవణ సాంద్రతలో 6-7 స్థానాల్లో ఉంది. వ్యవసాయ రంగానికి గ్రీన్ అమ్మోనియా చాలా మేలు చేస్తుంది.

సంక్రాంతికి 30 లక్షల జనాభా.. మూడు లక్షల కార్లు


రాష్ట్రవ్యాప్తంగా మూడు రోజులు సంక్రాంతిని వైభవంగా నిర్వహించారు. ఇతర ప్రాంతాల నుంచి 30 లక్షల మంది వచ్చారు. హైదరాబాద్ నుంచి 3లక్షల కార్లు రావడంతో రోడ్లన్నీ నిండిపోయాయి. ప్రపంచంలో తొలిసారి అతిపెద్ద గ్రీన్ అమ్మోనియా ప్లాంట్‌కు గ్రీన్‌కో శ్రీకారం చుట్టడం ఓ చరిత్ర. పర్యావరణహిత ప్లాంటు ఏర్పాటుతో అందరికంటే ఎక్కువగా ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆనందిస్తారు" అని చంద్రబాబు పేర్కొన్నారు.

హెలికాప్టర్ మొరాయించడంతో ఆలస్యం

అమరావతి నుంచి కాకినాడ వచ్చేందుకు బయలుదేరే క్రమంలో హెలికాప్టర్ మొరాయించడంతో కొంత ఆలస్యమైంది. అయినా ఈ చరిత్రాత్మక కార్యక్రమానికి హాజరవ్వాలనే లక్ష్యంతో కాకినాడ నుంచి హెలికాప్టర్ తెప్పించుకుని వచ్చినట్లు ముఖ్యమంత్రి చెప్పారు.



కార్యక్రమానికి హాజరైన సంస్థ ప్రతినిధులు, ప్రజలు



మీరు బతకాలి బ్రో

(మొదటి పేజీ తరువాయి)

ఎన్ఎంసీ అధ్యయనంలో ఏం తేలిందంటే?

జాతీయ వైద్య కమిషన్(ఎన్ఎంసీ) 2024లో నిర్వహించిన సర్వేలో వైద్య విద్యార్థుల్లో అధిక ఒత్తిడి, మానసిక సమస్యలు, ఆత్మహత్య ఆలోచనలు ఉన్నట్లు గుర్తించింది. 37,962 మంది వైద్య విద్యార్థులు, బోధకుల స్పందనల ఆధారంగా కీలక సమస్యల్ని గుర్తించింది.

■ మానసిక ఆరోగ్య సమస్యలు యూజీ(ఎంబీబీఎస్) విద్యార్థుల్లో 27.8 శాతం, పీజీ విద్యార్థుల్లో 15.3 శాతం ఉన్నట్లు గుర్తించారు.

■ ఆత్మహత్య ఆలోచనలు యూజీ విద్యార్థుల్లో 16.2 శాతం, పీజీ విద్యార్థుల్లో 31.2 శాతం ఉన్నట్లు తేలింది.

■ 19 శాతం యూజీ విద్యార్థులకు మానసిక ఆరోగ్య సేవలు అందుబాటులో లేవు.

■ మానసిక సమస్యలున్నా సహాయం కోరడానికి 41 శాతం మంది పీజీ విద్యార్థులు సంకోచిస్తున్నట్లు గుర్తించారు.

ఆత్మహత్యల కట్టడి దిశగా అడుగులు

రాష్ట్రంలోని ప్రభుత్వ ప్రైవేట్ వైద్యకళాశాలల్లో ఎంబీబీఎస్ ప్రథమ సంవత్సరంలో చేరే విద్యార్థులకు మానసిక వికాసం దిశగా దశలవారీ ప్రత్యేక శిక్షణలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు క్యూపీఆర్ సంస్థ, ఎన్టీఆర్ ఆరోగ్య వర్సిటీ మధ్య ఇటీవల అవగాహన ఒప్పందం కుదిరింది.

■ ఆత్మహత్య ప్రమాదంలో ఉన్నవారిని గుర్తించి, వారితో మాట్లాడి పరివర్తన తెచ్చేందుకు 'ఆన్‌లైన్ క్యూపీఆర్ గేట్ కీపర్ శిక్షణ' ఇస్తారు.

■ సహచర విద్యార్థులతోనే మనోధైర్యం నింపేలా 'పీర్ మెంటార్ శిక్షణ' ఇప్పిస్తారు.

■ మానసిక ఆరోగ్యంపై అవగాహన, ఎమోషనల్ ఫస్ట్ ఎయిడ్, పరీక్షల ఒత్తిడి నిర్వహణపైనా అవగాహన కల్పిస్తారు.

■ సైకియాట్రిస్టులకు, వైద్య కళాశాలల ఫ్యాకల్టీలు, పీజీ ట్రైనీలకు ప్రత్యేక శిక్షణలు ఇచ్చి.. వీరి ద్వారా మిగిలిన వారిలో మనోధైర్యం నింపుతారు.

■ నిరంతర నైపుణ్యాభివృద్ధి, మానసిక, ఔషధ చికిత్సల ద్వారా ఆత్మహత్యల నుంచి దృష్టి మళ్లేలా చర్యలు చేపడతారు.

■ టెలీ-మానస్ లాంటి మానసిక ఆరోగ్య సహాయ సేవలు 24 గంటలూ అందుబాటులో ఉండేలా చర్యలు.

వైఫల్యాలను ఎదుర్కొనే సామర్థ్యం పెరగాలి

- డాక్టర్ ఉప్పల అపర్ణ, క్యూపీఆర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్(అమెరికా), భారత ప్రతినిధి



వైఫల్యాల్ని ఎదుర్కొనే సామర్థ్యం యువతలో తగ్గుతోంది. చదువులో, బంధాల్లో వైఫల్యాలను అధిగమించలేక ఆత్మహత్య చేసుకుంటున్నారు. ఇలాంటివారిని ముందే గుర్తించి అవగాహన కల్పించడమే క్యూపీఆర్ సంస్థ లక్ష్యం. ఇతరులతో పోలిస్తే వైద్య విద్యార్థులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. వారిలో ఒత్తిడి తగ్గించేందుకు శిక్షణ, అవగాహన కార్యక్రమాలు అవసరమని ఎన్ఎంసీ సూచించింది. ఎన్టీఆర్ ఆరోగ్య వర్సిటీతో ఒప్పందం మేరకు దశల వారీగా వైద్య కళాశాలల్లో శిక్షణల ద్వారా మార్పు తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నాం.

ఒత్తిడి తగ్గించేలా..

- డాక్టర్ పి.చంద్రశేఖర్, వీసీ, ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం



రాష్ట్రంలో 36 వైద్య కళాశాలల్లో ఏటా 7 వేల మంది వరకు ఎంబీబీఎస్‌లో చేరుతున్నారు. వీరిలో ఒత్తిడి తగ్గించి, మానసిక వికాసానికి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. క్యూపీఆర్ఐ సంస్థతో కుదుర్చుకున్న ఒప్పందంలో భాగంగా ప్రభుత్వ ప్రైవేట్ వైద్య కళాశాలల్లోని విద్యార్థుల మానసిక పరిస్థితిని అంచనా వేసి కౌన్సెలింగ్ ద్వారా చక్కదిద్దే చర్యలు చేపట్టాం.

పర్యావరణాన్ని కాపాడుకుంటూ అభివృద్ధి పరుగులు

● ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

ఈనాడు, కాకినాడ, రాజమహేంద్రవరం: ప్రధాని మోదీ సారథ్యంలో కేంద్రం సహకారంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో ప్రభుత్వం పర్యావరణాన్ని రక్షించుకుంటూ, రాష్ట్రాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపేందుకు కృషిచేస్తోందని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అన్నారు. ఈ ప్రయత్నాలలో గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్ట్ కీలకమైన ముందడుగని, పునరుత్పాదక ఇంధన వనరులను ప్రోత్సహిస్తూ రాష్ట్రాన్ని దేశంలో అగ్రస్థానంలో నిలపాలన్నదే తమ లక్ష్యమన్నారు. కాకినాడలో శనివారం గ్రీన్ కో, ఏఎం గ్రీన్ ఆధ్వర్యంలో గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి ప్లాంటు శంకుస్థాపన కార్యక్రమంలో



ఆయన మాట్లాడారు. "గత ప్రభుత్వంలో పారిశ్రామికవేత్తలను ఎలా ఇబ్బంది పెట్టారో అందరికీ తెలుసు. కూటమి ప్రభుత్వంలో పారిశ్రామికవేత్తలకు, పెట్టుబడులకు ఇబ్బంది లేకుండా ఆరోగ్యకర వాతావరణం ఉండాలని సీఎం సూచించారు. 495 ఎకరాల్లోని ప్రస్తుత ప్లాంట్‌లో ఏడాదికి 15 లక్షల టన్నుల గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి లక్ష్యం. భవిష్యత్తులో 10 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వచ్చే బలమైన కంపెనీగా తయారుచేయడం అభినందనీయం. ఈ సంస్థ గ్రీన్ అమ్మోనియా ఎగుమతికి జర్మనీకి చెందిన యూనిపర్‌తో ఒప్పందం చేసుకుంది. దేశం నుంచి యూరోపియన్ దేశాలకు జరుగుతున్న క్లీన్ ఎనర్జీ తొలి ఎగుమతి ఒప్పందం ఇదే. ఎరువులు, ఫార్మా, రసాయన, ప్లాస్టిక్ తయారీ పరిశ్రమల్లో గ్రీన్ అమ్మోనియా ముడిసరకుగా ఉపయోగపడుతుంది. చలమలశెట్టి అనిల్‌కుమార్ పద్నాలుగేళ్ల క్రితం చేతిలో డబ్బు లేకున్నా. . ఒక సంకల్పంతో ఉండేవారు. ప్రభుత్వ పెట్టుబడులు లేకుండా మహేశ్ కొల్లితో కలిసి ఏఎం గ్రీన్ కంపెనీ ఏర్పాటుచేశారు. జన్మస్థలమైన కాకినాడకు. . రాష్ట్రానికి, దేశానికి సేవ చేయడం అభినందనీయం" అని పవన్ చెప్పారు.

ఇది శుభ పరిణామం: పీవీఎన్ మాధవ్



ఏడాది క్రితం ప్రధాని మోదీ విశాఖలో గ్రీన్ హైడ్రోజన్ హబ్‌కు అంకురార్పణ చేశారని. . ప్రస్తుతం కాకినాడలో గ్రీన్ అమ్మోనియా ప్లాంట్ ఏర్పాటు శుభ పరిణామమని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. వాతావరణంలోని కర్బన ఉద్గారాలనే భూతాన్ని ఏఎం గ్రీన్ హరిస్తుందని చెప్పారు.

■ ఏఎం గ్రీన్ ప్రెసిడెంట్ కొల్లి మహేశ్ తమ సంస్థ ఏర్పాటు, లక్ష్యాల గురించి వివరించారు. సీఈఓ గౌతంరెడ్డి సంస్థతో వివిధ దేశాల ఒప్పందాల గురించి వివరిస్తూ ప్రతినిధులతో వర్చువల్‌గా మాట్లాడించారు. ఎంపీలు సానా సతీష్, తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, హరీష్ మాధుర్, కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, శాసనసభ్యులు పంతం నానాజీ, వనమాడి వెంకటేశ్వరరావు, జ్యోతుల నెహ్రూ, చినరాజప్ప, యనమల దివ్య, సత్యప్రభ, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, కాకినాడ ప్లాంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎ.శ్రీనివాసులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

విశాఖలో బ్యూరో ఆఫ్ ఇమిగ్రేషన్ కార్యాలయం

(మొదటి పేజీ తరువాయి)

కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలో బ్యూరో ఆఫ్ ఇమిగ్రేషన్(బీవోఐ) పనిచేస్తుంది. నౌకాశ్రయాలు, విమానాశ్రయాల్లోని ఇమిగ్రేషన్ వ్యవహారాలన్నీ బీవోఐ పరిధిలోకి వస్తాయి. విదేశాల నుంచి రాకపోకలు సాగించే ప్రయాణికుల వ్యవహారాలను వారే పరిశీలిస్తారు. సిబ్బంది కొరతతో ప్రస్తుతం తనిఖీలు సక్రమంగా జరగడం లేదు. ఒక్కోసారి రాష్ట్ర పోలీసుల సహకారం తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర హోంశాఖ బీవోఐని బలోపేతం చేయాలని నిర్ణయించింది.

ఓసీఆర్ కాంప్లెక్స్ నిర్మాణం..

ఇమిగ్రేషన్ తనిఖీల్లో ఆప్టికల్ క్యారెక్టర్ రికగ్నిషన్ (ఓసీఆర్) కాంప్లెక్స్ కీలకం. త్వరలో దీన్ని. . కొనుగోలు చేసిన స్థలంలో నిర్మించనున్నారు. ఇది ఇమిగ్రేషన్‌కు ఒక చెక్‌పోస్టు లాంటిది. అందులో విదేశీయులకు చెందిన దస్త్రాలను సాంకేతికంగా విశ్లేషిస్తారు. అవసరమైన సమాచారాన్ని భద్రపరుస్తారు.

మనకూ అధునాతన రైళ్లు

(మొదటి పేజీ తరువాయి)

ఎక్కువ రైలింజిన్లు, బోగీలు తయారవుతున్నాయని తెలిపారు. "సమీప భవిష్యత్తులో దేశవ్యాప్తంగా వందేభారత్ స్లీపర్ రైళ్లు అందుబాటులోకి వస్తాయి. ఇప్పటికే నడుస్తున్న 150 వందేభారత్ రైళ్లతో మన రైల్వేవ్యవస్థ ఆధునిక సొబగులు సంతరించుకుని వేగంగా పరుగులు తీస్తోంది. దేశంలో తయారవుతున్న రైలింజన్లు, రైలుపెట్టెలు, మెట్రో రైళ్లు మనకు గుర్తింపు తెస్తున్నాయి. వీటిలో కొన్నింటిని మనం ఎగుమతి చేస్తూ ఆర్థికానికి ఊతమిస్తున్నాం" అని మోదీ చెప్పారు.

శరణార్థులకు కలవరం అవసరం లేదు

త్వరలో పశ్చిమబెంగాల్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో తృణమూల్ సర్కారుపై మోదీ పలు విమర్శలు చేశారు. చొరబాటుదారులే బెంగాల్‌కు అతిపెద్ద సవాల్ అని, అంతమాత్రాన మతువా వంటి శరణార్థులు కలవరపడాల్సిన అవసరం లేదని చెప్పారు. మమతాబెనర్జీ ప్రభుత్వ అండతో అక్రమంగా పెద్దఎత్తున వలసలు వస్తున్నవారితో రాష్ట్ర జనాభా స్వరూపమే మారిపోతూ అల్లర్లకు ఆజ్యం పోస్తోందన్నారు. ప్రజల ఆకాంక్షలను తీర్చడంలో మమతా బెనర్జీ ప్రభుత్వం విఫలమైందని, బెంగాల్ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని చెప్పారు.

అస్సాంను అగౌరవపరిచిన కాంగ్రెస్

అస్సాం సంస్కృతి, సంప్రదాయాలను కాంగ్రెస్ అగౌరవపరిచిందని ప్రధాని మోదీ ఆరోపించారు. చొరబాటుదారులను ఎర్రతివాచీతో స్వాగతించిన పార్టీ కూడా అదేనని చెప్పారు. బెంగాల్ నుంచి శనివారం సాయంత్రం ఆయన అస్సాంకు చేరుకున్నారు. గువాహటిలో 10వేల మంది కళాకారులు ప్రదర్శించిన బోడో జానపద నృత్యం 'బాగురుంబా'ను తిలకించి ప్రసంగించారు. "అస్సాంలోని బోడోలాండ్ ప్రాంతం ప్రధాన స్రవంతితో కలవకుండా చేసింది కాంగ్రెస్. అస్సాం ముందున్న సవాళ్లకు చర్చల ద్వారా పరిష్కారాన్ని చూపే బదులు రాష్ట్రాన్ని హింసవైపు మళ్లించింది.. ఓటుబ్యాంకు రాజకీయాలకు పాల్పడింది. అక్రమంగా వచ్చి స్థిరపడినవారు రాష్ట్ర భూముల్లో పాగా వేశారు" అని మోదీ ఆరోపించారు. కిక్కిరిసిన జనసందోహం మధ్య గువాహటిలో ఆయన 4 కి.మీ. పొడవున రోడ్డుషోలో పాల్గొన్నారు.



హావ్‌డా-గువాహటి మధ్య తొలి వందేభారత్ స్లీపర్ రైలును ప్రారంభించి అందులో ప్రయాణిస్తున్న విద్యార్థులతో ముచ్చటిస్తున్న ప్రధాని మోదీ

దోపిడీకోరు ప్రభుత్వం కొల్లగొడుతోంది

తాము బెంగాల్లో అధికారంలోకి వస్తే కఠిన చర్యలతో అక్రమ వలసదారుల్ని ఏరివేస్తామని మోదీ చెప్పారు. కేంద్ర నిధులను "దోపిడీకోరు తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వం" కొల్లగొడుతోందని.. అవినీతి, హింస, బుజ్జగింపు రాజకీయాలకు ఆ పార్టీ పాల్పడుతోందని ఆరోపించారు. ఇలాంటి ప్రభుత్వం పోతేనే బెంగాల్ ప్రజలు అసలైన సంక్షేమాన్ని చూడగలరని చెప్పారు. హృదయం లేని, క్రూరమైన తృణమూల్ సర్కారు ప్రజాధనాన్ని కొల్లగొడుతోందని, పేదలకు అందాల్సిన కేంద్ర నిధుల్ని దిగమింగేస్తోందని ఆరోపించారు. ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య బీమాను అమలుచేయని ఏకైక రాష్ట్రం బెంగాలేనని చెప్పారు.

కులాల మధ్య వైకాపా నేతల చిచ్చు: కొల్లు రవీంద్ర

ఈనాడు, అమరావతి: పల్నాడు జిల్లా పిన్నెల్లిలో ఇటీవల జరిగిన వ్యక్తిగత గొడవకు వైకాపా నేతలు రాజకీయ రంగు పులిమి కులాల మధ్య చిచ్చుపెట్టాలని చూస్తున్నారని మంత్రి కొల్లు రవీంద్ర ధ్వజమెత్తారు. జగన్ ప్రభుత్వంలో ఆ పార్టీ నాయకులు చేసిన అరాచకాల్ని ప్రజలు ఇంకా మర్చిపోలేదని అన్నారు. హత్యా రాజకీయాలు, కక్ష సాధింపులకు కూటమి ప్రభుత్వం వ్యతిరేకమని స్పష్టం చేశారు. తప్పు చేసిన వారిని కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి అసాంఘిక శక్తుల మీద నిఘా పెట్టినట్టు వివరించారు.

పైపైకి ఎదిగింది.. విరగబూసింది!



ఇంటి ప్రాంగణంలో అందానికి నాటిన గులాబీ మొక్క ఏకంగా 15 అడుగుల ఎత్తు పెరిగింది. విరగపూసిన పూలతో అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా పొదలకూరులోని రాంనగర్ ప్రాంతానికి చెందిన సర్వర్‌జాన్ నివాసంలో ఈ మొక్క ఉంది.

- న్యూస్‌టుడే, పొదలకూరు

విద్వేషాలు రెచ్చగొట్టడమే జగన్ రాజకీయం

● మంత్రి కొలుసు పార్థసారథి

ఈనాడు, అమరావతి: కులాల మధ్య చిచ్చుపెట్టడం, ప్రాంతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టడమే వైకాపా అధినేత జగన్ రాజకీయమని మంత్రి కొలుసు పార్థసారథి ధ్వజమెత్తారు. వైకాపా 11 సీట్లకు పడిపోయినా ఆయన బుద్ధి మారలేదని మండిపడ్డారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో శనివారం విలేకరులతో పార్థసారథి మాట్లాడారు. "రాష్ట్రాభివృద్ధి, పెట్టుబడులపై వైకాపా నాయకులు విషం చిమ్ముతున్నారు. పీపీపీ విధానంలో ముందుకొచ్చే వారిని 'మేం వస్తే అరెస్టు చేస్తాం' అంటూ జగన్ హెచ్చరించడం దారుణం. 2019 ఎన్నికల సమయంలో అమరావతే రాజధాని అని ఆయన చెప్పారు. తీరా అధికారంలోకి వచ్చాక మూడు రాజధానుల పేరుతో విధ్వంసం సృష్టించారు' అని పార్థసారథి దుయ్యబట్టారు.

గ్రహం అనుగ్రహం

18-1-2026 ఆదివారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; ఉత్తరాయణం; హేమంత రుతువు, పుష్యమాసం, బహుళపక్షం

అమావాస్య: రా. 1-17 తదుపరి మాఘ శుక్ల పాడ్యమి

పూర్వాషాఢ: ఉ. 10-41 తదుపరి ఉత్తరాషాఢ

వర్జ్యం: రా. 7-13 నుంచి 8-56 వరకు

అమృత ఘడియలు: ఉ. 7-12 వరకు తిరిగి తె. 5-28 నుంచి

దుర్ముహూర్తం: సా. 4-14 నుంచి 4-58 వరకు

రాహుకాలం: సా. 4-30 నుంచి 6-00 వరకు

సూర్యోదయం: ఉ.6.38; సూర్యాస్తమయం: సా.5.43

చొల్లంగి అమావాస్య

చలి పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
విజయనగరం	14.0	28.0
శ్రీకాకుళం	15.0	29.0
విశాఖపట్నం	16.0	28.6
కడప	17.0	31.0
తిరుపతి	17.2	30.9
తాడేపల్లిగూడెం	18.0	31.0
అనంతపురం	18.0	32.7
కర్నూలు	18.4	32.5
గుంటూరు	19.0	31.0
రాజమహేంద్రవరం	19.0	33.5
విజయవాడ	19.2	30.4
ఒంగోలు	20.2	31.4
నరసాపురం	21.0	28.8
నెల్లూరు	21.4	30.4

మద్యం కుంభకోణం కేసులో.. విజయసాయిరెడ్డికి ఈడీ పిలుపు

(మొదటి పేజీ తరువాయి)

పనిచేసిన రాజ్ కెసిరెడ్డితో పాటు ఆ పార్టీ నేతలు.. ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి, జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో సీఎంవో కార్యదర్శిగా పనిచేసిన విశ్రాంత ఐఏఎస్ అధికారి ధనుంజయరెడ్డి, జగన్ ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డి, భారతి సిమెంట్స్ పూర్తికాలపు డైరెక్టర్ గోవిందప్ప బాలాజీతో పాటు ఏపీఎస్‌బీసీఎల్ మాజీ ఎండీ వాసుదేవరెడ్డి, ప్రత్యేక అధికారి సత్యప్రసాద్, ఎస్పీవై ఆగ్రో ఇండస్ట్రీస్ పూర్వ డైరెక్టర్ సజ్జల శ్రీధర్‌రెడ్డి తదితరులున్నారు. ముడుపుల వసూళ్లలో కీలకంగా వ్యవహరించిన రాజ్ కెసిరెడ్డి తోడల్లుడు ముప్పిడి అవినాశ్‌రెడ్డి, అనుచరులు చాణక్య, కిరణ్‌కుమార్ రెడ్డి, సైఫ్ అహ్మద్‌లతో పాటు మనీ రూటింగ్ కోసం వినియోగించిన డొల్ల సంస్థల యాజమాన్యాలను కూడా నిందితుల జాబితాలో చేర్చింది. మద్యం కుంభకోణంపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్‌కు లేఖ రాసి, వివరాలు తీసుకుంది. వాటి ఆధారంగా బ్యాంకు ఖాతాలు, ఆస్తుల సమాచారం, స్థిరాస్తి సంస్థల్లోకి నిధుల మళ్లింపు, అంతిమ లబ్ధిదారు ఎవరు అనే కోణంలో ఈడీ విచారణ జరుపుతోంది. 2025 సెప్టెంబరులో రాజ్ కెసిరెడ్డి భార్య పైరెడ్డి దివ్యారెడ్డి, యూవీ డిస్టిలరీస్ యజమానుల్లో ఒకరైన తీగల విజేందర్‌రెడ్డి డైరెక్టర్‌గా ఉన్న హైదరాబాద్ అరేట్ ఆసుపత్రి సహా పలుచోట్ల సోదాలు నిర్వహించింది. హైదరాబాద్, చెన్నైలోని మరికొన్ని ప్రాంతాల్లోనూ అప్పట్లో తనిఖీలు చేసి లావాదేవీలు పరిశీలించింది. బ్యాంకు ఖాతాల పత్రాలను స్వాధీనం చేసుకుంది. కేసులో ప్రధాన నిందితుడు రాజ్ కెసిరెడ్డిని ప్రశ్నించి వివరాలు సేకరించింది.

గతంలోనూ విచారణకు హాజరైన సాయిరెడ్డి

మద్యం కుంభకోణంపై సిట్ నమోదు చేసిన కేసులో విజయసాయిరెడ్డి ఏ5గా ఉన్నారు. ఇప్పటికే రెండుసార్లు విచారణకు హాజరయ్యారు. అప్పటి సీఎం ఐటీ సలహాదారుగా వ్యవహరించిన రాజ్ కెసిరెడ్డి ఈ కుంభకోణానికి సూత్రధారిగా వివరణ ఇచ్చారు. వైకాపా ప్రభుత్వంలో మద్యం పాలసీల తయారీకి సంబంధించిన సమావేశాల్లో విజయసాయిరెడ్డి పాల్గొన్నారు. ఈ కేసులో తాను విజిల్ బ్లోయర్ అని గతేడాది ఏప్రిల్‌లో 'ఎక్స్' వేదికగా ఆయన ప్రకటించుకున్నారు.



ఆలయాల నమూనాలు

ఏటి పండగ.. జనం నిండుగా!

సంక్రాంతి ముగింపు వేడుకల్లో భాగంగా శనివారం నెల్లూరులోని పెన్నానది తీరంలో ఏటి పండగను ఘనంగా నిర్వహించారు. భక్తులు గొబ్బెమ్మల నిమజ్జనంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇక్కడ ఏర్పాటు చేసిన పలు ఆలయాల నమూనాలు ఆకట్టుకున్నాయి. వేల మంది హాజరై సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. మంత్రి నారాయణ యువకులతో కలిసి గాలిపటాలు ఎగురవేశారు. - న్యూస్‌టుడే, నెల్లూరు (సాంస్కృతికం)



ఏటి పండగకు హాజరైన జనం

అన్న క్యాంటీన్ల ప్రారంభోత్సవం వాయిదా

ఈనాడు, అమరావతి: గ్రామీణ నియోజకవర్గ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్ల ప్రారంభోత్సవం వాయిదా పడింది. సంక్రాంతి కానుకగా ఆదివారం 30 చోట్ల వీటిని ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. కానీ, సీఎం చంద్రబాబు దావోస్ పర్యటన నేపథ్యంలో తాత్కాలికంగా వాయిదా వేశారు. ఆయన పర్యటన ముగించుకుని వచ్చాక క్యాంటీన్లు ప్రారంభించనున్నారు.

బతుకుదాం నిండుగా...

వృద్ధి అనే ధాతువులోంచి వచ్చిన- వృద్ధత, వృద్ధాప్యం, వార్ధకం, వార్ధక్యం... వంటి పదాలన్నింటికీ అర్థం- ముసలితనమనే! అదంటే- పెద్దలకు జలదరింపు. యువతకు ఏవగింపు. ముసలితనం మృత్యువులోగిలికి మునివాకిలి కాబట్టి- భయమెవుతుంది వృద్ధులను. వయసు మీదపడితే కొందరికి చాదస్తమనే మూడో హస్తం మొలుస్తుంది కాబట్టి- చికాకు పెడుతుంది యువతరాన్ని. నిజానికి వార్ధక్యమంటే మల్లెపొదలమీద అంటబెట్టిన పట్టుబట్ట. దులిపితే చాలు పరిమళం గుప్పుమంటుంది. ఆ సత్యాన్ని గుర్తిస్తే రెండు తరాల మధ్యా చిగురిస్తుంది సఖ్యత! ముసలితనం, మృత్యువు... రెండూ అనివార్యమైనవే. 'ఎవరు బతికేరు యాభైలు మూడు' అని శ్రీశ్రీ ప్రశ్నించింది అందుకే. ఆ రెంటినీ అంగీకరించడమే అందరికీ ఆరోగ్యకరం. వృద్ధాప్యం అనేది ఒంటరితనానికి పర్యాయపదంగా మారిపోయిన ఈ రోజుల్లో- దాన్ని ఏకాంతంగా మార్చుకుని, ఇష్టమైన వ్యాపకాలతో కాలాన్ని వెలిగించే వృద్ధులు- చాదస్తాలకు దూరం అవుతారు, తమవారికి దగ్గరవుతారు. ఊరొస్తోంది అనగానే బ్యాగులూ అవీ సరి చూసుకుని రైల్లోంచి దిగిపోయేంత తేలిగ్గా- 'సాకేక వేళయిందిరా' అంటూ తమవారి కన్నీళ్లు తుడిచి మరీ తుది వీడ్కోలు చెబుతారు.

'ఆకాశాన్ని నింపాదిగా చీకటి ఆవరిస్తోంది (ది స్కై. గెట్స్ డార్క్, స్లోలీ)' అనే ప్రసిద్ధ గ్రంథంలో చైనా రచయిత జో దాషిన్ వార్ధక్యాన్ని హుందాతనంగా మార్చే అయిదు సూత్రాలను వివరించారు. 'నింగిని చీకటి పూర్తిగా మింగేవరకూ- నీ దారి పొడుగునా దీపాలు వెలిగిస్తూనే ఉండు' అన్నారాయన. ఆ ప్రయాణంలోనే, కవి అద్దేపల్లి ప్రభు చెప్పినట్లు- చినుకు గోదావరి అయినట్లు, మనిషి సమాజం అవుతాడు. నిజానికిది ముసలితనాన్ని నిరాకరించే ప్రయత్నం. 'నా కర్తవ్యం పూర్తయ్యేంత వరకు నా జోలికిరాకు' అని చావును నిరోధించే సంకల్పం. వేదంలోని 'శరదశ్శతం' సూక్తాలకు ఆచరణ రూపమది. దాశరథి శతకకర్త చెప్పిన 'ముప్పున కాల కింకరులు ముంగిట నిల్చినవేళ' దాకా- అంటే ఆఖరిక్షణం వరకూ జీవిస్తూనే ఉంటూ- చావు గురించి చింతించడం మర్చిపోయిన సూచనలవి. 'పక్వానికి రాగానే తీగనుంచి దోసపండు అలవోకగా విడిపోయినట్లు' అన్న మృత్యుంజయ మహామంత్ర సారాన్ని అనుభవంలోకి తెస్తాయా దీపాలు. బెంగతో కాకుండా- శ్రీనాథ మహాకవి మాదిరి 'దివిజ కవివరు గుండెయల్ దిగ్గురనెట్లు' హుందాగా, ధీమాగా సాగే మహాప్రస్థానానికి అవి ముందస్తు సన్నాహాలు.

భాగవతంలో పోతన అద్భుతంగా చెప్పాడు. 'నల్లని వెండ్రుకల్ తెల్లనయ్యే' స్థితినుంచి మొదలవుతుంది మనిషికి దిగులు. సత్యాన్ని అంగీకరించే పరిణతి వచ్చేసరికి 'నిర్మలంబు అనన్ వాల నెరయు చిత్తంబు' అన్నాడాయన. తల నెరిసిన బెంగ నుంచి- మనసు తేరుకుంటుంది. జీవనకళ పట్టుపడుతుంది. ఆపై బతుకు ఉత్సవంలా నడుస్తుంది. మృత్యుభయాన్ని జయించడమంటే- మృత్యువును ఒడిసిపట్టడమన్నది ఎరుక అనుభవంలోకి వస్తుంది. వృద్ధాప్యం వరం అవుతుంది. 'ప్రపంచ వ్యాప్తంగా వృద్ధుల సంఖ్య శరవేగంగా పెరుగుతోంది. 2050 నాటికి సీనియర్ సిటిజన్లు రెట్టింపు అవుతారు. ఒకరకంగా వృద్ధాప్య సునామీ ఇది' అనే 'జెరియాట్రిక్ సొసైటీ' అంచనాల నేపథ్యంలో- బతుకు నాణ్యతను నిర్ణయించేది వృద్ధాప్యమేనని గుర్తించాలి. మృత్యువు, ముసలితనాల దాడులకన్నా- వాటి గురించి చింత మరింత హానికరం. చితి మనిషిని కాలుస్తుంది- చింత మనసునూ దహిస్తుంది. విస్తరించిన మనిషి వృద్ధాప్యాన్ని- దిగంతాల సంతృప్తిని ధ్వనించే జ్ఞానస్వరంగా, వరంగా మార్చుకుంటాడు. కడకంటా నిండుగా, పండుగలా జీవిస్తాడు! 'శీతవేళ రానీయకు శిశిరానికి చోటీయకు' అన్న కృష్ణశాస్త్రి మాటను నిజం చేస్తాడు!



మనిషి మెదడు, హృదయం ఒకేలా ఉండాలి. ఒక విషయంలో ఉదారవాదం మరో విషయంలో సంప్రదాయవాదం పాటిస్తూండటం సరికాదు. అది హృదయాన్ని మూసి ఉంచుతుంది. తెలివితేటలను హక్కుల పరిధిని విస్తరించనీయదు.

- మహదేవ్ గోవింద్ రనడే

దేవుడెందుకు కనిపించడు?

చరాచర జగత్తు పరమాత్మకి ప్రతిరూపం. అందులో ఒక చిన్న భాగమైన మనిషి కూడా దైవాంశమే కాబట్టి అతడికీ దేవుడి లక్షణాలు రావడం సహజమే. తల్లిదండ్రుల లక్షణాలు పిల్లలకు రావడంలో ఆశ్చర్యమేముంది! మునులు, యోగులు, అవతార పురుషులు అందుకు ఉదాహరణలు. సముద్రం ఆవిరై, మేఘమై, వాన చినుకై, నదియై, అంతిమంగా మళ్లీ సాగరమే అవుతుంది. అదే విధంగా విశ్వచైతన్యం ఆత్మయాత్రని ప్రారంభించి ఏక కణజీవి నుంచి బహుకణ జీవిగా, మనిషిగా రూపాంతరం చెందుతుంది. జన్మ పరంపరలో చేసుకున్న కర్మ ఫలితాల కారణంగా విశ్వాత్మలో కలిసిపోయి, కరిగిపోయే ఆత్మజ్ఞానులు, సిద్ధపురుషులు, బుద్ధపురుషులు, ప్రబోధకులూ పరివర్తన చెందడమంతా పరమాత్ముడి నిర్దిష్ట నిర్ణీత గమన సూత్రానికి లోబడి జరిగేదే.

విత్తనం- మొక్కగా, చెట్టుగా, పువ్వుగా, పండుగా వివిధ రూపాలనెత్తి మళ్లీ విత్తనమవుతుంది. జగత్తులో జరిగే సృష్టికార్యం మొత్తం ఒకే ఒక్క ప్రామాణిక సూత్రంపైనే నడుస్తుంది. పంచభూతాల మూలకాలతో భౌతికరూపం దాల్చిన ప్రతిదీ కాలం సమీపించినప్పుడు మళ్లీ మొదటి స్థితికే వచ్చి చేరుతుంది. అలాంటి సృష్టిలోని సకల జీవరాశిలో ఒక్క మనిషే ప్రత్యేకతని సంతరించుకున్నాడు. ఆధ్యాత్మికాన్నింటినో సృష్టిస్తున్నాడు. దేవుడున్నాడనే సత్యాన్ని మనిషే గుర్తించాడు.



మనిషి- వ్యక్తి కాబట్టి వ్యక్తం అవుతాడు. మరి, దేవుడెందుకు వ్యక్తం కాడు అంటే- అతడు వ్యక్తికాడు కనుక. ఒక మూర్తికాదు, ఆకృతి కాని కాడు కాబట్టి. ఒక రూపం కలిగిన మూర్తికి పరిమితులూ, పరిధులూ ఉంటాయి. అవి ఎప్పుడైనా స్థల, కాలాలకు లోబడి ఉంటాయి. కానీ, విశ్వంలోని అన్ని ఆకృతులకు ప్రసాదాత్మ, అన్ని గుణాలకు భూమికగా ఉన్న దేవుడు- నిరాకారుడు, నిర్గుణుడు, అపరిమితుడు, అనంతుడు, కాలాతీతుడు. సకల లోకాల్లో విరాజిల్లే వెలుగులన్నింటికీ ఆధారమైన పరంజ్యోతి అతడు. సర్వ శబ్దాలకు మూలమైన ప్రణవనాదమైన 'ఓం' అతడు!

చెట్టుకు మొత్తంగా నిలిచిన విత్తనం ఎవరికీ కనిపించకుండా మట్టి పొరల కింద ఉండిపోయినట్లు-సృష్టి కారకమైన చైతన్యం జగత్తునంతా మోస్తూ విశ్వమంతటా వ్యాపించి ఆగుపడకుండా ఉంది. ఒక తల్లి చేపను పిల్ల చేప అడిగింది. 'అమ్మా! నువ్వెప్పుడైనా సముద్రాన్ని చూశావా' అని. 'ఆత్మజ్ఞానం పొందిన కొన్ని చేపలు సముద్రం అనేది మన లోపల, బయటా, అంతటా నిండి ఉందని చెప్పాయి. కానీ, నాకు మాత్రం ఇప్పటివరకూ కనపడనే లేదు' చెప్పింది తల్లిచేప. ఒకచోట ఉండి మరోచోట లేనిదాన్ని వెతికి పట్టుకోగలం. అంతటా ఉన్నదాన్ని గుర్తించడం కష్టం. అపారమైన ఆత్మజ్ఞానం ఉంటే తప్ప తెలుసుకోలేం. అంతిమ సత్యాన్ని (దైవాన్ని) చేరుకోవడానికి అవగాహన మొదటి మెట్టు లాంటిదైతే, అర్థం చేసుకోవడం ఆఖరి మెట్టు. ధర్మబద్ధమైన నడకతో సాగిపోతూ ఆపసవృత్తిని, నిరంతర ఎరుకతో జీవన గమనాన్ని పరిశీలిస్తూండాలి. ఆ అంతఃపరిశోధనలో భాగంగా ముందు 'నేనెవర్ని' అని తెలుసుకుంటే అటు పిమ్మట దైవం అంటే ఏమిటో అర్థమవుతుంది.

- మునిమడుగుల రాజారావు

డేటా కేంద్రాలకు హరిత శక్తి



దేశంలో ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్ వంటి సాంకేతికతల వినియోగం పెరుగుతున్న కొద్దీ... డేటా సెంటర్ల అవసరమూ పెరిగిపోతుంది. ఈ కేంద్రాల నిర్వహణకు భారీగా విద్యుత్ అవసరం. అలాగని శిలాజ ఇంధనాలతో విద్యుదుత్పత్తిని పెంచితే భూతాపం అధికమవుతుంది. పైగా డేటా సెంటర్లలో నీరు, ఇతర సహజ వనరుల అవసరం ఎక్కువ. పర్యావరణానికి హాని చేయకుండా డిజిటల్ ఆర్థిక వ్యవస్థను విస్తరించడానికి గ్రీన్ హైడ్రోజన్ సాయపడుతుంది.

నేటి డిజిటల్ ప్రపంచంలో బ్యాంకింగ్, ఆన్‌లైన్ పాలనా సేవలు, విద్యా వైద్యాలు, పరిశ్రమలు, పరిశోధన-అభివృద్ధి ఇలా ప్రతి రంగానికీ డేటా సెంటర్ల సేవలు తప్పనిసరి అవుతున్నాయి. ప్రపంచంలో ఉత్పత్తి అవుతున్న మొత్తం విద్యుత్తులో 2-3 శాతాన్ని డేటా సెంటర్లే వినియోగించుకుంటున్నాయి. ఏఐ ఆధారిత సేవలు విస్తరిస్తున్న కొద్దీ డేటా సెంటర్లూ, వాటి విద్యుత్ అవసరాలూ బాగా పెరిగిపోతూ ఉంటాయి. ఒక పెద్ద డేటా సెంటర్‌ను నడపడానికి ఏటా 8-10 టెరావాట్ అవర్ల విద్యుత్ కావాలి. ఇది ఒక పెద్ద నగరం, లేదంటే చిన్న దేశం ఏడాది కాలంలో వినియోగించే కరెంటుకు సమానం! కాబట్టి, విద్యుదుత్పత్తిని పెంచడంతోపాటు దాన్ని పొదుపుగా సమర్థంగా వాడుకోవాలి.

అంతర్జాతీయ అనుభవం నుంచి పాఠాలు...

ఇండియా, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు డేటా సెంటర్ల ఏర్పాటును స్వాగతిస్తున్నాయి. ఏపీ ప్రభుత్వం విశాఖపట్నాన్ని అంతర్జాతీయ డేటా సెంటర్ హబ్‌గా అభివృద్ధి చేయడానికి గట్టి చర్యలు తీసుకుంటోంది. రేవులు, అంతర్జాతీయ సముద్రగర్భ కేబుల్ లింకులు, భారీ సౌర, పవన విద్యుదుత్పత్తి కేంద్రాలు ఉన్న ఆంధ్రప్రదేశ్ డేటా సెంటర్ల స్థాపనకు ఎంతో అనువైనది. ఈ సౌకర్యాలే రాష్ట్రానికి ఇలాంటి సెంటర్లను ఆకర్షిస్తున్నాయి. ఇప్పటికే గూగుల్ సంస్థ ఒక గిగావాట్ డేటా కేంద్ర స్థాపనకు విశాఖను ఎంచుకుంది. అక్కడ సుమారు రూ.1.35లక్షల కోట్ల (1,500కోట్ల డాలర్ల) పెట్టుబడి పెడుతోంది. రిలయన్స్ కూడా ఒక గిగావాట్ డేటా సెంటర్ స్థాపనకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. విశాఖలోనే ఒక గిగావాట్ డేటా కేంద్రం ఏర్పాటుకు బ్రూక్ ఫీల్డ్ సంస్థ అవగాహన ఒప్పందంపై సంతకం చేసింది. మొత్తం ఆరు గిగావాట్ల డేటా సెంటర్లను స్థాపించదలచిన ఆంధ్రప్రదేశ్- దేశంలోనే అతిపెద్ద డేటా సెంటర్ హబ్‌లలో ఒకటిగా ఆవిర్భవించనుంది.



పెద్ద సంఖ్యలో డేటా సెంటర్లను నెలకొల్పితే విద్యుత్, నీటి అవసరాలు పెరిగిపోతాయి. అది స్థానిక వనరులపై ఒత్తిడికి కారణమవుతుంది. ఐర్లాండ్‌లో ఉత్పత్తి అవుతున్న విద్యుత్తులో 20శాతాన్ని డేటా సెంటర్లకే సరఫరా చేయాల్సి వస్తోంది. అందుకనే, ఆ కేంద్రాలు నీటినీ కరెంటునూ సమర్థంగా వినియోగించుకోవాలని సింగపూర్, నెదర్లాండ్స్ దేశాలు నిబంధన విధించాయి. పర్యావరణ పరిరక్షణతో పాటు స్థానిక ప్రజలు, పరిశ్రమల అవసరాలకు భంగం కలగని రీతిలో డిజిటల్ ఆర్థిక వ్యవస్థను ముందుకు తీసుకుపోవాలని ప్రభుత్వాలు గుర్తిస్తున్నాయి. ఇలాంటి తరుణంలో గ్రీన్ హైడ్రోజన్ అధిక ప్రాధాన్యం సంతరించుకుంటోంది. డేటా సెంటర్లకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే ప్రత్యామ్నాయంగా (బ్యాకప్‌గా) లక్షలాది అత్యవసర డీజిల్ జనరేటర్లను వాడుతున్నారు. వాటివల్ల కర్బన ఉద్గారాలు పెరిగిపోతున్నాయి. కాబట్టి పర్యావరణానికి భంగం కలగని రీతిలో డేటా సెంటర్లను నిర్వహించాల్సిన అవసరముంది. ఈ జనరేటర్ల స్థానంలో హైడ్రోజన్ ఫ్యూయెల్ సెల్స్‌ను వాడితే పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుంది. రోజంతా విద్యుత్తును అందించగల ఈ సెల్స్‌ను ఇప్పటికే పరీక్షించారు. మొదట అత్యవసర సమయాల్లో వాడే బ్యాకప్ డీజిల్ జనరేటర్ల బదులు హైడ్రోజన్ ఫ్యూయెల్ సెల్ జనరేటర్లను ఉపయోగించాలి. భారీ డేటా సెంటర్లు కొన్ని నిర్దిష్ట సమయాల్లో ఈ సెల్స్‌ను వాడుకోవచ్చు. విశాఖ లోపల, చుట్టుపక్కల ఏర్పాటయ్యే ఈ కేంద్రాల కోసం హైడ్రోజన్ సెల్స్‌కు అవసరమైన వసతులను కల్పించాలి. హైడ్రోజన్ పైపులైన్లు, నిల్వ కోసమే కాకుండా, ఈ ఇంధనాన్ని ఉత్పత్తి చేయడానికి అవసరమైన ఎలక్ట్రోలైజర్ పార్కుల నిర్మాణానికీ కొంత భూమిని ప్రత్యేకించాలి. ప్రస్తుత అవసరాలతో పాటు, మరో అయిదేళ్లలో పెరిగే డిమాండ్‌ను కూడా దృష్టిలో పెట్టుకుని ఈ కేటాయింపులు జరగాలి.

గ్రిడ్‌పై భారం పడకుండా...

హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్స్ ఉత్పత్తి వల్ల ఆర్థిక వ్యవస్థకే కాకుండా మొత్తం పర్యావరణానికి కలిగే ప్రయోజనాల గురించి ప్రజలకు విడమరిచి చెప్పాలి. ఈ సమాచారాన్ని స్థానిక సంస్థలకు అందించాలి. సమాచార సాధనాల ద్వారా అందరికీ తెలియజెప్పి, సమాజం నుంచి మద్దతు పొందాలి. హైడ్రోజన్‌ను సులభంగా నిల్వ చేయవచ్చు. అత్యవసర సమయాల్లో దాన్ని తేలిగ్గా విద్యుచ్ఛక్తిగా మార్చి ఉపయోగించుకోవచ్చు. కీలక సమయాల్లో దాన్ని డేటా సెంటర్లకు పంపిణీ చేసి స్థానిక విద్యుత్ గ్రిడ్‌పై ఎక్కువ భారం పడకుండా నివారించవచ్చు. చాలా దేశాలు ఇప్పటికే హైడ్రోజన్ బాట పట్టాయి. భారత్ జాతీయ హైడ్రోజన్ మిషన్ కింద 2030కల్లా 50లక్షల టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తిని చేపట్టాలని లక్షిస్తోంది. అమరావతిలో నెలకొల్పే గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ ప్రాజెక్టు ద్వారా ఆంధ్రప్రదేశ్ ఈ లక్ష్య సాధనలో కీలక భాగస్వామి కానుంది. 2029 నుంచి ఈ ప్రాజెక్టు ఏటా 15లక్షల టన్నుల గ్రీన్ హైడ్రోజన్‌ను ఉత్పత్తి చేస్తుంది. అయిదు గిగావాట్ల ఎలక్ట్రోలైజర్ ఉత్పత్తి సామర్థ్యాన్ని సంతరించుకోవాలనీ ఏపీ తలపెట్టింది. మూడేళ్లలో కిలో గ్రీన్ హైడ్రోజన్ ధరను రూ.160-170కి తగ్గించాలని యోచిస్తోంది. భారీస్థాయి డేటా కేంద్రాలను ఆకర్షించగలిగిన ఆంధ్రప్రదేశ్, వాటి విద్యుత్ అవసరాలను పర్యావరణానికీ స్థానిక సమాజానికీ భంగం కలగని రీతిలో తీర్చాలి. హైడ్రోజన్ వంటి పునరుత్పాదక ఇంధనాల వినియోగాన్ని భారీగా పెంచాలి. ఆ దిశగా పటిష్ఠ ప్రణాళికతో డిజిటల్ ఆర్థిక వ్యవస్థను సాకారం చేసుకోవాలి.



ఆచార్య డి.నారాయణరావు
ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్-రీసెర్చి, ఎస్ఆర్ఎం గ్రూప్ సంస్థలు
మెంబర్-సెక్రటరీ, గ్రీన్‌హైడ్రోజన్ వ్యాలీ, ఏపీ

కోడి పందేలు పెట్టుకుని అవి ఒకదాన్నొకటి చంపుకొంటుంటే చూసి ఆనందిస్తూ పండుగ చేసుకుంటున్న ఆధునిక సమాజం మనది! ఇలాంటి పందేలే ఒకప్పుడు మనుషులకు పెట్టేవారని తెలుసా? ఇద్దరిలో ఒకరు చనిపోయేదాకా పోరు సాగేది. దాన్ని వినోదంలా చూసి ఆనందించడానికి ఆడామగా డబ్బులిచ్చి మరీ బారులు తీరేవారు. గాయాలతో నెత్తురోడుతూ ఇక పోరాడే సత్తువ లేక పడిపోయిన మనిషిని గాడిదకు కట్టి ఈడ్చుకెళ్లేవారు. అంతేకాదు, వీధి పొడవునా ఏర్పాటు చేసిన శిలువలపై వేలాడుతున్నవారు ఎలా ఏడుస్తారో, కొంచెం కొంచెంగా ప్రాణం కోల్పోతూ ఎన్ని రోజుల్లో చస్తారో విడ్డూరంగా చూడటానికి మనుషులు విహారయాత్రకు వెళ్లేవారు. నమ్మలేని హేయ వాస్తవాలివి. అలా వేలాది బానిసలు శిలువలమీద ప్రాణాలు విడిచారు.

తిరుగుబాటు జెండా



ఆ అమానుషకాండ గురించి తెలియాలంటే 'స్పార్టకస్'ను చదవాలి. రోమన్ సామ్రాజ్య చరిత్ర తెలుసుకోవాలి. క్రీ.పూ.ఒకటో శతాబ్దంలో కొన్ని వేలమంది బానిసలు తప్పించుకుని స్పార్టకస్ ఆధ్వర్యంలో సంఘటితమై ప్రభుత్వంపై తిరుగుబాటు చేశారు. దాదాపు మూడేళ్లపాటు వీరోచితంగా పోరాడినప్పటికీ శక్తిమంతమైన రాజ్యం ముందు తలవొగ్గక తప్పలేదు.

శ్రీశ్రీ అన్నట్లు రోమన్ సామ్రాజ్యాన్ని ఎదిరించిన ధీరుడు స్పార్టకస్ కథ కూడా శతాబ్దాల పాటు ఇతిహాసపు చీకటి కోణం అట్టడుగున పడివుంది. కారల్‌మార్క్స్ 1861లో ఏంగెల్స్‌కి రాసిన లేఖలో 'రోమన్ సివిల్ వార్స్ గురించి చదువుతున్నాను. పురాతన శ్రామికవర్గానికి నిజమైన ప్రతినిధిగా గొప్ప వ్యక్తిత్వం ఉన్న స్పార్టకస్ కనిపించాడు' అని రాశారు. ఆ తరవాత 1951లో 'స్పార్టకస్' అనే చారిత్రక నవల రాశారు అమెరికన్ రచయిత హోవర్డ్ ఫాస్ట్. 1955కల్లా దీనికి తెలుగు అనువాదం వెలువడింది. ఇరవయ్యో శతాబ్దపు ఉత్తమ చారిత్రక నవలల్లో ఒకటైన 'స్పార్టకస్'ను చరిత్ర కోణంలోనే కాదు, అసలు జీవితానికి అర్థమేంటో తెలుసుకోవడానికైనా చదవాలి.

సంతలో పశువులను కొన్నట్లే ఆ రోజుల్లో బానిస స్త్రీ పురుషులను కొనుక్కునేవారు. వాళ్లను 'మాట్లాడే పనిముట్లు'గా భావించేవారు. అన్నిరంగాల్లోనూ ఉత్పత్తి అంతా బానిసల పని అయితే దాన్ని అనుభవించేది యాజమాన్య, పాలక వర్గాలు. బానిసలకు మిగిలేవి కొరడా దెబ్బలు. అలాంటి వేలాది బానిసల్లో స్పార్టకస్ ఒకడు. పీడన శక్తి బొగ్గును వజ్రంగా మార్చినట్లే మనిషిని విప్లవవీరుడిగా మారుస్తుంది, ఈ స్పార్టకస్ అలాంటివాడే- అంటారు పుస్తకానికి ముందుమాట రాసిన రావిశాస్త్రి. పొలాల్లో, గనుల్లో చెమటోడ్చిన స్పార్టకస్‌ని మరిన్ని లాభాలు ఆర్జించడానికిగాను మల్లుడిగా రంగస్థలం మీద దింపుతారు యజమానులు. వారి దృష్టిలో మల్లులంటే మృగాలే. వారి వికృతానందం కోసం మల్లులైన బానిసలు ఒకరినొకరు చంపుకోవాలి. పైకి దృఢంగా ముఖంలో ఏ భావమూ లేకుండా కనిపించే స్పార్టకస్ లోపల కణకణ మండే అగ్ని ఉందని వారికి తెలియదు. కాబట్టే తోటివారిని కూడగట్టగలిగాడు. విప్లవశంఖం పూరించగలిగాడు. తిరుగుబాటును అణచివేసి స్పార్టకస్‌ని కసితీరా ముక్కలుగా నరికేసింది రాజ్యం. జీవితానికి అర్థం జీవించడమే అని చెప్పిన స్పార్టకస్ పేరు మాత్రం ప్రపంచంలో దోపిడీ ఉన్నంతకాలం వినిపిస్తూనే ఉంటుంది. నవలలో స్పార్టకస్‌తో పాటు వరీనియా, క్రాసస్, బేటియాటస్... అన్నీ చారిత్రక పాత్రలే. ఒక్కొక్కరి వ్యక్తిత్వాన్నీ అద్భుతంగా మలచిన హోవర్డ్ ఫాస్ట్ నాటి ఆర్థిక, రాజకీయ, సామాజిక జీవనాన్ని కళ్లకు కడతారు. విప్లవాలనూ వాటి కారణాలనూ నగ్నంగా చూపెడతారు. సినిమాగానూ వచ్చి మెప్పించిన నవల ఇది.

- మిహిర

ప్రశ్నించడం మానేస్తే ప్రజాస్వామ్యం బతికేదెలా?

'నేను చెప్పాను కదా అని దేన్నీ గుడ్డిగా నమ్మకండి. బంగారాన్ని పుటంపెట్టి పరీక్షించినట్లు, నా ప్రతి మాటనూ తరచిచూడండి. స్వయంగా మీకు మీరు ఆలోచించుకుని మంచివి, లోకానికి మేలు చేసేవి అనుకుంటేనే నమ్మండి' అని వేల సంవత్సరాల కిందటే తన శిష్యులకు బోధించాడు బుద్ధుడు. అలా ఇప్పుడు తమ అనుచరులకు చెప్పి, వారికి సరైన మార్గదర్శనం చేసే నైతిక బలం మన రాజకీయ నాయకుల్లో ఎవరికైనా ఉందా? దాని సంగతి దేవుడెరుగు, అలా చెప్పాలన్న ఆలోచన కూడా వారి మనసులోకి రాదు... రానివ్వరు. దున్నపోతుకు దూడ పుట్టింది జున్నుపాలు పంచుతా రండ్రా అంటే, గిన్నెలు పట్టుకుని వచ్చి వరసలో నిలబడేంత 'తెలివిపరులే' తమకు పనికొస్తారన్నది నాయకుల ప్రగాఢ విశ్వాసం! తాము గుర్రాన్ని చూపించి గాడిద అన్నా అవునని నమ్మేసి, కాదన్న వారి మీద కారాలూమిరియాలూ నూరేవారిని ఏరికోరి పక్కన పెట్టుకోవడంలో మన నేతలు ప్రపంచంలోనే చాలా ముందున్నారు. అనుచరగణాలకూ గొర్రెలమందలకూ అట్టే తేడా ఉండకూడదనుకునే నాయకులు- తమనెవరూ ప్రశ్నించకూడదని కోరుకుంటూ ఉంటారు. అందుకోసం ప్రభుత్వాలను ప్రశ్నించడం మహాపాపం అన్న స్థాయిలో కపటనీతి సూత్రాలు చెబుతుంటారు. అలా మామూలు జనం మెదళ్లకు తాళాలేసి, వారిలోని విమర్శనాత్మక ఆలోచనా దృక్పథాన్ని చంపేస్తారు. కొండొకచో ఎవరైనా గట్టిగా ప్రశ్నిస్తే, అదేదో నిష్కృతి లేని నేరమన్నట్లు జమకడతారు. ప్రజలు ప్రశ్నించడం మొదలుపెడితే తమ అవినీతి మేడలు క్షణాల్లో కుప్పకూలిపోతాయన్న భయం వారిది! అందుకే నిలదీసేవారిపై నిందలేసే కుటిల రాజకీయ సంస్కృతిని పెంచిపోషిస్తున్నారు. దానివల్ల పాలనలో పారదర్శకత, అధికార యంత్రాంగంలో జవాబుదారీతనం వంటివి మనకు సంబంధం లేని విషయాలుగా మిగిలిపోతున్నాయి. భారత ప్రజాస్వామ్యాన్ని ప్రాణంలేని మట్టిబొమ్మగా మార్చి నిలబెడుతున్నాయి!

పారదర్శకంగా పనిచేస్తూ, అందరినీ కలుపుకొనిపోతూ, సందర్భానికి తగినట్లు ప్రతిస్పందిస్తూ, ప్రజలకు జవాబుదారీగా మెలిగినప్పుడే ప్రజాస్వామిక వ్యవస్థలు బలంగా మనుగడలో ఉంటాయని లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా తాజాగా స్పష్టంచేశారు. వ్యవస్థలకు చట్టబద్ధతనిచ్చేవి ఈ విలువలేనని, రాజ్యానికీ ప్రజలకూ మధ్య బంధాన్ని నిలిపేవి కూడా అవేనని ఆయన ఉద్ఘాటించారు. లోక్‌సభాపతి మాటలు స్ఫూర్తిదాయకమైనవి. కానీ, ఆ అక్షరసత్యాలను ఆలకించేవారేరీ? అధికారులనూ పోలీసులను ప్రశ్నించడం మంచివాళ్ల లక్షణం కాదని బహిరంగంగా మీడియా మైకుల ముందు ప్రవచించేవారు నాయకులుగా చలామణీ అవుతున్న చోట పారదర్శకత ఎక్కడ కనపడుతుంది? సమాచార హక్కు చట్టాన్ని చాపచుట్టి అటకెక్కించేయడంలో పార్టీలన్నీ ఒకేమాట మీద ఉంటుంటే ఇక యంత్రాంగంలో జవాబుదారీతనం ఏముంటుంది? అందుకే 2025 అంతర్జాతీయ సుపరిపాలనా సూచీలో 120 దేశాల్లో ఇండియా 71వ స్థానం దగ్గరే ఆగిపోవాల్సి వచ్చింది!

ప్రభుత్వాలు ఎలా పనిచేస్తున్నాయి, ఎవరికోసం నిర్ణయాలు తీసుకుంటున్నాయి, ప్రజాధనాన్ని ఎక్కడ ఎందుకు ఖర్చు పెడుతున్నాయి... ఇవన్నీ తెలుసుకోవడం ప్రజల ప్రాథమిక హక్కు. సర్కార్ల నడవడిక సరిగ్గా లేకపోతే విమర్శించడం, అసమ్మతి తెలపడం కూడా ఆ హక్కులో భాగమే. ప్రభుత్వ నిర్ణయాలను



విమర్శించే హక్కు ప్రతి పౌరుడికీ ఉంటుందని ఏడాదిన్నర కిందట సుప్రీంకోర్టు కూడా మరోమాటకు తావులేకుండా స్పష్టీకరించింది. కానీ, నాయకులు ఏం చేస్తున్నారు? కొద్దిపాటి అసమ్మతిని కూడా సహించలేకపోతున్నారు. ప్రజాహితం కోరే విమర్శకులకు తప్పుడు ఉద్దేశాలు ఆపాదిస్తూ, వారిని నేరగాళ్లను చూసినట్లు చూస్తున్నారు. దానివల్ల విమర్శ, స్వతంత్ర ఆలోచన అనేవి మన సమాజంలోంచి వేగంగా మాయమైపోతున్నాయి. నాయకుల మాటలకు పక్కతాళాలేయడమే పనిగా పెట్టుకున్న ప్రబుద్ధులతో సామాజిక మాధ్యమాలు విషప్రచార వేదికలవుతున్నాయి. సర్కారీ దస్త్రాల దొంతర్లలో దాగిన వాస్తవాలకు అక్కడే చెదలుపడుతుండటంతో అన్నిచోట్లా అక్రమాలు కట్టలు తెంచుకుంటున్నాయి. వివిధ పథకాలకు సంబంధించి లబ్ధిదారుల సమాచారం, ప్రాజెక్టుల డేటా ప్రజలకు అందుబాటులో లేదని... దానివల్ల ఆయా స్కీంల అమలులో పారదర్శకత మెంపునకు అవకాశాలు తగ్గిపోతున్నాయని 'నీతిఆయోగ్' నివేదిక గతంలో తేటతెల్లం చేసింది. సర్కారీ ఖజానాలోంచి ఖర్చుచేసే ప్రతిరూపాయికీ జనానికి లెక్కలు చెప్పాలని, ఎవరూ అడగకముందే ప్రభుత్వాలే స్వచ్ఛందంగా సమాచారం వెల్లడించాలని చెప్పే ఆర్టీఐ చట్టమొచ్చి ఇరవై ఏళ్లయింది. అయినప్పటికీ ప్రజాప్రయోజనాలకు సంబంధించిన సమాచారం బయటికి రావట్లేదంటే- నిజాలను కప్పెట్టేస్తున్న ఆ చీకటి వెనక ఏ అసురశక్తులున్నాయి? అవి అంతగా కోరలుచాచి విజృంభిస్తుండటం వల్లే అంతర్జాతీయ అవినీతి సూచిలో 180 దేశాల సరసన భారతావనికి 96వ ర్యాంకు దఖలుపడింది. అన్ని రకాల సామాజిక రోగాలకు పుట్టిల్లుగా తయారైన రాజకీయ అవినీతి దేశీయంగా సామాన్య జనజీవనాన్ని అంతకంతకూ కష్టాలపాల్జేస్తోంది!

ప్రజాస్వామిక స్ఫూర్తికి బయటినుంచి ఎవరూ అంటుకట్టలేరు, అది మన లోలోపలి నుంచే ఉద్భవించాలనేవారు మహాత్మాగాంధీ. ప్రజాతంత్రం గొప్పదనమేమిటో మనకుమనంగా తెలుసుకోవాలంటే ముందు ప్రశ్నించేతత్వాన్ని అలవాటు చేసుకోవాలి. రాజ్యాంగం ప్రబోధిస్తున్న శాస్త్రీయ దృక్పథాన్ని అలవరచుకున్నప్పుడే అధికారులనైనా నాయకులనైనా నిగ్గదీయగలిగిన సత్తా మన సొంతమవుతుంది. అభివృద్ధి చెందిన దేశాలు ఆ సైంటిఫిక్ టెంపర్‌ను తమ నవతరానికి ఉగ్గుపాలతోనే పరిచయం చేస్తున్నాయి. పాఠశాల దశ నుంచే అక్కడ ప్రశ్నలకు ప్రాధాన్యమిస్తారు. జాతి దౌర్భాగ్యం కొద్దీ మన దేశంలోనేమో గుడ్డెద్దు చేలో పడినట్లు చదువుకుపోవడమే తప్ప విద్య అసలు లక్ష్యమేంటో చాలామందికి తెలియదు... తెలియనివ్వరు కూడా! ప్రశ్నలడిగే వారిపై చిందులుతొక్కే వాతావరణం దట్టంగా అలముకుపోవడంతో యువతలో ఆరోగ్యకరమైన స్వతంత్ర భావాలు అణగారిపోతున్నాయి. హేతువుకు లొంగని విషయాలను గంపగుత్తగా బుర్రకెక్కించుకునే పోకడలు ఎక్కువవుతున్నాయి. సామాజిక దురాచారాలు, వివక్షలకు వంతపాడేవారు పెరిగిపోతున్నారు. ఈ రకం మూక మనస్తత్వాలు నాయకులకు ఓటుబ్యాంకులుగా ఉపయోగపడుతూ, అదే సమయంలో జుగుప్సాకరమైన నేరాల ఉద్ధృతికి కారణమవుతున్నాయి.

విమర్శలను ఎంతవరకు అంగీకరించగలుగుతున్నాయి అన్నదాన్ని బట్టే ప్రజాస్వామ్య వ్యవస్థల శక్తిసామర్థ్యాలను అంచనా వేయగలమన్నది రామ్‌మనోహర్ లోహియా మాట. ప్రశ్నలకు అవకాశం లేనిచోట బలమైన విమర్శలు వ్యక్తంకావు. హేతుబద్ధమైన అభిప్రాయాలను కట్టడిచేసే సమాజంలో జనం కోణంలో సరిగ్గా ప్రశ్నించే స్వరాలు వినపడవు. అప్పుడు ప్రజాస్వామ్యం ఏకపక్షమై జనజీవితాలు ఇంకా కంటకప్రాయమవుతాయి. ఆ ముప్పు నుంచి తప్పించుకోవాలంటే శాస్త్రీయ దృక్పథాన్ని నేర్పే చదువులను స్వాగతించితీరాలి. స్వార్థపూరిత రాజకీయాలు స్వైరవిహారం చేస్తున్న భారతావనిలో అలాంటి విద్యను భావితరాలకు అందించడానికి ముందుకొచ్చేదెవరు? ప్రజాస్వామ్యానికి చేవతెచ్చేందుకు చొరవచూపే జన హితైషులెవరు?

- శైలేష్ నిమ్మగడ్డ

తలనొప్పి వస్తోందా?

నేస్తాలూ.. ఇప్పుడొక చిన్న ప్రశ్న. తలనొప్పి ఎవరికి వస్తుంది? క్వశ్చనే రాంగ్. తల ఉన్న ప్రతి ఒక్కరికీ హెడేక్ వస్తుంది అంటారా! మరైతే, ఇంకో ప్రశ్న. తలనొప్పి శరీరంలో ఏ భాగానికి వస్తుంది? కడుపు, ఛాతీ, వీపు, పాదం, తల? ఈ ఆప్షన్లలో ఏది సరైన సమాధానం. చివరి ఆప్షన్‌నే ఆన్సర్‌గా ఎంచుకుంటే, తలనొప్పి తలకే వస్తుందని మీకు తెలుసన్నమాట! ఇదంతా కేవలం సరదాకే! ఇంతకీ తలనొప్పి ఎందుకు వస్తుందో తెలుసుకుందాం.

మెదడు ఉపరితల ప్రాంతంలోని సిరలు తదితర నాళాలు నొప్పి విషయంలో చాలా సునిశితంగా



ఉంటాయి. ఇవి గాయపడినప్పుడు తలనొప్పి వస్తుందన్నమాట. కొంతమందికి పొద్దున్నే టీ తాగకపోతే తల బద్దలైపోతుంది. అదెలా? బాగా ఆకలిగా ఉన్నప్పుడూ తలనొప్పి వేధిస్తుంది కదా! ఎందుకలా? ఇలాంటి సందర్భాల్లో నిజంగా జరిగేది ఏమిటంటే, పుర్రె భాగంలో ఉండే ధమని నాళాలు వ్యాకోచించడం వల్ల తలనొప్పి వస్తుంది. కొన్నిసార్లు పంటి నొప్పి కూడా తలనొప్పిగా మారుతుంటుంది కదూ! దంతాల దగ్గరుండే కండరాలు గాయపడినప్పుడు ఆ నొప్పి మెదడు ప్రాంతానికి వ్యాపించి తలనొప్పిగా మారుతుంది. తల సమీపంలో, మెడ పై భాగంలో ఉండే కండరాలు సంకోచించినప్పుడు కూడా తలనొప్పి వస్తుంటుంది.

మొత్తానికి.. తగినంతగా నీరు తాగకపోవడం, మంచి ఆహారం తినకపోవడం, కంటిచూపు సమస్య, జలుబు, ఇన్ఫెక్షన్లు, ముక్కుదిబ్బడ, సైనస్, తలకు తగిలే చిన్న దెబ్బలు, మానసిక ఒత్తిడి, నిద్రలేకపోవడం వంటివి కూడా తలనొప్పిని కలిగిస్తాయి. మెదడు ఇన్ఫెక్షన్లు, తలలో రక్తస్రావం, రక్తనాళాల సమస్యలు కొంచెం తీవ్రమైన సమస్యలుగా చెప్పవచ్చు. తలనొప్పినుంచి తప్పించుకోవాలంటే.. తగినంత విశ్రాంతి తీసుకోవాలి. ప్రశాంతంగా ఉండాలి. సరిపడా నీరు, పండ్లరసాలు తాగాలి. సమతులాహారం తీసుకోవాలి. తరచూ తలనొప్పి వేధిస్తుంటే మాత్రం డాక్టర్ దగ్గరికి వెళ్లాలి.

- శ్రీజన్



హాయిగొలిపే... హరితమిచ్చట

నిర్వహణ సరిగా లేక నగరంలో కొన్నిచోట్ల ఏర్పాటు చేసిన వాల్‌గ్రీన్లలో మొక్కలు ఎండిపోయి కళావిహీనంగా మారాయి. కృష్ణలంక నుంచి పశువుల ఆసుపత్రి వెళ్లే దారిలోని వంతెనకు ఇరువైపులా ఏర్పాటు చేసిన వాల్‌గ్రీన్లు కూడా ఎండిపోయాయి. స్పందించిన కార్పొరేషన్ అధికారులు వాటి స్థానంలో కొత్తగా మొక్కలు నాటించడంతో నూతన శోభ సంతరించుకుంది. నగరంలో సరిగా లేని వాల్‌గ్రీన్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసి పచ్చదనం పెంపొందిస్తే ఆహ్లాదంగా ఉంటుంది. - ఈనాడు, అమరావతి

ఆట చూడు.. బాగుందండి..



గజం స్థలం కూడా రూ. లక్షల్లో పలికే విజయవాడ నగరంలో మైదానాలు అత్యంత అరుదు. చిన్న ఖాళీ స్థలం ఉంటుంది చాలు ఎత్తయిన భవనాలు నిర్మిస్తున్నారు. దీంతో క్రికెట్ ఆడటానికి స్థలం లేకున్నా... తమ ఇంటిపైనే ఇలా చుట్టూ నెట్ ఏర్పాటు చేసుకుని కొందరు యువకులు క్రికెట్ ఆడుతున్నారు. బంతి బయటకు పోతుందనే బాధలేదు.. క్రికెట్ ఆడలేమనే దిగులు లేదు. విజయవాడ నగరంలోని చిట్టినగర్ సొరంగం ముందు కనిపించిన చిత్రమిది.

- ఈనాడు, అమరావతి

మరిపించే మాటలు.. ముంచేసే చేతలు..!



ఈనాడు, అమరావతి

ప్రైవేట్ ఉద్యోగి అయిన ప్రసాద్‌కు ఇటీవల వాట్సప్‌లో గుర్తుతెలియని నెంబరు నుంచి 'హాయ్' మెసేజ్ వచ్చింది. ఈ నెంబరు తన కాంటాక్టులో లేదని గుర్తించి.. ఫోన్ చేశాడు. అవతల నుంచి ఓ మహిళ కంఠం వినిపించింది. పొరబాటున పంపానని ఆమె చెప్పింది. అలా మాటలు కలవడంతో కొద్దిసేపు మాట్లాడుకున్నారు. అప్పటి నుంచి తరచూ మాట్లాడుకునే వరకు వెళ్లింది. తనకు అత్యవసరంగా డబ్బు కావాలని.. రూ.50 వేలు సర్దుబాటు చేయగలవా? అని ఆమె కోరింది. అడిగిందే తడవుగా ప్రసాద్.. ఆమె ఇచ్చిన ఖాతాకు బదిలీ చేశాడు. ఇలా తరచూ ఏదోక అవసరం చెబుతూ ఆ యువతి దశల వారీగా రూ.5.30 లక్షల వరకు బదిలీ చేయించుకుంది. ఇంకా అడుగుతుండడంతో అనుమానం వచ్చి ఆ నెంబరును బ్లాక్ చేశాడు.

--- ఇలా నిత్యం చాలా మంది ఆన్‌లైన్ రిలేషన్‌షిప్స్ వలకు చిక్కి మోసపోతున్నారు. పెద్దమొత్తంలో చేతి చమురు వదిలించుకుంటున్నారు. ఈ తరహా సంబంధాల్లో తొలుత.. ప్రశంసలు కురిపించడం,

ఆన్‌లైన్ సంబంధం ముసుగులో దోపిడీ!

ఎక్కడ లేని ఆప్యాయత ఒలకబోస్తూ.. ముగ్గులోకి దించుతారు. చివరకు.. ఆర్థిక, భావోద్వేగ దోపిడీతో ముగుస్తుంది. మోసగాళ్లు చాలా తెలివిగా వ్యవహరిస్తారు. బాగా నమ్మకం కలిగిస్తారు. భావోద్వేగ అనుబంధాన్ని సృష్టించి ముగ్గులోకి దించుతున్నారు. దారిలోకి వచ్చాక దఫాలుగా ఏదోక అవసరం పేరుతో డబ్బు గుంజుతున్నారు.

ముందే పసిగట్టాలి..

మనకు ఏమాత్రం పరిచయం లేని వ్యక్తులు.. ఎక్కడ లేని ఆప్యాయత కురిపించి మాట్లాడుతున్నా అనుమానించాల్సిందే. వీడియో కాల్స్‌లో మాట్లాడేందుకు నిరాకరిస్తూ.. వ్యక్తిగతంగా కలుద్దామని అడిగితే ఏదోక సాకుతో వాయిదా వేసే వారి పట్ల అప్రమత్తత అవసరం. ఇలాంటి వారికి డబ్బు లేదా గిఫ్ట్‌కార్డులు పంపకూడదు. అత్యవసరం పేరు చెప్పే కట్టుకథలు నమ్మొద్దు. ప్రయాణంలో ఉన్నానని.. అర్జెంటుగా డబ్బు కావాలని.. క్రిప్టో సమస్య ఉందని.. పెట్టుబడులకు అవకాశాలు ఉన్నాయని.. ఇలా సాకులతో డబ్బులు కోరే వారిని నమ్మకపోవడం ఉత్తమం.

తస్మాత్ జాగ్రత్త...

✪ వ్యక్తిగత సమాచారాన్ని అపరిచితులకు షేర్ చేయవద్దు. ఆర్థిక సమాచారం లేదా సన్నిహిత ఫొటోలను ఎవరికీ పంపొద్దు. వీటిని ఉపయోగించి బ్లాక్‌మెయిల్‌కు పాల్పడే అవకాశాలు ఉన్నాయి. ✪ అనుమానాస్పద యాప్‌లను డౌన్‌లోడ్ చేయొద్దు. ట్రేడింగ్, క్రిప్టో, పెట్టుబడుల పేరుతో పంపించే లింక్‌పై క్లిక్ చేయొద్దు.

వెంటనే ఫిర్యాదు చేయాలి..

✪ మోసపోయినట్లు గుర్తిస్తే.. ఎలాంటి ఆలస్యం చేయకుండా నేషనల్ సైబర్ క్రైమ్ పోర్టల్.. cybercrime.gov.in లో ఫిర్యాదు చేయాలి. ✪ సహాయవాణి నెంబరు 1930కు కాల్ చేయాలి. ✪ మీ బ్యాంకుకు తక్షణమే సమాచారం ఇవ్వండి. ✪ చాట్స్, స్క్రీన్‌షాట్లను భద్రపర్చుకోవాలి. సాక్ష్యాలుగా వాటిని అందజేయాలి.

23న ఇంద్రకీలాద్రిపై శ్రీపంచమి వేడుకలు

ఇంద్రకీలాద్రి: ఈనెల 23న సరస్వతీదేవి జన్మదినాన్ని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై శ్రీ పంచమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు దుర్గగుడి ఈవో శీనానాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. మూలవిరాట్టు దుర్గమ్మతోపాటు మల్లికార్జున మహామండపం ఆరో అంతస్తులోని ఉత్సవమూర్తి సరస్వతీ దేవి అలంకారం చేయనున్నట్లు వైదిక కమిటీ నిర్ణయించిందన్నారు. ఉదయం 6 నుంచి రాత్రి 7 గంటల వరకు విద్యార్థులకు ఉచితంగా అమ్మవారి దర్శనం కల్పించేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. యూనిఫాం, ఐడీ కార్డుతో విద్యార్థులు దర్శనానికి రావాలని సూచించారు. దర్శనం చేసుకున్న ప్రతి విద్యార్థికి పెన్ను, శక్తి కంకణం, పాకెట్ సైజ్ కనకదుర్గ అమ్మవారి ఫొటో, ఉచిత లడ్డూ ప్రసాదం అందజేస్తారని పేర్కొన్నారు.

దారంతా.. వాహనాల జాతర..

కిక్కిరిసిన విజయవాడ-హైదరాబాద్ హైవే



ఇబ్రహీంపట్నం రింగు సెంటర్‌లో ముందుకు కదలని వాహనాలు



నందిగామ వై జంక్షన్ వద్ద సర్వీస్‌రోడ్డులో హైదరాబాద్ వైపు వెళ్తున్న వాహనాలు

సంక్రాంతి పండగను ఆనందంగా గడిపిన ప్రజలు తిరిగి హైదరాబాద్‌కు పయనమయ్యారు. తిరుగు ప్రయాణాలతో విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారి కిక్కిరిసింది. ఆదివారం అమావాస్య కావడంతో ఎక్కువ మంది శనివారమే వెళ్లేందుకు మొగ్గు చూపారు. దీంతో ఉదయం నుంచి మొదలైన వాహనాల రద్దీ సాయంత్రం 5 నుంచి రాత్రి 7 గంటల మధ్య భారీగా పెరిగింది. ఉమ్మడి కృష్ణా, ఉభయ గోదావరి జిల్లాలు, విశాఖ నుంచి వచ్చే వాహనదారులు హైదరాబాద్ రహదారిపైకి రావడంతో రద్దీ ఎక్కువైంది.

- ఈనాడు, అమరావతి
- న్యూస్‌టుడే నందిగామ, కంచికచర్ల, ఇబ్రహీంపట్నం, గొల్లపూడి:

5 కి.మీ.లకు గంటన్నర...

గుంటుపల్లి నుంచి ఇబ్రహీంపట్నం రింగు కూడలి వరకు 5 కిలోమీటర్ల ప్రయాణానికి గంటన్నర పట్టింది. రింగ్ కూడలిలో అటు హైదరాబాద్ వెళ్లేవారు... ఇటు మైలవరం, తిరువూరు వైపు వెళ్లేవారు మలుపు తిరగాల్సి రావడంతో రద్దీ భారీగా పెరిగింది. ఎన్‌హెచ్‌పై కార్లు, వివిధ వాహనాలు నిలిచిపోగా.. .. కనీసం ద్విచక్ర వాహనాలు వెళ్లలేనంతగా ట్రాఫిక్ స్తంభించింది. గొల్లపూడి నుంచి నందిగామ వరకు ఎలాంటి ప్రత్యామ్నాయ దారులు, సర్వీస్ రోడ్లు లేకపోవడంతో ఎన్‌హెచ్‌పైకి వచ్చిన వాహనదారులు అల్లాడారు. రింగు కూడలి నుంచి ఛత్తీస్‌గఢ్ హైవేకు మళ్లే వాహనదారులకూ పాట్లు తప్పలేదు. ఏడీసీపీ రామకృష్ణ, ఏసీపీ దుర్గారావు, సీఐ చంద్రశేఖర్ సైతం ట్రాఫిక్‌ను చక్కదిద్దారు.

కీసర, నందిగామల్లోనూ...

కంచికచర్ల మండలం కీసర టోల్‌ప్లాజా దగ్గర ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు 20 వేల వాహనాలు వెళ్లినట్లు నమోదైంది. వాహనాల రద్దీకి తగ్గట్లు టోల్‌ప్లాజా వద్ద ఎనిమిది కౌంటర్లు తెరిచినా.. ఫాస్టాగ్ స్కానై వాహనం కదిలేందుకు సమయం పడుతుండటంతో వాహనాలు బారులు తీరాయి. * నందిగామ వైజంక్షన్ దగ్గర వాహనాలు సర్వీస్ రోడ్డుపై వెళ్లడంతో వాహన శ్రేణి ముందుకు వెళ్లేందుకు ఆలస్యమైంది. అక్కడ ట్రాఫిక్ సమస్యలు తప్పలేదు. రద్దీ పెరిగిన తరుణంలో ఫ్లైఓవర్ మీదుగా కార్లు మాత్రమే పంపారు.

నిరంతర పర్యవేక్షణ...

ట్రాఫిక్ నియంత్రణకు పోలీసు ఉన్నతాధికారులు మొదలు సిబ్బంది వరకు రంగంలోకి దిగారు. సాయంత్రం ఎక్కువ రద్దీ ఉండడంతో ఆ సమయంలో కృష్ణా, గుంటూరు జిల్లాల నుంచి వచ్చే భారీ వాహనాల రాకపోకలను ఆపేశారు. సాధారణ ప్రయాణికులనే పంపడంతో కొంతవరకు వాహనాలు సాఫీగా వెళ్లాయి. డ్రోన్ల ద్వారా రహదారిపై ట్రాఫిక్ సమస్యలు నిత్యం పర్యవేక్షించారు. సమస్య వచ్చిన చోటకు పోలీసులను తరలించారు. నిరంతరం పరిశీలిస్తూ సాఫీగా సాగేలా చర్యలు తీసుకున్నారు. నందిగామ వైజంక్షన్‌లో వాహనాలు వేగంగా వెళ్లకుండా పోలీసులు స్టాపర్లు, వేగ నియంత్రికలు ఏర్పాటు చేశారు.

రైళ్లన్నీ కిటకిట...



రైల్వేస్టేషన్‌లో రద్దీ

విజయవాడ(రైల్వేస్టేషన్), న్యూస్‌టుడే: సంక్రాంతి పండగకు సొంతూళ్లకు వచ్చి తిరుగు ప్రయాణమయ్యే ప్రయాణికులకు తిప్పలు తప్పడం లేదు. అన్ని రైళ్లలో దాదాపు బెర్తులు ఫుల్ అవడంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుంటున్నారు. సంక్రాంతి పండగకు విజయవాడ మీదుగా రైల్వే శాఖ 150కిపైగా రైళ్లు వేసినా రద్దీ మాత్రం తగ్గడం లేదు. ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు అన్ని రైళ్లల్లో రిజర్వేషన్ బెర్తులు నిండడంతో భారీగా వెయిటింగ్ లిస్టులు దర్శనమిస్తున్నాయి. చాలా రైళ్లల్లో టికెట్లు ఫుల్ అయి నోరూమ్‌లు వచ్చేశాయి. సికింద్రాబాద్, విశాఖపట్నం మార్గాల్లో ఎక్కువ రద్దీ ఉంది. తర్వాత బెంగళూరు, చెన్నై వైపు ఇదే పరిస్థితి నెలకొంది. రిజర్వేషన్ బెర్తులు ఫుల్ అవడంతో తత్కాల్ టికెట్లకు భారీ డిమాండ్ ఏర్పడింది. శనివారం ఉదయం రైల్వే రిజర్వేషన్ బుకింగ్‌లు ప్రారంభించిన నిమిషాల వ్యవధిలోనే టికెట్లు అయిపోయి నోరూమ్‌కు వచ్చేశాయి. రాత్రి నుంచి కౌంటర్ల ముందు పడిగాపులు గాసినా టికెట్లు దొరకకపోవడంతో ప్రయాణికులు నిరాశగా వెనుదిరిగారు. ఆదివారం ఉదయం సికింద్రాబాద్, విశాఖపట్నం, చెన్నై వైపు వెళ్లే ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌ల వద్ద రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉండడంతో అధికారులు ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని భద్రతాపరంగా అన్ని ఏర్పాటు చేశారు.

గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు

తుళ్లూరు, న్యూస్‌టుడే ఈ నెల 26న గణతంత్ర దినోత్సవానికి అమరావతి ముస్తాబవుతోంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను ప్రభుత్వం వేగవంతం చేసింది. రాయపూడి సమీపంలో ఎమ్మెల్యే భవన సముదాయాల నుంచి హైకోర్టుకు వెళ్లే మార్గంలో సుమారు 22 ఎకరాల్లో ప్రాంగణాన్ని సిద్ధం చేస్తున్నారు. చుట్టూ గ్యాలరీలు, వేదిక, కవాతు మైదానం, వీఐపీ, వీవీఐపీ పార్కింగ్ నిర్మాణాలను పూర్తి చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు ప్రముఖులు హాజరు కానున్న నేపథ్యంలో పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. శనివారం సాయంత్రం 6వ బెటాలియన్ కమాండెంట్ కె.నగేష్‌బాబు ఆధ్వర్యంలో పరేడ్ మైదానంలో బెటాలియన్ దళాల రిహార్సల్ ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో 2వ బెటాలియన్ 100 మంది, సీఆర్‌పీఎఫ్ 100, కేరళ పోలీస్ కాంటిన్‌జెంట్ 80, 16వ బెటాలియన్ 100, బ్యాండ్ టీం 120, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఏపీ 95, ఏపీ సొసైటీ స్టూడెంట్స్ అండ్ టీచర్స్ 74 మంది చొప్పున మొత్తం 669 మంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న నీటి విడుదల

ఎన్టీఆర్ కలెక్టరేట్: కృష్ణా డెల్టాలోని పంట కాలువలకు ప్రకాశం బ్యారేజీ నుంచి నీటి విడుదల కొనసాగుతోంది. శనివారం 5,057 క్యూసెక్కుల నీటిని ఇస్తున్నారు. కృష్ణా తూర్పు ప్రధాన కాలువకు 2,713, కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు 2,258, గుంటూరు ఛానల్‌కు 86 క్యూసెక్కుల మేర విడుదల చేశారు. కృష్ణా తూర్పు ప్రధాన కాలువ నుంచి రైవస్‌కు 1501, ఏలూరుకు 708, కేఈబీకి 403, బందరు కాలువకు 101 క్యూసెక్కుల చొప్పున వదిలారు. ప్రస్తుత అవసరాల దృష్ట్యా కృష్ణా తూర్పు ప్రధాన కాలువకు మరికొన్ని రోజులు నీటిని విడుదల చేయనున్నారు.

మీరు కడుతూనే ఉండండి.. మేం కష్టపడుతూనే ఉంటాం!

★ వామ్మో... నందిగామ వైజంక్షన్...
★ అసంపూర్తిగా వీయూపీ అప్రోచ్ రోడ్లు

'విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారి (ఎన్‌హెచ్-65) రెండు రాష్ట్రాల ప్రజలకు కీలకమైన మార్గం. నిత్యం వేల మంది రాకపోకలు సాగిస్తుంటారు. ప్రస్తుతం సంక్రాంతి నేపథ్యంలో తిరుగు ప్రయాణానికి వాహనాలు పోటెత్తుతున్నాయి. ఇంత ప్రాధాన్యం ఉన్న రహదారిని నందిగామ వైజంక్షన్ సమస్య పట్టి పీడిస్తోంది. వీయూపీ (వెహికల్ అండర్ పాస్) అనుసంధాన రహదారుల నిర్మాణం పూర్తవక ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు.'

ఈనాడు, అమరావతి - న్యూస్‌టుడే, నందిగామ



పూర్తికాని నిర్మాణంపైనే వాహనాల రాకపోకలు..

✪ నందిగామ వైపు రాకపోకలకు అనువుగా వీయూపీ నిర్మించినా ఇప్పటికి అనుసంధాన రహదారులు నిర్మించలేదు. ఈ పనులను ప్రధాన గుత్తేదారు ఉప గుత్తేదారుకిచ్చారు. చాలావరకు పనులు పూర్తి చేశారు. ఆ పనులకు రూ.4 కోట్ల బకాయిలు చెల్లించక పోవడంతో పనులు ఆపేశారు. ✪ దీంతో సర్వీస్ రహదారిపై తీవ్ర ఒత్తిడి ఉండడంతో గుంతలు పడి ప్రమాదాలకు కారణమవుతోంది. ✪ ఎన్‌హెచ్ అధికారులు ఇప్పటికే మూడుసార్లు రహదారి మరమ్మతులు చేసినా కొన్నాళ్లకే కథ మొదటికొస్తోంది. ✪ ఇక్కడ రహదారికి సెంట్రల్ డివైడర్ కూడా ఏర్పాటు చేయలేదు. ✪ సంక్రాంతి నేపథ్యంలో తాత్కాలిక విద్యుత్తు సదుపాయం కల్పించారు.

ఇంకా ఎన్నేళ్లు..



వీయూపీ అనుసంధాన పనుల పరిస్థితి ఇదీ...

ప్రాణాలు.. గుప్పిట్లో..

✪ రెండేళ్ల కిందట హైదరాబాద్ వైపు నుంచి ఓ సెంట్రింగ్ కూలీల వాహనం విజయవాడ వస్తుండగా వైజంక్షన్ సమీపంలో సర్వీస్ రోడ్డులోకి వస్తుండగా.. వాహనం గుంతలో పడి ప్రమాదానికి గురైంది. ఓ వ్యక్తి మృతి చెందగా.. మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. దీనికి అసంపూర్తి పనులే కారణం. ✪ మూడు నెలల కిందట ఇదే ప్రాంతంలో ఓ ప్రైవేటు బస్సు డివైడర్‌ను ఢీ కొట్టగా... పది మంది ప్రయాణికులకు తీవ్ర గాయాలయ్యాయి. ✪ రెండు నెలల కిందట సర్వీస్ రహదారిలో ఓ లారీని కారు దాటే క్రమంలోనూ ప్రమాదం జరిగి కారులోని ఓ ఎన్నారై మృతి చెందారు. ✪ ఇలా గత నాలుగేళ్లలో చిన్నా పెద్దా అన్నీ కలిపి పదుల సంఖ్యలో ప్రమాదాలు జరిగాయి.

'ప్రమాదాలకు అసంపూర్తి పనులే ప్రధాన కారణం. కొన్నేళ్లుగా వీయూపీ నిర్మాణం, అనుసంధాన పనుల్లో తీవ్ర జాప్యంతో ప్రయాణికులంతా సర్వీస్ రోడ్డుపైనే ప్రయాణిస్తున్నారు. సాధారణ రోజుల్లో ఈ రహదారిపై రోజుకు 15 వేల వాహనాలుపైగా ప్రయాణిస్తే సంక్రాంతి నేపథ్యంలో 30 వేల వాహనాలు వెళుతున్నాయి. ఈక్రమంలో నందిగామ వైజంక్షన్ దగ్గరకు వచ్చే క్రమంలో ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని వెళ్లాల్సి వస్తోంది.'

త్వరలోనే అనుసంధానం..

అండర్‌పాస్ అనుసంధానం పనులు వేగంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం. సంబంధిత అధికారులతో సమీక్షించి సమస్య పరిష్కరిస్తాం.

- లక్ష్మీశ, కలెక్టర్

నేడు విద్యుత్తు బిల్లులు చెల్లించొచ్చు

సూర్యారావుపేట, న్యూస్‌టుడే: ఆదివారం సెలవు దినమైనప్పటికీ అన్ని విద్యుత్తు బిల్లుల వసూలు కేంద్రాలు తెరచి ఉంటాయని ఆ సంస్థ ఎస్ఈ హనుమయ్య తెలిపారు. ఏపీసీపీడీసీఎల్ కస్టమర్ యాప్ ద్వారా ఇంటి వద్ద నుంచే విద్యుత్తు సర్వీసు నంబరును యాప్‌లో రిజిస్టర్ చేసుకుని కూడా బిల్లులు చెల్లించవచ్చన్నారు. అదే విధంగా గూగుల్‌పే, ఫోన్ పే, అమెజాన్ పే, బిల్‌డెస్క్ యాప్‌ల ద్వారా కూడా బిల్లులు చెల్లించవచ్చని ఎస్ఈ తెలిపారు.

విజయవాడ-హైదరాబాద్‌కు 225 ప్రత్యేక బస్సులు



పండిట్ నెహ్రూ బస్టాండ్‌లో నిరీక్షిస్తున్న ప్రయాణికులు

ఈనాడు, అమరావతి: సంక్రాంతి నేపథ్యంలో హైదరాబాద్ మొదలు వివిధ ప్రాంతాల నుంచి సొంతూళ్లకు వచ్చిన వారంతా తిరుగు ప్రయాణాలు మొదలుపెట్టారు. పండగకు వచ్చేందుకు ఆర్టీసీ అరకొర బస్సులు కేటాయించినా.. తిరుగు ప్రయాణానికి సర్వీలు బాగా పెంచింది. విజయవాడ నుంచి హైదరాబాద్, చెన్నై, బెంగుళూరు వెళ్లేందుకు ప్రత్యేక బస్సులు కేటాయించారు. ఉత్తరాంధ్ర, రాయలసీమ నుంచి విజయవాడకు రావాల్సిన వారికి సైతం సర్వీసులు అందుబాటులో ఉంచారు.

ఒక్క రోజే 130

✪ హైదరాబాద్ నుంచి విజయవాడకు పండగ నేపథ్యంలో 200 బస్సుల్లో ప్రయాణికులు వచ్చారు. శుక్రవారంతో పండగ ముగియడంతో ఆ రాత్రి నుంచే కొందరు తిరుగు పయనమయ్యారు. శని, ఆదివారాలు రావడంతో ఎక్కువ మంది ఆదివారం రాత్రికి వెళ్లేందుకు అవకాశం ఉంది.

కేటాయింపులు..

తేదీ	బస్సులు
16	25
17	40
18	130
19	30

✪ దీంతో ఆర్టీసీ అధికారులు శుక్రవారం నుంచి సోమవారం వరకు 225 ప్రత్యేక బస్సులు కేటాయించారు. అత్యధికంగా ఆదివారం 130 బస్సులు అందుబాటులో ఉంచారు. ఆదివారం అమావాస్య నేపథ్యంలో కొందరు శనివారమే తిరుగు ప్రయాణం అవుతున్నారు. ఇందుకు 40 బస్సులు కేటాయించారు. హైదరాబాద్‌తో పాటు చెన్నైకి శనివారం 4, ఆదివారం 8, బెంగళూరుకు ఆ రెండు రోజులకు రోజుకు ఒక బస్సు చొప్పున కేటాయించారు. ✪ ఇవేకాక... ఉత్తరాంధ్ర, రాయలసీమ నుంచి విద్యార్థులు, ఉద్యోగులు, ఇతర వర్గాలు విజయవాడ నగరానికి వచ్చేందుకు జనవరి 17-19 మధ్య 55 సర్వీసులు నడుపుతున్నారు.

భాగ్యనగరానికి రూ.375

విజయవాడ బస్టేషన్, న్యూస్‌టుడే: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా విజయవాడ నుంచి హైదరాబాద్‌కు రూ.375 ఛార్జీతో సిటీ మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసులు ఏర్పాటు చేశామని బస్టేషన్ డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ సూర్య పవన్‌కుమార్ తెలిపారు. రిజర్వేషన్ లేని ప్రయాణికులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

రక్షణ కొంతే.. ఆదమరిస్తే అంతే!



నగరంలో వారధి నుంచి బెంజి సర్కిల్ వెళ్లే రహదారి వందలాది వాహనాలతో నిత్యం రద్దీగా ఉంటుంది. బందరు కాలువ పైనున్న వంతెన దాటిన తరువాత బెంజి సర్కిల్ ఫ్లైఓవర్ పైకి వెళ్లే ముందు రహదారి పక్కన రక్షణ గోడలు ధ్వంసమై ప్రమాదకరంగా మారింది. రక్షణ గోడలు దెబ్బతిన్న చోట దిమ్మెలు పెట్టినా.. నిర్వహణ సరిగా లేదు. వాహనదారులు ఆదమరిస్తే ఆ ప్రాంతం వద్ద ప్రమాదాలు చోటుచేసుకొనే అవకాశం ఉంది. అధికారులు స్పందించాలి.- ఈనాడు, అమరావతి





బీసీసీఐ పరిశీలకుడిగా కేడీసీఏ కార్యదర్శి రవీంద్ర చౌదరి



విజయవాడ క్రీడలు: నాగపూర్‌లో ఈ నెల 21వ తేదీన భారత్, న్యూజిలాండ్ జట్ల మధ్య జరిగే తొలి టీ20 మ్యాచ్ పరిశీలకుడిగా ఉమ్మడి కృష్ణా జిల్లా క్రికెట్ సంఘం (కేడీసీఏ) కార్యదర్శి ఎం. రవీంద్ర చౌదరి నియమితులయ్యారు. ఈ మేరకు బీసీసీఐ నుంచి శనివారం నియామక పత్రం అందింది. రవీంద్ర చౌదరి నియామకం పట్ల ఆంధ్రా క్రికెట్ సంఘం (ఏసీఏ) అధ్యక్షుడు, ఎంపీ కేశినేని శివనాథ్, సంఘం కార్యదర్శి, రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ అభినందనలు తెలిపారు. 40 ఏళ్లుగా క్రికెట్‌కి అందిస్తున్న సేవలకు రవీంద్రచౌదరికి తగిన గుర్తింపు లభించిందని శిక్షకులు, అభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

డీఎన్‌బీ సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుబాటులో ఉన్న డీఎన్‌బీ ఎంబీబీఎస్ డిగ్రీ (మూడేళ్లు), పోస్టు ఎంబీబీఎస్ డిప్లొమా (రెండేళ్లు) కన్వీనర్ కోటా సీట్లకు నీట్ పీజీ అర్హత ఆధారంగా ఇన్ సర్వీస్ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విజయవాడ డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం శనివారం ఒక ప్రకటనలో పేర్కొంది. అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 19వ తేదీ సాయంత్రం 4 గంటల నుంచి 22వ తేదీ సాయంత్రం 4 గంటల్లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఇప్పటికే ఎన్ఎంసీ నీట్ పీజీ అర్హత మార్కులు తగ్గించిన విషయం తెలిసిందే.

బ్రాయిలర్ ధరలు (కిలో కి రూ.లలో)

నెక్‌కో: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -157 రిటైల్ ధర 184 చికెన్ విత్ స్కిన్ - 267 చికెన్ స్కిన్‌లెస్ - 304.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 180, 189, 200 చికెన్ విత్ స్కిన్ - 350 చికెన్ స్కిన్‌లెస్ - 360.

బరితెగించి.. బరుల్లో విద్యుత్తు చౌర్యం

లోపాలు సద్వినియోగం చేసుకున్న నిర్వాహకులు

కంకిపాడు, కంకిపాడు గ్రామీణం, కానూరు, న్యూస్‌టుడే

'సంక్రాంతి సంబరాల' పేరుతో నిర్వహించిన కోడి పందేలు, జూద శిబిరాల్లో విద్యుత్తు చౌర్యంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఏపీసీడీసీఎల్ (ట్రాన్స్‌కో) కానూరు సెక్షన్‌లో 12 చోట్ల బరులు ఏర్పాటు చేశారు. వీటిలో సగం మంది మాత్రమే తాత్కాలిక కనెక్షన్, మీటర్ల ఏర్పాటుకు దరఖాస్తు చేశారు. నిబంధనల మేరకు రూ.10 వేల ధరావత్తు, వినియోగించిన యూనిట్లకు వ్యాపార కేటగిరీ కింద బిల్లు చెల్లించాలి. బరుల్లో వందల సంఖ్యలో దీపాలు వంటి ఉపకరణాలకు విద్యుత్తు ఎలా సమకూర్చుకోగలిగారనే ప్రశ్న ఎదురవుతుంది. ఇంత పరిమాణంలో విద్యుత్తు ఉత్పత్తి చేసే జనరేటర్లు ఒక్కో శిబిరానికి కనీసం 10 నుంచి 20 వరకు అవసరం ఉంటుంది. కానీ తగిన సంఖ్యలో జనరేటర్లు అందుబాటులో ఉంచిన దాఖలాలు లేవని చెబుతున్నారు. బ్యాటరీతో నడిచే యంత్రాలు అంత సామర్థ్యంతో విద్యుత్తు ఉత్పత్తి చేసే అవకాశం లేదని నిపుణులు చెబుతున్నారు.



కంకిపాడు బరి ఎదుట నేరుగా తీగలకు అనుసంధానం చేసిన దీపాలు

పంట పొలాల్లోంచి..

ఒక్కో శిబిరం 10 నుంచి 20 ఎకరాల్లోని పంట భూమిలో ఏర్పాటు చేశారు. దీనిలో పదుల సంఖ్యలో వ్యవసాయ విద్యుత్తు స్తంభాలు, తీగలున్నాయి. వీటికి నేరుగా 'జంపర్లు' వేసి అక్రమంగా వాడుకున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ట్రాన్స్‌కో 'వార్‌రూం' నుంచి ఏ ట్రాన్స్‌ఫార్మర్‌పై ఎంత ఒత్తిడి పడుతుందనే సమాచారం ఎప్పటికప్పుడు చేరుతుంది. అయితే శిబిర ప్రాంగణంలో నియంత్రికలు కూడా అధిక సంఖ్యలో ఉండడంతో ఒకే ట్రాన్స్‌ఫార్మర్‌పై ఒత్తిడిని గుర్తించలేకపోయినట్లు ఆ శాఖ ఇంజినీర్లు చెబుతున్నారు.

ఒక శిబిరానికి రూ.1.50 లక్షల బిల్లు

కంకిపాడు మండలంలో ఏర్పాటు చేసిన ఒక శిబిరంలో మూడు రోజుల వినియోగానికి రూ.1.5 లక్షల బిల్లు వచ్చింది. ఈ లెక్కన 12 చోట్ల కలిపి రూ.18 లక్షల ఆదాయం రావాల్సి ఉండగా రూ.3.5 లక్షలు మాత్రమే వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. తాత్కాలిక మీటర్లు ఏర్పాటు చేసుకున్న బరుల్లోనూ వాడుకున్నట్లు చెబుతున్నారు. దీంతో కొన్ని భారీ శిబిరాలకూ రూ.50 వేల బిల్లు మాత్రమే వచ్చింది.

రాయితీ కొట్టేశారిలా..

పెళ్లిళ్లు, సమావేశాలు, సభలకు తాత్కాలిక కనెక్షన్లు ఇస్తారు. దరఖాస్తుదారులు ఎస్సీ వర్గానికి చెందినవారైతే 20-30 శాతం రాయితీ ఉంటుంది. దీన్ని ఆసరాగా తీసుకుని ఆ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తితో 'సంక్రాంతి సంబరాలు' పేరుతో దరఖాస్తు చేయించారు. ట్రాన్స్‌కో అధికారులకు తెలిసినా రాజకీయ, ఆర్థిక ఒత్తిళ్లతో చూసీచూడనట్లు వ్యవహరించడంతో రూ.లక్షల ప్రజాధనం దుర్వినియోగమైందనే విమర్శలున్నాయి.

జిల్లా తలసరి ఆదాయం పెంపే లక్ష్యం

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే : జిల్లాలో అయిదు వేల మంది మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తయారు చేయాలన్న లక్ష్యంతో ఇంక్యుబేషన్ స్కిల్లింగ్ ఎంట్రప్రెన్యూర్‌షిప్ సెంటరు(రైజ్)లో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టరు జి.లక్ష్మీశ తెలిపారు. గుంటుపల్లిలోని రైజ్ సెంటరును ఆయన శనివారం పరిశీలించి మహిళా పారిశ్రామికవేత్తలతో చర్చించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఇప్పటికే జిల్లాలో వేయి మందికి పైగా మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తయారు చేశామన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో రాష్ట్రంలో ప్రథమంగా గుంటుపల్లిలోనే రైజ్ సెంటరును ప్రారంభించినట్లు వివరించారు. దీని ద్వారా మహిళలకు పలు రకాల సంస్థల ద్వారా పారిశ్రామిక రంగంపై అవగాహన కల్పిస్తూ శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఈ సెంటరు నిర్వహణకు రూ.1.67 కోట్లు మంజూరు చేయాలని కేంద్రానికి ప్రతిపాదనలు పంపినట్లు వెల్లడించారు. జిల్లా తలసరి ఆదాయం గణనీయంగా పెంచాలన్న లక్ష్యాన్ని సాధించేందుకు ఒక కుటుంబం ఒక పారిశ్రామిక వేత్త సంకల్పం ఎంతగానో దోహదపడుతుందన్నారు. విజయవాడ ఆర్డీవో చైతన్య, డీఆర్‌డీఏ పీడీ నాంచారరావు, ఇబ్రహీంపట్నం తహసీల్దారు వెంకటేశ్వర్లు, ఎంపీడీవో శకుంతల పాల్గొన్నారు.



మహిళతో మాట్లాడుతున్న కలెక్టరు లక్ష్మీశ

25 నుంచి మాఘమాస ప్రత్యేక పూజలు ప్రారంభం

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఈ నెల 25 నుంచి ఇంద్రకీలాద్రిపై మాఘమాస ప్రత్యేక పూజలు ప్రారంభం అవుతాయని వైదిక కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.. 25న రథసప్తమి, 29న భీష్మ ఏకాదశి, ఫిబ్రవరి 1న మాఘపూర్ణిమ, 8న బహుళ సప్తమి, 13న ఏకాదశి, 15న త్రయోదశి(మాస శివరాత్రి) పురస్కరించుకొని సూర్యోపాసన, అరుణపారాయణ, సౌరజపాలను రుత్వికులు శాస్త్రోక్తంగా నిర్వహిస్తారని తెలిపారు. మల్లికార్జున మహామండపం ఆరో అంతస్తులో ఉదయం 9 గంటలకు నిర్వహించే సూర్యోపాసన ఆర్జిత సేవ టికెట్ రుసుము రూ.1000 చెల్లించి పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఆర్జిత సేవలో పాల్గొనే ఉభయ దాతలకు శేషవస్త్రం, రవిక ముక్క, శ్రీచక్రలడ్డు లను ప్రసాదంగా అందజేస్తారని తెలిపారు. దేవస్థానం ఆన్‌లైన్లో సైతం ఆర్జిత సేవా టికెట్లు పొందవచ్చని పేర్కొన్నారు.

ఎలక్ట్రానిక్ పరికరాల షోరూమ్‌లో దొంగతనం

రూ.18 లక్షల విలువైన సెల్‌ఫోన్ల చోరీ

పటమట, న్యూస్‌టుడే: ఎలక్ట్రానిక్ పరికరాల షోరూమ్‌లో దొంగలు చొరబడి రూ.18 లక్షల విలువైన సెల్‌ఫోన్లను చోరీ చేసిన ఘటన పటమట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. పటమట ప్రాంతంలోని ఓ ఎలక్ట్రానిక్ పరికరాల షోరూమ్ మూడు అంతస్తుల భవనంలో ఉంది. దానిపైన మరో అంతస్తు నిర్మించేందుకు పనులు చేపట్టారు. అందులో భాగంగా పైనున్న లిఫ్ట్ రూమ్ స్తంభాలను కొంత తొలగించి ఇనుప రాడ్లను బయటకు తీశారు. దాంతో అక్కడ రెండు అడుగుల వెడల్పుతో ఖాళీ ఏర్పడింది. శుక్రవారం రాత్రి 10 గంటలకు షోరూమ్ మూశారు. శనివారం ఉదయం సిబ్బంది వచ్చి షోరూమ్ తెరవగా.. మూడో అంతస్తులోని సెల్‌ఫోన్లు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దొంగలు షోరూమ్‌లో ఎక్కడా తాళాలు పగలగొట్టలేదు. భవనంపైన అంతస్తు నిర్మిస్తున్న నేపథ్యంలో కింద నుంచి మూడో అంతస్తు వరకు ఇనుప పరంజా అమర్చారు. దాని ద్వారా భవనం పైకి ఎక్కి లిఫ్ట్ రూమ్ నుంచి షోరూమ్ మూడో అంతస్తుకు చేరుకున్నారు. అక్కడున్న 52 ఖరీదైన సెల్‌ఫోన్లను చోరీ చేశారు. సెల్‌ఫోన్ల బాక్సులు మాత్రం అక్కడే పడేశారు. ఆ సెల్‌ఫోన్ల విలువ రూ.18 లక్షలు ఉంటుందని పోలీసులు గుర్తించారు. క్రైమ్ ఏడీసీపీ రాజారావు, ఏసీపీ దామోదర్, సీఐ పవన్ కిషోర్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీం వేలిముద్రలు సేకరించింది. పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలిస్తున్నారు. తెలిసిన వ్యక్తులే చోరీ చేశారనే అనుమానాన్ని వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యేక బృందాలతో దర్యాప్తు ప్రారంభించారు.



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న క్రైమ్ ఏడీసీపీ రాజారావు తదితరులు

ట్రాక్టర్ తిరగబడి యువకుడి దుర్మరణం

మైలవరం, న్యూస్‌టుడే : ఇటుకల తయారీకి మట్టిని సిద్ధం చేసే కుండీలో తిప్పుతున్న ట్రాక్టర్ తిరగబడి యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని [illegible] జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. [illegible] కూరుకుపోయిన అతడ్ని బయటకు తీసే సరికే మృతి చెందాడు. విషయం తెలుసు[illegible]



మట్టి కుండీలో తిరగబడిన వాహనం

ప్రేమను అంగీకరించలేదని నాడు పరారీ

బాలికను పెళ్లి చేసుకుని నేడు ఇంటికి.. ● గులకరాయి కేసు నిందితుడి అరెస్టు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే: బాలికతో ప్రేమ, పెళ్లి [illegible]

10 రోజుల తరువాత చిక్కి.. [illegible]

దినేష్ కోసం అన్వేషణ

భవానీపురం, న్యూస్‌టుడే: [illegible]

బాధిత కుటుంబాలకు సాయం అందజేత

మైలవరం, న్యూస్‌టుడే : మండలంలోని చంద్రాల ప్రాథమిక సహకార సంఘంలో సభ్యుడైన గణపవరానికి చెందిన వజ్రాల నారాయణరెడ్డి ఇటీవల మృతి చెందారు. ఈ మేరకు సంఘం ద్వారా రూ.10 వేల ఆర్థిక సాయాన్ని అతని కుటుంబ సభ్యులకు శనివారం అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ ఛైర్‌పర్సన్ రాయల సత్యబాలకుమారి, డైరెక్టర్ సీతారామిరెడ్డి, నాయకులు బుజ్జిరెడ్డి, శ్యాంప్రసాద్ పాల్గొన్నారు.

కొండపల్లి, న్యూస్‌టుడే : నిరుపేద వృద్ధురాలు నాగమ్మ(64)మృతి చెందడంతో ఆ కుటుంబానికి మైలవరం ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ ఆర్థిక సాయాన్ని పంపారు. కొండపల్లి అప్మెల్ వీధిలో నివాసం ఉండే వి.నాగమ్మ కొంత కాలం నుంచి ఆరోగ్య సమస్యతో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న శాసన సభ్యుడు మట్టి ఖర్చుల నిమిత్తం ఆ కుటుంబానికి మున్సిపల్ ఛైర్మన్ చిట్టిబాబు, వైస్ ఛైర్మన్ శ్రీను తదితరులచే రూ.25 వేలు అందజేశారు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

కాల్వలకు నీరు విడుదల

గంపలగూడెం, న్యూస్‌టుడే : ఎన్నెస్పీ రెండో జోన్ పరిధిలోని మధిర బ్రాంచి కెనాల్‌కు శనివారం కల్లూరు మండలం కప్పలబంధం నియంత్రిక నుంచి 1200 క్యూసెక్కుల సాగర్ జలాలు విడుదలైనట్లు ఏఈ మహేష్ బాబు తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

స్పందన: ★ తిరువూరు 7వ వార్డులోని డ్రెయిన్లలో చెత్త, మురుగు, ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకున్నాయని స్థానికుడు శ్యామ్‌సుందరరావు సమస్యను 'ఈనాడు' మేమున్నాం.. మీకు తోడుగా ద్వారా మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన మున్సిపల్ శానిటరీ అధికారి సంతోష్ పారిశుద్ధ్య కార్మికులను పంపించి డ్రెయిన్లను శుభ్రం చేయించి సమస్య పరిష్కరించారు. ★ తిరువూరు 9వ వార్డులోని మురుగు కాలువల్లో పూడిక పేరుకుని నీరు పారుదలకు ఆటంకంగా ఉందని స్థానికుడు రాఘవరావు సమస్యను 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా మున్సిపల్ అధికారులకు తెలిపారు. స్పందించిన మున్సిపల్ శానిటరీ అధికారి పారిశుద్ధ్య కార్మికులను పంపి డ్రెయిన్లను శుభ్రం చేయించి బ్లీచింగ్ చల్లించారు. స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. **- న్యూస్‌టుడే, తిరువూరు**

★ కోడూరు గ్రామంలో దోమలతో అవస్థలు పడుతున్నామని స్థానికులు సమస్యను సర్పంచి వంగూరి ప్రసాద్‌కు తెలిపారు. ఆయన వెంటనే స్పందించి సిబ్బందితో దోమల నివారణకు గ్రామంలో ఫాగింగ్‌చేయించారు. **- న్యూస్‌టుడే, జి.కొండూరు**

విస్తుబోయే నిజాలు.. ఇష్టారాజ్యంగా అమ్మకాలు

న్యూస్‌టుడే, తిరువూరు

తిరువూరు పట్టణంలో శుభ్రత, నాణ్యత లేని కోడి, మేక, గొర్రె మాంసం విక్రయాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఫుడ్ సేఫ్టీ నిబంధనలను పట్టించుకోకుండా పరిశుభ్రతకు తావు లేకుండా మాంసం విక్రయిస్తున్న దుకాణాలు రోజురోజుకు పెరిగి పోతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని దుకాణాల వద్ద చెత్త, మురుగు, ఈగల బెడద కనిపిస్తుండటంతో పాటు దుర్వాసన వస్తోందని వాపోతున్నారు. మాంసాన్ని గంటల తరబడి ఉదయం నుంచి రాత్రి వరకు బయటే ఉంచి విక్రయించడం, అమ్మకం జరగని దాన్ని డీప్ ఫ్రీజర్లలో నిల్వ ఉంచుతున్నారని పలువురు చెబుతున్నారు. కొందరు వ్యాపారులు మృతి చెందినవి, అనారోగ్యంతో ఉన్న వాటి మాంసాన్ని ఇష్టారాజ్యంగా విక్రయిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. వినియోగదారుడు ఇదేంటని ప్రశ్నిస్తే వారిపై దాడులు చేసిన సంఘటనలు కూడా ఉన్నాయి. ఇటువంటి మాంసం తింటే ప్రజల ఆరోగ్యం దెబ్బతింటోందని, చిన్న పిల్లలు, వృద్ధులకు ఉదర సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశం ఉందని తిరువూరు పశువైద్యాధికారి కిషన్ సింగ్ తెలిపారు.



అపరిశుభ్ర వాతావరణంలో మాంసం విక్రయిస్తున్న దుకాణాదారులు

కన్నెత్తి చూసిన దాఖలాలే లేవు

గతంలో మున్సిపాలిటీ అధికారులు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించే వారు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదని, అటువైపు కన్నెత్తి చూసిన దాఖలాలే లేవని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వారానికి ఒకసారైన తనిఖీలు నిర్వహించి, నాణ్యత లేని మాంసం విక్రయించే దుకాణాలను మూసేయాలని జనాలు కోరుతున్నారు. పశు వైద్య అధికారులతో పాటు మున్సిపల్ అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని, నిబంధనలు ఉల్లంఘించే వారికి భారీ జరిమానాలు విధించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

సాహిత్యాభిమానిగా కీర్తి గడించిన శ్రీకృష్ణదేవరాయలు

పెనుగొలను(గంపలగూడెం), న్యూస్‌టుడే : మండలంలోని పెనుగొలనులో శనివారం శ్రీకృష్ణదేవరాయలు జయంతిని నిర్వహించారు. గ్రామస్థులు, విద్యార్థులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విజయనగర సామ్రాజ్యాన్ని పరిపాలించిన ఆయన సాహిత్యాభిమానిగా కీర్తిగడించారని వక్తలు అన్నారు.



పెనుగొలనులో శ్రీకృష్ణదేవరాయలు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గ్రామస్థులు

ప్రజలను వణికిస్తున్న శీతలగాలులు

మైలవరం, న్యూస్‌టుడే : మంచు కురుస్తోంది. జాతీయ రహదారిని దుప్పటిలా కప్పేస్తోంది. నాలుగైదు రోజులుగా విపరీతంగా నీళ్ల మంచుతో విరుచుకు పడుతోంది. శనివారం ఉదయం 8 గంటల తర్వాత కురిసిన మంచుతో ఊర్లన్నీ మునిగాయి. నీళ్ల మంచు ప్రభావం ఇప్పుడిప్పుడే పూతలొచ్చిన మామిడి తోటలకు నష్టం కలగజేస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.



పుల్లూరు వద్ద జాతీయ రహదారిని కప్పేసిన మంచు

గంపలగూడెం, న్యూస్‌టుడే : శీతలగాలులు మండల ప్రజలను వణికిస్తున్నాయి. సంక్రాంతి నుంచి చలిగాలుల తీవ్రత పెరిగింది. వాస్తవంగా పండగ నాటికి శీతాకాలం ప్రభావం తగ్గుముఖం పడుతోంది. ఈ ఏడాది రేయింబవళ్లు చలి గాలులు వీస్తుండటంతో ప్రజలు చలిమంటలు వేసుకుంటున్నారు.

శోభాయమానంగా శ్రీనివాసుడి అలంకరణ

పెనుగొలను(గంపలగూడెం), న్యూస్‌టుడే : మండలంలోని పెనుగొలను సమీప మెట్టగుట్టలోని గజలక్ష్మి సమేత శేషాచల శ్రీనివాస స్వామి ఆలయంలో మూలవిరాట్‌ను శనివారం ప్రధానార్చకుడు శ్యామ్ సుందర శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో శోభాయమానంగా అలంకరించారు. భక్తులు, గుడి అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



మెట్టగుట్టలో స్వామివారు



తిరువూరులో చంద్రమౌళీశ్వర స్వామి

మాస శివరాత్రి పూజలు

తిరువూరు, న్యూస్‌టుడే : మాస శివరాత్రిని పురస్కరించుకుని తిరువూరు పట్టణంలోని దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆయా ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

19 నుంచి సూర్య నమస్కారాలు

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే : రథసప్తమిని పురస్కరించుకుని శాంతివన్ యోగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో 108 సామూహిక సూర్య నమస్కారాల కార్యక్రమాన్ని ఈ నెల 19 నుంచి ప్రారంభించనున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు జనార్దన్ తెలిపారు. ఇబ్రహీంపట్నం ఏ.కాలనీ అయ్యప్ప స్వామి ఆలయంలో ప్రతి రోజు ఉదయం 6 గంటలకు ఈ కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు.

అన్నదాతలకు అందుబాటులో యూరియా

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : మండలంలో 97 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని ఏవో డి.శ్రీనివాసరావు తెలిపారు. మండల పరిధిలోని ఎరువుల దుకాణాలు, పీఏసీఎస్‌ల్లో ఉన్న ఎరువులను ఆయన శనివారం పరిశీలించారు. అనంతరం రుద్రవరం, కుదప గ్రామాల్లో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్నారు. వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో ఏవో శ్రీనివాసరావు, రైతులు

ప్రీ క్వార్టర్స్‌లో వెనుదిరిగిన ఆంధ్రా కబడ్డీ జట్టు

విజయవాడ క్రీడలు: ఆంధ్రా కబడ్డీ జట్టు ప్రీ క్వార్టర్ ఫైనల్స్‌లో వెనుదిరిగి ప్రేక్షకులను నిరాశపరిచింది. ఈడుపుగల్లులోని శ్రీ సీతారామ గార్డెన్స్‌లో జరుగుతున్న 51వ జాతీయ జూనియర్ కబడ్డీ ఛాంపియన్‌షిప్‌లో భాగంగా మూడో రోజైన శనివారం సాయంత్రం ప్రారంభమైన నాకౌట్ మ్యాచుల్లో ఆంధ్రా జట్టు.. హరియాణా జట్టు చేతిలో పరాజయం పాలైంది.

విరామం ఎరగకుండా ఉద్యమాల నిర్వహణ

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే : భారత కమ్యూనిస్టు పార్టీ కష్టజీవుల కోసం విరామం ఎరగకుండా ఉద్యమాలు నిర్వహించిదని సీపీఐ మైలవరం నియోజకవర్గ కార్యదర్శి బుడ్డి రమేష్ పేర్కొన్నారు. సీపీఐ శత వార్షికోత్సవం సందర్భంగా శనివారం గుంటుపల్లిలో జరిగిన కార్యక్రమంలో పార్టీ జెండాను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. నియోజకవర్గంలో కార్మిక కర్షక ప్రయోజనాల కోసం నిర్వహించిన ఉద్యమాలను, వారి హక్కుల కోసం చేపట్టిన ఆందోళనలు, సాధించిన ఫలితాలను వివరించారు. జిల్లా కార్యవర్గ సభ్యులు యల్లమందరావు, రాష్ట్ర కౌలు రైతుల సంఘం ప్రధాన కార్యదర్శి జమలయ్య, గుంటుపల్లి గ్రామ శాఖ నాయకులు చెరుకూరి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : మండల కేంద్రంలో నవసమాజ్ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను మైలవరం ఏఎంసీ ఛైర్మన్ పి.నవ్యశ్రీ శనివారం ప్రారంభించారు. ఎస్సై శ్రీను, మైలవరం, రెడ్డిగూడెం మండలాల జనసేన అధ్యక్షులు ఎస్.బ్రహ్మయ్య, సీహెచ్.కాంతారావు, క్రీడాకారులు పాల్గొన్నారు.



రిబ్బను కత్తిరిస్తున్న నవ్యశ్రీ తదితరులు

బావ గొంతుకోసిన బావమరుదులు

తిరువూరు, విస్సన్నపేట, న్యూస్‌టుడే : ఆస్తి వివాదాల నేపథ్యంలో ఒక వ్యక్తిపై దాడి చేసి గొంతుకోసిన సంఘటన విస్సన్నపేట మండలం పుట్రేల గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. సేకరించిన, స్థానికుల వివరాల మేరకు.. కమ్మెల.చిరంజీవి అనే వ్యక్తి హైదరాబాద్‌లో వ్యవసాయ శాఖలో పని చేస్తుంటారు. సంక్రాంతి సందర్భంగా ఇంటికొచ్చిన అతడిని బావమరుదులైన ఊడల.సుమన్, సునీల్‌లు అదే గ్రామానికి చెందిన గార్లపాటి నాగేశ్వరరావు గృహం వద్ద మాట్లాడుకుందామని పిలిచి అతనిపై దాడి చేసి పదునైన కత్తితో గొంతుకోశారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన చిరంజీవిని స్థానికులు వెంటనే తిరువూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న చిరంజీవి పరిస్థితి విషమంగా మారడంతో మెరుగైన వైద్యం కోసం విజయవాడ ఆసుపత్రికి తరలించారని సమాచారం. దీనిపై స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చోరీ చేసిన నగదు స్వాధీనం

తిరువూరు, న్యూస్‌టుడే : స్థానిక హిందుజా జనరల్ స్టోర్ అండ్ ఫ్యాన్సీ దుకాణంలో బుధవారం దొంగతనం జరిగినట్లు దారా.వెంకట ఉపేంద్ర చేసిన ఫిర్యాదుపై పోలీసులు స్పందించారు. సీసీ కెమెరాలు, వేలిముద్రలను పరిశీలించి చోరీ చేసింది ఏ.కొండూరు మండలం కోడూరుకు చెందిన కట్టా.రామాంజనేయ అనే వ్యక్తిగా గుర్తించారు. నిందితుడు గతంలో కూడా పలు నేరాలకు పాల్పడినట్లు తెలిపారు. ఈ మేరకు శనివారం ఉదయం పీటీ.కొత్తూరు వద్ద అతడిని అదుపులోకి తీసుకుని, చోరీకి గురైన రూ.లక్ష స్వాధీనం చేసుకుని బాధితుడికి అప్పగించారు. నిందితుడిపై కేసు నమోదు చేసి న్యాయమూర్తి ఎదుట హాజరు పరచగా 14 రోజుల రిమాండ్ విధించినట్లు తిరువూరు సెక్టార్- 1 ఎస్సై శాతకర్ణి చెప్పారు.



పట్టుకున్న నిందితుడితో పోలీసులు

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

తిరువూరు, విస్సన్నపేట, న్యూస్‌టుడే : పాత ఇనుప దుకాణంలో పూర్తిగా కాలిపోయిన స్థితిలో మృతదేహం లభ్యమైన సంఘటన విస్సన్నపేట పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. దుకాణా యజమాని పోలీసులకు సమాచారమివ్వగా వారు అక్కడికొచ్చి పరిశీలించారు. చనిపోయిన వ్యక్తికి సుమారు 35 ఏళ్లు ఉంటాయని అంచనా వేస్తున్నారు. అతను రెడ్డిగూడేనికి చెందిన దిరిసినపు.ప్రకాశరావుగా గ్రామస్థులు తెలుపగా అతని బంధువులు మృతదేహాన్ని గుర్తించడం కష్టతరంగా మారింది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం విస్సన్నపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆ నివేదిక ఆధారంగా మృతికి గల కారణాలు వెల్లడవుతాయని పోలీసులు తెలిపారు.

EENADU e Classifieds

AUTO

VEHICLES FOR SALE

2022 Bolero NEO- N4, 7seater 2vehicles, 2022 AL 6Tyres tipper 4.5 tones Wheel Base 2820. and 2014 Leyland Links 50 seater school bus, 2018 Leyland Links 55 seater school bus for sale. Ph: 93919 89999

BUSINESS SERVICES

COURIERS

USA,UK, కెనడా, ఆస్ట్రేలియా & ఇతర దేశాలకు పచ్చళ్ళు, స్వీట్స్, బట్టలు, డాక్యుమెంట్స్, మెడిసిన్స్, మొ|| కొరియర్ చేయబడును. SV Express - ICL కొరియర్. గురునానక్ నగర్, VJA. 94410 27788

BUSINESS OFFER

శ్రీనివాసనగర్ బ్యాంకు కాలనీ విజయవాడలో రన్నింగ్ కండిషన్‌లో ఉన్న ప్లే స్కూల్ అమ్మకమునకు కలదు. Contact: 86869 84435.

స్త్రీ/పు చిన్న పెట్టుబడితో మీ ఆఫీసు/ ఇంటివద్దే గోల్డ్ జ్యువలరీ అమ్మండి/ కొనండి! ప్రతిరోజు ఫిక్స్‌డ్ ప్రాఫిట్ పొందండి! ✆ 73862 75652, 63095 72064.

FOR SALE

బ్యాంక్ ఆక్షన్‌లో విజయవాడనందు జిమ్ ఎక్విప్‌మెంట్స్, ఇంటీరియర్స్, A/cలు, జనరేటర్ & ఇండిపెండెంట్ హౌసెస్, 2 BHK ఫ్లాట్స్ వెటర్నరీకాలనీ, గొల్లపూడి, భవానీపురం, కొండపల్లి, నున్న, తాడిగడపనందు అమ్మకం. ✆ 70134 39314, 63040 00712.

PACKERS & MOVERS

Tirumala Packers & Movers an ISO 9001:2015 Certified Co. Household Goods Shifting any time any where. ✆ 97043 64389.

BUILDING CONSTRUCTION

BPS & LRS ద్వారా అనధికార బిల్డింగ్స్ & లేఅవుట్స్ క్రమబద్ధీకరించేందుకు సంప్రదించండి ANCISON ఇన్‌ఫ్రాటెక్ AP ఆర్కిటెక్ట్స్ & ఇంజినీర్స్ ✆ 94917 55456.

సొంతంగా ఇల్లు కట్టాలని ఉందా! తీరికలేకుండా ఉన్నారా! మీ మెటీరియల్‌తో దగ్గరుండి కేవలం జీతము తీసుకొని క్వాలిటీగా కట్టించగలను. ✆ 79890 13598

WATER PROOFING

Tarun Slab Leakage Works ★ 25 yrs Exp. ★ 5yrs Warranty ★ Bathroom Leakage Grouting Epoxy Works. ✆ 94940 02285, 99516 07504

EDUCATION

HOME TUITIONS

ప్రత్యక్ష (ఆఫ్‌లైన్ & హోమ్) ట్యూషన్స్ LKG to PG అన్ని సబ్జెక్ట్స్, NEET, IIT ట్యూటర్లు ✆ 92900 05677, 74165 35749.

FINANCIAL SERVICES

[illegible] ✆ 93969 99669

SHARES

Learn most Successful Trading and Investment Strategies and Psychology from Certified Experts. For your daily profits. Ph: 90305 91409.

HOME NEEDS

MOSQUITO SCREENS

మెష్‌డోర్స్ [illegible] UPVC విండోస్ [illegible] Anti Bird [illegible] ✆ 98495 69111.

గమనిక

[illegible]

PEST CONTROL

Tarun Pest ★25yrs Exp., 5yrs Warranty ★ Smell Less ★ Bayers Chemicals (Pest & Other Insects Control). ✆ 94940 02285, 99516 07504

REAL ESTATE

గుంటూరు సిటీలో, గోరంట్ల, లాం, JKC రోడ్డు, ఇన్నర్‌రింగ్ రోడ్, వెనిగండ్ల, పెదకాకాని, నంబూరు, కాజా, మంగళగిరి, తాడికొండలోని ప్లాట్లు అమ్మేవారు. 93999 55545.

గుంటూరు సిటీ, గోరంట్ల రెడ్డిపాలెం, లాం, అగతవరప్పాడు, వెనిగండ్ల, నంబూరు, పెదకాకాని, కొప్పురావూరు, కంతేరు, కాజాలలో ప్లాట్లు అమ్మాలన్నా/ కొనాలన్నా సంప్ర॥ 73823 96677.

అమరావతి రాజధానిలో గల ల్యాండ్ పూలింగ్ ప్లాట్లు, పొలాలు విజయవాడ- గుంటూరు మధ్య అన్ని వెంచర్లలో ప్లాట్లు అమ్మదలచిన, కొనదలచిన. Ph: 7794912324.

పెదఅవుటపల్లి గ్రామములో 18 సెంట్లు స్థలం, భవానీపురం VJA లో డబుల్ బెడ్‌రూమ్ అమ్మబడును. స్థలం బిల్డర్సుకూ యివ్వబడును. ✆ 99598 20464

ధర తక్కువ పాత అపార్ట్‌మెంట్స్, ఇండ్ల మధ్య ఓపెన్ ప్లాట్స్ మరియు షాపులు అమ్మబడును. & డెవలప్‌మెంట్‌కు సైట్ దొరుకును. ✆ 80089 75044

FLAT FOR SALE

KANURU

3 BHK Luxury Flats per floor two only at Kanuru, Vijayawada. Contact ✆ 98485 98331.

3BHK - 1470SFT North, 2BHK-1240SFT East, ready to move at Srinivasa Residency, Near sitapuram colony, aravapalli purnaiah veedhi, opp: priya foods, poranki, Vijayawada. Ph :77028 76445

కానూరు బల్లెంవారి వీధిలో Occupancyకి సిద్ధముగా 1700 S.ft న్యూ 3 BHK లగ్జరీ ఫ్లాట్స్ E/W కబోర్డ్స్ 100% లోన్‌తో ✆ 76719 22845.

కానూరు, మురళీనగర్, బల్లెంవారి వీధిలో అక్షయమెడోస్ నందు న్యూ 3BHK (1400 SF.t) ఫ్లాట్స్ అన్ని సౌ॥తో 53 లక్షలు. ✆ 89195 70872/ 96428 47736

TADIGADAPA

బందరు రోడ్డు సిద్ధార్థEnggకాలేజి ఎదురు, తాడిగడప, పద్మజానగర్ కాలనీలో న్యూ 3BHK ఫ్లాట్ 1800S.Ft. అమ్మకం (ఫ్లోర్‌కి 1ఫ్లాట్) ✆ 94400 31268

SATYANARAYANAPURAM

3BHK, 1300 Sft, 2nd Floor, 58 S.Yds UDS, @ Satyanarayanapuram, 2nd Lane Srinagar Colony, Vijayawada. 25Yrs Old Flat for Immediate Sale. ✆ 94920 49001, 94401 38224.

Premium 2BHK Flats for Sale. Plinth 900 S.Ft; Total: 1,190 S.Ft, Lift, C.C.T.V., Generator, Carparking, Near to BRTS; Satyanarayanapuram; Vijayawada. ✆ 95818 15555

GENERAL

Gurunanak Colony New 4BHK Luxury & Premium Flats for Sale North & East Corner Bldg, Each Floor One Flat 3,600SFt 2Car Parking. ✆ 93471 75149.

మన శ్రీసిటీ కన్‌స్ట్రక్షన్స్ వారి [illegible] ✆ 98493 03315, 84494 58449.

SALE/ LEASE
విజయవాడ, మహానాడు రోడ్డులో 352 చ.గ.లలో 5 ఫ్లోర్ల బిల్డింగ్ ఒక్కొక్క ఫ్లోర్ 2200 S.Ft. కమర్షియల్ స్పేస్ అమ్మకం/ లీజుకు కలదు.
✆ 88975 63506

గురునానక్ కాలనీ [illegible] 3 BHK, 3 [illegible] ✆ 98853 99999

VJA రామవరప్పాడు [illegible] 3 BHK ఫ్లాట్స్ [illegible] ✆ 98485 98331.

విజయవాడ, ఏలూరు రోడ్డు SRR కాలేజ్ [illegible] 4BHK (2675 SF.t) [illegible] ✆ 98482 99038

3BHK Flats for Sale. [illegible] 1700 SF.t. ✆ 94852 90846

VJA, LICకాలనీ, జయప్రకాష్‌నగర్ 1st లైన్ లగ్జరీ 3BHK ఫ్లాట్స్, ఏలూరురోడ్, సీతారామపురం చాపరాలవీధి, 3BHKఫ్లాట్స్ అమ్మకం. ✆ 90305 06249

విజయవాడ కుమ్మరిపాలెం సెంటర్‌లో గల లోటస్ లెజెండ్ అపార్టుమెంట్ 5th ఫ్లోర్ తూర్పు ఫేస్ 2BHK ఫ్లాట్ కబోర్డ్స్, ఫర్నిష్ అన్ని సౌకర్యాలతో అమ్మకమునకు కలదు. ✆ 94401 75561

Moghalrajapuram, Madhu Gardens, Flat. A2 (2 BHK), Old Bhanu Apartments, A-Block, Vijayawada. Ph: 78939 77344.

మచిలీపట్నం గుండుపాలెం (రుద్రవరం పంటకాలువ డొంకరోడ్డు కృష్ణ యూనివర్శిటీ దగ్గర) 12.5 ఎకరాల పొలం అమ్మకం ✆ +9199499 88829(Whatsapp)

FLATS for SALE
4 BHK Premium FLATS - 2850 Sft.
(2 Cars Parking)
beside Bhashyam School, KANURU
✆ 9989855219 8977162616

సీతారాంపురంలో ఫ్లోర్‌కి ఒకటి చొప్పున నూతనంగా నిర్మించిన ఉత్తరం ఫేస్ ఇండివిడ్యువల్ ఫ్లాట్స్ అమ్మకం. బ్యాంక్ లోన్ @ 7% ✆ 98483 48759

పోరంకి టెలిఫోన్ ఎక్స్చేంజ్ రోడ్డులో కబోర్డ్ వర్క్, కార్ పార్కింగ్, CRDA అప్రూవల్‌తో 2 BHK ఫ్లాట్ అమ్మకమునకు కలదు. ✆ 79939 45588.

3&4 BHK Deluxe Floorwise FLATS for SALE
Near Kennedy School, Kanuru.
G+2 Independent House for Sale in 154 Sq.yds
(Lift & 2 Car Parking) @ Tadigadapa.
✆ 7075017255

అశోక్ నగర్ టైం హాస్పిటల్ ఎదురుగా బందరురోడ్డుకి అతి సమీపమున నిర్మించిన 3BHK ఫ్లాట్స్ గృహప్రవేశమునకు సిద్ధముగా వున్నవి. ✆ 73829 81107.

నందిగామ రైతుపేట సెంటర్ నందు నిర్మించిన ★ విష్ణుప్రియ ప్లాజా నందు కమర్షియల్ షాప్స్ & 2BHK ఫ్లాట్స్ అమ్మకమునకు కలవు ✆ 93939 59907

పుల్లీఫర్నిష్డ్ 3 BHK
VJA కనకదుర్గానగర్, మెయిన్ రోడ్డు F.No:109, 509 నందు 2110 Sft, UDS 72 చ॥గ॥లు 2 కార్ల పార్కింగ్‌తో తూర్పు ఫేస్ 3 BHK ఫ్లాట్స్-2 అమ్మకం
✆ 63051 43789 81253 97979

VJA, లయోలాకాలేజీ దగ్గరలో 1680 S.Ft. గల 3BHK, E/F ఫుల్లీ ఫర్నిష్డ్‌తో, 1st ఫ్లోర్, ఫ్రెండ్లీ అపార్ట్‌మెంట్ [illegible] అమ్మకం. 81422 42239

సింగ్‌నగర్, ఆంధ్రప్రభ కాలనీ [illegible] 3 BHK [illegible] 1431 Sft, 4thఫ్లోర్, W/F Readyto Occupy. ✆ 9849242413

VJA, S.N.పురం, [illegible] 2BHK [illegible] ✆ 98666 01999, 96528 84144.

విజయవాడ, బందరు రోడ్డుకి దగ్గరగా, [illegible] 3rd & 5th ఫ్లోర్లలో 1764 S.Ft. 2 కార్ల పార్కింగ్‌తో [illegible] 3 BHK లగ్జరీ ఫ్లాట్స్ [illegible]
✆ 98494 10812

విజయవాడ - గొల్లపూడి [illegible] 3BHK, 1341 [illegible] Ph: 83338 65529.

VJA- గన్నవరం [illegible] 1660 [illegible] ✆ 83338 65529.

HOUSE FOR SALE

TADIGADAPA

150 చ॥గ॥ల G+1 ఇండిపెండెంట్ హౌస్ (E/F) [illegible] ✆ 98851 22909.

GENERAL

విజయవాడ 1-టౌన్, [illegible] ✆ 93914 89207, 94413 46129.

గన్నవరం [illegible] 2BHK [illegible] ✆ 70303 33368

బిల్డింగ్ అమ్మకము
విజయవాడ, కరెన్సీనగర్‌లో (NH-16 కు 200మీ॥ల దూరంలో) 378 చ॥గ॥లు విస్తీర్ణం గల స్థలంలో అన్ని రకాల సౌకర్యాలు ఉన్న ఒక్కొక్క ఫ్లోర్‌లో సుమారు 2,400చ॥అ॥లు విస్తీర్ణం గల 3BHK ఫ్లాట్స్, 5 ఫ్లోర్స్ & పెంట్ హౌస్ (E/F) బిల్డింగ్ మొత్తము అమ్మకమునకు కలదు.
94401 51179 94408 96594

LAND FOR SALE

విస్సన్నపేట వేమిరెడ్డిపల్లి గ్రామంలో 5 ఎకరాలు భూమిలో మామిడితోట, చుట్టూ టేకు చెట్లు, చుట్టూ ఫెన్సింగ్ గల భూమి అమ్మకమునకు కలదు. ✆ 94416 40207.

గన్నవరం, తెంపల్లి గ్రామం, చిన్న అవుటుపల్లి to తెంపల్లి రోడ్ ఫేసింగ్ 1.42 ac. Industrial Land. RCC షెడ్‌తో. ✆ 89782 66665.

గుడివాడ మండలం, కొమరవోలు శివారు తటివర్రు గ్రామమునందు 10 ఎకరముల మాగాణి పొలము అమ్మకం. సంప్ర ✆ 93462 81147, 83676 38755

కృష్ణా జిల్లా, చల్లపల్లి మండలం వెలివోలు గ్రామంలో 8ఎకరాల పొలం అమ్మకానికి కలదు. Mob No: 80080 50435

తక్కువ ఇన్వెస్ట్‌మెంట్, కోట్ల ఆదాయం ఎర్రచందనం పెంపకంలో ప్రపంచంలోనే అగ్రగామి సంస్థ సాయి ప్రోపర్టీస్ & ప్రాజెక్ట్స్ లిమిటెడ్. ✆ 85004 40758.

2 ఎకరాల 20 సెంట్లు చేపల చెరువు అమ్మకం. దొడ్డనపూడి గ్రామం కాళ్ల మండలం, భీమవరం, ప.గో. జిల్లా. సెల్: 85004 05678, 98859 12559

PLOT FOR SALE

KANURU

కానూరు 100 అ॥ రోడ్డుకి దగ్గరగా శ్రీకర హాస్పటల్ ఎదురుగా రోడ్డుకి 3వ బిట్టు 27 సెంట్లు (Sy No 93/7, 95/1) అమ్మకం. ✆ 98667 28580.

హరివిల్లు వారి అన్ని CRDA లేఅవుట్‌లో పెనమలూరు, కంకిపాడు, గండిగుంటలో 194, 240, 300, 400 చ.గ.ల మంచి ప్లాట్లు కంపెనీ డైరెక్ట్ సేల్కై ✆ 92464 73929

VJA పోరంకిలో CRDA గేటెడ్ కమ్యూనిటీలో వెంటనే ఇల్లు కట్టుకునే 220,275, 330, 550 చ.గ.ల ప్లాట్లుకై సంప్ర. గ॥ 26,000/- రూ.లకే. ✆ 93922 56567

విజయవాడ, అమరావతి రాజధాని సరౌండింగ్‌లో అన్ని రియల్ ఎస్టేట్ కంపెనీలలో మీ ప్లాట్లు అమ్మదలచినవారు ఖచ్చితమైన రేటుకై పూర్తి వివరాలతో ✆ 98498 65959

TADIGADAPA

పోరంకి నిడమానూరు రోడ్డులో 1254, 400 & 300 గజాలు, 53 సెంట్లు పొలం నిడమానూరులో మరియు నారాయణపురంకాలనీలో 250 గజాలు. ✆ 98495 05854

కంకిపాడు బైపాస్ శ్రీచైతన్య కాలేజీ ఎదురు 300 గజాల లేఔట్ ప్లాటు గజం 12,500/- & వణుకూరు ఊళ్ళో 200 గజాల ఉడా లేఔట్ ప్లాటు గజం 9,000/- ✆ 92907 63488.

తాడిగడప చైతన్య కాలేజి 100 Ft. రోడ్డు ప్రక్కన 200 & 250 గజాల లేఔట్ ప్లాట్లు అమ్మకం & పోరంకి సీతాపురం కాలనీ వెనుక 200 గజాల లేఔట్ ప్లాటు అమ్మకం. ✆ 92907 63488

CURRENCY NAGAR

విజయవాడ, భారతీనగర్‌లో నార్త్ & ఈస్ట్, 451 చ॥గ॥ల స్థలం అమ్మకం లేదా 150 గ॥లలో 3 విల్లాలు కట్టించి అమ్మబడును. ✆ 93946 26067/ 94903 53541.

GOLLAPUDI

గొల్లపూడి ఖలీల్‌భాయ్ రెస్టారెంట్ Opp రోడ్డులో 209 & 270 గజాల లేఔట్ ప్లాట్లు అమ్మకం. గజం: 26,000/- Cell : 92907 63488.

GENERAL

CRDA Layout Open Plots Gudivada NH165 (Pamarru To Digamarru) Sea Corridor Facing. Cont: Raja ✆ 99598 50405.

200 అ॥ బందరు రోడ్డుకి దగ్గర కంకిపాడు వద్ద తూర్పుఫేస్ 178 చ॥గ॥లు, పడమర ఫేస్ 194 చ॥గ॥ల ప్లాట్లు అమ్మకం. లోన్ సౌకర్యం కలదు. ✆ 98668 14557

ఈడుపుగల్లు జనచైతన్య వెస్ట్‌ఫేస్ 196 చ॥గ॥ 25L పునాదిపాడు to కోలవెన్ను తారురోడ్డు ఫేస్ 165 చ॥గ॥ 25L అమ్మకం. ✆ 73824 22777, 94942 87778

ఉయ్యూరు దగ్గర అప్రూవ్డ్ లేఅవుట్‌లో 224 గ॥లు మరియు కురుమద్దాలి మెయిన్ రోడ్ ఫేసింగ్‌తో 7 1/2 సెంట్లు అమ్మకమునకు కలవు. ✆ 99481 74488.

అమరావతి అవుటర్ రింగ్ రోడ్డుకు ఆనుకొని అగిరిపల్లి ఇళ్ళు పక్కనే గజం కేవలం 5500/- మాత్రమే. Cont: ✆ 73967 79997.

మన శ్రీసిటీ వారి గేటెడ్ కమ్యూనిటీ ప్రాజెక్ట్స్ బందరురోడ్, వెస్ట్ బైపాస్‌లలో ఓపెన్ ప్లాట్స్, విల్లాలు LP నంబర్‌తో అమ్మకానికి కలవు. బ్యాంక్ లోన్, స్పాట్ రిజిస్ట్రేషన్ ✆ 98493 03315, 84494 58449

హనుమాన్ జంక్షన్‌లో నేషనల్ హైవేకు 100 మీ॥ దూరంలో CRDA పాత లేఅవుట్ ప్లాట్లు గజం కేవలం 999/- మల్లవల్లికి 6 కి॥మీ॥ మాత్రమే. # 9963643786

విజయవాడ, గుంటూరు మధ్య చినకాకాని హాయ్‌ల్యాండ్ వెళ్లే రోడ్డు ఫేసింగ్‌కు, ఇళ్లకు దగ్గరలో W/F 160 చ॥గ॥ స్థలం అమ్మకం. ✆ 98666 23804.

విజయవాడ కండ్రిక, పాయకాపురంలలో 200 Ft రోడ్ ఫేస్‌లో ప్లాట్స్ మరియు వెస్ట్ బైపాస్‌లో ప్లాట్లు అమ్మకంనకు కలవు. 3 నెలల్లో రేటు డబుల్ కాగలవు. ✆ 63010 67750.

విజయవాడ సీతారామపురం రామానాయుడు వీధిలో స్వాతి ఆఫీసు దగ్గర వెస్ట్ ఫేస్‌లో 185 గజాల స్థలం అమ్మకంనకు కలదు. ✆ 78427 28111.

Labbipet, Vijayawada | Prime Plot 750 sq. yds. East facing. MG Road proximity. Call: 98662 19067

For Sale: 253 Sq Yds West Facing Site in Srinivasa nagar Bank Colony Near Novotel, VJA. ✆ 98490 02025, 93460 02025

గొల్లపూడి ఖలీల్‌భాయ్ రెస్టారెంట్ ఎదురు రోడ్డులో E/S ఫేస్ 42x53 కొ॥తో 247చ॥గ॥ల లేఅవుట్ ప్లాటు గజం: 35000/-లకే. (నో బ్రోకర్స్). ✆ 81429 75999

PLOTS FOR SALE
వణుకూరులో యం.ఎ. డెవలపర్స్ వారి వెంచర్లో గజం రూ॥13000/- రేటు మాట్లాడుకోవచ్చు
9492581977

బందరురోడ్డులో పోరంకి ఆకునూరులలో శ్రీ భ్రమరవారి ఓపెన్ ప్లాట్లు, అపార్ట్‌మెంట్స్, హౌస్‌లు & వినుకొండ బొల్లాపల్లిలో ఫామ్‌లాండ్స్ అమ్మకం. ✆ 97012 84449

NH-65, బెల్ కంపెనీ, మచిలీపట్నం పోర్ట్, గన్నవరం ఎయిర్ పోర్ట్, ORR లకు దగ్గరలో పామర్రు కార్పొరేషన్ పరిధిలో, బందర్ రోడ్, గంగూరులలోను CRDA అప్రూవ్డ్ వెంచర్లో ప్రీమియం ఓపెన్ ప్లాట్స్ బ్యాంక్ లోన్ సౌకర్యంతో కలవు & పరిటాల హైవే ఫేసింగ్‌లో మరో నూతన CRDA వెంచర్ త్వరలో ప్రారంభం. ✆ 77993 34555.

గుంటూరు - విజయవాడ నేషనల్ హైవేలో కాజా టోల్‌గేట్ దగ్గర CRDA అప్రూవ్డ్ ప్లాట్లు చ.గ. 20 వేలు మాత్రమే. బ్యాంక్‌లోన్ సౌకర్యం. కలదు. సంప్ర: ✆ 93944 44477.

7 లక్షలకే సెంటు 70% బ్యాంక్ లోన్‌తో
పెనమలూరు హైస్కూల్ దగ్గరలో 33 అ॥ రోడ్లతో పంచాయితీ అప్రూవ్డ్ ప్లాట్లు అమ్మకమునకు కలవు.
✆ 98486 67454

VJA బందర్ హైవే, ORR, పోర్ట్ దగ్గర్లో హరివిల్లు గేటెడ్ కమ్యూనిటీ పెనమలూరు, గండిగుంట, ప్లాట్స్ & 195గ॥ 2BHK, 67L నుండి సేల్. ✆ 95427 56666

ప్లాట్స్ అమ్మబడును. డి.టి.సి.పి. లేఔట్‌లో మచిలీపట్నంలో మంచినీటి కాలువ దగ్గర వాసవి నగర్‌లో ప్లాట్స్ అమ్మకమునకు కలవు. ✆ 79817 81688, 78158 50952

మచిలీపట్నం, ఈడేపల్లి బాలభాను విద్యాలయం రోడ్‌లో 265 గజాలు కమర్షియల్ ప్లాట్ అమ్మకం కలదు. PH.No: 98482 10397, 95559 93366.

విజయవాడ - హైదరాబాద్ హైవేను ఆనుకొని పరిటాల వద్ద, బందర్ హైవేకి దగ్గరలో రెసిడెన్షియల్ ఓపెన్ ప్లాట్స్ మరియు అమరావతి రాజధానిలో లామ్, తాడికొండ, కంతేరు, కాజాలలో రీజనబుల్ ధరలో ప్లాట్స్. ✆ 70366 39849.

VJA-HYD నేషనల్‌హైవే ఫేసింగ్‌తో నందిగామ సమీపంలో DTCP & 80% బ్యాంకు లోన్‌తో ప్లాట్లు కలవు. గజం: 7999/- ✆ 90307 46514, 78936 74352

బందరు రోడ్డుకి అతిదగ్గరలో 300 ఎకరాల మెగా గేటెడ్ కమ్యూనిటీలో కమర్షియల్ ఓపెన్ ప్లాట్స్ గ. 5500/- ✆ 98669 09185, 77806 16494.

విజయవాడ, పోరంకి, సీతాపురం కాలనీ, 410 చ॥గ॥ ఈస్ట్‌ఫేస్ & పటమట, కెనరా బ్యాంకు రోడ్డు 570 చ॥గ॥ వెస్ట్ ఫేస్ స్థలాలు అమ్మకం. 9849864969.

విజయవాడ, గురునానక్ కాలనీ మెయిన్ రోడ్డుపై 450 గ॥లు, గాయత్రీ నగర్‌లో 450 & 340గ॥ గుణదల మెయిన్ రోడ్డుపై 276 గ॥ తాడేపల్లి హైవేపై 1600 గ॥ & కానూరు 100 అడుగుల రోడ్డుకు 470గ॥ ✆ 93921 01599.

బందరు రోడ్ నేషనల్ హైవే ఫేసింగ్ నార్త్ సైడ్ కంకిపాడు దగ్గరలో 450 చ॥గ॥ల ప్లాట్ అమ్మకమునకు కలదు. సంప్ర ✆ 98483 43355.

గన్నవరం మం. కేసరపల్లి వృద్ధాశ్రమం దగ్గర తూర్పు ఫేస్ 232 గజాలు, ఇబ్రహీంపట్నం మం. కొటికలపూడిలో తూర్పు ఫేస్ 300 గజాల (ప్లాట్స్) ఖాళీ స్థలాలు అమ్మకంనకు కలవు. ✆86392 56079

కంకిపాడు వాణినగర్ 194 చ॥గ॥లు మెయిన్‌రోడ్‌కి 2వ బిట్టు సెమికమర్షియల్ 63 చ॥గ॥ కానూరు 80 అ॥ల రోడ్డు ఫేస్ కమర్షియల్ బిట్ 363 చ॥గ॥ అమ్మకం. ✆ 85018 17789

COMMERCIAL SPACE FOR SALE

Hyd, నేషనల్ హైవే, భవానీపురంలో 1050 చ॥గ॥ల్లో అప్రూవల్ ప్లాన్ గల బ్యాంక్ లోన్ నందు ఉన్న గోడౌన్ అమ్మకం ధర: 6.5 కోట్లు. ✆ 92464 76079.

గాంధీనగర్, ఐలాపురం హోటల్ ఎదురు రోడ్డులో 103 చ॥గ॥లో G+1 కమర్షియల్ బిల్డింగ్ & ఐలాపురం హోటల్ వెనుక 2 షాపులు అమ్మకం. ✆ 86606 77987

35 లక్షలకే విజయవాడ గొల్లపూడి MGకాంప్లెక్స్ దగ్గర కమర్షియల్ షాప్స్ అమ్మకమునకు కలవు. Ready to Occupy. సంప్ర ✆ 99851 51976.

విజయవాడ, 1టౌన్ కెనాల్ రోడ్డులో, నెమళ్ళ బిల్డింగ్ ప్రక్కన, తూర్పు, 1st ఫ్లోర్‌లో- 5 షాపులు మరియు 2nd ఫ్లోర్ (టెర్రస్ +హాలు) అమ్మకం. ✆ 98490 83118.

SHOP FOR SALE

First Floor for sale at Suryaraopet, Vja. 4 Blocks, Each Block Contains (12x10+12x10 approx) for 36 Lakhs, North face used for Consultant Doctors, Labs etc. ✆ 95052 64897.

LEASE/ RENT

MLR Sindoor Comercial Building G+3 Near Ayush Hospitals at VJA. For Lease or Rent, Opp: No1 Cars. ✆ 94928 48282, 81065 75979

విజయవాడ సిటీ దగ్గర నూజివీడు రోడ్లోనున్న ఊర్లో 30 సెంట్లు Water/ కరెంటు సౌకర్యంతో అద్దె/ లీజుకి ఇవ్వబడును. సంప్ర॥ ✆ 73821 92967.

VJA లబ్బీపేటలో కాలేజీలకు బ్యాంక్‌లు, గోడౌన్‌లు, గోల్డ్‌షాపులు, డిజిటల్ మార్కెటింగ్ ఆఫీసులకు హాస్పిటల్‌లకు అద్దెకు/లీజుకు 94410 04393, 77027 99355

WANTED

డెవలప్‌మెంట్ (అపార్ట్‌మెంట్సు)కి విజయవాడ సిటీలో స్థలం కావలెను. మరియు 5 నుండి 20 ఎకరాలు ప్లాటింగ్ & విల్లాస్‌కి కూడా విజయవాడ పరిసర ప్రాంతాలలో కావలెను. సంప్ర ✆70956 43677

PROPERTY FOR SALE

విజయవాడ ఇన్నర్ రింగ్ రోడ్ రామవరప్పాడులో లేఅవుట్లకు అనుకూలమైన ఎకరం వ్యవసాయ భూమి కలదు ఫోన్ : 92461 90045.

మచిలీపట్నం ఈడేపల్లిలో 1069 sq. yds రెసిడెన్షియల్ స్థలం / ఇల్లు స్పష్టమైన మున్సిపల్ ట్యాక్స్ రికార్డులతో అమ్మకమునకు కలదు. ఫోన్: 94922 18789

AGRICULTURE LANDS

7 acres, 50 meters of frontage with NH16, by the bridge on Eluru Canal in Kesarapalli. contact: 63041 49506.

LAND REQUIRED

విజయవాడ వెస్ట్ బైపాస్‌లో మీకు భూమి ఉందా? లీజ్‌కు ఇచ్చి స్థిరమైన ఆదాయం సంపాదించండి! ఇప్పుడే సంప్రదించండి- 99080 09448

TO LET

VJA Satyanarayanapuram New 3BHK Flat for Rent Video Security Parking Etc Only for Vegetarians. ✆ 99498 46721, 97030 65461

VJA, శ్రీనివాసనగర్ బ్యాంక్ కాలనీ నిర్మల అపార్ట్‌మెంట్ నందు 2nd ఫ్లోరు 2BHK అద్దెకు కలదు. ✆ 94401 57261, 94414 08383.

లబ్బీపేట, మధువన్ రెస్టారెంట్, ఆదర్శరోడ్, అభ్యుదయ అపార్ట్‌మెంట్స్‌లో 2B/R ఫ్లాట్, A5, అద్దెకు, కారు పార్కింగ్ కలదు ✆ 78937 38999

2BHK Independent House 2nd Floor For Rent. Near Nalanda School, Beside Trendset Mall, Benz Circle, VJA. ✆ 99497 76210

3BHK, 1st Floor, 2Balconies, Cupboards, Wardrobes, Lift, Car Parking, Vinaya Aprts, Gayatri Nagar, Near Pinnamaneni Polyclinic Rd, Job Holders Contact: 94924 90037

Mogalrajpuram: Shradha Aptt, close to main road, 3 BHK (1282 S.Ft. excluding cmn. area), 3rd Flr. ✆ 99852 66655/ 91012 58295.

గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కాలేజి వెనుక గేటు దగ్గర 3 BHK ఇండిపెండెంట్ ఇల్లు గ్రౌండ్ ఫ్లోర్ అద్దెకు కలదు. ✆ 94940 49969.

విజయవాడ వెటర్నరీ కాలనీలో సింగిల్ బెడ్‌రూమ్, షెడ్ విత్ టాయ్‌లెట్స్ & ఉయ్యూరు (మం) చిన ఓగిరాల గ్రామంలో సింగిల్ బెడ్‌రూమ్ హౌస్ అద్దెకు కలవు. ✆ 98483 05991.

విజయవాడ, బృందావన్‌కాలనీ మెయిన్‌రోడ్డులో తూర్పు ఫేస్ గ్రౌండ్ & 3rd ఫ్లోర్స్‌లో (7 బెడ్‌రూమ్స్) లిఫ్ట్, జనరేటర్‌తో అద్దెకు. అద్దె: 1,75,000/- ✆ 90003 33366.

COMMERCIAL

TOLET 1st Floor, Ramakrishna Towers, 3 BHK, 3 Bath, Car Parking, Centrally Located Between Nakkal Road and Dornakal Road, Suryaraopet, Vijayawada. Mobile: 98488 85657, Rent: 25,000/-.

Commercial Space for Rent
4500 S.Ft., G+2 Floors, Offices or Educational Institutions.
Old 5 Route, Ashok Nagar, Near ITI Bus stop, Vijayawada.
K. Raghuram
✆ 98481 15680

VJA మహానాడురోడ్ AXIS బ్యాంకుపైన 4వ ఫ్లోరు 2300 S.Ft ఆఫీసు, బ్యాంకు, కమర్షియల్‌కు అద్దెకు కలదు. ✆ 94401 57261, 94414 08383

కమర్షియల్ స్పేస్ అద్దెకు
విజయవాడ, సూర్యారావుపేట, దొర్నకల్ రోడ్డుకు, 2వ బిట్, 13,000 S.Ft. గల G+4 (5 ఫ్లోర్స్) బిల్డింగ్ హాస్పిటల్స్/ ఆఫీసులకు అద్దెకు ఇవ్వబడును.
K.Raghuram
✆ 98481 15680 93921 02673

Tolet for Corporate Offices Ground Floor 360 S.Ft Near A Plus Convention Hall, Vijayawada ✆ 90146 33050

7,000 S.Ft గోడౌన్ RCC Building VJA, ఆటోనగర్ 100 Feet రోడ్డులో లోడింగు & అన్ లోడింగుకు వీలుగా అద్దెకు ✆ 84312 51822.

నిడమానూరులో గోడౌన్ అద్దెకు
నిడమానూరులో, హైవే ఫేస్, నారాయణ కాలేజి, వైష్ణవి భవన్ ప్రక్కన, మిశ్రా దాబా ఆనుకొని 8680 చ॥అ॥ గోడౌన్ అద్దెకు
✆ 96764 00122 98481 50838

VJA, నక్కలరోడ్ భారతీరామం బిల్డింగ్ 2 ఫ్లోర్లు కలిపి 6400 చ॥అ॥ హాస్పిటల్/ క్లినిక్/ ఆఫీసులకు అనువుగా అద్దెకు కలదు. ✆ 98497 89830.

ఆఫీసుల కొరకు అద్దెకు. 2nd ఫ్లోర్ 1025 S.Ft. యార్లగడ్డ భవన్ ఆంధ్రా హాస్పిటల్ ఎదురుగా, ప్రకాశం రోడ్డు, గవర్నరుపేట, VJA-2. ✆ 94403 73802

పెనమలూరు వంతెన డౌన్ (పెనమలూరు గ్రామం వైపు)లో షాపు అద్దెకు ఇవ్వబడును. ✆ 88971 15999.

TO-LET FOR OFFICE Accomodation 2000 Sft.
in 1st Floor Suitable For Banks / Offices
Facing At Eluru Road, Kodandaramireddy St, Vijayawada.
98851 11144 70132 81881

కానూరు ఉమాశంకర్ నగర్ 3rd లైన్‌లో 12,000 SF.t, 4 అంతస్తుల 2 బిల్డింగ్స్ ఆఫీసు, హాస్పిటల్, ఇనిస్టిట్యూషన్, ఓల్డ్‌ఏజ్ హోమ్స్‌కు అద్దెకు. ✆ 98491 46958

SECOND SALE

Furniture for Sale. (Good Condition) Related to Readymade Garment Store @ MG Road, Vijayawada. 9704387132, 9989551919.

JOBS

విజయవాడలో నూతనంగా ప్రారంభిస్తున్న అయోధ్యసొసైటీకు రికవరీ ఆఫీసర్స్ వెంటనే కావలెను. ఆకర్షణీయమైన జీతం+T.A. ✆ 80740 26839, 7013142818.

హైదరాబాద్ ప్రముఖ హాస్టల్‌లో పనిచేయుటకు హౌస్‌కీపింగ్/ సూపర్‌వైజర్స్, ఆఫీస్‌బాయ్ కావలెను. వసతి, భోజనసౌకర్యం కలదు. ✆ 9014739287/ 8919038923

వైజాగ్: Urgent ఏబాధాబందీలేని 45ఏళ్లలోపు పనిమనిషి కావాలి. 1సం॥బిడ్డ సంరక్షణ+ ఇంటిపనులు కోసం వసతిఉచితం. 99893 66363,79898 11201.

ప్రముఖ ఎడ్యుకేషనల్ కన్సల్టెన్సీలో పనిచేయుటకు టెలీకాలర్స్ కావలెను. Age:18-30 Yrs. ✆ 89777 96932.

పోరంకిలోని స్వీట్ షాప్ నందు పనిచేయుటకు స్వీట్ మాస్టర్ మరియు అన్ని రకాల పిండి వంటలు తెలిసిన ఆడవారు కావలెను. ఫోన్: 99498 67966.

ఇంట్లోనే ఉంటూ వంటపని, ఇంటిపనిచేయుటకు యాక్టివా నడపకల్గిన లేడీ కావలెను. వసతి+భోజనం సౌకర్యం గుడ్‌మార్నింగ్ హోటల్‌దగ్గర, VJA ✆ 98854 50558

లేడీనర్సు కావలెను. డ్యూటీటైం 8 AM టు 8 PM యాక్టివా వెహికిల్ నడపకల్గిన వార్కి ప్రాధాన్యత. గుడ్‌మార్నింగ్ హోటల్ దగ్గర, విజయవాడ. ✆ 98854 50558

ప్రముఖ బ్యాంకింగ్ సంస్థలో పనిచేయడానికి రిటైర్డ్ వ్యక్తులు, గృహిణులు, వ్యాపార వ్యక్తులు, VRS, పార్ట్‌టైం/ఫుల్‌టైం వెంటనే కావలెను. ✆ 95293 03618.

Hydసిటీలో బ్రాహ్మణ కుటుంబానికి వంటచేయడానికి ఇద్దరు బ్రాహ్మణ స్త్రీలు & 1 బ్రాహ్మణ స్త్రీ కేర్‌టేకర్ కావలెను మంచిజీతం, భోజనం, వసతి ✆ 9866252220

Wanted Electrician for a Manufacturing Unit in Kabela Vijayawada. Contact ✆ 83091 58488

Required, Administration Dept. Qly: B.Tech/ Degree. Exp: 1Y, Sal:18K.+ System Knowledge Must, M/F, Tadepalli, D.Mart. ✆ 80195 41188.

Junior & Degree Principals & Faculty all Subjects, Microbiology PROs Working at Tanuku, Ravulapalem. ✆ 73963 32333.

Wanted for CA Office, Bhimavaram, 1) Fresh CA, 2) CA- Inter Completed with Audit Experience Cont: 98491 33096.

Wanted BDS Doctor of Any Experience\ Fresher Passed Outs. Happy Dental and General Health Care, Governerpet ✆ 98495 03055

ప్రముఖ ఆర్కిటెక్ట్స్ & సర్వేయర్ కంపెనీ నందు పనిచేయుటకు 2 సం॥ అనుభవం గల డ్రాఫ్ట్‌మెన్ సివిల్ (Auto Cad), సర్వేయర్ (D.G.P.S./ E.T.S.) మరియు ఆఫీస్ బాయ్/ ప్రీసమ్ బాయ్ కావలెను. ✆: 9705777688.

Exp. నర్సులు/ ఆయాలు/ వార్డ్ బాయ్స్ కావలెను. జీతం: 25,000/- నుండి 30,000/- (జనవరి ఆఫర్) ఇవ్వబడును. కూకట్‌పల్లిలో, Hyd. ✆ 9966568882/ 9963489661.

ప్రభుత్వ బ్యాంక్ అనుబంధ సంస్థలో పార్ట్/ ఫుల్‌టైం పనిచేయుటకు విశ్రాంత ఉద్యోగులు, గృహిణులు కావలెను. Q: ఇంటర్, 20k To 40k. ✆ 98662 85503

ప్రముఖ ప్లైవుడ్ హోల్‌సేల్ షాపులో మార్కెటింగ్ చేయుటకు ఉత్సాహవంతులైన యువకులు కావలెను. ఆకర్షణీయమైన జీతం. Contact ✆ 92474 76434

రామకృష్ణ గ్రూప్ Hyd, Vja, న్యూఢిల్లీకు టెలీకాలర్స్, కస్టమర్ కేర్, అన్నిరకాల ఆఫీస్ స్టాఫ్ కావలెను. భో+వ+జీ. ✆ 99490 21122, 96764 91122.

ఫిమేల్ టెలీకాలర్స్ - 10Nos లొకేషన్: విజయవాడ. ప్రముఖ కంపెనీలో పనిచేయుటకు కావలెను. Q : 10th/Inter. Sal :11k-20k+ Incentives upto -50k (P.M). ✆ 99515 88333.

WANTED
Fiber Technician/ Sales Executives
Qualification : ITI/ Polytechnic / Graduation.
Interested Candidates can Apply
Address : 40-1-70, 3rd floor, Opp Eenadu, Bandar Road, Vijayawada. PH: 9705822223
IT BROADBAND
hr@e-net.in

విజయవాడ, కృష్ణా జిల్లాలలో ప్రముఖ టీపొడి కంపెనీ ప్రొడక్ట్‌ను మార్కెటింగ్ చేయుటకు సేల్స్‌మెన్స్- 3, 4వీలర్ డ్రైవింగ్ వచ్చిన మార్కెటింగ్ డ్రైవర్-1 కావలెను. జీ: 20,000+ DA+ పెట్రోల్ అలవెన్స్. ✆ 93938 88885.

హరివిల్లు అప్రూవ్డ్ ప్లాట్స్ సేల్స్‌కై లోకల్ పరిచయాలతో కమిషన్ పద్ధతిపై ఆసక్తి గల M/F టీచర్స్, రిటైర్డ్ పర్సన్స్ బిజినెస్ ఏజెంట్స్‌గా. ✆ 95427 56666.

హైదరాబాద్‌లోని ప్రముఖ డాక్టర్ గారి ఇంట్లో ఉండి పనిచేయుటకు మహిళ కావలెను. వయస్సు 50 సం॥లోపు వారై ఉండవలెను. పెన్షన్ లేని వాళ్లకి మొదటి ప్రాధాన్యత. ✆ 77999 88082.

AP యమహా షోరూమ్ VJA నందు పనిచేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ మేల్ / ఫీమేల్, టెలికాలర్స్ ఫీమేల్, సర్వీస్ టెక్నీషియన్స్ కావలెను. ✆ 96400 56756

VJAలోని ఆటోమొబైల్ హోల్‌సేల్ డిస్ట్రిబ్యూటర్స్ దగ్గర పనిచేయుటకు అకౌంటెంట్ (F) కావలెను. EXP. టాలి 3YRS. 10Am to 5Pm ✆ 92464 92455.

కరీంనగర్‌లోని డాక్టర్ గారి ఇంట్లో వంట చేయడానికి అనుభవం కలిగిన, ఏ బాదరాబంది లేని 45 ఏళ్ళ వయస్సు పైబడిన మహిళ కావలెను. ఆకర్షణీయమైన జీతం. 98480 14512.

టూ వీలర్ ఫైనాన్స్ కంపెనీ, పటమట, విజయవాడలో పనిచేయుటకు టెలీకాలర్స్ (స్త్రీ అభ్యర్థులు) కావలెను. అనుభవం 0-2సం॥. ✆ 88862 99444.

టూ వీలర్ ఫైనాన్స్ కంపెనీ, పటమట, విజయవాడలో పనిచేయుటకు ఆఫీస్ సేల్స్ అభ్యర్థులు కావలెను. అనుభవం 0-2 సం॥. ✆ 63098 80999.

టూ వీలర్ ఫైనాన్స్ కంపెనీ, పటమట, విజయవాడలో పనిచేయుటకు కలెక్షన్ ఏజెంట్స్ కావలెను. అనుభవం 0-5సం॥. ✆ 88866 55588.

SK Riverfront, 1 టౌన్, విజయవాడలో హోటల్ నందు పనిచేయుటకు రూమ్ సర్వీస్ బాయ్స్ కావలెను. ✆: 83413 33563.

కానూరు కామయ్యతోపునందు వంశీ అసోసియేట్స్ (ప్లానింగ్ & కన్‌స్ట్రక్షన్స్)లో పనిచేయుటకు ఆఫీస్ అసిస్టెంట్ కావలెను. సంప్ర ✆ 98662 28001.

VJAలోని ప్రముఖ ఫైనాన్స్ కంపెనీలో పనిచేయుటకు అనుభవం గల కలెక్షన్ ఎగ్జిక్యూటివ్స్ (2 వీలర్ తప్పనిసరి) ఆఫీస్‌లో పనిచేయుటకు అనుభవం గల లేడీ టెలీకాలర్స్ కావలెను. ✆ 80747 02079.

లేడీ టెలి కాలర్స్ కావలెను. అడ్రస్: పటమట, విజయవాడ. జీతం: 13,000 + ఇన్సెంటివ్స్. Call @ 96766 53069.

VJAలోని ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీకి ఆఫీస్ ఇన్‌ఛార్జ్ కావలెను. సోషల్ నెట్‌వర్క్, యూట్యూబ్, DTPలలో అనుభవం గలవారికి మాత్రమే. ✆ 98666 62791

గుంటూరులోని ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ వారి ఓపెన్ ప్లాట్లు, ఫామ్‌ల్యాండ్స్ అమ్ముటకు మార్కెటింగ్ సిబ్బంది కావలెను. మంచి కమీషన్ ఇవ్వబడును. 93915 26523.

ఎలక్ట్రీషియన్స్ మరియు హెల్పర్స్ కావలెను. వయస్సు: 18-30 సం॥లోపు, హౌస్ వైరింగ్‌లో అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత. సంప్ర॥ ✆ 93921 33234.

Govt. LIC ప్రభుత్వరంగ సంస్థ నందు ఏజెంట్స్, కెరీర్ ఏజెంట్స్ కావలెను. మంచి కమీషన్‌తో పాటు నెలకు 7000/- స్టయిఫండ్. ✆ 73860 66033.

ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ నందు పనిచేయుటకు టెలీకాలర్స్ మరియు ఆఫీస్ మేనేజర్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. ✆ 81214 84630.

లేడీ టెలీకాలర్స్ కావలెను. VJAలో ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీకి సింగ్‌నగర్, లబ్బీపేట బ్రాంచిలలో పనిచేయుటకు లేడీటెలీకాలర్స్ కావలెను. ✆73373 46677

ప్రముఖ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్ నందు పనిచేయుటకు ఫోటోషాప్, పేజ్‌మేకర్‌లలో అనుభవంకల DTP ఆపరేటర్ కావలెను. వర్క్ ఫ్రమ్‌హోమ్ కలదు. ✆ 9110588864.

Erlite Pvt Ltd, మొగల్‌రాజపురం, విజయవాడ ★ కార్, Van డ్రైవర్స్-2 ★ అటెండర్ (M) -1 ★ లేడీటెలీకాలర్స్-1 EXP 2Yrs ★ రిసెప్షనిస్ట్(F) EXP: 1Yr ★ వ్యవసాయం పనులకు ఫ్యామిలీ (వసతి కలదు) కావలెను. ✆ 95536 96969, 83745 56168.

WANTED
PROJECT MANAGER
for VILLA PLOTS Development (50+Acres)
(8-10 years exp. in Real Estate / Land Development / Layout Projects)
Location MACHILIPATNAM, Krishna Dist.
JOB Summary
we are seeking an exp. Project Manager to lead and manage the end-to-end development of a 50 + acre villa plots venture. The role involves planning, execution, co-ordination with consultants and contractors, statutory approvals, infrastructure development and ensuring timely delivery within budget and quality standards.
for more details contact
✆ 9032591599
resumes@saachiprojects.com
SAACHI PROJECTS
17/262, Sidimbhi Agraharam, Machilipatnam, Krishna Dt.

1గ్రామ్ జ్యూయలరీషాపులో సేల్స్ గరల్స్, సేల్స్‌బాయ్స్, హెల్పర్స్ కావలెను. Age:18-30, Q:10th to డిగ్రీ, జీ:10వేలు-15వేలు, T:10AM - 9 PM. సాయి శ్రీనివాస పెరల్స్, స్వర్ణలోక్ కాంప్లెక్స్,VJA. ఆసక్తికలవారు బయోడేటా వాట్సాప్ చేయగలరు. ✆ 93937 79999

ఏలూరు జిల్లా చింతలపూడిలో హోల్‌సేల్ ఉల్లిపాయల వ్యాపారంలో గుమస్తాలుగా చేయుటకు ఉత్సాహవంతులైన యువకులు కావలెను. మంచిజీతం, భోజనం + రూము ఇవ్వబడును ✆ 9701731479.

కారు డ్రైవర్ కావలెను. బెంజ్, ఆడి, జాగ్వార్ కార్స్ నడుపుటకు విజయవాడ సూర్యారావుపేట పరిసర ప్రాంతాల్లో నివసించే అనుభవం గలవారు. 40-45సం॥లోపు. సంప్ర ✆ 94412 72777.

లేడీ ప్రిన్సిపాల్ క్రిస్టియన్ మిషనరి స్కూల్ గన్నవరం దగ్గర 5సంవత్సరాలు అనుభవం. Fluency in English కావలెను. జీతం:30వేలు. ✆ 86394 43266

విజయవాడ 1టౌన్ దేవాలయంలో పనిచేయుటకు బ్రాహ్మణ వంట మనుషులు కావలెను. ✆ 0866-2425045, 90140 52147.

హైదరాబాద్ (మియాపూర్) హాస్టల్‌లో పనిచేయడానికి వంట మనిషి, హెల్పర్స్, సూపర్ వైజర్స్ కావలెను. ✆ 9136559999.

గొల్లపూడి సూరాయపాలెంలోని ప్రముఖ ఫార్మా కంపెనీ నందు పనిచేయుటకు అనుభవం గల SAP & XL ఆపరేటర్స్ మరియు గోడౌన్ ఇంఛార్జ్‌లు & ప్యాకింగ్ హెల్పర్స్ కావలెను. ✆ 97059 94111

FACULTY/ TEACHERS

విజయవాడ, చుట్టుగుంటలో ఉన్న స్కూల్‌కు LKG-X వరకు, టీచర్లు, ట్యూటర్స్, JLs, PROలు, టెలీకాలర్స్, ఆయాలు కావలెను. ✆ 8985832214, 9493800268

HOSPITALITY

గుజరాత్ బరోడా సిటీలో ఆంధ్ర హోటల్ కొరకు ఆంధ్ర టిఫిన్స్ & మీల్స్ వంట అనుభవం ఉన్న కుక్ కావలెను. ఫోన్: 07069101665

TOURS AND TRAVELS


శ్రీలంక 4/3న, 4/4న ముక్తినాథ్, నేపాల్, 26/5న యమునానది పుష్కరాలకు చార్‌ధామ్, జులైలో అమరనాథ్, జూన్‌లో కైలాస్ మానస సరోవరం, శ్రీదుర్గా టూర్స్. ✆ 94901 19768



☛ ఏపీఎంఎస్ఆర్‌బీలో 220 అసిస్టెంట్ ప్రొఫెసర్లు
చివరి తేదీ: 22-01-2026

☛ నాల్కోలో 110 గ్రాడ్యుయేట్ ఇంజినీర్ ట్రెయినీ పోస్టులు
చివరి తేదీ: 22-01-2026

కరెంట్ అఫైర్స్



★ ప్రతిష్ఠాత్మక బుకర్ ప్రైజ్ - 2025 విజేతగా ఎవరు నిలిచారు?
జ: హంగేరియన్ బ్రిటిష్ రచయిత డేవిడ్ స్జలే. (ఆయన రచించిన 'ఫ్లెష్' నవలకు ఈ పురస్కారం దక్కింది. ఈ బహుమతి కింద 50 వేల పౌండ్ల నగదు, బుకర్ ట్రోఫీ ప్రదానంచేస్తారు.)

మాదిరి ప్రశ్నలు

★ జాతీయ విద్యా దినోత్సవాన్ని ఏటా ఏ రోజున నిర్వహిస్తారు? (భారత దేశ తొలి విద్యాశాఖామంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ గౌరవార్థం ఏటా ఈ రోజును జాతీయ విద్యా దినోత్సవంగా నిర్వహిస్తున్నారు. కేంద్రం 2008, సెప్టెంబరులో దీన్ని ప్రకటించింది.) జ: నవంబరు 11

★ భారత తన మొదటి జాతీయ డాల్ఫిన్ పరిశోధనా కేంద్రాన్ని ఇటీవల ఎక్కడ ప్రారంభించింది? (భారత్‌లో కొత్తగా ఆసియాలోనే మొదటి డాల్ఫిన్ పరిశోధనా కేంద్రంగా ఇది ఖ్యాతి సాధించింది. అంతరించిపోతున్న గంగా నది డాల్ఫిన్లను అధ్యయనం చేయడానికి దీన్ని ఏర్పాటు చేశారు.)
జ: పట్నా (బిహార్)

★ ఇటీవల ఏ రాష్ట్రప్రభుత్వం బహుభార్యత్వాన్ని నిషేధించే బిల్లును ఆమోదించింది?
జ: అస్సాం (ఈ రాష్ట్రంలోని షెడ్యూల్డ్ తెగలు (ఎస్టీ) వారికి లేదా రాజ్యాంగంలోని ఆరో షెడ్యూల్ కింద ఉన్న ప్రాంతాల నివాసితులకు ఈ చట్టం వర్తించదు.)

మరింత సమాచారం

ఈనాడు ప్రతిభ
► https://pratibha.eenadu.net ► https://eenadupratibha.net
విద్య, ఉద్యోగ పరీక్షల ప్రత్యేకం!

పర్యావరణ రసాయన శాస్త్రం

(కాలుష్యం - కారకాలు, రకాలు)

పర్యావరణంలో ఉన్న గాలి, నీరు, మట్టిలో జరిగే రసాయన చర్యలు, కాలుష్య కారకాలు ఏర్పడే తీరు, వాటి ప్రభావాలు, నియంత్రణ పద్ధతులను అధ్యయనం చేసే శాస్త్రాన్ని 'పర్యావరణ రసాయనశాస్త్రం' అంటారు. ఆ పర్యావరణాన్ని 4 విభాగాలుగా వర్గీకరించారు.

1) వాతావరణం భూమిని ఆవరించి దాదాపు 600 కి.మీ. వరకు (భూఉపరితలం నుంచి) ఉన్న రక్షక గాలి పొరనే 'వాతావరణం' అంటారు. ఇది భూమి చుట్టూ ఉన్న వాయువు పొర. భూమిపై ఉష్ణ సమతౌల్యాన్ని కాపాడటంలో కీలకపాత్ర పోషిస్తుంది.

జనరల్ స్టడీస్
రసాయన శాస్త్రం

2) జలావరణం సముద్రాలు నదులు, సరస్సులు, జలాశయాలు, జలపాతాలు, భూగర్భ జలాలు, ధ్రువ మంచు పర్వతాలు, ఊటబావులు దీని పరిధిలోకి వస్తాయి.

3) శిలావరణం భూమి, కొండలు, గుట్టలు, మట్టి ఈ ఆవరణానికి చెందుతాయి.

4) జీవావరణం మానవులు సహా మొక్కలు, జంతువులు ఈ వర్గంలో ఉంటాయి.

పర్యావరణ కాలుష్యం గాలి, నీరు, నేల లాంటి సహజ వనరులు హానికర పదార్థాలతో కలుషితమవడం వల్ల జీవులకు, వృక్ష జాలానికి, పర్యావరణ సమతౌల్యతకు నష్టం కలగడాన్ని 'పర్యావరణ కాలుష్యం' అంటారు.

కాలుష్యం - సాంకేతిక పదాలు


కాలుష్యం: ప్రకృతిలో సహజసిద్ధంగా లభ్యమై మానవ కార్యకలాపాల ద్వారా అధిక మోతాదులో పర్యావరణంలోకి చేరి జీవరాశులపై దుష్ప్రభావాన్ని చూపించే కారకం.

మలినం: ప్రకృతిలో సహజసిద్ధంగా లేకుండా, మానవ కార్యకలాపాల ద్వారా పర్యావరణంలోకి చేరి పర్యావరణ అణు సంఘటనాన్ని ప్రభావితం చేసే పదార్థం.

గ్రాహకం: కాలుష్యం ద్వారా దుష్ప్రభావానికి గురయ్యే మాధ్యమం.



జీవుల మనుగడకు ప్రాణాధారం పర్యావరణం. ఆధునిక జీవన విధానం, అడవుల నరికివేత, నగరీకరణ, పారిశ్రామికీకరణ, జనాభా పెరుగుదల మొదలైన పరిణామాలు పర్యావరణాన్ని కలుషితం చేస్తున్నాయి. గాలి, నీరు, నేలలోని సహజమైన రసాయన స్వభావం దెబ్బతింటోంది. ఆ కాలుష్యానికి కారకాలు, అవి ఏర్పడే తీరు, మనుషుల ఆరోగ్యంపై చూపుతున్న ప్రభావం, భూతాపానికి దారితీస్తున్న పరిస్థితులపై పోటీ పరీక్షార్థులకు శాస్త్రీయ అవగాహన ఉండాలి. సమస్త జీవులతో సహా భూమిని కాపాడుకోవడానికి అవసరమైన పరిజ్ఞానాన్ని అందించే పర్యావరణ రసాయన శాస్త్రంలోని ప్రాథమికాంశాలను, కాలుష్యకారక రసాయన ప్రక్రియలతో జరుగుతున్న అనర్థాలను అర్థం చేసుకోవాలి. కాలుష్యాన్ని తగ్గించే పరిష్కారాలను గుర్తించాలి.



రాళ్లల్లో పగుళ్లు.. కళ్లల్లో మంటలు!

కాలుష్య కారకాలు - దుష్ప్రభావానికి గురయ్యే మాధ్యమాలు

కాలుష్య కారకం	గ్రాహకం
★ అల్పగాఢత ఉన్న సల్ఫర్ డై ఆక్సైడ్	★ ఉబ్బసం లాంటి శ్వాసకోశ వ్యాధులు
★ అధిక గాఢత ఉన్న సల్ఫర్ డై ఆక్సైడ్	★ మొక్కల పుష్పవృంతాలు గట్టిపడటం. దాంతో పుష్పాలు రాలిపోవడం.
★ నైట్రోజన్ డై ఆక్సైడ్	★ కళ్ళ ఎర్రబడి మండటం
★ ఓజోన్, పెరాక్సీ ఎసిటైల్ నైట్రేట్ (PAN)	★ కళ్ళ మండటం
★ సంపూర్ణంగా దహనం చెందని హైడ్రోకార్బన్లు	★ క్యాన్సర్ బారిన పడటం
★ ఫ్రియాన్లు	★ ఓజోన్ పొర క్షీణించడం.
★ అధిక కార్బన్ డయాక్సైడ్	★ భూగోళం వేడెక్కడం
★ కార్బన్ మోనాక్సైడ్	★ తలనొప్పి, స్పృహ తప్పడం, 1000 ppm ల గాఢత మరణానికి దారితీస్తుంది.

శోషణం: చాలాకాలం నిలిచి ఉండే కాలుష్యాన్ని తనలో ఇంకుకుని, దాంతో అన్యోన్య చర్య జరిపే మాధ్యమాన్ని 'శోషకం' అంటారు.

ఉదా: కార్బన్ డయాక్సైడ్‌కు మహాసముద్రాలు అతిపెద్ద శోషకాలు.

ఆరంభ అవధి విలువ: ఆరోగ్యవంతుడైన పారిశ్రామిక కార్మికుడు తన రోజువారీ పని కాలంలో ఎక్కువ సంవత్సరాలు అదే కలుషిత వాతావరణంలో పని చేసినప్పటికీ ఎప్పటికీ ఎలాంటి దుష్ప్రభావానికి గురికాకుండా ఉండటానికి ఆమోదించిన విష కాలుష్య కనిష్ఠ పరిమాణాన్ని 'ఆరంభ అవధి విలువ' అంటారు.

$$\text{ఆరంభ అవధి విలువ} \propto \frac{1}{\text{ప్రమాదకర తీవ్రత}}$$

ఉదా: x, y, z అనే పదార్థాల ఆరంభ అవధి విలువలు వరుసగా 3 ppm, 9 ppm, 1 ppm అయితే x అనేది ఎక్కువ ప్రమాదకారి, z తక్కువ ప్రమాదకారి.

కాలుష్య కారకాలు - రకాలు




★ పర్యావరణంలోకి చేరే విధానం ఆధారంగా ఇవి రెండు రకాలు.

ప్రాథమిక కాలుష్య కారకాలు: మోటారు వాహనాలు, పరిశ్రమల నుంచి నేరుగా పర్యావరణంలోకి చేరేవి. ఉదా: CO_2, CO, SO_2 సంపూర్ణంగా దహనం చెందని హైడ్రోకార్బన్లు.

గౌణ కాలుష్య కారకాలు: ప్రాథమిక కాలుష్య కారకాల మధ్య జరిగే రసాయన చర్య ఫలితంగా ఇవి ఏర్పడతాయి. ఉదా: PAN, ఫ్రిజోన్, ఫార్మాల్డిహైడ్.

★ జీవక్షయీకృత ప్రక్రియ ఆధారంగా కాలుష్య కారకాలు రెండు రకాలు



జీవక్షయీకృత కాలుష్య కారకాలు: ప్రకృతిలోని సహజ చర్యల ద్వారా విచ్ఛిన్నం చెందేవి. ఉదా: గృహ వ్యర్థాలు.

జీవక్షయీకృతం కాని కాలుష్య కారకాలు: ప్లాస్టిక్ వ్యర్థాలు, డీడీటీ, భారలోహాలు.

★ భౌతిక స్థితి ఆధారంగా రెండు రకాలు

వాయుస్థితి కాలుష్య కారకాలు: ఉదా: SO_2, NO_2.

కణస్థితి కాలుష్య కారకాలు: ఇవి కణాల రూపంలో (1μm వ్యాసంలో) ఉండే కాలుష్య కారకాలు.

★ ఉనికి కాలుష్య కారకాలు రెండు రకాలు

ప్రాణం ఉన్న కణ కాలుష్య కారకాలు: కరోనా వైరస్, కొన్ని శిలీంధ్రాలు గాలి ద్వారా ఊపిరితిత్తుల్లోకి చేరి అనుకూల వాతావరణంలో తమ సంఖ్యను పెంచుకుని ఎలర్జీ లాంటి సమస్యలను కలిగిస్తాయి.

ప్రాణం లేని కణ కాలుష్య కారకాలు: గాలిలోని కార్బన్ కణాలు, పొగమంచు, ధూమం, మిస్ట్, స్మాగ్.

పొగమంచు (స్మాగ్) పొగ, మంచు కలయికతో ఏర్పడే ఏరోసాల్‌ను 'పొగమంచు' అంటారు. ఇది 2 రకాలు.

సంప్రదాయ స్మాగ్ లేదా లండన్ పొగమంచు: ఇది పొగ, మంచు, సల్ఫర్‌డైఆక్సైడ్‌లను కలిగి ఉండి శీతల (ఆర్ద్ర), తడి, చల్లని వాతావరణంలో ఏర్పడుతుంది. రసాయనికంగా ఇది క్షయకరణ స్వభావం ఉన్న మిశ్రమం. దీనిని 'సల్ఫ్యూరస్ స్మాగ్'గా పిలుస్తారు.


కాంతి రసాయన స్మాగ్/ లాస్‌ఏంజిల్స్ పొగమంచు/ బ్రౌన్ ఎయిర్: సూర్యకాంతి ప్రభావంతో వాహనాల నుంచి విడుదలయ్యే నైట్రోజన్ ఆక్సైడ్లు, హైడ్రోకార్బన్ల మధ్య జరిగే రసాయన చర్యలతో ఏర్పడే హానికర పొగమంచు. ఇది కళ్ల మండటం, శ్వాసకోశ సమస్యలు, మొక్కలకు నష్టం కలిగిస్తుంది. రబ్బరులో పగుళ్లు, లోహక్షయం, రాళ్లు, రంగుతలాల్లో పగుళ్లు ఏర్పడతాయి.



రచయిత: ఎస్. రామకృష్ణ

TENTH English

His First Flight



Q(1-5): Read the following passage

His parents and his brothers and sister had landed on this green flooring ahead of him. They were beckoning to him, calling shrilly. He dropped his legs to stand on the green sea. His legs sank into it. He screamed with fright and attempted to rise again, flapping his wings. But he was tired and weak with hunger, and he could not rise, exhausted by the strange exercise. His feet sank into the green sea, and then his belly touched it, and he sank no farther. He was floating on it, and around him his family was screaming, praising him, and their beaks were offering him scraps of dogfish. (First Flight) **5 x 2 = 10 M**

Now, answer the following questions.

1. Who landed on the green floor ahead of seagull?
2. What did his family do when seagull reached them?
3. Why did not the seagull flap his wings again?
   A) because he was tired
   B) because he was afraid
   C) because he was drowsy
4. What was Offered by the family?
   A) jelly fish B) dog fish C) star fish
5. How did the young seagull feel when his legs sank into green sea?
   A) felt happy B) afraid C) confused

Final Exams-2026
IMPORTANT Q & A

Vocabulary

(Q.No: 27): Read the following paragraph and write the synonyms of the underlined words, choosing the words given in the box. **4 Marks**

(Spoke, shouted, cheerful, promised, sadly,)

Ga, ga, ga he **cried** (a) begging her to bring him some food. Gaw-col-ah, she screamed back derisively. But he kept calling **plaintively** (b) and after a minute, he **uttered** (c) a **joyful** (d) scream.

(Q.No: 28): Read the following paragraph and write antonyms to the underlined words.

Who helped me to **arrive** (a) there **safely** (b) without compass or a radio without any more fuel. The compass was turning round. It was **dead**(c). It would not work. The other instrument was **suddenly** (d) dead.

For more IMP Q & A



Writer: A. Madhubabu

అక్షర జ్ఞానం ఉండేలా.. చదువులో రాణించేలా..

ప్రత్యేక బోధన అమలు చేస్తున్న విద్యా శాఖ

ఇబ్రహీంపట్నం గ్రామీణం, గుంటుపల్లి, న్యూస్‌టుడే

విద్యార్థులు ఏటా పై తరగతులకు వెళ్తున్నప్పటికీ కొందరు చదవడంలో తడబాటు, అక్షరాలను గుర్తు పట్టలేకపోవడం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ సూచనల మేరకు వారిని చక్కగా తీర్చిదిద్దడానికి జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో ప్రాథమిక పాఠశాలలో ప్రత్యేక బోధన కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. ఒకటో తరగతి నుంచి 5వ తరగతి వరకు ప్రతీ విద్యార్థి పఠనం, సంఖ్యాశాస్త్రంలో లక్ష్యాలను సాధించేలా చూడడానికి గ్యారంటెడ్ ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ(జీఎఫ్‌ఎల్ఎన్) కార్యక్రమాన్ని ప్రారంభించింది. గతేడాది డిసెంబరు 8వ తేదీ నుంచి 75 రోజుల పాటు మార్చి 24వ తేదీ వరకు దీన్ని అమలు చేస్తున్నారు. ప్రాథమిక స్థాయి విద్యార్థుల్లో కనీసం అక్షర జ్ఞానం ఉండేలా చూడటమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం. జీఎఫ్‌ఎల్ఎస్ అమలుకు ముందు డిసెంబరులో డైట్ విద్యార్థులు, సచివాలయ సిబ్బంది కలిసి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆన్‌లైన్‌లో బేస్‌లైన్ పరీక్షలు నిర్వహించారు. అందులో వచ్చిన మార్కులు ఆధారంగా వెనుకబడిన, ద్వితీయ శ్రేణి, బాగా చదివే విద్యార్థులుగా విభజించి ప్రణాళికను అమలు చేస్తున్నారు. ★ 1, 2 తరగతులను ఒక భాగంగా, 3 నుంచి 5వ తరగతులను మరో భాగంగా విభజించారు. వీరికి మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 3.30 నిమిషాల వరకు తెలుగు, గణితం, ఆంగ్లంపై తరగతులు నిర్వహిస్తున్నారు.



త్రిలోచనాపురంలో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు తెలుసుకుంటున్న డీఈవో చంద్రకళ

అమలు ఇలా.. రోజు వారీ కార్యక్రమాల కోసం అవసరమైన విద్యా సామగ్రిని సమగ్ర శిక్షా విభాగం పాఠశాలలకు సమకూర్చింది. చదవడం, రాయడం అర్థం చేసుకోవడం, పదాలు గుర్తించడం, తెలుగు అక్షరాలు పలికించడంతో పాటు ఆంగ్ల భాషపై పట్టు సాధించడం, గణితంలో మెలకువలు నేర్పించడం చేస్తున్నారు. కృత్యాధార బోధనతో పాటు చిన్న చిన్న పరీక్షలు నిర్వహించి హోం వర్క్ ఇస్తున్నారు. ఈ క్రమంలో ఉన్నత పాఠశాలకు వెళ్లే సరికి ఉపాధ్యాయులు విద్యార్థులను చదువులో చురుగ్గా తీర్చిదిద్దుతారని జిల్లా విద్యా శాఖ అధికారిణి ఎల్. చంద్రకళ వివరించారు.

సీనియర్ ఛాంప్ రాగశ్రీ

అస్మిత ఖేలో ఇండియా సౌత్ జోన్ సాఫ్ట్ టెన్నిస్ లీగ్

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: స్థానిక ఐజీఎంసీ స్టేడియంలోని టెన్నిస్ కాంప్లెక్స్‌లో జరుగుతున్న అస్మిత ఖేలో ఇండియా సౌత్ జోన్ సాఫ్ట్ టెన్నిస్ లీగ్ పోటీల్లో భాగంగా సీనియర్ వ్యక్తిగత విభాగంలో రాగశ్రీ ఛాంపియన్‌గా నిలిచింది. శనివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో రాగశ్రీ (తమిళనాడు) 3-0 తేడాతో శ్వేత (తమిళనాడు)పై గెలుపొందింది. షాలిని (తమిళనాడు) ద్వితీయ, యాజిని, సాధన (తమిళనాడు) సంయుక్తంగా తృతీయ స్థానాల్లో నిలిచారు. జూనియర్ వ్యక్తిగత విభాగంలో నరుమూగయ్ (తమిళనాడు) ఛాంపియన్‌గా నిలిచింది. శనివారం సాయంత్రం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో నరుమూగయ్(తమిళనాడు) 3-1 తేడాతో ఏఎస్ షాలిని (తమిళనాడు)పై గెలుపొందింది. శ్వేత (తమిళనాడు) ద్వితీయ, సోనికా (కర్ణాటక), సంజూ (తమిళనాడు) సంయుక్తంగా తృతీయ స్థానాల్లో నిలిచారు.



ఫైనల్ మ్యాచ్‌లో తలపడుతున్న తమిళనాడుకు చెందిన శ్వేత-రాగశ్రీ

జల వివాదాలు సామరస్యంగా పరిష్కరించుకోవాలి

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే: ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశానికి ప్రధానిగా ఉన్న నరేంద్రమోదీ.. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు దాసోహం అవడం సిగ్గుచేటని సీపీఐ జాతీయ కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ కె.నారాయణ ఎద్దేవా చేశారు. శనివారం దాసరి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన వెనెజువెలా అధ్యక్షుడిని రాత్రికి రాత్రే కిడ్నాప్ చేయడం అత్యంత దురదృష్టకరమైన చర్య అని అన్నారు. చంద్రబాబు, నితీశ్‌కుమార్ అండతో కేంద్రంలో భాజపా పాలన చేస్తోందని ప్రజా వ్యతిరేక విధానాలు అమలు చేస్తున్న మోదీకి ఎందుకు వంతపాడుతున్నారని నారాయణ ప్రశ్నించారు. రెండు తెలుగు రాష్ట్రాల జలవివాదాలు తారస్థాయికి చేరుకున్నాయని ఇద్దరు ముఖ్యమంత్రులు కూర్చుని సామరస్యంగా పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. అమరావతి రాజధాని కోసం రెండోసారి భూములు లాక్కోవడం మంచి పద్ధతి కాదని ముఖ్యమంత్రి చంద్రబాబుకు సూచించారు. జగన్ హయాంలో అమరావతి ప్రజలు పడిన కష్టాలు అన్నీ ఇన్నీ కావని ఇప్పుడు తిరిగి అదే పరిస్థితులను కూటమి ప్రభుత్వం తీసుకురావడం సరికాదని చెప్పారు. అమరావతిలో ఇటీవల ఓ రైతు ఆవేదనతో మరణిస్తే గుండెపోటుతో చనిపోయాడని చిత్రీకరించడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. రాజధాని విస్తరణ వైపు కాకుండా ప్రజలను సంతృప్తి పర్చాలన్నారు. భూముల ధరలు పెరగకుండా ఉన్నప్పుడే దురుద్దేశంతో భూములు బలవంతంగా లాక్కోవడం క్రిమినల్ చర్యని విమర్శించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య మాట్లాడుతూ పెద్దఎత్తున జరగనున్న శతాబ్ది ముగింపు వేడుకలకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే కార్యకర్తలు, ప్రజల సౌకర్యార్థం ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశంలో పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దోనేపూడి శంకర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నారాయణ, చిత్రంలో ఈశ్వరయ్య, వనజ, శంకర్

అక్రమ కేసుల ఉపసంహరణకు డిమాండ్

గాంధీనగర్, న్యూస్‌టుడే: పౌరహక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు క్రాంతి చైతన్యపై పోలీసులు పెట్టిన అక్రమ కేసులను తక్షణమే ఉపసంహరించుకోవాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలుకా చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘం రాష్ట్ర మహా సభలను విచ్ఛిన్నం చేయడానికే ఆయన్ను అరెస్టు చేశారని ఫ్లెక్సీలో ముద్రించిన రాజకీయ కార్టూన్ పేరుతో దేశద్రోహం కేసు పెట్టడం అన్యాయమని చెప్పారు. రాష్ట్ర సహాయ కార్యదర్శి టి.ఆంజనేయులు మాట్లాడుతూ కేంద్రంలోని భాజపా ప్రభుత్వం లౌకిక స్ఫూర్తికి విరుద్ధంగా పాలన సాగిస్తోందని విమర్శించారు. రాష్ట్రాలు కేంద్రం చేతిలో కీలు బొమ్మలుగా మారాయని కేఎన్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కృష్ణ, ఇఫ్టూ రాష్ట్ర నాయకుడు కె.పోలారీ మండిపడ్డారు. బీటీపీ అధ్యక్షుడు షేక్ బాషా, వివిధ సంఘాల నాయకులు వీరభద్రరావు, కొండారెడ్డి, యు.వెంకటేశ్వర్లు, అంజమ్మ, అరసవిల్లి కృష్ణ, విల్సన్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.


పెద్దిరాజు.. పెద్ద మనసు

పటమట, న్యూస్‌టుడే: ఆటోలో మర్చిపోయిన బ్యాగును ప్రయాణికురాలికి అప్పగించి ఆటో డ్రైవర్ నిజాయతీ చాటుకున్న ఘటన పటమట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పటమట లంకకు చెందిన అర్చన శనివారం రాత్రి 8 గంటల సమయంలో ఆటో కిరాయికి మాట్లాడుకొని రమేష్ ఆసుపత్రి జంక్షన్ వద్ద తన కుటుంబ సభ్యులతో కలిసి ఎక్కారు. పటమట లంక డీమార్ట్ సమీపంలో దిగారు. పటమట వరకు వెళ్లిన రామలింగేశ్వరనగర్‌కు చెందిన డ్రైవర్ పెద్దిరాజు ఆటోలో బ్యాగు ఉన్నట్లు గుర్తించారు. బ్యాగు తీసుకొని పటమట పోలీస్ స్టేషన్‌కు వెళ్లి సమాచారం అందించారు. బ్యాగులో పరిశీలించగా.. రూ.2 వేల నగదు, 60 గ్రాముల బంగారు ఆభరణాలు, గుర్తింపు కార్డులు ఉన్నాయి. బ్యాగులోని ఆధార్ కార్డు వివరాల ప్రకారం.. బ్యాగు పోగొట్టుకున్న అర్చనకు పోలీసులు ఫోన్ చేసి సమాచారం అందించారు. అనంతరం పటమట సీఐ పవన్ కిషోర్ సమక్షంలో అర్చనకు ఆటోడ్రైవర్ పెద్దిరాజు బ్యాగు అందజేశారు. ఆటోడ్రైవర్‌ను సీఐ అభినందించారు.



సీఐ పవన్ కిషోర్ సమక్షంలో మహిళకు బ్యాగు అందజేస్తున్న ఆటోడ్రైవర్

వ్యాధి నివారణే ప్రధానం



దగ్గు, తుమ్ములకు యాంటీబయాటిక్స్ ప్రమాదకరం

రోగులకు, వైద్యులకు వారధిగా ఏఐ

(మొదటి పేజీ తరువాయి)

తద్వారా జబ్బుపడే వరకు వేచి ఉండకుండా మన ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చు.

డాక్టర్, రోగి మధ్య ఎలాంటి సంభాషణ ఉండాలంటే.

రోగుల్ని అర్థం చేసుకోవడానికి, ఆరోగ్య సలహాలు ఇవ్వడానికి, వ్యాధిని నివారించడానికే వైద్యులు అధిక సమయం వెచ్చించాలని నేను భావిస్తున్నా. ఈఎన్‌టీ వైద్యునిగా నా వద్దకు ఎవరైనా వస్తే వారి నోరు, చెవులు చూసి ఇన్‌ఫెక్షన్ నిర్ధారించి యాంటీబయాటిక్ ఇస్తున్నా. అంతేతప్ప వ్యాధి నివారణకు సమయం వెచ్చించడం లేదు. మీరు ఏడు కిలోల అధిక బరువున్నారని, ఫలానా ఆహారం తినాలని, అప్పుడే మీరు ఆరోగ్యంగా ఉంటారని రోగికి చెప్పాలి. అలాంటి సంభాషణ డాక్టర్, రోగి మధ్య జరగాలి.

గ్రేడ్-2 బ్రెయిన్ ట్యూమర్ నన్ను నేను మలుచుకోవడానికి దక్కిన అవకాశం

2024 నవంబరులో నాకు మెదడుకు ఎడమవైపున 8 సెం.మీ గడ్డ ఉందని, అది గ్రేడ్2 ఆస్ట్రోసైటోమా అని గుర్తించారు. శస్త్రచికిత్స చేసి 90% గడ్డ తొలగించారు. సాధారణంగా బ్రెయిన్ ట్యూమర్ తొలగించాక రేడియేషన్, కీమోథెరపీ చేస్తారు. నాకు డిసెంబరులో ఆపరేషన్ జరిగింది. అంతకు ముందే ఆగస్టులో ఒక కొత్త మందు కనుగొన్నారు. దానితో ట్యూమర్ పెరగకుండా నిరోధించవచ్చు. కీమో, రేడియేషన్ థెరపీ అవసరం లేకపోవచ్చు. నేను సిగరెట్ తాగను. ఆరోగ్యం బాగానే ఉంటుంది. అయినా బ్రెయిన్ ట్యూమర్ ఎందుకు వచ్చిందో తెలియదు. నేను రోగినయ్యాను కాబట్టి దానిపై మరింత జ్ఞానం లభించింది. ఎక్కువ మందికి ఇలాంటి సమస్య రాకుండా సాయం చేయడానికి ఇది నాకు దక్కిన అవకాశం అనుకుంటున్నా. అమెరికన్ మెడికల్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా ఉండటంతో నాకు వైద్యుల అపాయింట్‌మెంట్ వేగంగా దొరికింది. నెలలో శస్త్రచికిత్స జరిగింది. అందరికీ ఈ సౌకర్యం ఉండదు కాబట్టి రోగనివారణపై అందరూ అవగాహన పెంచుకోవాలని పదేపదే చెబుతున్నా.

వైద్యరంగంలో ఏఐను ఆగ్మెంటెడ్ ఇంటెలిజెన్స్‌గా పిలుస్తాం. అంటే రోగుల పట్ల వైద్యుల సంరక్షణ సామర్థ్యాన్ని మెరుగుపరిచేదని అర్థం. ఒకసారి వచ్చిన రోగికి మళ్లీ పరీక్షలన్నీ చేయాల్సిన అవసరం లేకుండా ఆ వ్యక్తి ఆరోగ్య చరిత్ర తెలుసుకోవడానికి ఏఐను ఉపయోగించుకోవాలి. ఏఐ వచ్చిన కొత్తలో 50% మంది వైద్యుల్లో దీనిపై భయం ఉండేది. ఇప్పుడు అమెరికాలో దాదాపు 50% మంది వైద్యులు ఒక స్థాయిలో ఏఐ ఉపయోగిస్తున్నారు. నోట్స్ రాసే సమయంలో, రోగిని చూసే సమయంలో ప్రశ్నల్ని డాక్యుమెంట్ చేయడంలో, ఫార్మాస్యూటికల్స్‌లో ఏఐ ఉపయోగపడుతుంది. అయినా దీనిపై కొంత భయం ఉంది.

అమెరికాలో 2030 నాటికి 85 వేల మంది వైద్యుల కొరత

అమెరికాలో తగినంత మంది వైద్యుల్లేరు. 2030 నాటికి దాదాపు 85 వేల మంది వైద్యుల కొరత ఉంటుంది. అమెరికాలో వైద్య విద్యార్థులున్నా, తగినన్ని రెసిడెన్సీ (పీజీ) ప్రోగ్రామ్‌లు లేవు. భారత్‌లోనూ వైద్యుల కొరత ఉంది. ప్రజల ఆరోగ్య సంరక్షణకు మరిన్ని పీజీ ప్రోగ్రామ్స్‌తోపాటు వైద్య కళాశాలలు ఏర్పాటు చేయాలి. నర్సులు, ఇతర వైద్యసిబ్బందీ పెరగాలి. విదేశీయులు అమెరికాలో వైద్యులుగా రావాలంటే హెచ్1బీ వీసా కోసం లక్ష డాలర్లు చెల్లించాల్సిన అవసరం లేకుండా మినహాయింపు ఇవ్వాలని మా సంఘం వైట్‌హౌస్ ప్రతినిధులను కలిసి కోరింది.

యాంటీబయాటిక్స్ వినియోగంపై చాలా జాగ్రత్తగా ఉండాలి. ఎవరైనా తుమ్మినా, దగ్గినా, ముక్కుదిబ్బడగా ఉన్నా యాంటీబయాటిక్ అవసరం లేదు. కానీ వీటిని తీసుకుంటున్నారు. దీంతో బ్యాక్టీరియా మరింత నిరోధకత పెంచుకుంటుంది. మరిన్ని యాంటీబయాటిక్స్ అవసరమవుతాయి. తర్వాత ఇన్‌ఫెక్షన్ నుంచి బయటపడటం కష్టం. యాంటీబయాటిక్ తీసుకున్నా కాబట్టి వారంలో నయమైందనుకోవద్దు. సహజంగానే వైరల్ ఇన్‌ఫెక్షన్ వారంలో నయమవుతుంది.

సరదా కోసం సినిమాలో నటించా

2024 మార్చిలో ఒక సినిమాలో నటించే అవకాశం వచ్చింది. సరదా కోసం ఆ సినిమాలో బ్రిటిష్ ట్యాక్స్ కలెక్టర్ పాత్ర పోషించా. నటుడిగా నా ప్రతిభ సున్నా అని అప్పుడే తెలిసింది (నవ్వుతూ). బ్రెయిన్ ట్యూమర్ నుంచి బయటపడిన నాకు మరో పదేళ్ల ఆయుర్దాయం లభించింది. ఈలోగా నేను చేయాల్సిన పనులు చాలా ఉన్నాయనుకుంటున్నా.

ఆంధ్రప్రదేశ్‌లో ఆరోగ్య సంరక్షణకు సహకారం అందిస్తా

అమెరికన్ మెడికల్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా ఇతర ట్రస్టీలతో కలిసి ఆసుపత్రులు సందర్శిస్తున్నాం. తద్వారా ఎంతో నేర్చుకుంటున్నాం. నేర్పిస్తున్నాం. ఆంధ్రప్రదేశ్‌లో ఆరోగ్య సంరక్షణకు నా వంతు సహకారం అందిస్తా. వైద్య బృందాలు చెప్పేది వినడానికి, మా ఆలోచనలు ఇవ్వడానికి ఉత్సాహంగా ముందుంటా. వాట్సప్ ద్వారా విజయవాడలోని వైద్యుని నుంచి సహాయం తీసుకోగలుగుతున్నా. వారికి అవసరమైన సహాయం అందిస్తున్నా.



కీలక ప్రాజెక్టులపై సమీక్ష నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు. చిత్రంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, పయ్యావుల కేశవ్, అచ్చెన్నాయుడు, సీఎస్ విజయానంద్, ఇతర ఉన్నతాధికారులు

వివాదరహితంగా నల్లమల సాగర్

- కేంద్రం అనుమతులు తీసుకోవడమే కాదు.. తెలంగాణతోనూ సంప్రదించాలి
- మంత్రులు, అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టీకరణ

ఈనాడు, అమరావతి: వృథాగా పోయే జలాలను వాడుకునేలా రూపొందించిన నల్లమలసాగర్ ప్రాజెక్టుకు కేంద్రం నుంచి అనుమతులు తీసుకోవడంతో పాటు.. తెలంగాణ కూడా అభ్యంతరం చెప్పకుండా చూసుకోవాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. సముద్రంలోకి వృథాగా వెళ్లే వరదనీటిని తెలుగు రాష్ట్రాలు వినియోగించుకోవాలనేదే ఉద్దేశమని.. కాళేశ్వరానికి మనం అభ్యంతరం చెప్పలేదని తెలిపారు. వివాదాలు లేకుండా రెండు రాష్ట్రాలూ అభివృద్ధి చెందేలా సహకరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నల్లమలసాగర్ పూర్తయితే, అవసరమైతే తెలంగాణకూ నీరిచ్చే పరిస్థితి ఉంటుందని చెప్పారు. శనివారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో వివిధ శాఖల మంత్రులు, ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. గతేడాది ప్రాధాన్య పనులుగా గుర్తించిన పనుల పురోగతిని సమీక్షించారు, అలాగే ఈ ఏడాదే చేపట్టాల్సిన, ఉత్తరాంధ్ర సాగునీటి ప్రాజెక్టులను పూర్తిచేసే లక్ష్యంతో పనిచేయాలని సీఎం స్పష్టం చేశారు.

ఏప్రిల్ నుంచి పీపీపీ విధానంలో పనులు

'పీపీపీ విధానంలో తొలిదశలో ఈ ఏడాది 290 ప్రాజెక్టులను చేపట్టాలి. వీటికి కేంద్రం నుంచి సహకారం లభిస్తోంది. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచే వీటిని చేపట్టేలా ప్రణాళికలు సిద్ధం చేయండి. 2027 నాటికి జలజీవన్ మిషన్ పనులు పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలి' అని ముఖ్యమంత్రి చెప్పారు. 'పూర్వోదయ పథకం కింద రాష్ట్రానికి రూ.40వేల కోట్లు ఇచ్చేందుకు కేంద్రం సిద్ధంగా ఉంది. దీనికి అదనంగా మరిన్ని ప్రాజెక్టులను సిద్ధం చేయాలి. ఈ పథకం కింద ప్రకాశం, రాయలసీమ జిల్లాల్లో అభివృద్ధి చేయొచ్చు. వివిధ వారీగా ఉద్యానవన అభివృద్ధికి కార్యాచరణ అమలుచేయాలి. ఈ ఏడాది 2లక్షల హెక్టార్లలో ఉద్యానపంటలు పండించేలా రైతులను సమాయత్తం చేయాలి. దీంతో రాయలసీమ సహా ప్రకాశం జిల్లాలోని ఉద్యాన రైతులకు మేలు జరుగుతుంది. పథకంలో భాగంగా ఇరిగేషన్, రోడ్ నెట్‌వర్క్, లాజిస్టిక్స్ కనెక్టివిటీ, వేర్‌హౌసింగ్ సదుపాయాలు, కోల్డ్ చెయిన్ లాంటి వ్యవస్థలను అభివృద్ధి చేసుకోవాలి. శాఖలవారీగా చేపట్టనున్న పనులపై జిల్లాల వారీగా జాబితాను సిద్ధం చేసుకోవాలి' అని సూచించారు.

దావోస్ నుంచి వచ్చేలోగా నివేదికలు సిద్ధం చేయండి

కీలక రంగాల్లో అమలుచేయాల్సిన వివిధ పథకాలపై తాను దావోస్ నుంచి తిరిగొచ్చేసరికి నివేదికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఆ పథకాల అమలుకు క్షేత్రస్థాయి యంత్రాంగాన్ని సన్నద్ధం చేయడంతోపాటు మీరూ సిద్ధం కావాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో మంత్రులు పయ్యావుల కేశవ్, అచ్చెన్నాయుడు, నిమ్మల రామానాయుడు, సీఎస్ విజయానంద్, ఆర్థిక, ఇరిగేషన్, వ్యవసాయ, ఆర్అండ్‌బీ, మున్సిపల్ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



దస్త్రావేజులు అందిస్తున్న జీఎంఆర్ దంపతులు

ఆలయ అభివృద్ధికి జీఎంఆర్ రూ.కోటి స్థలం వితరణ

భోగాపురం, రాజాం, న్యూస్‌టుడే: జీఎంఆర్ గ్రూప్ అధినేత గ్రంధి మల్లికార్జునరావు విజయనగరం జిల్లా రాజాం పట్టణంలోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయానికి 19 సెంట్ల స్థలాన్ని వితరణ చేశారు. శనివారం రాజాంలో నిర్వహించిన కార్యక్రమంలో స్థలానికి సంబంధించిన దస్త్రావేజులను ఆయన సతీమణి వరలక్ష్మితో కలిసి ఆలయ కమిటీకి అందజేశారు. స్థల విలువ రూ.కోటి వరకు ఉంటుంది.

భోగాపురం విమానాశ్రయ పనులపై సమీక్ష

అనంతరం జీఎంఆర్ సంస్థ నిర్మిస్తున్న విజయనగరం జిల్లా భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని మల్లికార్జునరావు సందర్శించారు. విమానాశ్రయ పనుల పురోగతిని పరిశీలించారు. టెర్మినల్ భవనం, రన్‌వే, టాక్సీవేలు, ప్రయాణికుల వసతులు, భద్రతా ఏర్పాట్లపై సంస్థ ప్రతినిధులతో సమీక్షించారు. పనుల నాణ్యత, వేగం, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల వివరాలు అడిగి తెలుసుకున్నారు.

జేఈఈ అడ్మిట్ కార్డులు విడుదల

21 నుంచి ప్రారంభంకానున్న పరీక్షలు

ఈనాడు, హైదరాబాద్: దేశవ్యాప్తంగా ఈ నెల 21వ తేదీ నుంచి ప్రారంభం కానున్న జేఈఈ మెయిన్ ఆన్‌లైన్ పరీక్షలకు సంబంధించిన అడ్మిట్ కార్డులను జాతీయ పరీక్షల సంస్థ శనివారం విడుదల చేసింది. వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచిన హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పేర్కొంది. పేపర్-1, 2లకు కలిపి దేశవ్యాప్తంగా దాదాపు 14.50 లక్షల మంది ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం.

ఆర్యవైశ్యులకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది: డూండి రాకేశ్

ఈనాడు, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న పండుగల్లో ఆర్యవైశ్యులకు సంబంధించినవే మూడు ఉండడం ఆ సామాజిక వర్గానికి కూటమి ప్రభుత్వం ఇస్తున్న గౌరవానికి నిదర్శనమని ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ డూండి రాకేశ్ అన్నారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. "మ్యానిఫెస్టోలో పెట్టకపోయినా పెనుగొండకు వాసవీ అమ్మవారి పేరుపెట్టినందుకు సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు" అని పేర్కొన్నారు.

గుంతకల్లు-నంచెర్ల మధ్య 11.47 కి.మీ. బైపాస్ రైల్వేలైన్

ఈనాడు, దిల్లీ: అనంతపురం జిల్లాలోని గుంతకల్లు-నంచెర్ల మధ్య 11.47 కిలోమీటర్ల పొడవైన రైల్వే బైపాస్ లైన్ నిర్మాణానికి రైల్వేశాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణ కోసం గుంతకల్లు ఆర్డీవోను కాంపిటెంట్ అథారిటీగా నియమించింది. ఈ ప్రాజెక్టు నిర్వహణ బాధ్యతలన్నీ వారికే అప్పగిస్తున్నట్లు పేర్కొంది.



కోట్లు లేకపోయినా సంపన్నుల్లా జీవించాలంటే..

సంపన్నులు కావాలంటే బాగా డబ్బు సంపాదించాలన్నది నిజమే కానీ, సంపన్నుల్లా జీవించడానికి మాత్రం కోట్లు గడించాల్సిన అవసరం లేదు. ఆదాయం కన్నా ఖర్చులు తక్కువగా ఉండేలా జాగ్రత్తపడితే చాలు. అలాంటివారంతా భవిష్యత్తు గురించి ఆందోళన అవసరం లేని సుసంపన్నమైన జీవితాన్ని అనుభవిస్తున్నట్లే.

– టైలర్ టాట్, ఫిట్‌నెస్ కోచ్



పునర్నిర్మాణం, విస్తరణ పనుల అనంతరం మేడారం వనదేవతల గద్దెల ప్రాంగణం

మేడారం... అద్భుత ప్రాకారం!

పునరుద్ధరించిన గద్దెల ప్రాంగణం.. రేపే ప్రారంభం

ఈనాడు, హైదరాబాద్: వన దేవతల జాతరకు... తెలంగాణలోని మేడారం ముస్తాబవుతోంది. వెయ్యేళ్ల చరిత్రను తెలిపే ఘట్టాలను ఆవిష్కరించే చిత్రాలు, మూలవాసులైన కోయ తెగల ఆచార వ్యవహారాలను కళ్లకు కట్టబోతోంది. దశాబ్దాలుగా భక్తులు పడుతున్న ఇబ్బందులన్నీ తీరేలా తెలంగాణ ప్రభుత్వం తీర్చిదిద్దింది. గద్దెల ప్రాంగణాన్ని ఆసాంతం అద్భుతంగా మార్చేసింది. ఇకపై... సమ్మక్క, సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్ద రాజుల గద్దెలను ఏకకాలంలో ఎనిమిది వేల మంది రెండువైపుల నుంచి దర్శించుకునే భాగ్యం కలగనుంది. కేవలం మూడు నెలల్లోనే ప్రాంగణం పునరుద్ధరణ పూర్తయింది. సోమవారం తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం కానుంది.

నకిలీ మద్యం కేసులో మరో ఛార్జిషీట్

జోగి సోదరులు, జనార్దన్‌రావు పేర్ల ప్రస్తావన

ఈనాడు, అన్నమయ్య, ములకలచెరువు, న్యూస్‌టుడే: ములకలచెరువు నకిలీ మద్యం తయారీ కేసులో 536 పేజీలరెండో ఛార్జిషీటును ఎక్సైజ్ పోలీసులు తంబళ్లపల్లె కోర్టులో దాఖలు చేశారు. గతేడాది అక్టోబరు 3న ములకలచెరువులో నకిలీ మద్యం తయారీ కేంద్రంపై ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఇప్పటి వరకు 33 మందిపై కేసులు నమోదు చేసి 31 మందిని అరెస్టు చేశారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. ఈ కేసుకు సంబంధించి గత ఏడాది డిసెంబర్‌లో మొదటి ప్రాథమిక ఛార్జిషీట్ దాఖలు చేయగా, రెండోది శనివారం వేశారు.

కీలక నిందితుల నుంచి ఆధారాలు..

వైకాపాకు చెందిన మాజీ మంత్రి జోగి రమేష్, ఆయన సోదరుడు రాము, కీలక నిందితులు జనార్దన్‌రావు, జినేష్, శిబు, నక్కిరేకంటి రవి, శ్రీనివాసులరెడ్డిని ఎక్సైజ్ పోలీసులు ఇటీవల కస్టడీకి తీసుకుని కీలక ఆధారాలు రాబట్టారు. గతేడాది సెప్టెంబర్ 23న జనార్దన్‌రావు ఆఫ్రికా వెళ్లే ముందే జోగి రమేష్‌ను ఆయన ఇంట్లో కలిసినట్లు ఆధారాలు సేకరించారు. జనార్దన్‌రావు అందించిన వివరాలతో ప్లాస్టిక్ బాటిళ్లు, నకిలీ లేబుళ్ల తయారీ తదితర విషయాలను ఛార్జిషీట్‌లో పొందుపర్చారు. ఈ ఛార్జిషీట్‌లో జోగి రమేష్ సోదరులు, జనార్దన్‌రావు మధ్య ఫోన్ సంభాషణల కాల్ డేటా, నగదు లావాదేవీల వివరాలు చేర్చారు.

జాతీయ రహదారుల యోగం ఎప్పుడు?

(మొదటి పేజీ తరువాయి)

మూడు సీసీయూలుగా లెక్కిస్తారు. రెండు బైక్స్‌ను ఒక పీసీయూగా పరిగణిస్తారు.

- ✦ జాతీయ రహదారుల నిబంధనల ప్రకారం రోజుకు 10వేల పీసీయూలకు పైగా ట్రాఫిక్ ఉంటే.. ఆ రోడ్డును నాలుగు వరుసలుగా విస్తరించాలి.
- ✦ ఏపీ నుంచి ప్రతిపాదనలు పంపిన రాష్ట్ర రహదారుల్లోని 14 రోడ్లలో వాహనరద్దీ 10 వేల పీసీయూలకుపైనే ఉంది.
- ✦ చిలకపాలెం-రామభద్రపురం-రాయగడ రోడ్డులో 15,997 పీసీయూలు, కళింగపట్నం-పాలకొండ-రాయగడ రోడ్డులో 16,538 పీసీయూలు, విజయనగరం-పాలకొండ రోడ్డులో 15,908 పీసీయూలు ఉన్నాయి.
- ✦ 10 వేలకుపైగా పీసీయూలు ఉన్న రోడ్లలో.. రాజమహేంద్రవరం-సామర్లకోట రోడ్డులో 13,257 పీసీయూలు, ఎమ్మిగనూరు-పత్తికొండ-కళ్యాణదుర్గం-మడకశిర రోడ్డులో 12,548, గుత్తి-ఆదోని-కౌతాళం రోడ్డులో 12,548, జమ్మలమడుగు-కొలిమిగుంట్ల రోడ్డులో 11,011, సబ్బవరం-నర్సీపట్నం-తుని రోడ్డులో 10,445, తాళ్లపాలెం-చింతపల్లి-సీలేరు-భద్రాచలం రోడ్డులో 10,274, రాజమహేంద్రవరం-నిడదవోలు-భీమవరం రోడ్డులో 10,355, నాగసముద్రం క్రాస్-నాయనపల్లి క్రాస్‌రోడ్డులో 10,209, గుంటూరు-ప్రత్తిపాడు-ఒంగోలు రోడ్డులో 10వేల పీసీయూలు ఉన్నాయి.
- ✦ ఇవన్నీ జాతీయ రహదారులైతే వీటిని నాలుగు వరుసలుగా విస్తరించేందుకు వీలుంటుంది.

ఎన్‌హెచ్‌లైతే.. ప్రయోజనాలేంటి?

- ✦ ఏ రహదారి అయినా ఎన్‌హెచ్‌గా మారితే.. దానిని కేంద్ర రోడ్డు రవాణా, హైవేల శాఖ (మోర్త్) ప్రమాణాలతో కనీసం 10 మీటర్ల వెడల్పుతో విస్తరిస్తారు. 10వేల పీసీయూలు దాటిన రోడ్లను నాలుగు వరుసలుగా విస్తరిస్తారు.
- ✦ పట్టణాలు, ఎక్కువ జనాభా ఉండే గ్రామాల మధ్య నుంచి రోడ్డు వెళ్తున్న చోట్ల బైపాస్‌లు నిర్మిస్తారు. దీనివల్ల ఆయా ప్రాంతాల్లో ప్రమాదాలు తగ్గుతాయి.
- ✦ వంపులు లేకుండా చాలావరకు తిన్నగా ఉండేలా మారుస్తారు. దీనివల్ల ప్రమాదాలు నియంత్రించవచ్చు.
- ✦ శిథిల వంతెనలు ఉంటే, వాటిస్థానంలో కొత్తవి నిర్మిస్తారు.
- ✦ ప్రతి ఐదేళ్లకు ఆ రోడ్లలో తప్పనిసరిగా రెన్యువల్స్ (పునరుద్ధరణ) పనులు చేస్తారు.
- ✦ ఎన్‌హెచ్‌లో పనులు చేసేందుకు నిధుల కొరత ఉండదు.

కేంద్ర మంత్రులు, ఎంపీలు ఒత్తిడి తేవాలి

రాష్ట్ర రోడ్లను ఎన్‌హెచ్‌లుగా ఉన్నతీకరించే అధికారం మోర్త్‌కు ఉంటుంది. తాము చెప్పేవరకు ఏ రాష్ట్ర రహదారినీ.. ఎన్‌హెచ్‌గా ఉన్నతీకరించొద్దంటూ 2021 సెప్టెంబరులో పీఎంఓ నుంచి మోర్త్‌కు ఆదేశాలొచ్చాయి. ఎవరైనా కేంద్ర మంత్రి గడ్కరీని కలిసి అడిగినా, పీఎంఓలో సంప్రదించాలని ఆయన చెబుతున్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వానికి.. గత ఏడాదిన్నరగా కేంద్రం అనేక ప్రాజెక్టులు ఇస్తోంది. ఇలాంటి తరుణంలో రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ముగ్గురు కేంద్రమంత్రులు ఎన్‌హెచ్‌ల కోసం ప్రత్యేక చొరవ చూపాలి. రాష్ట్ర ఎంపీలు కూడా ఈ రోడ్లను ఎన్‌హెచ్‌లుగా మార్చాల్సిన ఆవశ్యకతను కేంద్రం దృష్టికి తీసుకెళ్లి వాటిని సాధించాలి. 31 రోడ్లూ ఒకేసారి కాకపోయినా.. దశలవారీగా ఐదేసి రోడ్ల చొప్పున ఉన్నతీకరించేలా కోరితే కేంద్రం సానుకూలంగా నిర్ణయం తీసుకునేందుకు వీలుంది.

ఎన్‌హెచ్‌లుగా ఉన్నతీకరణకు రాష్ట్రం ప్రతిపాదించిన రోడ్లు ఇవి

రహదారి	కి.మీ.
1. చిలకపాలెం-రామభద్రపురం-పార్వతీపురం-రాయగడ రోడ్డు	100
2. కళింగపట్నం-ఆమదాలవలస-పాలకొండ-పార్వతీపురం-రాయగడ	145
3. గార-అలికాం-బత్తిలి రోడ్డు.. ఒడిశాలో గునుపూర్ వరకు	118
4. విజయనగరం-పాలకొండ	70.31
5. సబ్బవరం-చోడవరం-నర్సీపట్నం-తుని రోడ్డు	109.5
6. తాళ్లపాలెం-చింతపల్లి-సీలేరు-భద్రాచలం	224
7. కాకినాడ-కోటిపల్లి-అమలాపురం	57.29
8. రాజమహేంద్రవరం-ప్రత్తిపాడు-నిడదవోలు-భీమవరం	73.80
9. రాజమహేంద్రవరం-అనపర్తి-ద్వారపూడి-సామర్లకోట	62
10. భీమవరం-నరసాపురం-మార్టేరు-ఆచంట-సిద్ధాంతం	44
11. భీమడోలు-ద్వారకాతిరుమల-జంగారెడ్డిగూడెం	42.4
12. పామర్రు-కూచిపూడి-మొవ్వ-కొడాలి-చల్లపల్లి	26.83
13. గుంటూరు-ప్రత్తిపాడు-ఒంగోలు	107
14. గుంటూరు-నల్లపాడు-పేరేచెర్ల-తాడికొండ-కాజ	50.76
15. గుంటూరు-నారాకోడూరు-చేబ్రోలు-పొన్నూరు-బాపట్ల	63.80
16. నరసరావుపేట-సత్తెనపల్లి-అమరావతి-తాడికొండ-కాజ	96
17 బేస్తవారపేట-పొదిలి-ఉప్పలపాడు-చీమకుర్తి-ఒంగోలు	107
18. ఉత్తుకొట్టాయి-సత్యవేడు-తడ	42
19. తడ-వరదరాయిపాళెం-బుచ్చినాయుడు కండ్రిగ-శ్రీకాళహస్తి	50
20. కదిరి-రాయచోటి-రాజంపేట-చిట్వేల్-రాపూరు-గూడూరు-కృష్ణపట్నం పోర్ట్	253
21. కర్ణాటక సరిహద్దు-రొద్దం-పెనుకొండ-బుక్కపట్నం	54
22. మలకవేముల క్రాస్-నల్లమాడ-ఓబులదేవరచెరువు-బాగేపల్లి	84.80
23. నాగసముద్రం క్రాస్-ధర్మవరం-బత్తలపల్లి-నాయనపల్లి క్రాస్	64
24. భాకరాపేట-బద్వేలు-పోరుమామిళ్ల-బేస్తవారపేట	140
25. ఎమ్మిగనూరు-పత్తికొండ-గుంతకల్లు-ఉరవకొండ-కళ్యాణదుర్గం-మడకశిర	243
26. కర్నూలు-కోడుమూరు-ఆస్పరి-ఆలూరు-బళ్లారి రోడ్డు	143.62
27. బైరెడ్డిపల్లె-పుంగనూరు-చిన్నగొట్టిగల్లు-రొంపిచెర్ల	100.74
28. గుత్తి-ఆదోని-కౌతాళం-కర్ణాటక సరిహద్దు వరకు	135
29. పాత ఎన్‌బీ రోడ్డు (జమ్మలమడుగు-కొలిమిగుంట్ల)	42
30. బేతంచర్ల-బనగానపల్లి-కోయిలకుంట్ల-ఆళ్లగడ్డ	64
31. ఆదోని-పత్తికొండ-ప్యాపిలి-బనగానపల్లి	144.60
మొత్తం	3,059.10

ఏఎం గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్టు 'క్లీన్ ఎనర్జీ' ఉత్పత్తిలో కీలక ముందడుగు: లోకేశ్

ఈనాడు, అమరావతి: దేశాన్ని 'క్లీన్ ఎనర్జీ' రంగంలో అగ్రగామిగా నిలపడంలో కాకినాడలోని ఏఎం గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్టు కీలక ముందడుగని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. ఇప్పటిదాకా ఇంధన దిగుమతిదారుగా ఉన్న దేశం... త్వరలో క్లీన్ ఎనర్జీ ఎగుమతిదారుగా మారబోతోందని ఎక్స్ వేదికగా శనివారం పేర్కొన్నారు. "ఈ లక్ష్యాన్ని సాకారం చేయడానికి 'ఏపీ సమగ్ర క్లీన్ ఎనర్జీ-2024'కు పునాది వేశాం. ఏఎం గ్రీన్ అమ్మోనియం ప్రాజెక్టు ద్వారా భవిష్యత్తులో ఈ రంగంలో పది బిలియన్ డాలర్ల పెట్టుబడులు రానున్నాయి" అని లోకేశ్ వివరించారు. ఈ మేరకు ఓ వీడియోను పోస్టు చేశారు. "గ్రీన్ హైడ్రోజన్, అమ్మోనియా హబ్‌గా ఏపీ మారనుంది. దేశంలో తొలి, ప్రపంచంలోనే అతిపెద్ద హరిత హైడ్రోజన్, హరిత అమ్మోనియా కాంప్లెక్స్‌ను కాకినాడలో ఏఎం గ్రీన్ సంస్థ ఏర్పాటుచేయనుంది. కర్బనరహితంగా.. వాటర్ ఎలక్ట్రాలసిస్ విధానం ద్వారా వంద శాతం శుద్ధ, పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి దీనిద్వారా సాధ్యమవుతుంది. ఈ ప్లాంట్ సాకారం అయ్యాక ఏడాదికి 15 లక్షల టన్నుల చొప్పున గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి అవుతుంది. 8వేల మందికి ఉపాధి కలగనుంది" అని ఆ వీడియోలో వివరించారు.

ప్రముఖ సైకాలజిస్టు లక్ష్మీకాంతమ్మ కన్నుమూత



ఈనాడు, కర్నూలు; న్యూస్‌టుడే, హైదరాబాద్: సంఘ సేవకురాలు, ప్రముఖ సైకాలజిస్టు పరమాత్ముని లక్ష్మీకాంతమ్మ (91) హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం ఉదయం కన్నుమూశారు. తిరుపతికి చెందిన సుబ్రహ్మణ్యం, వెంకమ్మ దంపతులకు 1935లో లక్ష్మీకాంతమ్మ జన్మించారు. తిరుపతి శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఎంఏ సైకాలజీ పూర్తి చేశారు. 1958లో కర్నూలులోని కోసిరెడ్డి వెంకట్‌రెడ్డి (కేవీఆర్) ప్రభుత్వ కళాశాలలో ప్రొఫెసర్‌గా ఉద్యోగంలో చేరారు. కడప ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సైకాలజీ విభాగాధిపతిగా విధులు నిర్వర్తించారు. ప్రొఫెసర్‌గా 35 ఏళ్లపాటు సేవలందించారు. ఉద్యోగ విరమణ చేశాక హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. ఆమె భర్త వెంకటరావు 2004లో మృతి చెందారు. వీరికి పిల్లలు లేకపోవడంతో హైదరాబాద్‌లోని మేనకోడలు హైమావతి ఇంట్లో ఉంటూ తన సేవా ప్రస్థానాన్ని కొనసాగించారు. శనివారం మధ్యాహ్నం హైదరాబాద్‌లోని ఈఎస్ఐ శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

అవిశ్రాంత సేవలు..

సంఘ సేవకురాలిగా, మనస్తత్వ సమస్యల విశ్లేషకురాలిగా, ఫ్యామిలీ కౌన్సెలర్‌గా లక్ష్మీకాంతమ్మ గుర్తింపు తెచ్చుకున్నారు. 'ఈనాడు' దినపత్రికలో 'డియర్ వసుంధర'కు కాలమిస్టుగా 20 ఏళ్లపాటు పని చేశారు. ఉమ్మడి కడప జిల్లాలో పల్లె ప్రజలకు చదువు ఆవశ్యకత తెలిపేలా 'అక్షర రశ్మి' సంస్థ ద్వారా కృషిచేశారు. హైదరాబాద్‌లో ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్ 'స్పృష్టి' సంస్థ వ్యవస్థాపక కార్యదర్శిగా సేవలందించారు. హైదరాబాద్ వెంగళరావునగర్‌లోని భవానీ ఎడ్యుకేషన్ సొసైటీకి అధ్యక్షురాలిగా పనిచేశారు. సేవా ప్రపూర్ణ, శ్రీ ప్రకాశ్, బెస్ట్ సైకాలజిస్ట్ అవార్డులు అందుకున్నారు.

చిట్యాల నుంచి వాహనాల మళ్లింపు



సంక్రాంతి సంబరాలు పూర్తయ్యాయి. ఏపీ, తెలంగాణలోని వివిధ ప్రాంతాల నుంచి పలు కుటుంబాలు తిరుగు ప్రయాణమయ్యాయి. విజయవాడ- హైదరాబాద్ జాతీయ రహదారిపై నల్గొండ జిల్లా చిట్యాల వద్ద రద్దీ ఎక్కువైంది. దీంతో పోలీసులు వాహనాలను చిట్యాల నుంచి ఇలా కుడివైపు సింగిల్ రోడ్డులో భువనగిరి మీదుగా హైదరాబాద్ వైపునకు మళ్లించారు. – న్యూస్‌టుడే, చిట్యాల

ఇళ్లకు పోదాం చలో చలో!

సంక్రాంతి సెలవులు పూర్తవడంతో సొంతూళ్ల నుంచి తిరుగు ప్రయాణాలు ప్రారంభమయ్యాయి. శనివారం విజయవాడ వచ్చేవారు, ఇక్కడి నుంచి వెళ్లేవారితో బస్టాండు, రైల్వేస్టేషన్ కిక్కిరిసిపోయాయి. – ఈనాడు, అమరావతి



బస్సు ఎక్కేందుకు ప్రయాసపడుతున్న ప్రయాణికులు



రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ

వసుంధర

vasundhara@eenadu.in

అధరాలు... ఆరోగ్యంగా!



శీతకాలం బారినపడే వాటిల్లో పెదాలు ముందుంటాయి. పొడిబారడం, పగుళ్లు రావడం వంటి సమస్యలు చాలానే. త్వరగా కోలుకోవాలా... అయితే ఈ సహజ మార్గాల్ని ప్రయత్నించండి.

- పావు స్పూను చొప్పున కొబ్బరినూనె, తేనె తీసుకొని బాగా కలపండి. ఈ మిశ్రమాన్ని మందమైన పొరగా పెదాలకు పూయండి. పావు గంటయ్యాక తడి వస్త్రంతో తుడిచేస్తే సరి. కొబ్బరినూనె తేమను అందిస్తే... తేనెలోని యాంటీ మైక్రోబియల్ గుణాలు గాయాలను మాన్పుతాయి. పొడిబారడమూ తగ్గుతుంది.
- అరస్పూను చక్కెరలో 5-6 చుక్కల ఆలివ్ ఆయిల్ వేసి, బాగా కలపండి. ఈ మిశ్రమంతో పెదాలను 1-2 నిమిషాలు మృదువుగా రుద్దాలి. ఆపై అలాగే 5 నిమిషాలు వదిలేశాక గోరువెచ్చని నీటితో కడిగేస్తే చాలు. పంచదార స్క్రబ్‌లా పనిచేసి, మృతకణాలను తొలగిస్తుంది. ఆలివ్ ఆయిల్ తేమను లాక్ చేసి, పెదాలు తాజాగా కనిపించేలా చేస్తుంది. వాటిని మృదువుగానూ మారుస్తుంది.
- కలబంద గుజ్జును తీసుకోండి. రాత్రి నిద్రపోయే ముందు పెదాలకు రాసి పడుకోండి. ఉదయాన్నే మృదువుగా తొలగిస్తే సరి. ఇది గాయాలను మాన్పడంతోపాటు పొడిబారడాన్నీ తగ్గిస్తుంది.

వ్యర్థాలతో... ఫ్యాషన్ వేదిక మీదకి!



మల్లిక

చెత్త, వృథా... వీటివల్ల ఎన్నెన్ని కష్టాలో! ఇక పరిశ్రమల నుంచి ఉత్పత్తి అయ్యే వాటి గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. వాటిని తగ్గించలేం. పోనీ తిరిగి ఉపయోగిస్తే? పర్యావరణానికి మేలు చేసినవాళ్లం అవుతాం కదా! ఇదే ఆలోచించారు మల్లికా రెడ్డి గునుపాటి. తన ఆలోచనతో ఫ్యాషన్ వీక్‌ల్లోనూ మెరిశారామె.

మాది హైదరాబాద్. నాన్న జీవీ ప్రసాద్ డాక్టర్ రెడ్డీస్ లెబొరేటరీస్ ఛైర్మన్, అమ్మ అనురాధ... సప్తపర్ణి అనే కల్చరల్ సెంటర్ నడుపుతారు. నేను ఆర్కిటెక్చర్ పూర్తయ్యాక కొన్నాళ్లు డాక్టర్ రెడ్డీస్‌లో పనిచేశా. మొదట్నుంచీ నాకు సస్టెయినబిలిటీ మీద ఆసక్తి ఎక్కువ. దీంతో ఓసారి అక్కడ ఎంత వృథా పోగవుతోంది, దాన్ని వాళ్లేం చేస్తారో గమనించా. అప్పుడే ఆ వృథాపై ఏదైనా చేయాలి అనిపించింది. అయితే దీనిలో ఎక్కువమంది భాగస్వాములు అయ్యేలానూ చేయాలనుకున్నా. అలా 2019లో 'క్యాన్సిల్డ్ ప్లాన్స్' ప్రారంభించా. కొత్తగా ఏదైనా చేయాలంటే... పాత ఆలోచనలు, అభిప్రాయాలు క్యాన్సిల్ చేయాలన్న ఉద్దేశం నాది. అందుకే సంస్థకీ పేరు. మేం ఎక్కువగా దృష్టి పెట్టింది ఫార్మా ప్యాకేజింగ్, టెక్స్‌టైల్ వేస్ట్ మీదే. అయితే హానికరం కాని వాటిని చూసి ఎంచుకుంటాం. ఇందుకోసం హైదరాబాద్‌లోని పరిశ్రమలన్నీ తిరిగాం. చాలామంది 'ఈ వృథాతో ఏదైనా చేయాలని ఉన్నా చేయలేకపోతున్నాం. కనీసం మీరు ప్రయత్నిస్తున్నారు' అని ప్రోత్సహించినవారే. దాంతో మా పని సులువైంది.

కొవిడ్ అడ్డుపడింది

వృథాతో ఫ్యాషన్, గృహాలంకరణ వస్తువులు చేయాలన్నది నా ఆలోచన. చాలామంది నా చదువుకు సంబంధం లేనిది అనుకుంటారు కానీ... ఆర్కిటెక్చర్, డిజైనింగ్ రెండూ ఒక తరహావే. అందుకే, కొనసాగడానికేమీ ఇబ్బంది పడలేదు. సమస్యల్లా చేతివృత్తుల వాళ్లతోనే! ఇలా వృథాతో పనిచేయడం వాళ్లకు కొత్త. దీంతో కష్టమనేవాళ్లు. కానీ ఏమేం చేయొచ్చో ఎలా చేయొచ్చో సలహాలిచ్చి ప్రోత్సహించాం. అప్పుడు నెమ్మదిగా ఒప్పుకొన్నారు. పోచంపల్లి, పాతబస్తీ.. ఇలా భిన్న ప్రాంతాల నుంచి వివిధ రకాల చేతివృత్తుల వాళ్లని ఎంచుకున్నాం. వాళ్లతో తయారుచేయించిన వస్తువుల్ని మా వెబ్‌సైట్‌తోపాటు ఎగ్జిబిషన్లు, స్టాల్స్‌లో పెట్టి అమ్ముతున్నాం. వ్యాపారం మీద అవగాహన కోసం లండన్‌లో ఎంబీఏ కూడా చేశా. నిజానికి మేం వ్యాపారం ఇలా ప్రారంభించామో లేదో లాక్‌డౌన్ వచ్చింది. అసలే కొత్త. మా దగ్గర అందరూ చేతివృత్తుల వాళ్లే. తొలగిస్తే వాళ్లకి ఉపాధి ఉండదు. అందుకే పని చేయించుకోకపోయినా ఆర్నెల్లు జీతాలు ఇచ్చాం. కానీ ఆ సమయంలో అందరూ ఇంటికి పరిమితం అవడం వల్ల ప్రకృతికి కొంత మేలు జరిగింది. ఈ విషయం అందరికీ అర్థమైంది. సస్టెయినబిలిటీ మీదా అవగాహన వచ్చింది. ఇది మా ఆలోచనా తీరును ఇంకా మెరుగు చేసుకునే అవకాశాన్ని ఇచ్చింది. ఆ ఉత్సాహంతో ప్రయోగాలు చేశాం. వృథాతో రూపొందించిన దుస్తుల్ని లాక్మే వంటి ఫ్యాషన్ వీక్‌ల్లోనూ ప్రదర్శించాం. మొదట అందరూ ఆశ్చర్యపోయినా... తరవాత ఆదరించారు. అలా వాటికి స్పందన బాగా వచ్చింది.

కష్టమే కానీ...

పర్యావరణాన్ని గౌరవించడం, కాపాడటం మన సంప్రదాయంలోనే ఉంది. కొద్దిగా మర్చిపోయామంతే. నాణ్యత బాగుండి, నలుగురికీ మేలు చేస్తుందంటే చాలామంది ఆసక్తి చూపుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఈ ధోరణి కనిపిస్తోంది. కాబట్టే, మా ఉత్పత్తులకు ఆదరణ పెరుగుతోంది. దేశవ్యాప్తంగా ఆర్డర్లు వస్తున్నాయి. దీన్ని గ్లోబల్ స్థాయికి తీసుకెళ్లే ప్రయత్నంలో ఉన్నాం. 'మల్లే' పేరుతో వస్త్ర బ్రాండ్‌నీ తీసుకొచ్చా. దీనిలో పూర్తిగా ఆర్గానిక్, బయోడిగ్రేడబుల్ మెటీరియల్స్‌తో చేసిన దుస్తులే ఉంటాయి. ఫాస్ట్ ఫ్యాషన్‌ని పక్కనపెట్టి, ఒక డ్రెస్ పదేళ్లపాటు వేసుకునేలా ఉండాలన్నది దీని ఉద్దేశం. ఇంకా ఆవాసా హోటల్స్‌కి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గానూ ఉన్నా. ఇన్ని బాధ్యతలు చూసుకోవడం కష్టమే. కానీ ఇష్టమైన పనులు కదా! కష్టమేమీ అనిపించట్లేదు. సస్టెయినబిలిటీ ప్రపంచమంతా దృష్టిపెడుతున్న రంగం. కాబట్టే, చాలామంది సాయపడుతున్నారు. ప్రయత్నించండి, రాణించొచ్చు... కావాల్సిన సాయం చేయడానికీ నేను సిద్ధమే!

నైపుణ్యాలకి పెడుతున్న ఖర్చెంత..!



చదువై, ఉద్యోగం వచ్చిందంటే చాలు... నైపుణ్య సాధనకు అక్కడితో చెక్ పడినట్లే. చేస్తున్న ఉద్యోగంపైనే దృష్టంతా. రొటీన్ లైఫ్‌లో ఎంతలా కొట్టుకుపోతారంటే... కొన్నాళ్లకు అదే వాళ్లని విసిగిస్తుంది. కొత్త పద్ధతుల్ని అందిపుచ్చుకుందాం, టెక్నాలజీ గురించి తెలుసుకుందాం, ఉన్నత పదవులకు పోటీ పడదాం అన్న ఆలోచనే ఉండదే. దొరికిన దానితోనే తృప్తి పడిపోయి... వృద్ధిని మరచిపోతున్న మహిళలు, అమ్మాయిల సంఖ్యే ఎక్కువ. దీనివల్ల వెనకబాటుతనం సరేసరి, విసుగొచ్చి పని మానేయాలన్నా, వేరే చోట ఉద్యోగం వెతుక్కోవాలన్నా... 'చేస్తోన్న పని తప్ప మనకు ఏం వచ్చు' అని మనసుకు సర్దిచెప్పుకుంటూ దాన్నే కొనసాగిస్తున్నారు. ఇలా 43శాతం మంది మహిళలు పనిపై ఆసక్తి లేకుండానే కొనసాగిస్తున్నారని చెబుతున్నాయి అధ్యయనాలు. దీనంతటికీ కారణం నైపుణ్యాల కొరతే. అయితే, ఉద్యోగంలో చేరి, కాస్త కుదురుకున్నాక ప్రతి ఒక్క అమ్మాయి నైపుణ్యాలు మెరుగుపరుచుకోవడంపై దృష్టి పెట్టాలి అంటున్నారు నిపుణులు. వృత్తిగత జీవితంలో నిత్య విద్యార్థిగా ఉండటం చాలా అవసరం అంటున్నారు. కృత్రిమ మేధ విస్తరిస్తున్న ఈ తరుణంలో... నేటి తరానికి ఇది మరీ ముఖ్యం అని చెబుతున్నారు. కొత్త నైపుణ్యాలు సంపాదించుకోవడం, చేస్తున్న పనినే ఇంకా మెరుగ్గా చేసేందుకు అవసరమయ్యే కోర్సులూ, శిక్షణల గురించి తెలుసుకుని, సమయం కేటాయించమంటున్నారు. అంతేకాదు, జీతంలో కనీసం ఒక్కశాతమైనా... నైపుణ్యాల సాధనకు ఖర్చు చేస్తే భవిష్యత్తుకు ఢోకా ఉండదు అంటున్నారు. పాటిస్తారుగా మరి.

మీకు తెలుసా..!

మహిళలు తమ జీవితకాలంలో దాదాపు తొమ్మిదేళ్లు అనారోగ్యంతోనే గడుపుతున్నారట. ఇల్లు, ఆఫీసు, సమాజంలో వాళ్ల ఉనికి, ఉత్పాదకత, సంపాదనా సామర్థ్యాలపై దీని ప్రభావం పడుతోందట. 2040 నాటికైనా ఈ పరిస్థితిని మార్చగలిగితే ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ఏటా కనీసం రూ.లక్ష కోట్ల ఆదాయం పెరుగుతుందని అంచనా వేస్తున్నాయి అధ్యయనాలు.

నగరాన్ని పూల వనంగా మార్చాలనీ..!



షెఫాలీ

చెన్నైలో ఎటు చూసినా పసుపు పచ్చని అందాలే. కారణం... పట్టణంలో పొద్దుతిరుగుడు పూలను పెంచుతూ 'సన్‌ఫ్లవర్ సిటీ'గా మారుస్తున్నారు ఓ యువతి. నగరాన్ని కాలుష్యం నుంచి కాపాడుతున్నారు. తనే షెఫాలీ దాదాభాయ్.



మనం ప్రయాణం చేస్తున్నప్పుడు ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయామనుకోండి. చుట్టూ వాహనాలు. ఇంజిన్ల మోతతో అవి విడుదల చేసే పొగ. దీనికితోడు మండిపోతున్న ఎండ. అంత వేడిలో ఒక్కసారిగా బంగారు రంగులో మెరుస్తూ పొద్దుతిరుగుడు పువ్వులు కనిపిస్తే... వాటి నుంచి వీచే చల్లటి గాలి ముఖానికి తగిలితే ఎంత హాయిగా ఉంటుందో కదా! ఆ గాలికి అప్పటి వరకూ పడిన ఒత్తిడి మొత్తం పోయి మనసు తేలిక పడుతుంది. చెన్నైలో సరిగ్గా ఇలాంటి వాతావరణం ఉండాలనుకున్నారు షెఫాలీ. అందుకే సిటీ మొత్తం సన్‌ఫ్లవర్స్‌తో నిండిపోవాలని కోరుకుంటున్నారు. ఇందుకు ఆమె బ్యాంకు ఉద్యోగాన్ని వదిలి గార్డెనర్‌గా మారారు. అంతేకాదు, దీనికోసం ప్రత్యేకంగా 'సన్‌ఫ్లవర్ సిటీ' పేరుతో ఓ ఉద్యమాన్ని మొదలుపెట్టి. నగరంలో విత్తనాలనూ, మొక్కల్నీ ఉచితంగా అందిస్తూ ఇళ్లు, పెట్రోల్ బంకులూ, పాఠశాలల్లో పువ్వులు పెంచేలా కృషి చేస్తున్నారు. అమెరికా నుంచి తిరిగొచ్చిన షెఫాలీ తన రూఫ్‌టాప్ గార్డెన్‌లో సన్‌ఫ్లవర్ విత్తనాలను వేశారట. 'మొక్కలు పెరిగి పూలు పూసినప్పుడు నాకెంతో ఆనందంగా అనిపించింది. ఆ సంతోషం నాకు మాత్రమే పరిమితం కాకూడదనుకున్నా. నగరం మొత్తం ఆ అనుభూతి పొందాలనుకున్నా. అందుకే 'సన్‌ఫ్లవర్ సిటీ' కార్యక్రమాన్ని మొదలుపెట్టా. ఇప్పటివరకూ పదివేలకు పైగా సన్‌ఫ్లవర్ మొక్కలను పంచాను. 150కి పైగా ఇళ్లు, పాఠశాలలు, ప్రైవేట్ కార్యాలయాలు, పెట్రోల్ బంకుల్లో వీటిని పెంచుతున్నారు. మొక్కలు, గింజల వివరాలతోపాటూ ఎరువులు, వాటికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వీడియోల రూపంలో ఇన్‌స్టాలో పోస్టు చేస్తుంటా'అని చెబుతారు షెఫాలీ.

సన్‌ఫ్లవర్ సిటీగా మెరిసిపోతూ...

ఏప్రిల్, ఆగస్టు నెలల్లో పూసే ఈ పూలతో చెన్నై పూర్తిగా బంగారు వర్ణంలో మెరిసిపోతూ కనిపిస్తుంది. తేనెటీగలు, సీతాకోకచిలుకలు వీటిచుట్టూ చేరతాయి. దాంతో బయోడైవర్సిటీ పెరుగుతుంది. అంతేకాదు, ఈ పొద్దుతిరుగుడు మొక్కలకు మట్టిలో టాక్సిన్లను పీల్చే గుణం ఎక్కువ. పైగా తక్కువ నీటితో ఇవి పెరుగుతాయి. అందుకే కొన్ని స్కూళ్లు వీటిని సైన్స్ ప్రాజెక్టుల కోసం పెంచుతున్నాయి. నగరంలో ప్రధాన కూడళ్లు, పెట్రోల్ బంకుల్లో ఈ పూలు కనువిందు చేస్తున్నాయి. దాంతో ఈ మొక్కల దగ్గర ఆగి మరీ సెల్ఫీలు తీసుకుంటున్నారు. ఆమె ప్రయత్నాన్ని అభినందించాల్సిందే కదూ!

మహిళల భద్రతకు సాంకేతిక అస్త్రం..!

మహిళలపై జరుగుతున్న నేరాల సంఖ్య నానాటికీ పెరుగుతోంది. వీటి నుంచి వాళ్లని కాపాడాలంటే సకాలంలో సహాయం అందాలి. అందుకోసం 'అవ్వా' అప్లికేషన్‌ని తయారుచేసింది మాన్సీ భగత్.



మాన్సీ పుట్టిపెరిగిందంతా మహారాష్ట్రలోని అమరావతి. స్థానిక కళాశాలలోనే ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్ ఇంజినీరింగ్ చదువుతోందీమె. ప్రాజెక్టులో భాగంగా ఏదైనా మొబైల్ అప్లికేషన్ తయారుచేయమని చెప్పారట అధ్యాపకులు. అప్పుడు మాన్సీ మహిళా రక్షణకు సంబంధించిన యాప్‌ని రూపొందించాలి అనుకుందట. 'ఈ విధమైన అప్లికేషన్లు ఇప్పటికే చాలా వచ్చాయి. కానీ, సకాలంలో సహాయం అందించడంలో కొన్ని విఫలమవుతున్నాయి. అందుకే అధునా తన పరిజ్ఞానంతో రక్షణ అప్లికేషన్‌ని తయారుచేయాలి అనుకున్నా. క్షేత్రస్థాయిలో మహిళలకు ఎదురవుతున్న వేధింపులు, లైంగిక దాడుల మీద అవగాహన పెంచుకున్నా. అత్యవసర వేళల్లో ప్రతి సెకనుకి ఎంత విలువ ఉంటుందో అర్థమైంది. పరిశోధనలో తెలుసుకున్న ప్రతి చిన్న విషయాన్నీ జోడిస్తూ... ఎనిమిది నెలలు శ్రమించి అవ్వాను రూపొందించా. ఈ అప్లికేషన్‌ను ఫోన్లో ఇన్‌స్టాల్ చేసుకుంటే... బాధితురాలు ఉన్న లొకేషన్, ఆమె ప్రమాదంలో ఉందన్న మెసేజ్ తల్లిదండ్రులూ, సంరక్షకులకు మూడు సెకన్లలో అందుతుంది. సైబర్ నేరాల్నీ హెచ్చరిస్తుందీ అప్లికేషన్. పనితీరు తెలుసుకోవడానికి ఇప్పటికే కొంత మంది అమ్మాయిల ఫోన్లలో దీన్ని ఇన్‌స్టాల్ చేశాం. ముందున్న అప్లికేషన్ల కంటే ఇది ప్రభావవంతంగా పనిచేసిందన్న సానుకూల స్పందనలు వచ్చాయి' అంటోంది మాన్సీ. ఈ అప్లికేషన్‌కు మరిన్ని ఫీచర్లు జోడించి దేశవ్యాప్తంగా అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో అడుగులు వేస్తోందీమె.

ఈటీవీ భారత్
యాప్ స్టోర్ & గూగుల్ ప్లే ద్వారా డౌన్‌లోడ్ చేసుకోండి

ఏం తింటున్నారో మీకు తెలియాలిగా!

బరువు తగ్గడంలోనే కాదు... ఆరోగ్యాన్ని కాపాడటంలోనూ ఆహారానిది కీలకపాత్ర. కానీ మనం తేలిగ్గా తీసుకునే కొన్ని అలవాట్లే అనేక రకాల సమస్యలకు కారణం అవుతాయి. ముఖ్యంగా మహిళలు పని ఒత్తిడి పేరుతో వీటిని నిర్లక్ష్యం చేయొద్దని చెబుతున్నారు పోషకాహార నిపుణులు. మరి అవేంటో తెలుసుకుందామా!



తాజావే తినండి...

పని ఒత్తిడితో పిల్లల లంచ్ బాక్సులనూ ప్యాకేజ్డ్ ఫుడ్‌తో నింపేస్తున్న తల్లులు ఎక్కువమందే. అవే సులువుగా కడుపు నింపేస్తాయని భావిస్తూ వాళ్లూ అదే తింటున్నారు. అయితే, ఊబకాయం, మధుమేహం లాంటివి అధికమవడానికి ఈ తరహా ఆహారం కూడా ఓ కారణమట. వీలైనంతవరకూ తాజా కూరగాయలు, పండ్లు వంటివి తీసుకోవడమే కాదు... అప్పటికప్పుడు వండుకుని తిన్నవాటికే ప్రాధాన్యం ఇవ్వండి. పొద్దున్నే టిఫిన్ చేయడం కుదరకపోతే పాలల్లో ఓట్స్ వేసుకుని తినండి. సలాడ్ చేసుకోండి. అన్నింటికీ ప్రత్యామ్నాయాలు ఉంటాయి. ఆలోచించి ప్లాన్ చేసుకుంటే సరి.

అప్పటి చిరుతిళ్లు...

ఆకలేస్తే ఒకప్పటిలా జంతికలు, సున్నుండలు, పప్పు చెక్కలు... వంటివి తినేవారెవరు? చిప్స్, ఐస్‌క్రీమ్, నూడుల్స్‌లే మా ఫేవరెట్ అంటారు చిన్నా, పెద్దా అంతా. కానీ, ఇలా ప్రాసెస్ చేసిన ఆహారాన్ని, ఫ్రోజెన్ ఫుడ్స్‌ని రెగ్యులర్‌గా తింటే... బరువు పెరగడంతో పాటు గుండె సంబంధిత వ్యాధులు, మధుమేహం లాంటి సమస్యలూ తలెత్తుతాయి. పాతకాలం నాటి చిరుతిళ్లను గుర్తు తెచ్చుకోండి. వాటిని ఇంట్లోనే ఓసారి చేసి పెట్టుకుంటే మీకు ఇబ్బంది ఉండదు, ఆలోచించండి. ఇవి పిల్లలకే కాదు, ఆకలేస్తే ఆఫీసులో మీరు తినడానికీ బాగుంటాయి.

మైండ్‌ఫుల్‌గా తినండి...

ఒకప్పుడు భోజనం చేయడమంటే తీరిగ్గా అందరూ కలిసి కూర్చుని తినేవారు. నెమ్మదిగా నమిలి మింగేవారు. తిన్న తరవాత కాసేపు నడిచేవారు. కానీ, ఇప్పుడలా కాదే... పని చేసుకుంటూ నోట్లో కుక్కుకోవడం, ఏ బస్సులోనో స్పూను వేసుకుని తిన్నామని అనుకోవడం చేస్తున్నాం. అదీ లేదంటే ఇంటికొచ్చి ఫోన్ చూస్తూ ఎంత తింటున్నామో, ఏం తింటున్నామో కూడా తెలియకుండా మింగేస్తాం. ఇవన్నీ జీర్ణక్రియమీద ప్రభావం చూపిస్తాయి. ఐదు నిమిషాలు తిన్నా మైండ్‌ఫుల్‌గా తినడానికి ప్రయత్నించండి. అప్పుడే పోషకాలు ఒంటికీ పడతాయి.

బామ్మ చిట్కా



జలుబు చేస్తే త్వరగా తగ్గదు. ఆ సమయంలో నోటికీ ఏదీ రుచిగా అనిపించదు. రెండింటికీ చెక్ చెప్పేలా ఏదైనా కావాలంటే... దీన్ని ప్రయత్నించండి. తాలింపులో కొన్ని పచ్చిమిర్చి ముక్కలు, వెల్లుల్లి రెబ్బలు వేసి వేయించాక చిన్న కప్పు ఉల్లిముక్కల్నీ చేర్చండి. అవి వేగాక దంచిన అల్లం రెండు స్పూన్లు వేసి వేయించాలి. ఆపై స్పూను పసుపు పొడి, అర స్పూను నల్లమిరియాల పొడి, తగినంత ఉప్పు, కొద్దిగా నీళ్లు కలిపి మరిగించండి. కూర చిక్కగా అయ్యాక స్టవ్ మీద నుంచి దించి, కొద్దిగా నిమ్మరసం కలపండి. దీన్ని అన్నంలో కలుపుకొని తినండి. జలుబు, గొంతు నొప్పికి చక్కగా పనిచేస్తుంది.

అమ్మ... ఓ చిక్కీ పాఠం!



ఆ వీధిలో చాలా దుకాణాలున్నాయి. కానీ ఒక స్టాల్ మాత్రం అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. చిన్న పిల్లాడు వ్యాపారంలో అనుభవం ఉన్నవాడిలా రోడ్డుపై చిక్కీలు అమ్ముతున్నాడు. అంతేనా... కొనుగోలుదారులతో ఎప్పటి నుంచో పరిచయం ఉన్నట్లే మాట కలుపుతున్నాడు. వచ్చిన ప్రతి కస్టమర్‌కీ ఓపిగ్గా సమాధానం చెబుతున్నాడు. చిక్కీలు అమ్మిన తరవాత వచ్చిన డబ్బుని జాగ్రత్తగా లెక్కపెట్టి గల్లాపెట్టెలో దాస్తున్నాడు. ఇదంతా బాబు తల్లి పక్కనే ఉండి గమనిస్తున్నారు. పాపం పేద కుటుంబం అనుకోకండి. పుస్తకాల పాఠాలే కాదు... జీవిత పాఠాలూ కావాలని ఓ తల్లి చేస్తున్న ప్రయత్నమిది. ఆమె పేరు చీనీ మెహతా. వీళ్లది రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్. పిల్లల్ని పుస్తకాల మధ్యే బంధించకూడదు. నిజ జీవిత అనుభవాలనూ తెలుసుకునేలా చేయాలన్న ఉద్దేశంతోనే అలా చేశానంటారామె. 'కస్టమర్లని ఎలా పలకరించాలి. వాళ్లతో ఎలా మాట కలపాలి? ఒకవేళ తప్పు జరిగితే ఎలా సరిదిద్దుకోవాలి ఇవన్నీ తనకు పాఠాలే. ఇవి క్లాస్ రూమ్‌లో కూర్చొంటే ఎలా వస్తాయి? వృత్తిరీత్యా ట్రేడ్ మార్కెట్‌లో ఉండటంతో ఆ తరహాలోనే మా బాబుకి జీవిత పాఠాలు చెప్పాలనుకున్నా. ఒక్కోక్కసారి అమ్మకం జరగదు. అలాంటి సమయంలో ఎంతో ఓపిక అవసరం. అలాంటప్పుడే డబ్బు ప్రాధాన్యత అర్థం అవుతుంది. అప్పుడే జీవితంలో ఫలితాలు ఆలస్యమైనా ప్రయత్నాన్ని ఆపకూడదనే నిజాన్ని గ్రహించగలుగుతారు. ఇవన్నీ వాళ్లకి చిన్నవయసు నుంచే అలవాటు చేస్తే, జీవితంలో స్వయంగా నిర్ణయం తీసుకునే ధైర్యం వస్తుంది. ప్రతి చిన్న విషయానికి చెయ్యి పట్టి నడిపించాల్సిన అవసరమూ ఉండదు' అంటారు చీనీ.

ఏకాగ్రతను పెంచే ఆటలివి..!

కిడ్స్ కార్నర్

పిల్లలకు మనం కొనిచ్చే బొమ్మలు, గ్యాడ్జెట్లు... వినోదంతోపాటు విజ్ఞానమూ అందిస్తే బాగుంటుంది కదూ! ఆటకు ఆటా, నైపుణ్యాల సాధన రెండూ సాధ్యం అవుతాయి. ఈ బోర్డులు ఆ కోవకు చెందినవే.



సులువుగా లెక్కపెట్టేయొచ్చు...

'సబ్జెక్టుల్లో కష్టమైనది ఏంట'ని అడగడం ఆలస్యం మ్యాథ్స్ అని టక్కున చెబుతారు చాలామంది చిన్నారులు. వాళ్లకి ఆ భయం పోగొట్టి, లెక్కల మీద ఇష్టం పెంచాలంటే ఈ 'మల్టీ ఫంక్షనల్ వుడెన్ ఎడ్యుకేషనల్ బోర్డు'ను బహుమతిగా ఇవ్వాల్సిందే. దీనిలో అంకెలు, గణితం గుర్తులు(గుణకారం, తీసివేత, కూడిక, భాగాహారం), రంగురంగుల స్టిక్స్ ఉంటాయి. ఇవన్నీ పేర్చేందుకు వీలుగా ఉపరితలం గడులు గడులుగా ఖాళీగా ఉంటుంది. వాటిలో మనకు నచ్చిన అంకెల్నీ గుర్తుల్నీ పెట్టి... అందుకు తగినట్లుగా స్టిక్స్‌ని అమర్చి లెక్కిస్తే సరి. గుర్తును బట్టి కలపడం, తీసివేయడం, గుణించడం సులువుగా చేయొచ్చు. దీనివల్ల ఏకాగ్రతా, అభిజ్ఞ నైపుణ్యాలూ అభివృద్ధి చెందుతాయి.









సమయం చెప్పేలా...

చేతి, గోడ గడియారాలు చూసి సమయం చెప్పడం వల్ల ఎన్ని ప్రయోజనాలో తెలుసా? పరిశీలన, సంఖ్యలపై అవగాహన, కూడికలు, దిశ, కోణం... ఇలా అన్నీ పిల్లలకు అర్థం అవుతాయి. ముఖ్యంగా ఏకాగ్రత, అభిజ్ఞా నైపుణ్యాలు మెరుగుపడతాయి. కానీ ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు వచ్చాక ఈ నైపుణ్యాలకు చిన్నారులు దూరమవుతున్నారు. అలా కాకూడదంటే పిల్లలకు ఈ 'వుడెన్ షేప్ సార్టింగ్ క్లాక్' బోర్డుని ఇచ్చి చూడండి. 1-12 నంబర్లు, చిన్న, పెద్ద ముల్లులు విడి భాగాలుగా వస్తాయి. వాటిని బోర్డు మీద అమర్చి ముల్లులను తిప్పుతూ సమయం చెప్పమంటే సరి. వాళ్లకు ఇది ఆటలానూ ఉంటుంది. దూరమవుతోన్న నైపుణ్యాల్నీ అందిపుచ్చుకుంటారు.

రంగుల్ని నేర్పొచ్చు...

భిన్న రంగుల గురించి తెలుసుకోవడం, వాటిని గుర్తుపట్టడం, అడిగినప్పుడు చూపించడం... అన్నీ పిల్లలకు కలర్స్‌పై అవగాహన కల్పించడంలో భాగమే. అయితే ఈ పాఠాలు వాళ్లకు త్వరగా అర్థం కావాలంటే 'స్మార్ట్‌విటీ కలర్ కోడర్ బోర్డ్' ఇవ్వాల్సిందే. దీనిలో అన్ని రకాల రంగుల బటన్స్ ఉంటాయి. వాటిని చూపిస్తూ నేర్పొచ్చు. బటన్స్ అమర్చుకునేందుకు వీలుగా బోర్డు అమరిక ఉంటుంది. మనం ఒక్కో రంగు చెబుతూ అమర్చమంటే సరి. బోర్డుతో పాటు ప్యాటరన్ కార్డులూ వస్తాయి. వాటిని చూపించి అదే తరహాలో బోర్డు మీద అతికించమంటే... ఆడుతూ రంగులు తెలుసుకుంటారు. దీంతోపాటు చేతికీ కంటికీ మధ్య సమన్వయం, సమస్య పరిష్కార సామర్థ్యాలు, మ్యాచింగ్ నైపుణ్యాలు కూడా అలవడతాయి.





బంగారం - వెండి




17న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,44,220	1,32,200	3,10,000
విజయవాడ	1,43,725	1,31,800	2,89,400
ప్రొద్దుటూరు	1,43,300	1,31,840	2,81,000
రాజమహేంద్రవరం	1,43,780	1,31,800	3,10,000
విశాఖపట్నం	1,43,790	1,31,800	2,89,000
తమిళనాడు	-----	1,32,800	3,10,000

ఛాంపియన్


కోహ్లి, రోహిత్


గిల్

మధ్యాహ్నం 1.30 నుంచి

ఇటూ.. అటూ..!

● న్యూజిలాండ్‌తో భారత్ మూడో వన్డే నేడు

సొంతగడ్డపై టీమ్ఇండియా ఆధిపత్యానికి పరీక్ష ఎదురుకానుంది. 2019 నుంచి స్వదేశంలో వన్డే సిరీస్ కోల్పోని ఆ జట్టు.. న్యూజిలాండ్‌తో నిర్ణయాత్మక పోరుకు సిద్ధమైంది. చివరిదైన మూడో వన్డే నేడే. స్వదేశంలో మరో సిరీస్‌ను చేజిక్కించుకోవాలనే పట్టుదలతో టీమ్ఇండియా ఉండగా.. భారత్‌లో తొలిసారి వన్డే సిరీస్ విజయం కోసం కివీస్ తహతహలాడుతోంది. మరి బ్యాటింగ్‌కు స్వర్గధామమైన ఇందౌర్‌లో ఏ జట్టుది పైచేయి అవుతుందో..!

ఇందౌర్

ఆసక్తికర సమరానికి వేళైంది. భారత్, న్యూజిలాండ్ మధ్య చివరి వన్డే ఆదివారం జరగనుంది. రెండు జట్లూ సిరీస్‌పై కన్నేశాయి. తొలి వన్డేలో టీమ్ఇండియా నెగ్గగా.. రెండో వన్డేలో కివీస్ పైచేయి సాధించింది. భారత్‌లో తొలిసారి టెస్టు సిరీస్ (2024) చేజిక్కించుకున్న కివీస్.. ఈ గడ్డపై మొదటిసారి వన్డే సిరీస్‌నూ సొంతం చేసుకోవాలనే ఆశతో ఉంది. నాలుగు ఐసీసీ టోర్నీలు సహా వన్డే క్రికెట్ ఆడేందుకు 16సార్లు భారత్‌కు వచ్చిన ఆ జట్టు.. ఒక్కసారి కూడా విజేతగా నిలవలేకపోయింది. మూడు సార్లు మాత్రమే సిరీస్‌ను నిర్ణయాత్మక పోరుకు తీసుకెళ్లగలిగింది. ఈసారి ఎలా ఆడుతుందన్నది ఆసక్తికరం. కోచ్‌గా సొంతగడ్డపై అనూహ్యంగా అయిదు టెస్టులు ఓడిపోయిన గంభీర్.. ఇప్పుడు వన్డే సిరీస్‌నూ కోల్పోతే మరింత తీవ్రమైన విమర్శలు ఎదుర్కోక తప్పదు.

స్పిన్నర్లు రాణించాలి: రాజ్‌కోట్‌లో డరిల్ మిచెల్ అసాధారణ ఇన్నింగ్స్ భారత్ పరాజయానికి ప్రధాన కారణమైంది. నియంత్రణతో కూడిన దూకుడుతో అతడు అదిరే శతకం సాధించాడు. ముఖ్యంగా స్పిన్ బౌలింగ్‌లో అతడు ఆధిపత్యాన్ని ప్రదర్శించాడు. నిర్ణయాత్మక పోరులో పైచేయి సాధించాలంటే ఈ విభాగంలో టీమ్ఇండియా మెరుగుపడడం అవసరం. గత రెండు మ్యాచ్‌లో స్పిన్నర్లు జడేజా, కుల్‌దీప్ యాదవ్ తీవ్రంగా నిరాశపరిచారు. జడేజా రెండు మ్యాచ్‌ల్లో ఒక్క వికెట్టూ పడగొట్టలేకపోయాడు. రాజ్‌కోట్‌లో కుల్‌దీప్ ఏకంగా 82 పరుగులిచ్చాడు. రాజ్‌కోట్‌లో మిచెల్‌కు బౌలింగ్ చేయడానికి కుల్‌దీప్ వచ్చేటప్పటికి మ్యాచ్ సమతూకంగానే ఉంది. కానీ కుల్‌దీప్‌పై దాడికి దిగిన మిచెల్.. కివీస్‌ను పైచేయిలో నిలిపాడు. ఇందౌర్‌లో బౌండరీలు చిన్నవిగా ఉండడం, పిచ్ నుంచి సహకారం అందే అవకాశం లేని నేపథ్యంలో బౌలర్లకు మరింత సవాలు ఎదురుకానుంది. ఇక బ్యాటింగ్‌లో రోహిత్ జోరందుకోవాల్సివుంది. మరో సీనియర్ స్టార్ కోహ్లి గత మ్యాచ్‌లో త్వరగానే ఔటైనా మంచి లయలోనే ఉన్నాడు. కేఎల్ రాహుల్ ఫామ్ జట్టుకు సంతోషాన్నిస్తోంది. గత మ్యాచ్‌లో అతడు అజేయ శతకం బాదిన సంగతి తెలిసిందే. సిరీస్‌లో ఇంకా అతడు ఔట్ కాలేదు. శ్రేయస్ అయ్యర్ మాత్రం పెద్ద ఇన్నింగ్స్ బాకీ ఉన్నాడు. మధ్య ఓవర్లలో స్పిన్నర్లను ఎదుర్కోవడంలో భారత బ్యాటర్లు మెరుగుపడాల్సివుంది. ఈ మ్యాచ్‌కు భారత తుది జట్టులో కొన్ని మార్పులు జరగొచ్చు. నితీశ్ కుమార్ రెడ్డి స్థానంలో స్పిన్ బౌలింగ్ ఆల్‌రౌండర్ ఆయుష్ బదోని జట్టులోకి రావొచ్చు. ఈ సిరీస్‌లో ఇప్పటివరకు ఆడని అర్ష్‌దీప్ సింగ్‌కు అవకాశం దక్కవచ్చు. ప్రసిద్ధ్‌కృష్ణ స్థానంలో అతణ్ని ఆడించే అవకాశముంది.

ఆత్మవిశ్వాసంతో కివీస్: న్యూజిలాండ్ జట్టులో ఎనిమిది మంది ఆటగాళ్లు తొలిసారి భారత పర్యటనకు వచ్చారు. అయినా సిరీస్‌లో ఆ జట్టు గట్టి పోటీతో ఆకట్టుకుంది. రెండో వన్డేలో విజయంతో కివీస్ రెట్టించిన ఉత్సాహంతో బరిలోకి దిగుతోంది. గత మ్యాచ్ సెంచరీ హీరో మిచెల్ ఫామ్ ఆ జట్టుకు గొప్ప సానుకూలాంశమే. 215 పరుగులతో అతడు సిరీస్ టాప్ స్కోరర్‌గా ఉన్నాడు .రాజ్‌కోట్‌లో కాన్వే కూడా మంచి ఇన్నింగ్స్ ఆడాడు. ఈ ఇద్దరు మరోసారి సత్తా చాటాలని ఆ జట్టు కోరుకుంటోంది. పూర్తిగా బ్యాటింగ్‌కు సహకరించే పిచ్‌పై ఆ జట్టు బౌలర్లు ఎలా బౌలింగ్ చేస్తారో చూడాలి.

పిచ్ ఎలా ఉందంటే..

మూడో వన్డే వేదిక హోల్కర్ స్టేడియం పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలం. 2011లో సెహ్వాగ్ ఇదే మైదానంలో డబుల్ సెంచరీ (219) చేశాడు. ఆ మ్యాచ్‌లో భారత్ 418 పరుగులు సాధించింది. ఇక్కడ గత రెండు మ్యాచ్‌ల్లో టీమ్ఇండియా 399, 385 పరుగులు చేసింది. ఈ నేపథ్యంలో ఈసారి కూడా ఇక్కడ పరుగుల వరద ఖాయమని భావిస్తున్నారు. 350పై స్కోరు నమోదు కావొచ్చు.


మిచెల్

తుది జట్లు (అంచనా)... భారత్: శుభ్‌మన్ గిల్, రోహిత్, కోహ్లి, శ్రేయస్ అయ్యర్, రాహుల్, నితీశ్/ఆయుష్ బదోని, జడేజా, హర్షిత్ రాణా, కుల్‌దీప్ యాదవ్, అర్ష్‌దీప్ సింగ్, సిరాజ్; **న్యూజిలాండ్:** కాన్వే, నికోల్స్, యంగ్, మిచెల్, మైకెల్ హే, ఫిలిప్స్, బ్రాస్‌వెల్, క్రిస్టియన్ క్లార్క్, జేమీసన్, ఫౌక్స్, లెనాక్స్

అండర్-19 ప్రపంచకప్

విజృంభించిన విహాన్

మెరిసిన వైభవ్, కుండు ● బంగ్లాదేశ్‌పై భారత్ విజయం


విహాన్ 4/14


వైభవ్

బులవాయో: అండర్-19 ప్రపంచకప్‌లో భారత యువ జట్టు సత్తా చాటింది. వరుసగా రెండో విజయాన్ని ఖాతాలో వేసుకుంది. ఆఫ్‌స్పిన్నర్ విహాన్ మల్హోత్రా (4/14) మాయ చేసిన వేళ.. శనివారం వర్ష ప్రభావిత మ్యాచ్‌లో డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో 18 పరుగుల తేడాతో బంగ్లాదేశ్‌ను ఓడించింది. వర్షం కారణంగా మ్యాచ్‌ను తొలుత 49 ఓవర్లకు కుదించారు. భారత్ 48.4 ఓవర్లలో 238 పరుగులకు ఆలౌటైంది. అభిజ్ఞాన్ కుండు (80; 112 బంతుల్లో 4×4, 3×6), వైభవ్ సూర్యవంశీ (72; 67 బంతుల్లో 6×4, 3×6) కీలక ఇన్నింగ్స్ ఆడారు. వర్షం వల్ల లక్ష్యాన్ని 29 ఓవర్లలో 165 పరుగులకు సవరించగా.. బంగ్లాదేశ్ 28.3 ఓవర్లలో 146 పరుగులకే ఆలౌటైంది. అజిజుల్ హకీమ్ (51) టాప్ స్కోరర్. బంగ్లా ఓ దశలో విజయంవైపు సాగినా.. 22 పరుగుల వ్యవధిలో ఏడు వికెట్లు పడగొట్టి భారత్ విజయాన్ని లాగేసుకుంది. టాస్ సమయంలో రెండు జట్ల కెప్టెన్లు కరచాలనం చేసుకోలేదు. కానీ మ్యాచ్ అనంతరం ఆటగాళ్లు స్నేహపూర్వకంగా వ్యవహరించారు. కరచాలనాలు చేసుకున్నారు.

అతడు తిప్పేశాడు..: బంగ్లా ఛేదనలో తొలి ఓవర్లోనే ఓపెనర్ అబ్రార్ (5)ను దీపేశ్ ఔట్ చేశాడు. కానీ చక్కగా బ్యాటింగ్ చేసిన అజిజుల్ హకీమ్, రిఫాత్ బేగ్ రెండో వికెట్‌కు 56 పరుగులు జోడించారు. జట్టు స్కోరు 62 వద్ద రిఫాత్ (37) ఔటయ్యాడు. వర్షం అంతరాయం కలిగించే సమయానికి బంగ్లా 17.2 ఓవర్లలో 90/2తో నిలిచింది. ఆ తర్వాత బంగ్లా 20 ఓవర్లలో 102/2తో బలమైన స్థితిలో నిలిచింది. లక్ష్యాన్ని ఛేదించేలా కనిపించింది. కానీ అద్భుతమైన బౌలింగ్‌తో విహాన్ మల్హోత్రా మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. తన ఆఫ్‌స్పిన్‌తో బంగ్లా వెన్నువిరిచాడు. మంచి టర్న్, బౌన్స్‌తో అతడు మిడిల్ ఆర్డర్ పని పట్టాడు. వరుసగా తన మూడు ఓవర్లలో సిద్దికి (15), జిబాన్ (7), బాసిర్ (2)ను ఔట్ చేసిన విహాన్.. 11 పరుగులే ఇచ్చాడు. ఈ మధ్యలో హకీమ్‌ను ఖిలాన్ పెవిలియన్ చేర్చాడు. 26 ఓవర్లలో 131/6తో నిలిచింది బంగ్లాదేశ్.. తర్వాతి ఓవర్లో ఖిలాన్ ఓ వికెట్ పడగొట్టినప్పటికీ 12 పరుగులిచ్చాడు. అయితే విహాన్ వేసిన 28వ ఓవర్లో బంగ్లా 3 పరుగులే చేసి 2 వికెట్లు కోల్పోయింది. దీంతో భారత్ విజయం ఖాయమైపోయింది.

రాణించిన ఆ ఇద్దరు: అల్ ఫహాద్ (5/38) విజృంభించడంతో అంతకుముందు భారత్‌ను బంగ్లా కట్టడి చేసింది. ఓ దశలో భారత్ 53కే మూడు వికెట్లు కోల్పోగా.. వైభవ్, అభిజ్ఞాన్ కుండు పోరాడారు. వైభవ్ ఎప్పటిలా కాకుండా కాస్త నియంత్రణ పాటించాడు. నాలుగో వికెట్‌కు 62 పరుగులు జోడించి ఔటయ్యాడు. వెంటనే హర్వంశ్ (2) కూడా వెనుదిరిగినప్పటికీ కనిష్క్ (28)తో కలిసి కుండు ఆరో వికెట్‌కు 54 పరుగులు జోడించాడు. కనిష్క్ తర్వాత అంబ్రిశ్ (5), ఖిలాన్ (8) కూడా ఔటైనప్పటికీ చక్కని బ్యాటింగ్‌ను కొనసాగించిన కుండు.. జట్టు గౌరవప్రద స్కోరు సాధించడంలో కీలక పాత్ర పోషించాడు. చివరికి 47వ ఓవర్లో జట్టు స్కోరు 224 వద్ద 9వ వికెట్‌గా అతడు వెనుదిరిగాడు.

సంక్షిప్త స్కోర్లు... భారత్ అండర్-19: 48.4 ఓవర్లలో 238 (అభిజ్ఞాన్ కుండు 80, వైభవ్ సూర్యవంశీ 72, కనిష్క్ 28; అల్ ఫహాద్ 5/38); **బంగ్లాదేశ్ అండర్-19:** 28.3 ఓవర్లలో 146 (హకీమ్ 51, రిఫాత్ 37; విహాన్ మల్హోత్రా 4/14, ఖిలాన్ పటేల్ 2/35)

తిరుగులేని ఆర్సీబీ

● దిల్లీ ఓటమి

● మెరిసిన స్మృతి, లారెన్, సయాలి


స్మృతి 96

నవీ ముంబయి: రోజు మాత్రమే మారింది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు దూకుడు మారలేదు. 24 గంటల్లోనే ఆ జట్టు డబ్ల్యూపీఎల్-4లో మరో విజయాన్ని నమోదు చేసింది. శనివారం ఆర్సీబీ 8 వికెట్ల తేడాతో దిల్లీ క్యాపిటల్స్‌ను ఓడించింది. మొదట లారెన్ బెల్ (3/26), సయాలి సత్గారే (3/27), ప్రేమ రావత్ (2/16) ధాటికి దిల్లీ 20 ఓవర్లలో 166 పరుగులకు ఆలౌటైంది. షెఫాలి వర్మ (62; 41 బంతుల్లో 5×4, 4×6) టాప్ స్కోరర్. లూసీ హామిల్టన్ (36), స్నేహ్ రాణా (22) రాణించారు. స్మృతి మంధాన (96; 61 బంతుల్లో 13×4, 3×6) మెరుపులతో బెంగళూరు 18.2 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. జార్జియా వోల్ (54 నాటౌట్; 42 బంతుల్లో 5×4, 2×6) కీలక ఇన్నింగ్స్ ఆడింది. శుక్రవారం ఆర్సీబీ గుజరాత్‌ను ఓడించిన సంగతి తెలిసిందే. ఈ సీజన్లో వరుసగా నాలుగో విజయంతో ఆ జట్టు ప్లేఆఫ్స్ దిశగా మరో అడుగు వేసింది.

సత్తా చాటిన స్మృతి: 167 పరుగుల ఛేదనలో బెంగళూరు ఇన్నింగ్స్ నెమ్మదిగా సాగింది. 5 ఓవర్లకు ఆ జట్టు స్కోరు 27 పరుగులే.. పైగా ఒక వికెట్ పడింది. ఈ స్థితిలో స్మృతి బ్యాట్ ఝుళిపించింది. నందని బౌలింగ్‌లో సిక్స్‌తో మొదలైన ఆమె జోరు.. ఆ తర్వాత మరింత పెరిగింది. జార్జియా వోల్ నుంచి ఆమెకు చక్కటి సహకారం అందింది. దీంతో 10 ఓవర్లకు 83/1తో ఆర్సీబీ లక్ష్యం దిశగా సాగింది. ముఖ్యంగా చక్కని బ్యాటింగ్ కొనసాగించిన స్మృతి ప్రత్యర్థి బౌలర్లకు ఏమాత్రం అవకాశం ఇవ్వలేదు. ఈ క్రమంలోనే ఈ స్టార్ బ్యాటర్ 31 బంతుల్లోనే అర్ధసెంచరీ అందుకుంది. మరోవైపు జార్జియా కూడా దూకుడుగా ఆడడంతో లక్ష్యం వేగంగా కరిగిపోయింది. సెంచరీ చేసేలా కనిపించిన స్మృతి.. ఈ మైలురాయికి నాలుగు పరుగుల దూరంలో ఔటైంది. నందని బౌలింగ్‌లో లూసీ పట్టిన ఓ మెరుపు క్యాచ్‌కు స్మృతి వెనుదిరిగింది. రిచా (7 నాటౌట్)తో కలిసి జార్జియా పని పూర్తి చేసింది. అంతకుముందు దిల్లీ తడబడినా.. మెరుగైన స్కోరుతో ఇన్నింగ్స్‌ను ముగించింది. ఆ జట్టు 10 పరుగులకే 4 వికెట్లు కోల్పోయింది. లిజెలీ (4), లారా వోల్వార్ట్ (0), జెమీమా (4), మారిజేన్ కాప్ (0) పెవిలియన్ చేరిపోయారు. ఈ స్థితిలో షెఫాలి వర్మ మెరుపు అర్ధసెంచరీతో ఆ జట్టును ఆదుకుంది. లూసీ హామిల్టన్, స్నేహ్‌రాణా రాణించడంతో దిల్లీ పోరాడే స్కోరు చేయగలిగింది.

సంక్షిప్త స్కోర్లు... దిల్లీ: 166 ఆలౌట్ (షెఫాలి వర్మ 62, లూసీ హామిల్టన్ 36, స్నేహ్ రాణా 22; లారెన్ బెల్ 3/26, సయాలి 3/27, ప్రేమ 2/16) **బెంగళూరు:** 18.2 ఓవర్లలో 169/2 (స్మృతి మంధాన 96, జార్జియా వోల్ 54 నాటౌట్, మరిజేన్ కాప్ 1/21, నందని 1/34)

మళ్లీ యూపీనే..

● ముంబయిపై గెలుపు

● రాణించిన లానింగ్, లిచ్‌ఫీల్డ్


మెగ్ లానింగ్

నవీ ముంబయి: డబ్ల్యూపీఎల్-4లో వరుసగా మూడు ఓటముల తర్వాత.. గత మ్యాచ్‌లో ముంబయి ఇండియన్స్‌పై నెగ్గి గాడిలో పడిన యూపీ వారియర్స్.. జోరు కొనసాగిస్తోంది. స్ఫూర్తిదాయక ప్రదర్శన చేసిన ఆ జట్టు మళ్లీ ముంబయిని కంగుతినిపించి వరుసగా రెండో విజయాన్ని అందుకుంది. శనివారం యూపీ 22 పరుగుల తేడాతో విజయాన్ని అందుకుంది. మొదట ఆ జట్టు 8 వికెట్లకు 187 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్', కెప్టెన్ మెగ్ లానింగ్ (70; 45 బంతుల్లో 11×4, 2×6), ఫోబి లిచ్‌ఫీల్డ్ (61; 37 బంతుల్లో 7×4, 3×6) మెరుపు ఇన్నింగ్స్ ఆడారు. అమేలియా కెర్ (3/28), నాట్ సీవర్ (2/22) రాణించారు. ఛేదనలో ముంబయి 6 వికెట్లకు 165 పరుగులకే పరిమితమైంది. అమేలియా కెర్ (49 నాటౌట్; 28 బంతుల్లో 6×4, 1×6), అమన్‌జ్యోత్ కౌర్ (41; 24 బంతుల్లో 4×4, 3×6) పోరాడినా జట్టుకు విజయాన్ని అందించలేకపోయారు. యూపీ బౌలర్లలో శిఖ పాండే రెండు వికెట్లు తీయగా.. క్రాంతి గౌడ్, ఎకిల్‌స్టోన్, దీప్తి, ట్రయాన్ తలా వికెట్ పడగొట్టారు. ముంబయికి వరుసగా ఇది రెండో ఓటమి.

ముంబయి తడబాటు: 69/5.. భారీ ఛేదనలో ముంబయి ఇన్నింగ్స్ సాగిన తీరిది. యూపీ బౌలర్ల ధాటికి ఆరంభం నుంచే ఇబ్బంది పడిన ఆ జట్టు.. క్రమం తప్పకుండా వికెట్లు చేజార్చుకుంది. 23/0తో కాస్త మెరుగ్గానే మొదలుపెట్టిన ముంబయి.. తర్వాత తడబడింది. ఓపెనర్లు సజన (10), హేలీ మాథ్యూస్ (13) వికెట్లు కోల్పోయింది. నాట్ సీవర్ (15), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ (18), నికోలా కేరీ (6) సైతం పెవిలియన్ చేరిపోవడంతో ఓటమి దిశగా సాగింది. ఈ స్థితిలో అమేలియా కెర్, అమన్‌జ్యోత్ నిలిచారు. ఎదురుదాడికి దిగిన ఈ జంట.. ముంబయి శిబిరంలో ఆశలు రేపింది. కానీ మిడిల్ ఓవర్లలో యూపీ బౌలర్లు శిఖ, ఎకిల్‌స్టోన్, దీప్తి కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడం.. సమీకరణం (24 బంతుల్లో 63) క్లిష్టంగా మారడంతో ముంబయిపై ఒత్తిడి పెరిగిపోయింది. దీనికి తోడు అమన్‌జ్యోత్ ఔట్ కావడంతో ఆ జట్టుకు అవకాశాలు లేకుండాపోయాయి. అంతకుముందు యూపీ ఇన్నింగ్స్‌లో మెగ్ లానింగ్, లిచ్‌ఫీల్డ్ ఆటే హైలైట్. తొలి ఓవర్లోనే కిరణ్ నవ్‌గిరె (0) వికెట్ పడినా.. దూకుడుగా ఆడిన లానింగ్, లిచ్‌ఫీల్డ్ యూపీ స్కోరుబోర్డు పరుగులెత్తించారు. చక్కని షాట్లతో స్కోరు పెంచారు. లానింగ్ 35 బంతుల్లో.. లిచ్‌ఫీల్డ్ 33 బంతుల్లో అర్ధసెంచరీలు అందుకున్నారు. 12.6 ఓవర్లకు 124/1తో యూపీ.. 200పైన స్కోరు చేసేలా కనిపించింది. కానీ లిచ్‌ఫీల్డ్, లానింగ్ స్వల్ప వ్యవధిలో ఔట్ కావడంతో ఆ జట్టు దూకుడుకు బ్రేక్ పడింది. హర్లీన్ డియోల్ (25), ట్రయాన్ (21) రాణించడంతో యూపీ 180పైన స్కోరు సాధించగలిగింది.

సంక్షిప్త స్కోర్లు... యూపీ వారియర్స్: 187/8 (మెగ్ లానింగ్ 70, ఫోబి లిచ్‌ఫీల్డ్ 61, హర్లీన్ 25, ట్రయాన్ 21; అమేలియా కెర్ 3/28, నాట్ సీవర్ 2/22); **ముంబయి ఇండియన్స్:** 165/6 (అమేలియా కెర్ 49 నాటౌట్, అమన్‌జ్యోత్ కౌర్ 41; శిఖ పాండే 2/30, క్రాంతి గౌడ్ 1/32, ఎకిల్‌స్టోన్ 1/33, దీప్తి 1/35, ట్రయాన్ 1/18)

గిల్ నీటి శుద్ధి యంత్రంతో..

భారత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి ఫ్రాన్స్ నుంచి దిగుమతి చేసుకున్న నీటిని తాగుతాడన్న సంగతి తెలిసిందే. టీమ్ఇండియా టెస్టు, వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్ కూడా తాగునీటి విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నాడు. తన వెంట నీటి శుద్ధి యంత్రాన్ని తీసుకెళ్తున్నాడని, రూ. 3 లక్షల విలువైన ఆ యంత్రంతో శుద్ధి చేసిన నీటిని మాత్రమే అతడు తాగుతున్నాడని సమాచారం. ఆరోగ్యం పట్ల భారత క్రికెటర్లు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటుండటంతో వారి అభిరుచికి తగ్గట్టుగా ఆహారాన్ని అందించేలా.. బీసీసీఐ ఓ చెఫ్‌ను టీమ్ఇండియాతో పంపుతోంది.

232 ఏళ్ల రికార్డు బద్దలు..

కరాచి: ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో 232 ఏళ్ల రికార్డు బద్దలైంది. పాకిస్థాన్‌లో జరుగుతున్న ప్రెసిడెంట్స్ ట్రోఫీలో పాకిస్థాన్ టీవీ (పీటీవీ) జట్టు అతి తక్కువ స్కోరును కాపాడుకుని చరిత్ర సృష్టించింది. నాలుగు రోజుల మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన పీటీవీ తొలి ఇన్నింగ్స్‌లో 166 పరుగులు.. సుయ్ నార్తన్ జట్టు 238 చేశాయి. సుయ్ 72 పరుగుల ఆధిక్యం దక్కించుకుంది. రెండో ఇన్నింగ్స్‌లో పీటీవీ 111కు ఆలౌటై.. ప్రత్యర్థికి 40 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. ఛేదనలో సుయ్ 37కే పరిమితం కావడంతో పీటీవీ రెండు పరుగుల స్వల్ప తేడాతో నెగ్గి సంచలన విజయాన్ని అందుకుంది. స్పిన్నర్ అలీ ఉస్మాన్ (6/9) విజృంభించాడు. 1794లో ఓల్డ్‌ఫీల్డ్ జట్టు.. ఎంసీసీపై 41 పరుగుల లక్ష్యాన్ని కాచుకుంది.

చిన్నస్వామికి పచ్చజెండా

బెంగళూరు: అనిశ్చితి తొలగిపోయింది. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో ఐపీఎల్, అంతర్జాతీయ మ్యాచ్‌లు నిర్వహించేందుకు కర్ణాటక క్రికెట్ సంఘానికి శనివారం అనుమతి లభించింది. ప్రభుత్వం నియమించిన టాస్క్‌ఫోర్స్ అందించిన నివేదికను పరిశీలించిన అనంతరం.. కర్ణాటక హోం మంత్రిత్వ శాఖ అనుమతి జారీ చేసింది. చిన్నస్వామిలో భద్రత ఏర్పాట్ల మెరుగుదలపై టాస్క్‌ఫోర్స్ సంతృప్తి వ్యక్తం చేసింది. నిరుడు ఆర్సీబీ ఐపీఎల్ ట్రోఫీ సంబరాల సందర్భంగా వేదిక బయట జరిగిన తొక్కిసలాటలో 11 మంది అభిమానులు మరణించడంతో చిన్నస్వామి స్టేడియంలో క్రికెట్ కార్యకలాపాలు పూర్తిగా నిలిచిపోయిన సంగతి తెలిసిందే. స్టేడియంలో తిరిగి మ్యాచ్‌లు నిర్వహించడంపై మాజీ పేసర్ వెంకటేశ్ ప్రసాద్ నేతృత్వంలోని కర్ణాటక క్రికెట్ సంఘం (కేఎస్‌సీఏ) కొత్త పాలకవర్గం నెల రోజుల నుంచి వివిధ ప్రభుత్వ సంస్థలతో చర్చలు జరుపుతోంది.

గ్రూప్-బికి పంపండి

ఐసీసీకి బంగ్లా విజ్ఞప్తి

ఢాకా: టీ20 ప్రపంచకప్ మ్యాచ్‌లను భారత్‌లో ఆడకూడదని పట్టుదలగా ఉన్న బంగ్లాదేశ్ తమ జట్టును గ్రూప్-బికి మార్చాలని, అక్కడ ఐర్లాండ్ స్థానంలో తమను ఆడించాలని ఐసీసీని కోరింది. భద్రత కారణాలతో తమ మ్యాచ్‌ల వేదికలను మార్చాలన్న డిమాండ్ నేపథ్యంలో బంగ్లా క్రికెట్ బోర్డు (బీసీబీ)తో శనివారం ఐసీసీ బృందం చర్చలు జరిపింది. ఈ మెగా టోర్నీకి భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యం ఇస్తున్నాయి. ఆతిథ్య శ్రీలంక ఉన్న గ్రూప్-బి మ్యాచ్‌లన్నీ ఆ దేశంలోనే జరగనున్నాయి. దీంతో ఐర్లాండ్‌ను గ్రూప్-సికి మార్చి.. తమను గ్రూప్-బికి పంపాలని ఐసీసీకి విజ్ఞప్తి చేసింది. కానీ అందుకు ఐసీసీ ఒప్పుకోలేదు. అయితే ఎలాగైనా తమ మ్యాచ్‌లను ముంబయి, కోల్‌కతా నుంచి తరలించాలని బీసీబీ పట్టుబడుతోంది. ఈ విషయంపై ఐసీసీ ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఐపీఎల్ నుంచి పేసర్ ముస్తాఫిజుర్ రెహ్మాన్‌ను తప్పించడం వంటి అంశాలను తమ ఆటగాళ్ల భద్రతకు ముప్పుగా బీసీబీ ప్రస్తావిస్తోంది.

సౌరాష్ట్ర × విదర్భ

మ॥ 1:30 నుంచి

● విజయ్ హజారే ట్రోఫీ ఫైనల్ నేడే

బెంగళూరు: దేశవాళీ వన్డే టోర్నీ విజయ్ హజారే ట్రోఫీ తుది పోరుకు రంగం సిద్ధమైంది. నిరుడు ఫైనల్లో పరాజయం పాలైన విదర్భ ఈసారి ఎలాగైనా గెలిచి.. తొలి వన్డే టైటిల్‌ను సాధించాలనే పట్టుదలతో ఉంది. మరోవైపు రెండుసార్లు విజేత సౌరాష్ట్ర మూడో ట్రోఫీ కోసం బరిలో దిగనుంది. ఈ సీజన్లో అదిరే ఫామ్‌లో ఉన్న హార్విక్ దేశాయ్ (561), సెమీఫైనల్లో అజేయ శతకంతో మెరిసిన విశ్వరాజ్ జడేజాలపై సౌరాష్ట్ర ఎక్కువగా ఆధారపడనుంది. బౌలింగ్‌లో అంకుర్ పన్వర్ (21 వికెట్లు), చేతన్ సకారియా (15) జోరు కొనసాగించాలని ఆ జట్టు కోరుకుంటోంది. మరోవైపు టోర్నీలో అత్యధిక పరుగుల వీరుడు అమన్ మోఖడే (781), ధ్రువ్ షోరే (515), రవికుమార్ సమర్థ్ (427)లతో విదర్భ బ్యాటింగ్ బలంగా కనిపిస్తోంది.


ఫైనల్లో సియంగ్, క్రిస్టీ

దిల్లీ: ప్రపంచ నంబర్ వన్ షట్లర్ ఆన్ సియంగ్ తన ఆధిపత్యం కొనసాగిస్తోంది. ఈ కొరియా స్టార్.. ఇండియా ఓపెన్‌లో ఫైనల్లోకి దూసుకెళ్లింది. శనివారం మహిళల సింగిల్స్ సెమీస్‌లో సియంగ్ 21-11, 21-7తో రచనోక్ ఇంతనాన్ (థాయ్‌లాండ్)పై అలవోకగా విజయం సాధించింది. ఫైనల్లో వాంగ్ జియి (చైనా)తో తలపడనుంది. పురుషుల సింగిల్స్‌లో జొనాథన్ క్రిస్టీ (ఇండోనేషియా), లిన్ చున్ యి (చైనీస్ తైపీ) ఫైనల్ చేరారు.

తొలి పంచ్ ఎవరిదో!

బరిలో అల్కరాస్, సినర్ ● ఆస్ట్రేలియన్ ఓపెన్

ఉదయం 5.30 నుంచి


సినర్, అల్కరాస్

మెల్‌బోర్న్: కొత్త సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్ ఆస్ట్రేలియన్ ఓపెన్‌కు వేళైంది. ఆదివారం ఈ టోర్నీ ఆరంభం కానుంది. గతేడాది నాలుగు గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో చెరో రెండు పంచుకున్న కార్లోస్ అల్కరాస్ (స్పెయిన్), యానిక్ సినర్ (ఇటలీ) మధ్య మరోసారి ఆధిపత్య పోరుకు రంగం సిద్ధమైంది. మరి తొలి పంచ్ ఎవరిదో? వీరిద్దరిలో సీజన్ మొదటి టైటిల్ దక్కించుకునేది ఎవరో? వీరిని కాదని మరొకరు ఛాంపియన్ అవుతారా..?

కెరీర్ గ్రాండ్‌స్లామ్‌పై కన్నేసిన టాప్‌సీడ్ అల్కరాస్ తొలిసారి ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో గెలవాలనే పట్టుదలతో ఉన్నాడు. 2024, 2025లో క్వార్టర్స్ చేరడమే ఈ స్పెయిన్ స్టార్‌కు ఇక్కడ ఉత్తమ ప్రదర్శన. ఈసారి ఎలాంటి ప్రదర్శన చేస్తాడనేది ఆసక్తికరం. గత రెండేళ్లుగా మెల్‌బోర్న్ పార్క్‌లో విజేతగా ఉన్న యానిక్ సినర్ నుంచే అల్కరాస్‌కు గట్టి సవాల్ ఎదురు కాబోతోంది. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్లో వాల్టన్ (ఆస్ట్రేలియా)తో అల్కరాస్ తలపడనున్నాడు. మరోవైపు రెండో సీడ్ సినర్.. గాస్టన్ (ఫ్రాన్స్)తో పోటీపడనున్నాడు. సినర్ ఉన్న పార్శ్వంలోనే మాజీ ఛాంపియన్ నొవాక్ జకోవిచ్ (సెర్బియా) ఆడుతున్నాడు. కెరీర్ చరమాంకంలో ఉన్న 38 ఏళ్ల జకోవిచ్‌కు ఈ సీజన్ పెద్ద సవాల్. సినర్, అల్కరాస్ జోరు ముందు నిలవలేకపోతున్న అతడు.. ఈ టోర్నీలో ఎలా ఆడతాడో చూడాలి. చివరగా 2023 యుఎస్ ఓపెన్లో నొవాక్ విజేతగా నిలిచాడు. అతడు మరో టైటిల్‌ను దక్కించుకుంటే మార్గరెట్ కోర్ట్ (25) అత్యధిక టైటిళ్ల రికార్డును అధిగమిస్తాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్ తొలి రౌండ్లో మార్టినెజ్ (స్పెయిన్)తో నొవాక్ తలపడనున్నాడు. మహిళల సింగిల్స్‌లో ఇగా స్వైటెక్ (పోలెండ్) టైటిల్ ఫేవరెట్‌గా బరిలో దిగుతోంది. రెండో సీడ్‌గా పోటీలో ఉన్న స్వైటెక్.. ఇప్పటిదాకా ఆస్ట్రేలియన్ ఓపెన్ నెగ్గలేదు. ఈసారి విజేతగా నిలిచి కెరీర్ గ్రాండ్‌స్లామ్ పూర్తి చేయాలనే పట్టుదలతో ఉంది. మహిళల సింగిల్స్ తొలి రౌండ్లో స్వైటెక్.. యువాన్ (చైనా)తో తలపడనుంది. టైటిల్‌కు ఆమెకు మధ్య అర్యానా సబలెంకా (బెలారస్) రూపంలో పెద్ద అడ్డంకి ఉంది. టాప్‌సీడ్ సబలెంకా తొలి రౌండ్లో టియాట్‌సోవా (ఫ్రాన్స్)తో తలపడనుంది. డిఫెండింగ్ ఛాంపియన్ మాడిసన్ కీస్ (అమెరికా) తొమ్మిదో సీడ్‌గా పోటీలో ఉంది. అమెరికా వెటరన్ స్టార్ వీనస్ విలియమ్స్ 45 ఏళ్ల వయసులో బరిలో నిలిచింది. ఈ టోర్నీలో మహిళల సింగిల్స్ డ్రాలో ఆడుతున్న పెద్ద వయస్కురాలు ఆమే.

అరకులోయలో 3.9 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత



లంబసింగిలో దట్టంగా అలుముకున్న పొగమంచు

చింతపల్లి, న్యూస్‌టుడే: అల్లూరి సీతారామ రాజు జిల్లాలో అతి తక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. శనివారం అరకులోయలో అత్యల్పంగా 3.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్లు చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం తెలిపింది. పెదబయలులో 4.7, చింతపల్లి, ముంచంగిపుట్టులలో 4.8, జి.మాడుగులలో 4.9, హుకుంపేటలో 7.6 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని పేర్కొంది.

తమిళనాట నగర బస్సుల్లో పురుషులకు ఉచిత ప్రయాణం

అన్నాడీఎంకే తొలి విడత మేనిఫెస్టో విడుదల

చెన్నై(సైదాపేట), న్యూస్‌టుడే: తమిళనాడులో శాసనసభ ఎన్నికల వేడి మొదలైంది. ఇప్పటికే పలు పార్టీల నేతలు పాదయాత్రలు, ప్రచారాలు మొదలుపెట్టారు. ప్రధాన ప్రతిపక్షమైన అన్నాడీఎంకే తొలి విడత మేనిఫెస్టోను శనివారం విడుదల చేసింది. నగర బస్సుల్లో పురుషులకు ఉచిత ప్రయాణం, మహిళా కుటుంబ పెద్దకు నెలకు రూ.2000, అందరికీ ఇళ్లు, ఉపాధి హామీ పథకాన్ని 150 రోజులకు పొడిగింపు, 5 లక్షల మంది మహిళలకు రూ.25 వేల రాయితీతో అమ్మా (జయలలిత) ద్విచక్ర వాహన పంపిణీ పథకం తదితర అంశాలు అందులో ఉన్నాయి. ప్రస్తుతం మహిళా కుటుంబ పెద్దకు నెలకు రూ.1000, మహిళలకు నగర బస్సుల్లో ఉచిత ప్రయాణం పథకాలు అమలులో ఉన్నాయి.




నాయకుడికి వ్యూహం ఉంటే సరిపోదు..

మీరు నాయకుడిగా ఎదగాలనుకొంటే గొప్ప లక్ష్యం, అద్భుతమైన వ్యూహంతో పాటు మీ బృందంలో ఎలాంటివారున్నారన్నదీ ముఖ్యమే. మీ కలను తమ ఆశయంగా మార్చుకొనేవారు, మీ విలువలకు అనుగుణంగా నడుచుకొనేవారు, మీతో పాటు తామూ ఎదగాలనే దృక్పథంతో ఉన్నవారిని మీ బృందంలో చేర్చుకోండి. అప్పుడే ఎంత పెద్ద లక్ష్యాన్నైనా సాధించగలమన్న విశ్వాసం మీకు కలుగుతుంది.

– జిమ్ కొలిన్స్, మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్

పెట్టుబడుల కోసం దావోస్‌కు చంద్రబాబు

- నేటి నుంచి 4 రోజుల పర్యటన



ఈనాడు, అమరావతి: రాష్ట్రానికి పెట్టుబడుల సాధనే లక్ష్యంగా ఆదివారం నుంచి నాలుగు రోజుల పాటు సీఎం చంద్రబాబు, విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్‌ల బృందం దావోస్‌లో పర్యటించనుంది. వివిధ శాఖల మంత్రులు, అధికారులతో కలిసి ఆదివారం రాత్రి 8.35 గంటలకు విజయవాడ విమానాశ్రయం నుంచి దిల్లీ వెళ్లనున్నారు. అక్కడి నుంచి జ్యూరిచ్ చేరుకుంటారు. ఈ నెల 19 నుంచి 22 వరకు అక్కడ జరిగే ప్రపంచ ఆర్థిక సదస్సులో పాల్గొంటారు. దిగ్గజ పారిశ్రామికవేత్తలు, ప్రముఖ సంస్థల సీఈవోలు, వివిధ దేశాల ప్రతినిధులతో చంద్రబాబు సమావేశమవుతారు. మొత్తంగా దావోస్‌లో 36 కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటారు. ప్రభుత్వాల మధ్య జరిగే 3 సమావేశాలు, పారిశ్రామికవేత్తలతో జరిగే 16 ముఖాముఖి సమావేశాలకు హాజరుకానున్నారు. 9 రౌండ్ టేబుల్ సమావేశాలు, ప్లీనరీ సెషన్స్‌లోనూ పాల్గొంటారు. సీఎన్‌బీసీ ఇంటర్నేషనల్ సహా వివిధ అంతర్జాతీయ మీడియా సంస్థలకు ఇంటర్వ్యూలు ఇస్తారు.

◆ తొలిరోజు జ్యూరిచ్‌లోని హిల్టన్ హోటల్‌లో స్విట్జర్లాండ్‌లోని భారత రాయబారి మృదుల్‌కుమార్‌తో మర్యాదపూర్వకంగా భేటీ అవుతారు. అనంతరం భారత రాయబార కార్యాలయంలో ఆధ్వర్యంలో నిర్వహించే తెలుగు డయాస్పోరాకు హాజరవుతారు. సుమారు 20 దేశాల ప్రవాసాంధ్రులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. అనంతరం చంద్రబాబు జ్యూరిచ్ నుంచి దావోస్ వెళ్తారు.

◆ దావోస్‌లో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఆర్థిక, పర్యాటక విభాగాల మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్, వివిధ దేశాల ప్రతినిధులు, టాటా సన్స్ ఛైర్మన్ ఎన్.చంద్రశేఖరన్, సీఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీలతో చంద్రబాబు వేర్వేరుగా సమావేశమవుతారు.

◆ 20వ తేదీ 'ఇండియా ఎట్ సెంటర్ జియోగ్రఫీ గ్రోత్- ఏపీ ఎడ్వాంటేజ్' పేరిట సీఐఐ నిర్వహిస్తున్న సదస్సులో పాల్గొంటారు.

◆ ఐబీఎం ఛైర్మన్, సీఈవో అరవింద్ కృష్ణతో భేటీ అవుతారు. ఈ భేటీకి మంత్రి లోకేశ్ కూడా హాజరవుతారు. గూగుల్ క్లౌడ్ సీఈఓ థామస్ కురియన్‌తోనూ చంద్రబాబు సమావేశమవుతారు.

◆ స్విట్జర్లాండ్, ఇజ్రాయెల్ ఆర్థిక వ్యవహారాల మంత్రులు, అంతర్జాతీయ కంటెయినర్ లాజిస్టిక్స్ సంస్థ మోలర్‌మెర్స్క్ సీఈఓలతో చంద్రబాబు వేర్వేరుగా భేటీ అవుతారు.

'ఏఐ మూమెంట్ ట్రాన్స్‌ఫార్మింగ్ గ్లోబల్ ఎకానమీ' సదస్సులో ముఖ్యవక్తగా చంద్రబాబు

◆ 21న బ్లూమ్‌బెర్గ్ సంస్థ నిర్వహించనున్న 'ట్రిలియన్స్ ఆఫ్ డాలర్స్ ఏఐ మూమెంట్ ట్రాన్స్‌ఫార్మింగ్ గ్లోబల్ ఎకానమీ' సెషన్‌లో చంద్రబాబు ముఖ్య వక్తగా ప్రసంగించనున్నారు. ◆ 22న దావోస్ నుంచి జ్యూరిచ్‌కు చేరుకుని, అక్కడి నుంచి తిరుగు ప్రయాణమవుతారు. 23న ఉదయం 8.25 గంటలకు చంద్రబాబు బృందం హైదరాబాద్ చేరుకోనుంది.

దావోస్‌లో సిద్ధమైన ఏపీ లాంజ్

దావోస్‌లో ఈ నెల 19 నుంచి జరగనున్న ప్రపంచ ఆర్థిక సదస్సు వేదిక వద్ద ఏపీ లాంజ్ సిద్ధమైంది. దేశ, విదేశాలకు చెందిన పారిశ్రామిక దిగ్గజాలు, వివిధ సంస్థల ప్రతినిధులతో సీఎం చంద్రబాబు ఇక్కడ భేటీ కానున్నారు.

రిజిస్ట్రేషన్ రోజే.. మ్యుటేషన్!

- 5 నెలల్లో 23వేల ఆస్తుల్లో యజమానుల పేర్లు మార్పు
- ఆటోమేటిక్ విధానంతో ప్రజలకు తప్పిన అవస్థలు
- నగరపాలక కార్యాలయాలకు వెళ్లకుండానే మ్యుటేషన్ పూర్తి

విజయవాడకు చెందిన చైతన్య.. రెండు నెలల క్రితం సుబ్బారావు దగ్గర ఫ్లాట్ కొని రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. మున్సిపల్ రికార్డుల్లో అదేరోజు చైతన్య పేరుతో మారిపోయింది. 'ఆటోమేటిక్ మ్యుటేషన్ సిస్టం' ఫలితమిది. ఇదే పని కోసం ఐదు నెలల క్రితం వరకు కార్యాలయాల చుట్టూ తిరిగేవారు. మ్యుటేషన్ ఫీజుతోపాటు అదనపు చెల్లింపులూ తప్పేవి కావు.

ఈనాడు–అమరావతి: ప్రభుత్వం గతేడాది ఆగస్టు 1 నుంచి 17 నగరపాలక సంస్థల్లో ప్రయోగాత్మకంగా ప్రారంభించిన 'ఆటోమేటిక్ మ్యుటేషన్ సిస్టం'తో ఫలితాలొస్తున్నాయి. ఖాళీస్థలాల నుంచి ఇళ్ల వరకు, వాణిజ్య భవనాల నుంచి ప్లాట్ల వరకు క్రయవిక్రయాలపై రిజిస్ట్రేషన్లతో పాటు నగరపాలకసంస్థ దస్త్రాల్లో పేరు మార్పూ అదేరోజు జరిగిపోతోంది. గత ఐదు నెలల్లో 23వేల మ్యుటేషన్లు ఇలా ఆటోమేటిగ్గా జరిగిపోయాయి.



అక్రమ వసూళ్లకు అడ్డుకట్ట

సుపరిపాలనలో భాగంగా ప్రవేశపెట్టిన ఆటోమేటిక్ మ్యుటేషన్ సిస్టంతో ప్రత్యేకించి నగరపాలక సంస్థల్లో అక్రమ వసూళ్లకు, ఆస్తుల రిజిస్ట్రేషన్ల తర్వాత పేరు మార్పు ప్రక్రియలో జాప్యానికి తెరపడింది.

◆ గతంలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ తర్వాత ఫ్లాట్ కొనుగోలుదారులు నగరపాలక సంస్థ కార్యాలయంలో ఆస్తిపన్ను దస్త్రంలో పేరు మార్పునకు దరఖాస్తు చేసేవారు. అక్కడి సిబ్బంది మ్యుటేషన్ ఫీజుతోపాటు అదనపు మొత్తాలను వసూలు చేసేవారు. అడిగినంత ఇవ్వకపోతే పేరు మార్పులో తీవ్ర జాప్యం చేసేవారు.

◆ కొత్త విధానంలో నగరపాలక సంస్థల్లో డేటాను స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖకు అనుసంధానించారు. సబ్ రిజిస్ట్రార్లు రిజిస్ట్రేషన్ చేయగానే మ్యుటేషన్ పూర్తిచేస్తున్నారు. ఆస్తిపై నగరపాలక సంస్థకు బకాయిలేమీ లేకపోతే రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ ఒకేరోజు జరిగిపోతున్నాయి.

◆ ఆస్తిపన్ను, ఖాళీ స్థలాలపై పన్ను (వీఎల్‌టీ), తాగునీటి, సివరేజ్ ఛార్జీల బకాయిలు ఉంటే వాటిని చెల్లించాకే మ్యుటేషన్ పూర్తిచేస్తున్నారు.

5 నెలల్లో రూ.8 కోట్ల ఆదాయం

ఆటోమేటిక్ సిస్టం ప్రవేశపెట్టిన ఐదు నెలల్లోనే మ్యుటేషన్‌కి సంబంధించి పుర, నగరపాలక సంస్థలకు రూ.8 కోట్లు వచ్చింది. మ్యుటేషన్ ఫీజులు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నుంచి మున్సిపల్ ఖాతాకు జమయ్యేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

కొత్త ఎసెస్‌మెంట్ నంబర్ల కేటాయింపులో జాప్యంపై దృష్టి సారించాలి

కొత్త ఫ్లాట్ల రిజిస్ట్రేషన్లు అయ్యాక వాటికి ఆస్తిపన్ను కోసం ఎసెస్‌మెంట్ నంబర్ల కేటాయింపులో జాప్యాన్ని నిరోధించేందుకు పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఖాళీస్థలాల రిజిస్ట్రేషన్ల తర్వాత వాటికి వీఎల్‌టీ విధింపులోనూ జాప్యమవుతోంది. నగరపాలక సంస్థల అధికారులు 15 రోజుల్లోగా ప్రక్రియ పూర్తిచేయాలి. చాలా చోట్ల నెలరోజులైనా కొత్త ఎసెస్‌మెంట్ నంబర్లు కేటాయించట్లేదు. దీంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గడువులోగా ఇలాంటివి పరిష్కారమయ్యేలా స్పెషల్‌డ్రైవ్ నిర్వహిస్తున్నామని పురపాలకశాఖ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

విశాఖలో ఈఎస్‌ఐ వైద్య కళాశాల ఏర్పాటుకు అనుమతి

2026–27 నుంచి ప్రవేశాలకు ప్రణాళిక

ఈనాడు, అమరావతి: విశాఖపట్నంలో ఈఎస్‌ఐ ఆసుపత్రికి అనుబంధంగా 2026-27 విద్యాసంవత్సరంలో 50 ఎంబీబీఎస్ సీట్లతో వైద్య కళాశాల ఏర్పాటుకు సూత్రప్రాయంగా ఆమోదం లభించింది. గతేడాది సిమ్లాలో జరిగిన ఈఎస్‌ఐ కార్పొరేషన్ సమావేశంలో దేశంలో 10 వైద్యకళాశాలల ఏర్పాటుకు ఆమోదం తెలుపుతూ నిర్ణయం తీసుకున్నారు. విశాఖలో ప్రస్తుతం ఈఎస్‌ఐ ఆసుపత్రికి 200 పడకలకు అనుమతి ఉంది. 350 పడకల సామర్థ్యంతో ఈఎస్‌ఐ నూతన ఆసుపత్రి నిర్మాణ దశలో ఉంది. దీనికి అనుబంధంగా వైద్య కళాశాల ఏర్పాటు చేయాలన్నది ప్రణాళిక. ఈ నెల 6న కేంద్ర బృందం విశాఖలోని ఆసుపత్రిని పరిశీలించి వైద్యకళాశాల ఏర్పాటుకు సంబంధించిన అంశాలపై చర్చించింది. వచ్చే విద్యాసంవత్సరానికి వైద్యకళాశాల అందుబాటులోకి తేవాలంటే క్షేత్రస్థాయిలో పలు సమస్యలు అధిగమించి, వసతులు సమకూర్చాల్సి ఉంటుంది. తాజాగా అధికారిక ఆమోదం లభించడంతో ఈఎస్‌ఐ అధికారులు ఈ దిశగా దృష్టిసారించారు.

డేటా నిరంతర ప్రవాహమే

ప్రపంచవ్యాప్తంగా రోజూ తయారయ్యేది **40 వేల కోట్ల జీబీపైనే**

- నిల్వ, భద్రత, కనెక్టివిటీలో డేటా సెంటర్లే కీలకం
- గేమ్ ఛేంజర్‌గా విశాఖ మెగా ఏఐహబ్, డేటా సెంటర్

- 15 ఏళ్ల కిందట మనం వాడిన ఆండ్రాయిడ్ మొబైల్‌లో ఇంటర్నల్ మెమరీ ఎంత? 2జీబీ లేదంటే 4 జీబీ. ఇంకా కావాలంటే మైక్రో ఎస్‌డీ కార్డు ఉపయోగించేవాళ్లు. ఇప్పుడొచ్చే మొబైల్ ఫోన్లలో 256 జీబీ ఇంటర్నల్ స్టోరేజ్ ఇస్తున్నా ఏడాదికే నిండిపోతోంది. హార్డ్ డిస్క్‌ల్లోకి ఎక్కించుకుంటున్నారు. కొన్ని మొబైల్ సంస్థలు 1టీబీ ఇంటర్నల్ స్టోరేజ్ కల్పిస్తున్నాయి. ఒక వ్యక్తి దగ్గరుండే సమాచారమే ఇంతగా పెరిగితే.. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు, కార్పొరేట్లు, సామాజిక మాధ్యమ, ఎంటర్‌టైన్‌మెంట్ కంపెనీల దగ్గర ఎంత సమాచారం ఉంటుంది? అదంతా ఎక్కడ నిల్వ చేస్తున్నారు? ఒక్క క్లిక్‌తో వాటిని ఎలా చూస్తున్నాం?
- ప్రజలకు సంబంధించిన సమాచారం తోపాటు ప్రభుత్వ దస్త్రాలు, జీవోలు, ఇన్‌ఫ్రా తదితరాలన్నీ కలిపితే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వద్ద 6 పెటా బైట్స్ (ఒక్కో పెటాబైట్ 10.48 లక్షల జీబీ) డేటా ఉంటుందని అంచనా. ఏటికేడు పెరుగుతోంది. ఇదంతా ఎక్కడ నిల్వ చేయాలి? ప్రజలకు ఎలా అందుబాటులో ఉంచాలి?
- నెట్‌ఫ్లిక్స్, అమెజాన్ ప్రైమ్, జియో హాట్‌స్టార్ తదితర ఎంటర్‌టైన్‌మెంట్ ఛానళ్లలో రెండు గంటల 4కే సినిమా 15 నుంచి 30 జీబీ పైనే ఉంటుంది. అలాంటి ఎన్ని సినిమాలు, వెబ్‌సిరీస్ అందులో ఉంటాయి? వాటి డేటా ఎంత? యూట్యూబ్ వీడియోలైతే అనంతం. ఫేస్‌బుక్, ఎక్స్, లింక్డిన్, ఇన్‌స్టాగ్రామ్ తదితర సామాజిక మాధ్యమాల్లో కోట్లలో వీడియోలు, ఫొటోలు పంచుకుంటున్నాం. కొన్నేళ్ల కిందటివి కూడా చూస్తున్నాం. సెర్చ్ చేస్తే వెంటనే ప్రత్యక్షమవుతాయి. ఎందుకంటే ఆ సమాచారమంతా నిల్వ చేయడం వల్లే.
- రాబోయే రోజుల్లో ఏదైనా అనారోగ్య పరిస్థితి తలెత్తితే ఆ వ్యక్తి, ఆయన కుటుంబీకుల ఆరోగ్య చరిత్ర కావాలంటే కంప్యూటర్ ఇట్టే ఇచ్చేస్తుంది. తరాల పాటు నిల్వ చేస్తేనే.. కావాల్సినప్పుడు ప్రత్యక్షమవుతుంది. ఒక్క క్లిక్‌తో దశాబ్దాల విద్య, వ్యవసాయ, ఇతర రంగాల సమాచారమూ కళ్లముందే కనిపిస్తుంది.



ప్రపంచవ్యాప్తంగా రోజుకు తయారయ్యే డేటా ఎంతో తెలుసా? 402.74 మిలియన్ టెరా బైట్స్ (టీబీ).. అంటే 40 వేల కోట్ల జీబీ ప్రపంచవ్యాప్తంగా డేటా ప్రవాహం ఏ స్థాయికి వెళ్లిపోయిందో ఈ లెక్కలే చెబుతున్నాయి. డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లపై ఆధారపడటం, స్మార్ట్ పరికరాల వేగవంత విస్తరణ, ఇంటర్నెట్ యాక్సెస్ కారణంగా ఇది మరింత పెరుగుతుందని అంచనా. నిత్యం గూగుల్ శోధనలు 20 పెటా బైట్స్ (సుమారు 2.09 కోట్ల జీబీ). యూట్యూబ్, ఫేస్‌బుక్, ఎక్స్, టిక్‌టాక్.. ఇతరత్రా కలిపితే భారీ మొత్తంలో డేటా తయారవుతోంది. దీనంతటినీ నిల్వ చేయడం, వినియోగదారులకు చేర్చడంలో కీలకం డేటా సెంటర్లే. విశాఖలో మెగా ఏఐ హబ్, డేటా సెంటర్ ఏర్పాటు చేసేందుకు గూగుల్ సన్నాహాలు చేస్తుండటంతో ప్రజలందరి దృష్టి వీటిపై పడింది. అసలు డేటా సెంటర్ అంటే ఏంటి? మనకేంటి? అనే చర్చ నడుస్తోంది. ఒకప్పుడు హైటెక్‌సిటీ అంటే ఆధునిక డిజైన్‌తో నిర్మించిన బిల్డింగ్ అనుకునేవారు.. కానీ తెలుగు యువత దశ, దిశ మార్చిందదే. విశాఖలో గూగుల్ మెగా ఏఐ హబ్, డేటా సెంటర్ దానికంటే ఎన్నో రెట్లు శక్తిమంతమైంది. 1 గిగావాట్ డేటా సెంటర్ నిర్మిస్తోంది.

డేటా సెంటర్ అంటే?

డేటా సెంటర్ అంటే డేటా నిల్వ చేసి, ప్రాసెస్ చేసి, నిర్వహించే కేంద్రం. వివిధ సంస్థలు తమ కీలక అప్లికేషన్లు, డేటా నిల్వ చేయడానికి, డెలివరీ చేయడానికి వీలుగా కంప్యూటింగ్, నిల్వ వనరుల నెట్‌వర్క్‌పై డేటా సెంటర్ రూపకల్పన ఆధారపడి ఉంటుంది. ఇందులో రౌటర్లు, స్విచ్‌లు, ఫైర్‌వాల్స్, నిల్వ వ్యవస్థలు, సర్వర్లు, అప్లికేషన్ డెలివరీ కంట్రోలర్లు ఉంటాయి.

- 1990లలో ప్రభుత్వ కార్యాలయాలు, కార్పొరేట్ కార్యాలయాల్లో ఇవి చిన్న గదుల్లో ఉండేవి. తర్వాత థర్డ్‌పార్టీ సెంటర్లలో సర్వర్లు ఏర్పాటు చేసి నిల్వ చేసేవారు. కొన్నేళ్లుగా ఇంటర్నెట్ వ్యాప్తితో డేటా ట్రాఫిక్ భారీగా పెరగడంతో డేటా సెంటర్ల అవసరం ఏర్పడింది.

డేటా సెంటర్ ఎందుకు?

- మనం వాడే స్మార్ట్‌ఫోన్, ఇంటర్నెట్, క్లౌడ్ సర్వీస్, ఏఐ, బిగ్‌డేటా అన్నీ డేటా సెంటర్‌పైనే ఆధారపడి ఉంటాయి.
- డేటా సెంటర్లు వీటిని నిర్వహిస్తూ.. హైస్పీడ్ కంప్యూటింగ్, ప్రాసెసింగ్‌తో సులభతరంగా మనకు సమాచారం అందేలా చేస్తాయి.
- కంప్యూటింగ్ అనేది డేటా సెంటర్‌కు మెదడులాంటిది. డేటా ప్రాసెస్, కాలిక్యులేషన్ చేసి, అప్లికేషన్లను నడిపిస్తుంది. నిల్వ, కనెక్టివిటీతో కలిసి పనిచేస్తుంది. సర్వర్లు, ప్రాసెసర్లు ఉపయోగించి మిలియన్ల కొద్దీ లావాదేవీలు, ఏఐ మోడల్ ట్రైనింగ్, సైంటిఫిక్ సిమ్యులేషన్ చేస్తుంది.
- ఫైర్‌వాల్స్, బయోమెట్రిక్స్, బ్యాకప్ సిస్టమ్స్ భూకంపాలు, సైబర్ దాడుల్ని తట్టుకునేందుకు దోహదపడతాయి. ఆర్థిక దస్త్రాలకు రక్షణ కల్పిస్తాయి.
- పెద్ద డేటా సెంటర్లను క్లౌడ్ కంప్యూటింగ్, డేటా స్టోరేజ్, కంటెంట్ డెలివరీ, డిజాస్టర్ రికవరీ, ఏఐ ప్రాసెసింగ్‌కు ఉపయోగిస్తారు. హైపర్‌స్కేల్ సెంటర్లు.. ప్రభుత్వాలు, టెక్ సంస్థలు, కోట్ల మంది వినియోగదారులకు సేవలందిస్తాయి.
- డేటా సెంటర్లు వర్చువల్, క్లౌడ్ ఆధారిత కార్యకలాపాల్ని తట్టుకుంటూ రక్షణ అందించాలి. అనధికార ప్రవేశాన్ని నిరోధించే నియంత్రణ వ్యవస్థలు ఉండాలి. సైబర్ దాడుల పర్యవేక్షణ, నిరోధించడం, అధునాతన ముప్పుల్ని గుర్తించి అడ్డుకోవడం, డేటా ఎన్‌క్రిప్షన్ తదితర అంశాలు ప్రధానమైనవి.
- సమాచారం నిల్వ చేయడమే కాదు, శోధనకు అనుగుణంగా అందుబాటులోని డేటాను వడగట్టి, వేగవంతంగా, అంతరాయం లేకుండా అందించడమూ ముఖ్యం.
- సర్వర్లు పనిచేసే సమయంలో వేడెక్కకుండా కూలింగ్ విధానం ఉండాలి. అందుకే డేటా సెంటర్‌లో విద్యుత్తు, కూలింగ్ వ్యవస్థలే కీలకం. ప్రాజెక్టు వ్యయంలో 25% నుంచి 40% వీటికే ఖర్చవుతుంది.

డేటా సెంటర్లలో రకాలేంటి?

- కృత్రిమ మేధ (ఏఐ) డేటా కేంద్రాలు ఇప్పుడు ప్రత్యేకం. జీపీయూ (గ్రాఫికల్ ప్రాసెసింగ్ యూనిట్), టీపీయూ (టెన్సార్ ప్రాసెసింగ్ యూనిట్) తదితర అధునాతన మౌలిక సౌకర్యాల్ని ఉపయోగిస్తాయి. విస్తారమైన డేటాను సమర్థంగా ప్రాసెస్ చేసేందుకు సంక్లిష్టమైన ఏఐ ఆల్గారిథమ్‌లు అమలు చేయడానికి దోహదపడతాయి. రియల్‌టైమ్ అప్లికేషన్లు, ప్రెడిక్టివ్ ఎనలిటిక్స్, నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్, వేగవంతమైన డేటా ప్రాసెసింగ్ ద్వారా శక్తిమంతమైన కంప్యూట్ వనరులతో పనిచేస్తాయి.
- ఎంటర్‌ప్రైజెస్ డేటా సెంటర్ (బ్యాంకులు, రిటైల్),
- కో-లొకేషన్ డేటా సెంటర్ (థర్డ్ పార్టీ ప్రొవైడర్ నిర్మించేవి. అక్కడ వినియోగదారులు తమ సర్వర్లు పెట్టుకుంటారు)
- హైపర్‌స్కేల్ డేటా సెంటర్ (గూగుల్, ఏడబ్ల్యూఎస్, మైక్రోసాఫ్ట్ అజూర్.. మిలియన్ల కొద్దీ సర్వర్లు ఉంటాయి)
- ఎడ్జ్ డేటా సెంటర్ (నగరాలు, పట్టణాల సమీపంలో పెట్టే చిన్నవి. 5జీ, 6జీ ద్వారా తక్కువ జాప్యంతో కూడిన సేవలందిస్తాయి)
- మాడ్యులర్ డేటా సెంటర్ (కంటెయినర్, ప్యానల్‌తో నిర్మించేవి. వేగంగా అమర్చవచ్చు. ఆయిల్ రిగ్ లాంటి రిమోట్ లొకేషన్లలో పెడతారు)
- క్లౌడ్ డేటా సెంటర్ (పబ్లిక్, ప్రైవేట్, హైబ్రిడ్ మోడల్‌లో పనిచేసేవి)
- ఒక పెటాబైట్ డేటా నిల్వ చేయాలంటే.. పదేళ్ల కిందట అయితే పూర్తి ర్యాక్ (42యూ- ఒక్కో యూనిట్ 1.75 అంగుళాలు) కావాలి. ఇప్పుడు 2యూ ర్యాక్ సర్వర్‌లో 40 పెటా బైట్లు నిల్వ చేసుకునేంత సాంకేతికత వచ్చింది.
- డేటా సెంటర్ల ఏర్పాటులో సంఖ్యాపరంగా అమెరికా, పరిమాణంలో చైనా ముందున్నాయి. ప్రపంచవ్యాప్తంగా 122 గిగా వాట్ల సామర్థ్యం కలిగిన డేటా సెంటర్లు ఉన్నాయి.

2025లో ప్రపంచవ్యాప్త డేటా 181 జెటా బైట్స్

- 2024 చివరికి ప్రపంచవ్యాప్తంగా సృష్టించిన, సమీకరించిన, కాపీ, వినియోగించిన డేటా సుమారు 149 జెటాబైట్స్ (స్టాటిస్టా గణాంకాల ప్రకారం) అని అంచనా. 2025లో 181 జెటా బైట్స్ అవుతుందని పేర్కొంది.
- 2024లో ప్రపంచవ్యాప్తంగా రోజుకు 402 మిలియన్ టెరాబైట్ల డేటా తయారవుతోంది.
- మొత్తం డేటాలో 90% గత రెండేళ్లలో తయారైందే. ప్రతి నాలుగేళ్లకు రెట్టింపవుతుందని ఐడీసీ (ఇంటర్నేషనల్ డేటా కోఆపరేషన్) గణాంకాలు వెల్లడిస్తున్నాయి.
- ఐఓటీ డివైజ్‌ల వాడకం, రియల్‌టైమ్ డేటా ప్రాసెసింగ్, క్లౌడ్ బేస్డ్ స్టోరేజ్ తదితర కారణాలతో ఇది మరింత పెరుగుతోంది.

డిస్క్ స్టోరేజ్ విధానం

1,024 బైట్స్(బైనరీ డిజిట్)	– 1 కేబీ (కిలోబైట్)
1,024 కేబీ	– 1 ఎంబీ (మెగాబైట్)
1,024 ఎంబీ	– 1 జీబీ (గిగాబైట్)
1,024 జీబీ	– 1 టీబీ (టెరా బైట్)
1,024 టీబీ	– 1 పీబీ (పెటాబైట్)
1,024 పీబీ	– 1 ఈబీ (ఎక్సాబైట్)
1,024 ఈబీ	– 1 జడ్‌బీ (జెటా బైట్)
1,024 జడ్‌బీ	– 1 వైబీ (యొట్టాబైట్)
1,024 వైబీ	– 1 బ్రోంటో బైట్
1,024 బ్రోంటో	– 1 జియోప్‌బైట్

- ఈనాడు, అమరావతి

శ్రీవారి సేవల ఏప్రిల్ కోటా బుకింగ్ షెడ్యూల్ వెల్లడి



తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారికి ఏప్రిల్‌లో నిర్వహించే ఆర్జిత సేవలు సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన సేవల్లో పాల్గొనేందుకు భక్తులు లక్కీడిప్ పద్ధతిలో టికెట్లు బుక్ చేసుకునేలా తితిదే ఈనెల 19న ఉదయం పది గంటలకు ఆన్‌లైన్‌లో కోటా విడుదల చేయనుంది. వీటిని 21న ఉదయం పది గంటల వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. సేవలకు ఎంపికైన భక్తులు 21 మధ్యాహ్నం నుంచి 23 మధ్యాహ్నం 12 గంటల్లోపు ఆన్‌లైన్‌లో సొమ్ము చెల్లించాలి.

◆ ఏప్రిల్‌లో నిర్వహించే కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవ, సాలకట్ల వసంతోత్సవాల టికెట్లను 22న ఉదయం 10 గంటలకు.. వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన కోటాను మధ్యాహ్నం మూడింటికి విడుదల చేయనుంది.

◆ ఏప్రిల్ నెల అంగ ప్రదక్షిణ టికెట్లను 23న ఉదయం పదింటికి, శ్రీవాణి ట్రస్టు బ్రేక్ దర్శనం కోటాను 11 గంటలకు విడుదల చేస్తారు. వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులు, దివ్యాంగులకు ఉచిత ప్రత్యేక ప్రవేశ దర్శన టోకెన్ల కోటా మధ్యాహ్నం మూడింటికి ఆన్‌లైన్‌లో జారీ చేస్తుంది.

◆ ప్రత్యేక ప్రవేశ దర్శనం (రూ.300) టికెట్ల కోటాను 24న ఉదయం పదింటికి, తిరుమల, తిరుపతిలో అద్దె గదుల బుకింగ్ కోటాను అదేరోజు మధ్యాహ్నం మూడింటికి అందుబాటులో ఉంచుతుంది.

◆ మార్చికి సంబంధించిన శ్రీవారిసేవ, పరకామణి సేవల కోటాను 27న మధ్యాహ్నం మూడింటికి విడుదల చేస్తారు. భక్తులు https://ttdevasthanams.ap.gov.in వెబ్‌సైట్‌లో మాత్రమే ఆర్జిత సేవలు, సేవా టికెట్లను బుక్ చేసుకోవాలని తితిదే సూచించింది.

తితిదే కల్యాణ మండపాలకు ప్రత్యేక హెల్ప్‌లైన్

ఈవో అనిల్ కుమార్ సింఘాల్

తిరుపతి(తితిదే), న్యూస్‌టుడే: దేశవ్యాప్తంగా తితిదే ఆధ్వర్యంలోని కల్యాణ మండపాలు మరింత మెరుగ్గా నిర్వహించేందుకు ప్రత్యేక హెల్ప్‌లైన్ ఏర్పాటు చేయనున్నట్లు తితిదే ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ తెలిపారు. శనివారం తిరుపతిలోని తితిదే పరిపాలనా భవనంలో ఉన్నతాధికారులతో సమీక్షించారు. భక్తులు, శ్రీవారి సేవకుల నుంచి అభిప్రాయాలు సేకరించి తదనుగుణంగా వాటిలో సౌకర్యాల కల్పనకు ప్రణాళికలు సిద్ధం చేయాలని తెలిపారు. నిర్వహణ బాధ్యతలను ఫెసిలిటీ మేనేజ్‌మెంట్ సర్వీసెస్(ఎఫ్ఎంఎస్) పరిధిలోకి తీసుకొస్తే పరిశుభ్రత, మెరుగైన నిర్వహణ మరింత సులభతరం అవుతుందన్నారు. ప్రహరీలు, మరుగుదొడ్లు, పార్కింగ్, నీటివసతి, సెక్యూరిటీ, నిర్వహణకు అనువుగా ఉన్నదీ లేనిదీ వెంటనే గుర్తించాలని సూచించారు.

ఆ సమాచారం మా వద్ద లేదు

గోదావరి బోర్డు స్పష్టీకరణ

ఈనాడు, అమరావతి: గోదావరి నదిపై 940.87 టీఎంసీల వినియోగానికి సంబంధించి కేంద్ర జలసంఘం తమకు అనుమతులు ఇచ్చిందని తెలంగాణ పేర్కొంటోందని, ఏయే ప్రాజెక్టులకు సాంకేతిక సలహా కమిటీ అనుమతులిచ్చిందో ఆ సమాచారం తమ వద్ద లేదని ఆంధ్రప్రదేశ్‌కు గోదావరి బోర్డు స్పష్టంచేసింది. తెలంగాణ పేర్కొంటున్న ప్రకారం ఏయే ప్రాజెక్టులకు కేంద్ర జలసంఘం, సాంకేతిక సలహా కమిటీలు అనుమతులు ఇచ్చాయో ఆ వివరాలు తమకు తెలపాలని గోదావరి బోర్డు ఛైర్మన్‌కు ఏపీ ఇంజినీర్ ఇన్ చీఫ్ లేఖ రాశారు. ఆ లేఖకు గోదావరి బోర్డు స్పందించి ఈ విషయం తెలిపింది. తాజాగా జల వివాదాల పరిష్కారానికి కేంద్ర జలసంఘం ఛైర్మన్ అధ్యక్షతన కమిటీని నియమించి, జనవరి 30న సమావేశం ఏర్పాటు చేసినందున ఈ సమాచారం విషయాన్ని అక్కడే అడిగి వారి ద్వారానే తెలుసుకోవాలని ఏపీకి గోదావరి బోర్డు సలహా ఇచ్చింది.

కేకు.. మాడిన దిబ్బ రొట్టెలా!

బ్యాచిలర్స్ కిచెన్



నేను డిగ్రీ చదివే రోజుల్లో కేకులు అందరికీ అందుబాటులో ఉండేవి కాదు. డబ్బున్నవాళ్లు- పిల్లల పుట్టినరోజులకు మాత్రం తెచ్చేవారు. మాలాంటివాళ్లకి గ్లూకోజ్ బిస్కెట్లు, నిమ్మతొనలతో కానిచ్చేసేవారు. అదలా ఉంచితే.. నా స్నేహితుడు సూరిబాబుకు రావులపాలెంలో కోళ్లఫారం ఉండేది. సూరి అప్పుడప్పుడు మమ్మల్ని తీసుకెళ్లి.. పగిలిన గుడ్లతో (వాటి ఖరీదు తక్కువ) ఆమ్లెట్లు వేయించి పెట్టేవాడు. 'అస్తమానూ ఆమ్లెట్లేనా.. ఈసారి ఎగ్ కేక్ చేసుకుందాం' అన్నానో రోజు.. మా పిన్ని మలయాళీల దగ్గర కేక్ నేర్చుకుందన్న ధీమాతో. ఏమేం కావాలో, ఎలా చేయాలో కాగితం మీద రాసుకున్నా. కావాల్సిన సరుకులు వాసు తెచ్చాడు. వెంటనే రంగంలోకి దిగిపోయాం. ఒక పెద్ద గిన్నెలో ఇసుక వేసి వేడి చేశా. మైదాపిండిలో పంచదార కలిపి ఉంచుకున్నా. మరో పాత్రలో ఓ డజను గుడ్లు, నూనె వేసి గిలకొట్టాను. ఈ సొనను మైదా మిశ్రమంలో చేర్చి కలిపితే ముద్దలా అయ్యింది. కాస్త జారుగానే ఉండాలని గుర్తొచ్చి ఇంకో అరడజను గుడ్లసొన వేశా. ఈసారి మరీ పల్చనయ్యింది. తెచ్చిన మైదా అయిపోయింది. సర్లెమ్మని బియ్యప్పిండి జోడించాను. పొయ్యి వెలిగించి నేస్తాలతో కబుర్లలో పడిపోయా. ఎక్కువ సెగ ఉండటంతో పావుగంటలోనే మాడువాసన వచ్చింది. కంగారుగా మూత తీస్తే.. కేక్ కాస్తా మాడిన దిబ్బరొట్టెలా ఉంది. మాడినది వదిలేసి బాగున్నది తిన్నాం. 'పెద్ద మంట పెట్టకపోతే భేషుగ్గా ఉండేది' అంటూ.. అందరూ నెపం భద్రంపై తోసేయడంతో నేను ఊపిరి పీల్చుకున్నా. నిజానికి అన్ని గుడ్లు వేయనే కూడదు. తర్వాత మా పిన్ని దగ్గర సరిగ్గా నేర్చుకుని.. కేక్ చేస్తే.. నా దోస్తులు ఆకాశానికి ఎత్తేశారు. ఇన్నేళ్లు గడిచినా.. తొలిసారి కేక్ తయారీ, మా కేరింతలు కళ్లముందు మెదులుతుంటాయి.

– త్రిమూర్తులు మెర్ల, ర్యాలి, కోనసీమ జిల్లా



ఖర్జూరంతో క్యాండీలు ఇలా!



చాక్లెట్లు తింటే పళ్లు పుచ్చిపోతాయి. కానీ పిల్లలు అవే కావాలంటారు. ప్రత్యామ్నాయం ఏమిటంటే.. అంతే రుచిగా ఇలా చేయండి..

కావలసినవి.. కోకో పౌడర్ - 2 టేబుల్ స్పూన్లు, డార్క్ చాక్లెట్ - పావు కప్పు, బాదం, జీడిపప్పులు - పావు కప్పు, నెయ్యి - 2 స్పూన్లు, ఖర్జూరపండ్లు - కప్పు, వెనీలా ఎసెన్స్ - పావు స్పూన్, కొబ్బరి తురుము - రెండున్నర స్పూన్లు

తయారీ.. ఖర్జూరపండ్లలో గింజలు తీసి.. నానబెట్టాలి. 10 నిమిషాల తర్వాత మెత్తగా అయ్యేలా గ్రైండ్ చేయాలి. ప్యాన్‌లో కొంత నెయ్యి వేడిచేసి బాదం, జీడిపప్పులను వేయించి తీయాలి. అదే ప్యాన్‌లో డార్క్ చాక్లెట్‌ను కరిగించాలి. సెగ తీసేసి ఖర్జూర పేస్టు, కోకో పౌడర్, వెనీలా ఎసెన్స్ వేసి బాగా కలపాలి. డ్రై ఫ్రూట్స్ కచ్చాపచ్చా దంచి.. వాటిని కూడా జోడించి కలియబెట్టాలి. మిగిలిన నెయ్యిని చేతులకు రాసుకుని.. ఈ మిశ్రమంతో నచ్చిన ఆకృతులు చేసుకోవాలి. అన్నీ అయ్యాక.. కొబ్బరి తురుములో దొర్లించాలి. ఒక అరగంట ఫ్రిజ్‌లో ఉంచాలి. ఈ ఖర్జూర క్యాండీలు ఎంతో రుచిగా ఉంటాయి. మంచి పోషకాహారం కూడా.

నోరూరించే ఉసిరి కొబ్బరి పచ్చడి

ఇది ఉసిరికాయల సీజన్. వీటితో ఒక్కో ప్రాంతంలో ఒక్కో విధంగా పచ్చడి చేస్తారు. కేరళవాసులు కొబ్బరి జోడించి చేసే చట్నీ మీ కోసం...

కావలసినవి.. ఉసిరికాయలు - అర డజను, కొబ్బరి తురుము - ముప్పావు కప్పు, పెరుగు - అర కప్పు, ఉప్పు - రుచికి తగినంత, పచ్చిమిర్చి - 7, నూనె - 3 స్పూన్లు, ఆవాలు, శనగపప్పు, మినప్పప్పు, జీలకర్ర - స్పూన్ చొప్పున, మెంతులు - అర స్పూన్, కరివేపాకు - 2 రెబ్బలు, ఇంగువ - పావు స్పూన్

తయారీ.. ఉసిరికాయలను కడిగి, తుడిచి విత్తనాలు తీసేయాలి. వీటికి పచ్చిమిర్చి, కొబ్బరి, ఉప్పు జోడించి గ్రైండ్ చేయాలి. ఈ మిశ్రమంలో పెరుగు కలపాలి. కడాయిలో నూనె వేడిచేసి.. ఆవాలు, శనగపప్పు, మినప్పప్పు, మెంతులు, జీలకర్ర, కరివేపాకు, ఇంగువ ఒక్కొక్కటిగా వేయాలి. మంచి వాసన వస్తుండగా దించేసి.. ఈ తాలింపును ఉసిరి- కొబ్బరి పచ్చడిలో కలపాలి. అంతే.. వేడి అన్నంలో కలిపి తిన్నారంటే వారెవా అనిపిస్తుంది.





ఫటాఫట్.. ధనాధన్..

పిల్లలకు సంక్రాంతి సెలవులు అయిపోతున్నాయి.. రేపట్నుంచి పొద్దున్నే లేచి ఫలహారం సిద్ధం చేసేయాలి. అంటే తీరుబాటుకు స్వస్తి పలికి.. వేగాన్ని అందుకోవాలి. రొటీన్లో పదేవరకూ సులువుగా పూర్తయ్యే ఈ ఫలహారాలు ప్రయత్నించండి. ఫటాఫట్ పనైపోతుంది.. ధనాధన్ తినేయొచ్చు..

స్ప్రౌట్స్ ఛాట్

కావలసినవి.. మొలకెత్తిన శనగలు, పెసలు, పల్లీలు - ముప్పావు కప్పు చొప్పున, ఉల్లి తరుగు - పావు కప్పు, సన్నగా తరిగిన టొమాటో - గుప్పెడు, పచ్చిమిర్చి - 1, కొత్తిమీర తరుగు - 2 టేబుల్ స్పూన్లు, నిమ్మరసం - టేబుల్ స్పూన్, ఉప్పు - తగినంత, కారం, ఛాట్ మసాలా - అర స్పూన్ చొప్పున, జీలకర్ర పొడి - పావు స్పూన్

తయారీ... వెడల్పాటి పాత్రలో మొలకెత్తిన శనగలు, పెసలు, పల్లీలు, ఉల్లి, టొమాటో, పచ్చిమిర్చి ముక్కలు, ఉప్పు, ఛాట్ మసాలా, కారం, జీలకర్ర పొడి వేసి కలపాలి. తర్వాత నిమ్మరసం, కొత్తిమీర తరుగు జోడించి.. ఎగరేసినట్లు చేస్తే.. అన్నిటికీ మసాలా పడుతుంది. అంతే.. 'స్ప్రౌట్స్ ఛాట్' సిద్ధమైపోతుంది. ఇది సులువుగా చేసుకునే ఆరోగ్యకరమైన బ్రేక్‌ఫాస్ట్. ఇందులో అధిక ప్రోటీన్లుంటాయి. జీర్ణప్రక్రియ మెరుగుపడుతుంది. బరువు తగ్గాలనుకునేవారికి మరింత మంచిది.



మరమరాల మసాలా మిక్స్

కావలసినవి.. మరమరాలు - 2 కప్పులు, ఉల్లి తరుగు - అర కప్పు, సన్నగా తరిగిన టొమాటో - పావు కప్పు, పచ్చిమిర్చి - 1, వేయించిన పల్లీలు - 3 టేబుల్ స్పూన్లు, పుట్నాల పొడి, కొత్తిమీర తరుగు - టేబుల్ స్పూన్ చొప్పున, నిమ్మరసం - ఒకటిన్నర స్పూన్లు, ఉప్పు - తగినంత, కారం - ముప్పావు స్పూన్, పసుపు - చిటికెడు, ఛాట్ మసాలా, ఆవాలు, జీలకర్ర - అర స్పూన్ చొప్పున, కరివేపాకు - 2 రెబ్బలు, ఇంగువ - చిటికెడు, నూనె - 2 స్పూన్లు

తయారీ.. మరమరాల్లో నీళ్లు పోసి వెంటనే వడకట్టాలి. ఎక్కువసేపు నానితే మెత్తగా పిండిలా అయిపోతాయి. ఈ తడిపిన మరమరాలను మిక్సింగ్ బౌల్‌లోకి తీయాలి. అందులో ఉల్లి, టొమాటో, పచ్చిమిర్చి ముక్కలు, పుట్నాల పొడి, పల్లీలు, కారం, ఉప్పు, పసుపు, ఛాట్ మసాలా, కొత్తిమీర తరుగు, నిమ్మరసం వేసి బాగా కలపాలి. కడాయిలో నూనె వేడిచేసి.. ఆవాలు జీలకర్ర, కరివేపాకు, ఇంగువ ఒక్కొక్కటిగా వేయాలి. ఈ తాలింపును మరమరాల మిశ్రమంలో కలిపితే సరిపోతుంది.



రవ్వ దోశ

కావలసినవి.. ఉప్మా రవ్వ - కప్పు, బియ్యప్పిండి - అర కప్పు, పెరుగు - ముప్పావు కప్పు, ఉల్లి తరుగు - పావు కప్పు, పచ్చిమిర్చి - 2, అల్లం ముద్ద - అర స్పూన్, కొత్తిమీర తరుగు - 2 టేబుల్ స్పూన్లు, కరివేపాకు - ఒక రెబ్బ, ఉప్పు - తగినంత, జీలకర్ర - ముప్పావు స్పూన్, మిరియాల పొడి - పావు స్పూన్, ఫ్రూట్ సాల్ట్ - అర స్పూన్ నూనె - దోశలు వేసేందుకు అవసరమైనంత

తయారీ... వెడల్పాటి పాత్రలో రవ్వ, బియ్యప్పిండి, తగినన్ని నీళ్లు, ఉప్పు, పెరుగు, జీలకర్ర, మిరియాల పొడి వేసి పిండి కలపాలి. అందులో ఉల్లి, పచ్చిమిర్చి ముక్కలు, అల్లం ముద్ద, కొత్తిమీర తరుగు, కరివేపాకు, ఫ్రూట్ సాల్ట్ జతచేసి మళ్లీ కలపాలి. పెనం వేడిచేసి.. కొద్దిగా నూనె రాయాలి. గరిటెడు పిండితో దోశ వేసి.. అంచుల చుట్టూ కాస్త నూనె వేయాలి. మధ్యస్థమైన సెగ మీద.. బంగారు రంగులోకి మారే వరకూ ఉంచి.. తీసేయాలి. తిరగేయాల్సిన పని లేదు. తక్కిన పిండితోనూ ఇలాగే దోశలు వేసుకోవాలి. పప్పు నానబెట్టడం, రుబ్బడం లాంటివి లేకుండా క్షణాల్లో దోశలు రెడీ అయిపోతాయి. వీటికి కొబ్బరి, టొమాటో, పుదీనా చట్నీ ఏదైనా బాగుంటుంది. పిండి కొంచెం పల్చగా ఉంటేనే దోశలు ఉల్లిపొరల్లా క్రిస్పీగా ఉంటాయి.



కాజూ పోహా

కావలసినవి.. అటుకులు - 2 కప్పులు, ఉల్లి తరుగు - గుప్పెడు, బంగాళదుంప - 1, పచ్చిమిర్చి - 2, అల్లం - అంగుళం ముక్క, జీడిపప్పులు - 3 టేబుల్ స్పూన్లు, పల్లీలు - చారెడు, కరివేపాకు - 2 రెబ్బలు, ఉప్పు - తగినంత, ఆవాలు - అర స్పూన్, శనగపప్పు - స్పూన్, పసుపు - పావు స్పూన్, నిమ్మరసం - స్పూన్, పంచదార - ముప్పావు స్పూన్, కొత్తిమీర తరుగు - 2 టేబుల్ స్పూన్లు, నూనె - రెండున్నర టేబుల్ స్పూన్లు

తయారీ.. బంగాళదుంప చెక్కు తీసి.. ముక్కలు కోయాలి. అల్లం పొట్టు తీసి.. సన్నగా తరగాలి. అటుకులను కడిగి, వెంటనే నీళ్లు వడకట్టేయాలి. ప్యాన్‌లో నూనె వేడిచేసి.. ఆవాలు, శనగపప్పు, పల్లీలు వేయాలి. అవి వేగాక.. పచ్చిమిర్చి, కరివేపాకు జతచేయాలి. అందులో అల్లం, ఉల్లి తరుగులను చేర్చాలి. అవి బంగారు రంగులోకి మారాక.. జీడిపప్పులు, బంగాళదుంప ముక్కలు, పసుపు, ఉప్పు, పంచదార, అటుకులు జోడించాలి. మూత పెట్టి సన్న సెగ మీద రెండు నిమిషాలుంచాలి. నిమ్మరసం జోడించి సెగ తీసేసి.. కొత్తిమీర తరుగు చల్లాలి. అంతే.. వేడి వేడి 'కాజూ పోహా' రుచిని ఆస్వాదించడమే తరువాయి. కొద్దిగా సన్న కారప్పూస చల్లితే.. మరింత టేస్టీగా ఉంటుంది.



వెజిటబుల్ ఆమ్లెట్

కావలసినవి.. శనగపిండి - అర కప్పు, బియ్యప్పిండి - టేబుల్ స్పూన్, సన్నగా తరిగిన టొమాటో, క్యారెట్లు - 2 టేబుల్ స్పూన్ల చొప్పున, క్యాబేజీ, క్యాప్సికం తరుగు - టేబుల్ స్పూన్ చొప్పున, పచ్చిమిర్చి - 1, కొత్తిమీర తరుగు - గుప్పెడు, అల్లం ముద్ద - స్పూన్, ఉప్పు - తగినంత, జీలకర్ర, కారం - అర స్పూన్ చొప్పున, పసుపు - పావు స్పూన్, నూనె - 3 స్పూన్లు

తయారీ... ఒక పాత్రలో శనగపిండి, బియ్యప్పిండి, కారం, పసుపు, ఉప్పు, జీలకర్ర వేసి కలపాలి. అందులో తగినన్ని నీళ్లు, టొమాటో, క్యారెట్, క్యాబేజీ, పచ్చిమిర్చి, అల్లం, కొత్తిమీర జతచేసి చిక్కటి దోశల పిండిలా కలపాలి. ఈ మిశ్రమంతో కాలుతున్న పెనం మీద.. కొంచెం మందంగా ఆమ్లెట్‌లా వేయాలి. లేత గోధుమ రంగులోకి మారాక.. తిరగేసి అటు కూడా కాలనివ్వాలి. ఇందులోకి టొమాటో సాస్ బాగుంటుంది. పుదీనా లేదా కొబ్బరి పచ్చడితోనైనా తినొచ్చు. మరింత క్రిస్పీగా ఉండాలంటే కొద్దిగా రవ్వ కలపవచ్చు. ఇంకొంచెం ప్రత్యేకమైన రుచి రావాలంటే కాస్తంత పెరుగు జోడించవచ్చు.



బేసన్ చీలా

కావలసినవి.. శనగపిండి (బేసన్) - కప్పు, బియ్యప్పిండి - 2 టేబుల్ స్పూన్లు, పెరుగు - రెండున్నర టేబుల్ స్పూన్లు, ఉల్లి తరుగు - పావు కప్పు, పచ్చిమిర్చి - 2, తురిమిన అల్లం - అర స్పూన్, కొత్తిమీర తరుగు - గుప్పెడు, కరివేపాకు - 2 రెబ్బలు, ఉప్పు - తగినంత, పసుపు - చిటికెడు, జీలకర్ర, ఫ్రూట్ సాల్ట్ - అర స్పూన్ చొప్పున, మిరియాల పొడి - పావు స్పూన్, నూనె - అవసరమైనంత

తయారీ.. ఒక పాత్రలో శనగపిండి, బియ్యప్పిండి, పెరుగు, తగినన్ని నీళ్లు, ఉప్పు, పసుపు, జీలకర్ర, మిరియాల పొడి వేసి కొంచెం పల్చగా పిండి కలపాలి. అందులో ఉల్లి, పచ్చిమిర్చి, అల్లం, కరివేపాకు, కొత్తిమీర, ఫ్రూట్ సాల్ట్ జతచేసి మరోసారి కలపాలి. పెనం వేడయ్యాక.. కొద్దిగా నూనె రాసి.. గరిటెడు పిండితో దోశ వేయాలి. మధ్యస్థమైన సెగ మీదుంచి అంచుల దగ్గర కాస్త నూనె చల్లాలి. ఒకవైపు బంగారు రంగులోకి మారాక.. తిరగేసి అటు కూడా కాలనివ్వాలి. ఇవి ఏ చట్నీతోనైనా బాగుంటాయి. బియ్యప్పిండి జతచేయడాన దోశలు క్రిస్పీగా ఉంటాయి.



అందంగా.. అద్భుతంగా..

కూరగాయలు తరుగుతుంటే.. అవి చిన్నచిన్న ముక్కలయ్యే బదులు.. వన్నెలు చిందించే పువ్వులై నవ్వులు చిందించాయి. కళాత్మక హృదయం చేసిన గారడీ అది. డైనింగ్ టేబుల్‌పైనా అందంగా, అద్భుతంగా మలచాలన్న సౌందర్యారాధన. నచ్చితే మీరు కూడా ఇలా ప్రయత్నించి చూడండి!












చిత్రంగా..

అదరహో క్యాలీఫ్లవర్ సూప్!

ఆహారం ఆరోగ్యం

క్యాలీఫ్లవర్‌తో కూర సరే.. సూప్ చేసి చూడండి.. చలి కాలంలో నోటికి హితవుగా ఉంటుంది..

ఈ సూప్ కోసం.. క్యాలీఫ్లవర్ - కప్పు, ఉల్లి తరుగు - పావు కప్పు, మిరియాల పొడి - ముప్పావు స్పూన్, తురిమిన అల్లం - అర స్పూన్, కచ్చాపచ్చా దంచిన వెల్లుల్లి - స్పూన్, ఉప్పు - తగినంత, వెన్న - ఒకటిన్నర స్పూన్లు, ఆలివ్ నూనె - టేబుల్ స్పూన్ చొప్పున తీసుకోవాలి. ఎలా చేయాలంటే.. క్యాలీఫ్లవర్‌ను చిన్న పువ్వులుగా విడగొట్టి.. ఉప్పు నీళ్లలో తెర్లించి.. ఆ నీళ్లు వార్చేయాలి. ప్యాన్‌లో నూనె వేసి.. ఉల్లి తరుగును లేత బంగారు రంగు వచ్చే వరకూ వేయించాలి. అందులో అల్లం, వెల్లుల్లి, క్యాలీఫ్లవర్ ముక్కలు, ఉప్పు చేర్చి కలియతిప్పి.. సన్న సెగ మీదుంచాలి.



ఉడికిందనుకున్నాక దించేయాలి. చల్లారిన తర్వాత గ్రైండ్ చేయాలి. కడాయిలో వెన్న వేడిచేసి మిరియాల పొడి వేసి.. వెంటనే గ్రైండ్ చేసిన క్యాలీఫ్లవర్ మిశ్రమం, రెండు కప్పుల నీళ్లు జోడించాలి. మూడు నిమిషాలు మరిగించి సెగ తీసేస్తే.. ఘుమఘుమలాడే 'క్యాలీఫ్లవర్ సూప్' సిద్ధమైపోతుంది.

ఎన్ని లాభాలో...

- విటమిన్లు అందుతాయి.
- రోగనిరోధకశక్తి పెరుగుతుంది.
- గుండె ఆరోగ్యానికి మంచిది.
- జీర్ణప్రక్రియ మెరుగుపడుతుంది.
- ఊబకాయం రాదు. బరువు తగ్గాలనుకునేవారికి ఇదెంతో మంచిది.
- ఒంట్లో చేరిన మలినాలను బయటకు పంపేస్తుంది.
- ఎముకలకు పటుత్వం వస్తుంది.
- జలుబుతో ఇబ్బంది పడుతుంటే మిరియాలు, జీలకర్ర ఇంకొద్దిగా కలపవచ్చు.
- పిల్లలకు కాస్త వెన్న జోడించి ఇస్తే ఇష్టపడతారు.

చాయ్‌తో చోరాఫలీ తిందామా!

గుజరాతీ వారి చిరుతిళ్లలో చోరాఫలీ ఒకటి. చాయ్‌కు తోడుగా కరకరలాడే ఈ స్నాక్స్ ఉన్నాయంటే.. కులాసాగా ముచ్చటిస్తూ తినొచ్చు.

కావలసినవి... బియ్యప్పిండి, మైదా - కప్పు చొప్పున, జొన్నపిండి - 2 టేబుల్ స్పూన్లు, కారం - ఒకటిన్నర స్పూన్లు, వాము, ఛాట్ మసాలా - స్పూన్ చొప్పున, ఉప్పు - రుచికి తగినంత, నూనె - వేయించడానికి సరిపడా



పొరుగు రుచి

తయారీ.. వెడల్పాటి గిన్నెలో బియ్యప్పిండి, మైదా, జొన్నపిండి, ఉప్పు, వాము, అర స్పూన్ కారం వేసి బాగా కలపాలి. అందులో టేబుల్ స్పూన్ నూనె, కొన్ని నీళ్లు జతచేసి మళ్లీ కలపాలి. చపాతీ పిండి కంటే కొంచెం గట్టిగా కలిపి.. పక్కనుంచాలి. పది నిమిషాలు నానిన తర్వాత.. చిన్న భాగాలుగా విడగొట్టి.. చపాతీల్లా ఒత్తుకోవాలి. చాకు లేదా పిజ్జా కట్టర్‌తో పొడవాటి స్ట్రిప్స్‌లా కట్ చేయాలి. అన్నీ అయ్యాక.. కాగుతున్న నూనెలో మధ్యస్థమైన సెగ మీద బంగారు రంగులోకి మారే వరకూ వేయించాలి. వేడిగా ఉండగానే మిగిలిన కారం, ఛాట్ మసాలా, కాస్త ఉప్పు చల్లి అన్నిటికీ పట్టేలా కలపాలి. పూర్తిగా చల్లారాక డబ్బాలోకి తీయాలి. లేదంటే మెత్తబడతాయి. పిండిని అతి కొద్ది నీళ్లతో గట్టిగా ఉండేలా కలపాలి. అప్పుడే కరకరలాడతాయి. జొన్నపిండి బదులు కార్న్ ఫ్లోర్ వేయొచ్చు. తినదలచినప్పుడు కొద్దిగా నిమ్మరసం చల్లితే మరింత రుచిగా ఉంటాయి.

వారెవా.. అమృత్‌సరీ కుల్చా

పిల్లలకు ఎందుకో చపాతీ పెద్దగా నచ్చదు. కుల్చా అనగానే హుషారుగా తినడానికి రెడీ అయిపోతారు. దీన్ని చాలా రకాలుగా చేస్తారు. నేను అమృత్‌సరీ కుల్చా ఇలా చేస్తాను..

ఇందుకోసం... మైదా - 2 కప్పులు, మొక్కజొన్న పిండి - 2 టేబుల్ స్పూన్లు, బేకింగ్ పౌడర్ - అర స్పూన్, బేకింగ్ సోడా - పావు స్పూన్, ఉప్పు - రుచికి తగినంత, పంచదార - స్పూన్, పెరుగు - అర కప్పు, వెన్న - 2 టేబుల్ స్పూన్లు, నూనె - తగినంత, నల్ల జీలకర్ర - స్పూన్, కొత్తిమీర తరుగు- 2 టేబుల్ స్పూన్లు, బంగాళ దుంపలు - 3, ఉల్లిపాయ- 1, పచ్చిమిర్చి- 2, ధనియాల పొడి, తురిమిన అల్లం - స్పూన్ చొప్పున, ఆమ్‌చూర్ పౌడర్, గరం మసాలా, కారం - అర స్పూన్ చొప్పున, ఉప్పు - రుచికి తగినంత, కొత్తిమీర తరుగు - పావు కప్పు తీసుకోవాలి.

పాకవంట

ఎలా చేయాలంటే... బంగాళదుంపలను ఉడికించి పొట్టు తీసి మెత్తగా మెదపాలి. అందులో ఉప్పు, సన్నగా తరిగిన ఉల్లిపాయ, పచ్చిమిర్చి ముక్కలు, ధనియాల పొడి, ఆమ్‌చూర్ పౌడర్, గరం మసాలా, కారం, కొంత కొత్తిమీర జతచేయాలి. ఈ మిశ్రమంతో చిన్న ఉండల్లా చేసి పక్కనుంచాలి. వెడల్పాటి గిన్నెలో మైదా, మొక్కజొన్నపిండి, ఉప్పు, పంచదార, బేకింగ్ పౌడర్, బేకింగ్ సోడా, పెరుగు, వెన్న, తగినన్ని నీళ్లు పోసి మెత్తగా అయ్యేలా బాగా కలపాలి. మూతపెట్టి నాననివ్వాలి. అరగంట తర్వాత పెద్ద నిమ్మకాయంత ఉండలు చేసుకోవాలి. ఒక్కోదాన్నీ చిన్న రొట్టెలా చేసి.. మధ్యలో స్టఫింగ్ ఉంచి.. అంచులను మూసేయాలి. లోపలి స్టఫింగ్ బయటకు రాకుండా మళ్లీ రొట్టె చేయాలి. ఒకవైపు రెండు చుక్కల నీళ్లు పోసి నల్ల జీలకర్ర, కొత్తిమీర చల్లి మరోసారి రోల్ చేయాలి. అన్నీ అయ్యాక.. పెనం మీద రెండు వైపులా కాల్చుకోవాలి. పైన వెన్న రాస్తే అదనపు రుచి వస్తుంది. శనగల కూర, ఉల్లిస్లైసులు, నిమ్మ చెక్కతో వడ్డిస్తే.. అసలైన 'అమృత్‌సరీ కుల్చా' రుచి వస్తుంది.





– వేగె శైలాజా సుధాకర్, హైదరాబాద్

టేస్టీ చికెన్ రోస్ట్

చికెన్ కొందరికి గ్రేవీగా ఉంటే నచ్చుతుంది. ఇంకొందరు డ్రైగా ఉంటేనే బాగుంటుందంటారు. కేరళ వాళ్లు చేసే చికెన్ రోస్ట్ మాత్రం అందరూ ఇష్టపడతారు. మీరూ ఒకసారి ప్రయత్నించి చూడండి!

కావలసినవి

మ్యారినేషన్ కోసం.. చికెన్ - అర కిలో, పసుపు - అర స్పూన్, కారం - స్పూన్, ఉప్పు - తగినంత, నిమ్మరసం - టేబుల్ స్పూన్

రోస్ట్ కోసం.. నూనె - 3 టేబుల్ స్పూన్లు, ఉల్లి తరుగు - ఒకటిన్నర కప్పులు, కరివేపాకు - 2 రెబ్బలు, అల్లం వెల్లుల్లి పేస్ట్ - టేబుల్ స్పూన్, పచ్చిమిర్చి - 2, ధనియాల పొడి - 2 స్పూన్లు, కారం - స్పూన్, గరం మసాలా, మిరియాలు, సోంపు పొడులు - అర స్పూన్ చొప్పున, కొత్తిమీర తరుగు - కొద్దిగా

చెఫ్ స్పెషల్

తయారీ.. చికెన్ ముక్కల్లో కారం, ఉప్పు, పసుపు, నిమ్మరసం వేసి కలిపి.. అరగంట పక్కనుంచాలి. ప్యాన్‌లో కొద్దిగా నూనె వేసి మ్యారినేట్ చేసిన చికెన్ వేసి మూత పెట్టి.. తక్కువ సెగ మీద ఉడికించాలి. నీరు పూర్తిగా ఇగిరిన తర్వాత దించేయాలి. కడాయిలో మిగిలిన నూనె వేడిచేసి.. ఉల్లితరుగును లేత బంగారు రంగులోకి మారే వరకూ వేయించాలి. కరివేపాకు, అల్లం వెల్లుల్లి పేస్ట్, పచ్చిమిర్చి జతచేసి.. పచ్చి వాసన పోయేవరకూ వేగనివ్వాలి. ఇప్పుడు ధనియాలు, మిరియాలు, సోంపు పొడులు, కారం, గరం మసాలా, ఉడికించిన చికెన్ ముక్కలు, కొద్దిగా నీళ్లు జోడించాలి. ముక్కలకు మసాలా బాగా పట్టే వరకూ కలియతిప్పి.. సన్న సెగ మీదుంచాలి. చివర్లో కొత్తిమీర తరుగు చల్లి సెగ తీసేయాలి. ఇది అన్నం, చపాతీ, పరోటా.. ఎందులోకైనా బాగుంటుంది.



తేడాగా నాట్లు... తప్పవు పాట్లు!



చదువులు.. ఉద్యోగమే కాదు.. యువతకు బట్టతలా ఓ సమస్యే. దీని బారి నుంచి తప్పించుకోవడానికి చేసే ప్రయత్నాలు అన్నీ ఇన్నీ కావు.. అందులో ఒకటే హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్.. దీనికి జాగ్రత్తలు అవసరమంటున్నారు నిపుణులు.


ఆహారపు అలవాట్లు, విపరీతమైన కాలుష్యం, మానసిక అనారోగ్యం బట్టతలను తొందరగా తెచ్చిపెడతాయి. వంశపారంపర్యంగా వచ్చే సమస్యల్లో బట్టతల ఒకటని మరిచి ఆందోళన చెందుతారు.

ప్రచార ప్రకటనలను నమ్మి నూనెలు, మందులు, ఇంజెక్షన్లు వాడినంత మాత్రాన జుట్టు రాదని పేర్కొంటున్నారు వైద్యులు.

మూడు దశలు..

- **అనాజెన్:** ఇది మొదటి దశ. జుట్టు కుదుళ్లలో చీలికలు వచ్చి వెంట్రుకలు పట్టు కోల్పోయి, రాలిపోతుంటాయి.
- **కెటాజెన్:** మొదటిదశ ఫలితంగా ఇది మొదలవుతుంది. ఈ దశతో జుట్టు పెరగడం తగ్గి బట్టతల ఆనవాళ్లు కనిపిస్తాయి.
- **టెలోజెన్:** ఈ దశలో సమస్య తీవ్రమై కొత్త జుట్టు మొలవడం ఆగిపోతుంది.

కృత్రిమ కురులు..



- తల వెనకున్న చర్మంతో పాటే వెంట్రుకలను తీసుకొని ఒక్కొక్కదాన్ని విడగొట్టి మనకు కావాల్సిన చోట నాటడం హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌లో ఒక పద్ధతి.
- అయితే కొన్ని సమస్యలు వస్తుండటంతో దీనిని ప్రస్తుతం వాడటం లేదు.
- రెండో విధానం.. వెంట్రుకలను తీసుకొని కావాల్సిన చోట నాటడం.
- దీని వల్ల మూడు నాలుగు రోజుల్లో సాధారణ స్థితికి వచ్చేస్తారు.
- మూడు నెలల తర్వాత వైద్యులు ఇచ్చే మందులతో జుట్టు మందంగా వస్తుంది.

సరైన సమయమేది..?

- ఎప్పుడు హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయించుకోవాలనే సందేహం చాలా మందిలో ఉంటుంది.
- అయితే అందరికీ ఈ విధానమే అవసరం పడకపోవచ్చు.
- పూర్తిగా బట్టతల వచ్చినవారికి మాత్రమే వైద్యులు ఈ విధానాన్ని సిఫారసు చేస్తారు.
- చికిత్సలోనూ పురుషుల్లో 6, మహిళల్లో 3 గ్రేడ్లు ఉంటాయి.
- ఇందులో పురుషుల్లో 4, 5వ గ్రేడ్‌కు హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేస్తారు.
- దాదాపు జుట్టు అంతా ఊడిపోయి చికిత్సకు అనుకూలంగా ఉన్న వాళ్లకు మాత్రమే చేస్తారు.
- అలాగే ఇప్పటికే మందులు వాడుతూ జుట్టు పల్చగా మారి, బట్టతల కనబడుతున్న వాళ్లకే దీనిని సూచిస్తారు.

ఇబ్బందులు తలెత్తుతాయా...?

- హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ సమయంలో ఇచ్చే అనస్థీషియా వల్లే అనేక సమస్యలు వస్తాయంటున్నారు నిపుణులు.
- నూటిలో ఒక్కరిద్దరిలో మాత్రమే వీటిని ముందుగా గుర్తించవచ్చు.
- అందుకే చికిత్సకు ముందే బీపీ, షుగర్, లివర్, కిడ్నీకి సంబంధించిన పరీక్షలు చేస్తారు.
- అనస్థీషియా టెస్టింగ్ డోస్ ఇచ్చిన తర్వాత ఎలాంటి అలెర్జీలు రాకపోతేనే చికిత్స ప్రారంభిస్తారు.
- రెండో ప్రధాన సమస్య హెయిర్ రూట్ ఇన్‌ఫెక్షన్. దీన్ని ఫాలిక్యులైటిస్ అంటారు.
- తలను పరిశుభ్రంగా ఉంచకపోయినా, వైద్యుల పర్యవేక్షణలో నిర్లక్ష్యంగా ఉన్నా దీనికి అవకాశముంటుంది.
- అందుకే చికిత్స తర్వాత ఇది రాకుండా జాగ్రత్తపడాలి.
- చికిత్స అనంతరం కొందరిలో ముఖం వాపు వచ్చే అవకాశముంది.

విశ్రాంతి తప్పనిసరి..

- చికిత్స తీసుకున్న 3 నుంచి 4 రోజుల వరకు విశ్రాంతి తప్పనిసరి.
- అయితే ఇప్పుడు అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతికత వల్ల చికిత్స సులువుగానే పూర్తవుతుంది.
- 3 రోజుల విశ్రాంతి తర్వాత 4వ రోజు నుంచి తలపై టోపీ పెట్టుకుని పనిచేసుకోవచ్చు.
- 14 రోజుల తర్వాత మందులు వాడవచ్చు.
- నెల తర్వాత వ్యాయామమూ ప్రారంభించవచ్చు.

ఫలితం ఏడాదికి...

- జుట్టు ఎప్పుడు వస్తుంది, ఒత్తుగా ఎప్పుడు పెరుగుతుందని చాలా మందిలో ఉంటుంది.
- చికిత్స తీసుకున్న 3 నెలల తర్వాత జుట్టు పెరగడం మొదలైతే.. ఏడాదికి ఫలితం కనిపిస్తుంది.
- చికిత్స అనంతరం వైద్యుల సలహాలు, సూచనల మేరకు జుట్టును కాపాడుకోవాలి.
- వెనకాల ఉన్న సహజమైన జుట్టు సన్నగా కాకుండా చూసుకోవాలి.
- ఒక వేళ కోల్పోతే ఈ చికిత్స వల్ల సరైన ఫలితం లేదని అనుకునే అవకాశం ఉంటుంది.

జాగ్రత్తలివి..

- ప్రతిరోజూ సరైన పోషకాహారం, తగినంత నిద్ర తప్పనిసరిగా ఉండాలి.
- యోగా, వ్యాయామం, క్రీడల్ని దినచర్యలో భాగం చేసుకోవాలి.
- రోజు మార్చి రోజు జుట్టుకు నూనె రాయడం, తలస్నానం చేయడం ఉత్తమం.
- కురులకు రక్త సరఫరా జరిగి జుట్టు బలంగా మారడానికి తలకు మర్దనా చేస్తుండాలి.

ఆరోగ్యమే ముఖ్యం..

జుట్టు విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. సరైన నిద్ర, ఆహారం లేకపోతే హార్మోన్లలో మార్పులు వచ్చి ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంటుంది. వైద్యపరీక్షలు చేయించుకునే సమయంలో అనుభవం కలిగిన వైద్యులను సంప్రదించడం ఉత్తమం.

– ఎస్.ప్రదీప్, సీనియర్ సర్జన్ ఎయిమ్స్

- ఈనాడు డిజిటల్, హైదరాబాద్

సౌకర్యం కంటే సామర్థ్యాన్ని ఇష్టపడతాం



అందుకే 9 ఏళ్లలో 50,000 కి.మీ. పరుగు

“సౌకర్యం కంటే కదలికను, సౌకర్యం కంటే సామర్థ్యాన్ని మేము ఇష్టపడతాం. సజీవంగా, ఉత్సాహంగా ఉండేందుకు పరుగులు తీస్తాం” అంటారు రిటైర్డ్ కర్నల్ బజరంగ్ సింగ్ (67), ఆశాసింగ్ దంపతులు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని లఖ్‌నవూకు చెందిన ఈ జంట పలు ప్రపంచ మారథాన్‌లలో పాల్గొని పతకాలు సాధించింది. 56 ఏళ్ల వయసులో 2014లో బజరంగ్ సింగ్ భారత సైన్యం నుంచి రిటైర్ అయ్యారు. ఆ తర్వాత రన్నింగ్‌ను తమ జీవితంలో భాగంగా మార్చుకోగా.. గృహిణిగా ఉన్న ఆశాసింగ్ సైతం జత కలిశారు. ఈ జంట ఇప్పటివరకు బోస్టన్, లండన్, బెర్లిన్, షికాగో, న్యూయార్క్, సిడ్నీ మారథాన్‌లలో పాల్గొంది. ఇద్దరూ కలిసి తొమ్మిదేళ్లలో దాదాపు 50,000 కి.మీ. పరుగెత్తి 200కు పైగా పతకాలు, అవార్డులు సాధించారు. ఈ విభాగంలో ఇప్పటికే గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సాధించిన వీరు టోక్యో మారథాన్‌లో పాల్గొనేందుకు ఎదురు చూస్తున్నారు.

– ఈటీవీ భారత్

ఈ బ్రదర్స్.. రీసైక్లింగ్ స్టార్స్



బిహార్‌లోని నవాదా జిల్లాకు చెందిన సర్వత్ అనే కుగ్రామం నుంచి వచ్చిన ఇద్దరు సోదరులు ప్లాస్టిక్ వ్యర్థాలతో వ్యాపారం చేసి రూ. 1.25 కోట్ల వార్షిక టర్నోవరు సాధిస్తున్నారు. వికాస్‌కుమార్, రాహుల్‌కుమార్ అనే ఈ సోదరులిద్దరూ ఉన్నత విద్యావంతులు. వికాస్ ఐఐఎం కోల్‌కతా నుంచి బీటెక్ చేశారు, ప్రతిష్ఠాత్మక ఐఐటీ దిల్లీ నుంచి మెకానికల్ ఇంజినీరింగ్‌లో ఎంటెక్ చేశారు. తమ్ముడు రాహుల్ నిఫ్ట్ నుంచి ఫ్యాషన్ టెక్నాలజీలో బ్యాచిలర్ డిగ్రీ పొందారు. ఈ ఇద్దరూ లాభదాయకమైన ఉద్యోగాలు కాదనుకొని సొంతంగా ఏదైనా చేయాలనే తపనతో అయిదేళ్ల కిందట తొలి అడుగు వేశారు. కరోనా లాక్‌డౌను సమయంలో రూ.6 వేల పెట్టుబడితో వ్యర్థాల రీసైక్లింగ్ మొదలుపెట్టి, 2021 నాటికి 'మైనస్ డిగ్రీ' పేరుతో సొంత కంపెనీ ప్రారంభించారు. ప్రస్తుతం ఏడాదిగా ఈ కంపెనీ నెల నెలా 10 టన్నుల వ్యర్థాలను రీసైకిల్ చేస్తూ రూ.1.25 కోట్ల వార్షిక టర్నోవరుకు చేరింది. 12 మంది కార్మికులకు ఉపాధి కల్పిస్తున్నారు. వ్యర్థాలతో వీరు తయారుచేసే టైల్స్, ట్రోఫీలు, ఫర్నీచరుకు అమెరికా, జర్మనీ, తైవాన్, కెనడా, సింగపూర్ వంటి విదేశాల నుంచి కూడా ఆర్డర్లు వస్తున్నాయి. రాష్ట్రపతి భవన్‌లోనూ వీరి ఫర్నీచరుకు చోటు దక్కింది.

– ఈటీవీ భారత్

సతతం హరితం ఈ చదువుల నిలయం

భవనం చుట్టూ చెట్లు.. మేడపైన పచ్చని తోరణాలు అల్లుకుని విల్లాలా కనిపిస్తున్న ఈ భవనం విశాఖపట్నంలోని ద్వారకానగర్‌లో ఉన్న పౌర గ్రంథాలయం. 2003లో ప్రారంభించిన ఈ భవనాన్ని ఉద్యానవనంలా తీర్చిదిద్దారు. నిత్యం పుస్తకాలతో కుస్తీ పట్టే విద్యార్థులు, పోటీ పరీక్షల అభ్యర్థులకు.. కాస్త ఉపశమనం లభించేలా ఆహ్లాదకరంగా మార్చారు. పిల్లలు గ్రంథాలయాలకు అలవాటు పడేలా పూర్తిగా అటవీ వాతావరణాన్ని ప్రతిబింబిస్తూ ఓ గదిని అలంకరించారు. ఇక్కడ 75 వేల పుస్తకాలు ఉండగా రోజు 1,200 మంది పాఠకులు వస్తుంటారు. మూడు అంతస్తులు ఉన్న భవన నిర్వహణ బాధ్యతలను విశాఖ పబ్లిక్ లైబ్రరీ సొసైటీ ప్రతినిధులు చూసుకుంటున్నారు. ఇందుకోసం ప్రతి నెల దాతలు విరాళాలు ఇస్తుండటం గమనార్హం.

– ఈనాడు, విశాఖపట్నం



ఈ నీలమణికి సాటిలేదట!



ప్రపంచంలోనే అతి పెద్ద ఊదా రంగు స్టార్ నీలం రాయి శ్రీలంకలో లభ్యమైంది. ఇది 3,563 క్యారెట్లుంది. దీనిని శనివారం కొలంబోలో యజమానులు ఆవిష్కరించారు. ఇది ప్రపంచంలోనే అతి పెద్ద సహజమైన నీలం కావొచ్చని జెమాలజిస్టు అమర సింఘే తెలిపారు. దీని విలువ 300 మిలియన్ డాలర్లని (రూ.2,726 కోట్లు) వెల్లడించారు. చక్రం ఆకారంలో ఉన్న ఈ నీలంకు ‘స్టార్ ఆఫ్ ప్యూర్ ల్యాండ్’ అని పేరు పెట్టారు. ఇది 2023లో రత్నపురలో దొరికిందని యజమాని ఒకరు తెలిపారు. తొలుత దీనిని సాధారణ నీలంలతోపాటే కొనుగోలు చేశామని, పాలిష్ చేశాక తాజాగా దాని విశిష్టతను గుర్తించామని వివరించారు.

– కొలంబో



వరి వంగడాలు.. వెదురు వయ్యారాలు

జగిత్యాల జిల్లా పొలాస ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు వరి, వేరుశనగ, పసుపు, నువ్వులు, బీర పంటల్లో దాదాపు 20 కొత్త వంగడాలను రూపొందించారు. ఇందులో అత్యధికం వరిలో ఉన్నాయి. ఇదే ఆవరణలో ఉన్న వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు వరి వంగడాల నమూనాలకు వెదురు బద్దలతో ఇలా ఆకట్టుకునే ఆకృతి కల్పించారు.

- న్యూస్‌టుడే, జగిత్యాల వ్యవసాయం

ఈ చేపల ప్రదర్శనకు 519 ఏళ్ల చరిత్ర

బెంగాలీల ఆహారంలో చేపలకు ప్రత్యేక స్థానం ఉంటుంది. చేపలతో చేసే బెంగాలీ వంటకాలు బోలెడు. హుగ్లీ జిల్లాలోని దేవానందపుర్ సమీప కెస్టోపుర్ గ్రామంలో నిర్వహించే చేపల ప్రదర్శనకు 519 ఏళ్ల చరిత్ర ఉంది. మాఘ మాస ప్రారంభంలో ప్రతి ఏటా పౌష్య సంక్రాంతి నాడు ఈ ప్రదర్శన ఏర్పాటు చేస్తారు.



పలు ప్రాంతాల నుంచి తరలివచ్చే వ్యాపారులు విక్రయించే వివిధ రకాల చేపలతోపాటు వండిన వెరైటీలు సైతం ఇక్కడ దొరుకుతాయి. చిరు చేపలు మొదలు కట్లా, టూనా, హిల్సా, ఈల్స్, రోహు వంటి 40 - 50 కిలోల రకాలు.. రొయ్యలు, పీతలు రాశులుగా పోసి అమ్ముతారు. ఇతర జిల్లాల నుంచి సైతం వచ్చే చాలామంది శీతాకాల వాతావరణాన్ని ఆస్వాదిస్తూ సమీప మామిడితోటల్లో పిక్నిక్‌లు ఏర్పాటు చేసుకొని చేపలు ఆరగిస్తారు. స్థానిక రాధాగోవింద ఆలయంలో పూజలు చేస్తారు. కెస్టోపుర్ చేపల ప్రదర్శనకు ఈ ఆలయంతో ముడిపడిన ఓ స్థలపురాణం కూడా ప్రచారంలో ఉంది.

ETV భారత్

హిజాబ్ పిన్ను మింగేసిన బాలిక రెండు నిమిషాల్లోపే శస్త్రచికిత్స

మధ్యప్రదేశ్‌లోని శ్యోపుర్‌కు చెందిన 11 ఏళ్ల బాలిక హిజాబ్ (ముఖ వస్త్రం) ధరిస్తున్న క్రమంలో అంగుళం పొడవు ఉన్న సేఫ్టీ పిన్ను మింగేయగా.. అది శ్వాసనాళంలో ఇరుక్కుపోయింది. దగ్గుతూ ఊపిరి తీసుకునేందుకు ఇబ్బందిపడుతున్న బాలికను కుటుంబసభ్యులు శ్యోపుర్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు రాజస్థాన్‌లోని కోటా వైద్య కళాశాలకు తీసుకొచ్చారు. ఎండోస్కోపీ విధానం ద్వారా శస్త్రచికిత్స చేసిన కోటా వైద్యులు రెండు నిమిషాల్లోపే ఆపరేషను పూర్తిచేసి బాలిక ప్రాణాలు కాపాడారు. ఈఎన్‌టీ శాఖాధిపతి డాక్టర్ శివకుమార్ సారథ్యంలోని వైద్యబృందం శుక్రవారం ఈ శస్త్రచికిత్సను నిర్వహించింది. “పిన్ను శ్వాసనాళంలో ఎక్కువసేపు ఉంటే ఇన్ఫెక్షను సోకుతుంది. బాలిక శ్వాస తీసుకోడానికి కూడా ఆటంకం కలుగుతుంది. అనస్థీషియా ఇచ్చాక ఆమె శ్వాసను



కాసేపు నిలిపివేసి ఈ క్లిష్టమైన ఆపరేషను పూర్తి చేశాం. బాలిక ఇప్పుడు క్షేమంగా ఉంది. ఎప్పటిలాగే ఆహారం, నీరు తీసుకుంటోంది” అని డాక్టర్ శివకుమార్ వివరించారు.

గాజా శాంతి మండలిలో అజయ్ బంగా

- మార్కో రూబియోకు కూడా చోటు
- కూర్పుపై ఇజ్రాయెల్ అసంతృప్తి

వాషింగ్టన్: గాజా పునర్నిర్మాణం కోసం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఏర్పాటు చేసిన శాంతి మండలి (బోర్డ్ ఆఫ్ పీస్)లో ఇండియన్-అమెరికన్, ప్రపంచ బ్యాంక్ అధ్యక్షుడు అజయ్ బంగాకు చోటు లభించింది. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో కూడా ఈ మండలికి ఎంపికయ్యారు. శాంతి మండలిలోని రెండు కీలక మండళ్లకు ఎంపికైన వారి పేర్లను వైట్‌హౌస్ శుక్రవారం విడుదల చేసింది. ఈ మండలికి ట్రంప్ ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే. బంగా, రూబియోలతో పాటు.. కార్యనిర్వాహక బోర్డులో పశ్చిమాసియా అమెరికా ప్రత్యేక దూత స్టీవ్ విట్కాఫ్, ట్రంప్ అల్లుడు జేర్డ్ కుష్నర్, బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్, అపోలో మేనేజ్‌మెంట్ సీఈవో మార్క్ రువాన్, తుర్కియే విదేశాంగ మంత్రి హకాన్ ఫిదాన్, ఖతార్ దౌత్యవేత్త అలి తవాడి, ఈజిప్టు నిఘా అధిపతి హసన్, యూఏఈ మంత్రి అల్ హషిమి, అమెరికా జాతీయ ఉప భద్రతా సలహాదారు రాబర్ట్ గాబ్రియెల్ తదితరులు ఉన్నారు. గాజా కార్యనిర్వాహక మండలిలో తమ దేశానికి సరైన ప్రాతినిధ్యం కల్పించకపోవడంపై ఇజ్రాయెల్ అసంతృప్తి వ్యక్తం చేసింది.

మీ సామర్థ్యాన్ని పెంచుకోవాలంటే..



నేను ఫలానా పని చేయడానికి అర్హుణ్ని కాదు, అందులో నాకు పెద్దగా పట్టు లేదు, నా నైపుణ్యాలకు విలువ లేదు అని మీకు మీరు ఎప్పుడూ చెప్పుకోకండి. మీకు అర్హత లేదని భావిస్తున్న పనులను చేయడం మొదలుపెడితేనే మీ సామర్థ్యం పెరుగుతుంది. అప్పుడే మీ ఎదుగుదల మొదలవుతుంది.

– స్టీవెన్ బార్ట్‌లెట్, అంత్రప్రెన్యూర్

ట్రంప్ ఓ నేరస్థుడు



- ఇరాన్‌లో ఆందోళనలకు ఆయన మద్దతు
- ఎవరినీ వదిలిపెట్టం
- సుప్రీం లీడర్ ఖమేనీ స్పష్టీకరణ



దుబాయ్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. ఓ నేరస్థుడని ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ ధ్వజమెత్తారు. ఇరాన్‌లో ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనలకు ఆయన మద్దతిస్తున్నారని విమర్శించారు. దేశంలో వేల మంది చనిపోవడానికి ఆందోళనకారులే కారణమని ఆరోపించారు. ప్రభుత్వ టీవీ ఛానల్‌ద్వారా శనివారం ఆయన దేశ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ‘ఈ తిరుగుబాటుకు అమెరికా అధ్యక్షుడు స్వయంగా ఆజ్యం పోశారు. విద్రోహ శక్తులకు మద్దతిచ్చారు. సైనికపరంగా సాయం చేస్తామని ప్రకటించారు. తద్వారా ఇరాన్‌పై రాజకీయంగా, ఆర్థికంగా పెత్తనం చేయాలని చూశారు. అందుకే ఆయనను నేరస్థుడిగా చూస్తున్నాం. అనేక మంది మరణానికి, విధ్వంసానికి ఆయన కారకుడు. ఇరాన్‌కు వ్యతిరేకంగా ఆయన వ్యవహరించారు. ఆందోళనకారులు అమెరికా కాలికింద చెప్పుల్లాంటివారు. వారు మసీదులను, విద్యా సంస్థలను ధ్వంసం చేశారు. ప్రజలను ఇబ్బందిపెడుతూ వేల మంది మరణానికి కారకులయ్యారు’ అని ఖమేనీ ధ్వజమెత్తారు. మరోవైపు తన వ్యాఖ్యల ద్వారా ఆందోళనల్లో వేల మంది మరణించిన విషయాన్ని ఆయన అంగీకరించారు. విదేశాల నుంచి అందిన ఆయుధాలతో ఆందోళనకారులు విధ్వంసానికి పాల్పడ్డారని ఖమేనీ ఆరోపించారు. అయితే ఏ దేశాల నుంచి వచ్చాయనే వివరాలను వెల్లడించలేదు.

ఆందోళనకారులను వదలిపెట్టం

మేమేమీ ప్రణాళిక రచించుకోలేదు. దేశాన్ని యుద్ధం దిశగా తీసుకెళ్లబోం. అయితే దేశంలోని విధ్వంసక శక్తులను వదిలిపెట్టం. అధికారులు వారి కేసులను పరిశీలిస్తున్నారు. దేశంలోని వీరికంటే విదేశీ విధ్వంసకారులే అత్యంత ప్రమాదకరంగా ఉన్నారు’ అని ఖమేనీ స్పష్టం చేశారు.

■ ఇరాన్‌పై సానుకూల స్వరంతో ట్రంప్ మాట్లాడిన మరుసటి రోజే ఆయనపై ఖమేనీ విరుచుకుపడటం గమనార్హం. 800 మందికి విధించిన మరణ శిక్షలను ఆ దేశం రద్దు చేసిందని శుక్రవారం ట్రంప్ ప్రకటించారు. అంతేకాదు.. ఆ దేశంపై దాడి చేసే ఆలోచన ఇప్పట్లో లేదని వెల్లడించారు. అయితే తాను ఇరాన్‌లోని ఏ నేతతో మాట్లాడిందీ ఆయన వెల్లడించలేదు.

మాట వినని 8 ఐరోపా దేశాలపై 10% అదనపు సుంకం

- గ్రీన్‌లాండ్ వివాదంలో ట్రంప్ నిర్ణయం

నూక్: గ్రీన్‌లాండ్ విషయంలో తమ విధానాన్ని వ్యతిరేకిస్తున్న 8 ఐరోపా దేశాలపై 10 శాతం అదనపు సుంకం విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. ఈ దేశాల నుంచి అమెరికాకు దిగుమతి అయ్యే సరకులపై 10 శాతం అదనపు సుంకం ఫిబ్రవరి నుంచి అమల్లోకి వస్తుందని శనివారం ఆయన తన సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు. డెన్మార్క్, నార్వే, స్వీడన్, ఫ్రాన్స్ జర్మనీ, బ్రిటన్, నెదర్లాండ్స్, ఫిన్లాండ్ దేశాలకు ఈ సుంకం వర్తిస్తుందని తెలిపారు. గ్రీన్‌లాండ్‌ను అమెరికా సంపూర్ణంగా కొనుగోలు చేయడంపై జూన్ 1కల్లా అంగీకారం కుదరకపోతే సుంకాన్ని 25శాతానికి పెంచుతానని ట్రంప్ హెచ్చరించారు. గ్రీన్‌లాండ్ విషయంలో ట్రంప్ వాదనతో అమెరికన్ కాంగ్రెస్ ద్వైపాక్షిక ప్రతినిధి బృందం విభేదించింది. ట్రంప్ మాటలెలా ఉన్నా తాము డెన్మార్క్‌కు, దాని భూభాగమైన గ్రీన్‌లాండ్‌కు మద్దతు తెలుపుతున్నామని శనివారం స్పష్టం చేసింది.

మహారాష్ట్ర స్థానిక ఎన్నికల్లో భాజపా ఘన విజయం

మొత్తం 2,869 స్థానాల్లో సగానికిపైగా ఆ పార్టీ ఖాతాలోకే

ముంబయి: మహారాష్ట్రలోని మున్సిపల్ కార్పొరేషన్లకు జరిగిన ఎన్నికల్లో భాజపా భారీ విజయాలను నమోదు చేసింది. ఆ పార్టీ నేతృత్వంలోని మహాయుతి కూటమి భాగస్వామ్య పక్షం శివసేన (శిందే)తో కలిపి రాష్ట్రంలోని మొత్తం 29 మున్సిపల్ కార్పొరేషన్లకు గాను 25 కైవసం చేసుకుంది. 19 నగరాల్లో భాజపా ఏకైక అతి పెద్ద పార్టీగా నిలిచింది. 20 మున్సిపల్ కార్పొరేషన్లలో భాజపా అభ్యర్థులే మేయర్ పదవులను చేపట్టనున్నారు. ఈ నెల 15న ఎన్నికలు జరిగిన 29 మున్సిపల్ కార్పొరేషన్లలో మొత్తం 2,869 స్థానాలు ఉండగా 1,425 సీట్లలో భాజపా విజయకేతనం ఎగురవేసింది. శుక్రవారం రాత్రి వీటి ఫలితాలు వెలువడ్డాయి.

మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో పార్టీలు గెలుచుకున్న స్థానాలు	
మొత్తం స్థానాలు	2,869
భాజపా	1,425
శివసేన (శిందే)	399
కాంగ్రెస్	324
ఎన్సీపీ(ఏపీ)	167
శివసేన(యూబీటీ)	155
ఏఐఎంఐఎం	125
ఎన్సీపీ (ఎస్పీ)	36
ఎం.ఎన్.ఎస్	13
ఇతరులు	225

■ 227 స్థానాలున్న బృహన్‌ముంబయి(బీఎంసీ)లో భాజపా 89 చోట్ల గెలుపొందింది. 29 స్థానాల్లో విజయం సాధించిన మిత్ర పక్షం శివసేన(శిందే)తో కలిసి రెండున్నర దశాబ్దాల తర్వాత మేయర్ పదవిని చేజిక్కించుకోనుంది. శివసేన(యూబీటీ)-65, దాని మిత్రపక్షం ఎంఎన్ఎస్-6, వంచిత్ బహుజన్ అఘాడీతో కలిసి పోటీ చేసిన కాంగ్రెస్ పార్టీ-24, ఏఐఎంఐఎం-8, ఎన్సీపీ(అజిత్‌పవార్)-3, సమాజ్‌వాదీ పార్టీ-2 సీట్లు దక్కించుకున్నాయి. శరద్‌పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ(ఎస్పీ) ఒక్క సీటుకే పరిమితమైంది.

బంగ్లాలో మరో హిందువు హత్య

దిల్లీ, ఢాకా: బంగ్లాదేశ్‌లో మరో హిందూ యువకుడి హత్య జరిగింది. వాహనంలో ఇంధనం నింపుకొని డబ్బులు చెల్లించకుండా వెళ్తున్న దుండగులను అడ్డుకునే క్రమంలో రిపన్ సాహా అనే 30 ఏళ్ల యువకుడు ప్రాణాలు కోల్పోయారు. దుండగులు వాహనాన్ని ఆపకుండా అతడిని తొక్కించుకుంటూ వెళ్లారు. దీంతో సాహా మరణించారు. రాజ్‌బరీ జిల్లాలో ఈ ఘటన చోటుచేసుకుంది. గోలంద మోర్‌లోని కరీం ఫిల్లింగ్ స్టేషన్‌లో రిపన్ సాహా పని చేస్తున్నారు. శుక్రవారం సాయంత్రం 4.30 గంటల సమయంలో నలుపు రంగు ఎస్‌యూవీలో కొందరు పెట్రోలు స్టేషన్‌కు వచ్చారు. 5వేల టాకాల (రూ.3,710) ఇంధనం నింపుకొన్నారు. ఆ వెంటనే బిల్లు చెల్లించకుండా వాహనాన్ని ముందుకు కదిలించారు. వారిని ఆపేందుకు సాహా ప్రయత్నించారు. కానీ వారు అతడిని తొక్కించుకుంటూ వెళ్లారు. దీంతో సాహా అక్కడికక్కడే మరణించారు. సాహాపై వాహనాన్ని పోనిచ్చి అతడి మృతికి కారణమైన దాని యజమాని అబ్దుల్ హషీం అలియాస్ సుజాన్ (55), అతడి డ్రైవరు కమల్ హుసేన్ (43)ను పోలీసులు అరెస్టు చేశారు.

పారాసిటమాల్‌తో ఆటిజం ముప్పు రాదు

దిల్లీ: గర్భధారణ సమయంలో పారాసిటమాల్ వాడటం వల్ల శిశువుల్లో ఆటిజం, మేధో వైకల్యం, అతి చురుకుదనం(అటెన్షన్ డెఫిసిట్-హైపర్ ఆక్టివిటీ డిజార్డర్) వంటి సమస్యలు వస్తాయనడానికి ఎలాంటి శాస్త్రీయ ఆధారాలు లేవని ఓ అధ్యయనంలో వెల్లడైంది. ఈ వివరాలు ‘ద లాన్సెట్ అబ్‌స్టెట్రిక్స్, గైనకాలజీ, ఉమెన్ హెల్త్’ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. “గర్భధారణ సమయంలో వైద్యుల సలహా మేరకు పారాసిటమాల్ తీసుకున్న వారి పిల్లల్లో ఆటిజం, మేధో వైకల్యం, అతి చురుకుదనం వంటి సమస్యలు రావని ఆధారాలు సూచిస్తున్నాయి. దాని భద్రతపై ఇప్పటికే ఉన్న సిఫార్సుకు మరింత మద్దతునిస్తున్నాయి. పారాసిటమాల్ వాడిన, వాడని పలువురు గర్భిణిల ఆరోగ్య నివేదికలను పరిశీలించినపుడు.. గర్భధారణ సమయంలో పారాసిటమాల్ తీసుకోవడం వల్ల ఆటిజం రుగ్మత ప్రమాదం లేదని తెలిసింది. గర్భిణిలకు అసౌకర్యం, అంతర్లీన నొప్పి, జ్వరం వంటివి వచ్చినపుడు వైద్యులే పారాసిటమాల్‌ను సూచిస్తారు. గర్భధారణ సమయంలో పారాసిటమాల్ వాడటం వల్ల పిండం మనుగడ, నరాల అభివృద్ధికి హాని కలుగుతుందని చెప్పేందుకు నిర్దిష్ట ఆధారాలు లేవు” అని పరిశోధనలో వెల్లడైంది.

ఇందౌర్ మరణాలకు ప్రభుత్వానిదే బాధ్యత: రాహుల్

ఇందౌర్: మధ్యప్రదేశ్‌లోని ఇందౌర్‌లో జరిగిన కలుషిత నీటి మరణాలకు ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. భాగీరథ్‌పుర ప్రాంతంలో కలుషిత జలాలు తాగి ఆస్పత్రి పాలైన బాధితులను రాహుల్ పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందించడం, కాలుష్యాన్ని నియంత్రించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ‘చాలా నగరాల్లో ఇదే జరుగుతోంది. స్వచ్ఛమైన నీటిని అందించడం, కాలుష్యాన్ని నియంత్రించడమనేది ప్రభుత్వ బాధ్యత. వీటిని ప్రభుత్వం నెరవేర్చడం లేదు. ఇక్కడ ప్రభుత్వానికి బాధ్యత ఉంటే దానిని వారు నిర్వర్తించాలి. వీళ్లు(బాధితులు) అదే కోరుకుంటున్నారు. వారికి మద్దతు ఇవ్వడానికే వచ్చాను. ఇందులో ఎలాంటి రాజకీయం లేదు. కావాలంటే దీన్ని రాజకీయమని పిలవండి. నాకు ఎటువంటి అభ్యంతరం లేదు. నేను వీరికి మద్దతు ఇవ్వడానికి వచ్చాను. వీరికి స్వచ్ఛమైన మంచినీటిని అందించాలి’’ అని రాహుల్ డిమాండ్ చేశారు.



ఇందౌర్‌లో కలుషిత నీరు తాగి ప్రాణాలు కోల్పోయిన ఓ వ్యక్తి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న రాహుల్‌గాంధీ

నిమ్మ.. దీనికెంతో కమ్మన!



చిత్రంలో కనిపిస్తున్న నల్లటి సీతాకోకచిలుక బ్లూ మోర్మన్ జాతికి చెందింది. మన దేశంలో కనిపించే అతిపెద్ద సీతాకోకచిలుకల్లో ఇవి ఒకటి. వీటి రెక్కలు 120 నుంచి 150 మిల్లీమీటర్ల వరకు పెరుగుతాయి. రెక్కల పైభాగం నల్లగా.. తెలుపు, ఎరుపు రంగుల సమ్మేళనంతో ఉంటుంది. మహారాష్ట్ర ప్రభుత్వం వీటిని 2015లో రాష్ట్ర సీతాకోకచిలుకగా ప్రకటించింది. ఇవి నిమ్మజాతి పువ్వుల్లోని మకరందాన్ని ఎక్కువగా ఇష్టపడతాయని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల జంతుశాస్త్ర అధ్యాపకుడు కె.బాబు తెలిపారు. కాకినాడ నగరంలోని బోట్ క్లబ్ ఉద్యానంలో కనిపించింది ఈ సీతాకోకచిలుక.
– ఈనాడు, కాకినాడ

ప్రైవేట్ విశ్వవిద్యాలయాల ఏర్పాటుకు నిబంధనల్లో మార్పులు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో ప్రైవేట్ విశ్వవిద్యాలయాల (బ్రౌన్ ఫీల్డ్) ఏర్పాటుకు ప్రస్తుతం ఉన్న నిబంధనలను ప్రభుత్వం సవరించింది. ఈ మేరకు ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. కొత్తగా ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు ఏర్పాటు చేయాలనుకున్న సంస్థలు స్పష్టమైన దరఖాస్తు విధానాన్ని అనుసరించడంతోపాటు.. సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్) ఉన్నత విద్యాశాఖకు సమర్పించాలని సూచించారు.







డబ్బులు తీశారని ఆరోపిస్తూ ఉప్పులూరు బరి వద్ద చొక్కాలు తీయించి.. తాళ్లతో కట్టేసిన వైనం ★ గుడ్లవల్లేరు బరిలో కుర్చీలు, కర్రలతో దాడులు ★ ఘంటసాల మండలం లంకపల్లిలో ఎస్సైతో స్థానికుల వాగ్వాదం

బరుల్లో బరి తెగించారు!

- పందేల డబ్బులు దొంగిలించారంటూ దుస్తులూడదీసి 11 మందిపై దాడి
- పలుచోట్ల కర్రలు, కుర్చీలతో కొట్లాటలు
- కృష్ణా జిల్లాలో చెలరేగిన ఘర్షణలు

ఈనాడు డిజిటల్, మచిలీపట్నం: కృష్ణాజిల్లాలో కోడి పందేల బరుల వద్ద శుక్రవారం రాత్రి పలుచోట్ల ఘర్షణలు చెలరేగాయి. జూదాల డబ్బులు దొంగిలించారంటూ ఉప్పులూరు బరిలో.. దుస్తులు ఊడదీసి, తాళ్లతో కట్టేసి 11 మందిపై అమానవీయంగా దాడి చేశారు. మరికొన్ని చోట్ల పందెం విషయంలో ఇరు వర్గాలు కర్రలు, కుర్చీలతో కొట్టుకున్నారు. మద్యం మత్తులో గొడవ పడ్డారు. ఇన్ని జరిగినా చాలాచోట్ల కేసులు నమోదు కాలేదు. నమోదైన చోట కోడి పందేల ఘర్షణలు కాదన్నట్లు కేసులు రాయడం గమనార్హం.

తాళ్లతో కట్టేసి.. వీడియోలు తీసి

కంకిపాడు మండలంలోని ఉప్పులూరులో నిర్వహించిన కోడి పందేల బరిలో తోట్లవల్లూరు ప్రాంతానికి చెందిన గొల్లపల్లి మధు అనే వ్యక్తి చిన్నబజార్-పెద్ద బజార్(పేకముక్కలాట) జూదం నిర్వహించారు. ఆ డిక్ సహాయకులుగా వారి ప్రాంతానికి చెందిన పలువురిని తీసుకొచ్చారు. జూదం డబ్బుల్లో తేడాలొచ్చాయని సహాయకుల వర్గం.. మధు కర్రలతో పరస్పరం దాడులు చేసుకున్నారు. జూదం డబ్బులు నొక్కేశారంటూ మధుతో పాటు మరికొందరు.. 11 మందిపై దాడి చేసి వారి చొక్కాలు తీయించి.. తాళ్లతో కట్టేసి అమానవీయంగా ప్రవర్తించారు. అసభ్యంగా తిడుతూ వీడియోలు తీశారు. ఆలస్యంగా సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఇరు వర్గాల వారిని రాజీకి తరలించారు. అయితే వారు నమోదు చేసిన కేసులో 'మధు అనే వ్యక్తి గోపీ అనే అతనికి డబ్బు ఇవ్వాల్సి ఉంది. వారిద్దరూ ఉప్పులూరు రైల్వేగేటు వద్ద ఎదురుపడ్డారు. డబ్బు ఇవ్వడం లేదని గోపీ నిలదీశాడు. వారి మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. దీంతో ఒక వర్గం వారిని మరో వర్గం వారు పట్టుకున్న పొలంలో కట్టేశారు' అని పోలీసులు పేర్కొన్నారు. ఘర్షణ జరిగింది కోడిపందేల బరుల్లో జూదాల విషయంలో అయితే వాటితో సంబంధమే లేదన్నట్లు పోలీసులు కేసు నమోదు చేయడం తీవ్ర విమర్శలకు తావిచ్చింది.

★ కత్తి సరిగా కట్టకపోవడంతో తమ కోడి పుంజు ఓడిపోయిందని గుడ్లవల్లేరు బరిలో కొందరు వాదనకు దిగారు. దీంతో ఇరు వర్గాల వారు కర్రలు, కుర్చీలతో పరస్పరం దాడులు చేసుకున్నారు. పలువురికి గాయాలయ్యాయి. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని స్థానిక పోలీసులు చెప్పారు.

★ ఘంటసాల మండలం లంకపల్లిలో ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఘటన స్థలానికి ఎస్సై ప్రవీణ్ చేరుకుని వారికి సర్దిచెప్పారు. ఈ క్రమంలో పలువురు ఆయనతో వాగ్వాదానికి దిగారు. దీన్ని వక్రీకరించి ఎస్సైపై దాడికి యత్నించారంటూ సామాజిక మాధ్యమాల్లో వీడియోను కొందరు వైరల్ చేశారు.

అనంత ఎమ్మెల్యే అక్రమాలపై విచారణకు డిమాండ్

ఎస్పీ కార్యాలయం ఎదుట సీపీఐ ఆందోళన



నిరసన తెలుపుతున్న సీపీఐ శ్రేణులు

అజాద్‌నగర్ (అనంతపురం), న్యూస్‌టుడే: అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, ఆతని అనుచరుల అక్రమాలు, దౌర్జన్యాలపై ప్రభుత్వం విచారణ జరిపించి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని సీపీఐ నగర సమితి డిమాండ్ చేసింది. ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు శనివారం అనంతపురంలోని అంబేడ్కర్ విగ్రహం నుంచి ఎస్పీ కార్యాలయం వరకు ప్రదర్శనగా వెళ్లి నిరసన తెలిపారు. ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పార్టీ నగర కార్యదర్శి శ్రీరాములు మాట్లాడుతూ 'దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్.. నగరవాసుల పరువును తీస్తున్నారు. చంద్రబాబుకు 'సైకో' అని, జూనియర్ ఎన్టీఆర్‌ను దూషించారు. అనేక మంది జనం ఓటేసి గెలిపించారు. ఎమ్మెల్యే ఎన్నికైనప్పటి నుంచి ఆయన ప్రవర్తన ప్రజలను నిరాశ పరిచేలా ఉంది. తన అనుచరుల ద్వారా గంగారామ్ సాయంతో ఎమ్మెల్యే మాఫియా తరహాలో వ్యవహరిస్తున్నారు. హోటల్‌లో గదులు ఇవ్వక పోయినా బెదిరిస్తున్నారు. ఖాళీ స్థలం కనిపిస్తే కబ్జాలకు దిగుతున్నారు. సొంత పార్టీ మహిళా నాయకురాలికి చెందిన ఆస్తిని ఆక్రమించారని ఆరోపించారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ జగదీశ్‌కు వినతిపత్రం అందజేశారు. సీపీఐ నాయకులు రమణయ్య, పద్మావతి, లింగమయ్య, సంతోష్, కృష్ణుడు, కుళ్లాయిస్వామి, నారాయణస్వామి, రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బావమరిది గురించి మాట్లాడతావా?

బాధితురాలి భర్తపై బూతులతో విరుచుకుపడిన దగ్గుపాటి

ఈనాడు, అనంతపురం: 'నువ్వూ నీ భార్య ఎప్పుడైనా ఎమ్మెల్యేను చూశారా? ఎమ్మెల్యే బావమరిది గురించి మాట్లాడతారా?' అంటూ అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ నగరంలో కంటి అద్దాల షాపు నిర్వాహకురాలి భర్తపై రెచ్చిపోయారు. అనంతపురం సాయినగర్‌లో షరీఫ్, సుమయ దంపతులు ఆస్రా పేరుతో ఆప్టికల్ షాపు నిర్వహిస్తున్నారు. 2024లోనే ఆ దుకాణాన్ని కొనుగోలు చేశారు. దాన్ని బ్యాంకులో తనఖా పెట్టి రుణం పొందారు. అయితే వీరికి షాపును అమ్మిన వ్యక్తితో కొందరు డబుల్ రిజిస్ట్రేషన్ చేయించుకుని వివాదం సృష్టించారు. దీనిపై బాధితులు జిల్లా రిజిస్ట్రార్‌ను ఆశ్రయించారు. ఈ క్రమంలో సుమయ గతేడాది ఆగస్టు 9న మీడియాతో మాట్లాడుతూ.. తమకు అన్యాయం జరిగిందని ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదని, ఇందుకు ఎమ్మెల్యే బావమరిది అశోక్ పేరు చెబుతున్నారని వాపోయారు. దీంతో ఎమ్మెల్యే అదేరోజు షరీఫ్‌నకు ఫోన్ చేసి దుర్భాషలాడారు. పత్రికలో రాయలేని విధంగా దంపతులను బూతులు తిట్టారు. ఆ ఆడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

అడవుల్లో దాడులు పెరగడంతో బయటకొచ్చాం

- కస్టడీలో వెల్లడించిన మావోయిస్టులు

ఈనాడు – అమరావతి, న్యూస్‌టుడే – పెనమలూరు: 'అడవుల్లో ఎన్‌కౌంటర్లు పెరిగాయి. కీలక నేతలు నేలకొరుగుతుండడంతో మాపై ఒత్తిడి పెరిగింది. కొన్నాళ్లు మైదాన ప్రాంతాల్లో షెల్టర్ తీసుకోవాలంటూ ఉన్నత స్థాయి నుంచి వచ్చిన ఆదేశాలతో బయటకు వచ్చామ'ని ఇటీవల ఎన్‌కౌంటర్‌లో మరణించిన మావోయిస్టు పార్టీ అగ్రనేత హిడ్మా బృందంలోని ముగ్గురు కీలక మావోయిస్టులు వెల్లడించారు. గతేడాది నవంబరులో విజయవాడ నగరం కానూరు కొత్త ఆటోనగర్‌లో 28 మంది మావోయిస్టులను కృష్ణా జిల్లా పెనమలూరు పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. వీరిలో ముగ్గురిని కస్టడీకి తీసుకుని విచారించేందుకు పెనమలూరు పోలీసులు విజయవాడలోని తాలూకా కోర్టులో ఇటీవల పిటిషన్ దాఖలు చేశారు. ఆ మావోయిస్టులు రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో రిమాండ్‌లో ఉన్నందున అక్కడే విచారించాలని కోర్టు ఆదేశాలిచ్చింది. దీనిపై పోలీసులు హైకోర్టును ఆశ్రయించడంతో శుక్ర, శనివారాలు పోలీసు కస్టడీకి ఇస్తూ ఆదేశాలిచ్చింది. వీరు అరెస్టై శనివారానికి 60 రోజులు అవుతోంది. కొత్త చట్టాల మేరకు 60 రోజుల్లోపే కస్టడీకి తీసుకోవాల్సి ఉంది. శుక్రవారం సాయంత్రం హైకోర్టు ఆదేశాలు అందుకున్న పోలీసులు.. వెంటనే రాజమహేంద్రవరం జైలుకెళ్లి ఉద్దే రఘు, ఓయం జ్యోతి, మదకం దివాకర్ అలియాస్ మిట్టును అదుపులోకి తీసుకున్నారు. శనివారం తెల్లవారుజామున వారిని పెనమలూరు స్టేషన్‌కు తరలించారు. ముగ్గురిని వేర్వేరుగా విచారించారు.







కస్టడీ సందర్భంగా పెనమలూరు పోలీస్‌స్టేషన్ వద్ద మావోయిస్టులు

హిడ్మా చనిపోయినట్లు మేం అరెస్టయ్యాకే తెలిసింది

ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఈ ముగ్గురు మావోయిస్టులను పోలీసులు పలువిధాలుగా ప్రశ్నించి సమాధానాలు రాబట్టారని తెలిసింది. దళంలోకి ఎందుకు వెళ్లారని ప్రశ్నించగా, విప్లవ భావజాలానికి ఆకర్షితులై అడవిబాట పట్టినట్లు వారు చెప్పారు. 'పోలీసులు, పారామిలిటరీ దళాలు అడవులను జల్లెడ పడుతున్నాయి. కొన్నాళ్లపాటు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని వచ్చిన ఆదేశాల మేరకు మేం బయటకొచ్చాం. మా దళంలోని కొందరు గతంలో వైద్యం కోసం విజయవాడ వచ్చారు. వారి తోడ్పాటుతో ఇక్కడికి చేరుకున్నామ'ని వివరించారు. విజయవాడలో వీవీఐపీలను టార్గెట్ చేసేందుకు వచ్చారా అని పోలీసులు ప్రశ్నించగా.. 'అలా కాదు. కేవలం షెల్టర్‌కోసమే వచ్చాం. మేమంతా అక్టోబర్ 30 నుంచే కానూరు, పరిసర ప్రాంతాలకు బృందాలుగా చేరుకున్నాం. విజయవాడ, పరిసర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున భవన నిర్మాణ పనులు జరుగుతున్నందున కొంత కాలం పని చేయొచ్చని భావించాం. పనులు చూసుకునేలోపే అరెస్టు అయ్యామ'ని ముగ్గురు మావోయిస్టులు చెప్పినట్లు తెలిసింది. హిడ్మా ఎన్‌కౌంటర్ గురించి మీకు ఎప్పుడు తెలిసిందని ప్రశ్నించగా.. తాము అరెస్టు అయిన తర్వాతే తెలిసిందని వారు బదులిచ్చినట్లు సమాచారం.

★ కస్టడీ ముగిశాక విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో ముగ్గురికి వైద్య పరీక్షలు చేయించి, తర్వాత తాలూకా కోర్టులో హాజరుపర్చారు. న్యాయస్థానం ఆదేశాల మేరకు వారిని రిమాండ్ నిమిత్తం మళ్లీ రాజమహేంద్రవరం కేంద్ర కారాగారానికి తరలించారు.

ఛత్తీస్‌గఢ్‌లో నలుగురు మావోయిస్టుల ఎన్‌కౌంటర్



దిలీప్ బెడ్జా

చర్ల, న్యూస్‌టుడే: ఛత్తీస్‌గఢ్‌లో శనివారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో నేషనల్ పార్క్ ఏరియా కమిటీ చీఫ్ దిలీప్ బెడ్జా సహా నలుగురు మావోయిస్టులు మృతి చెందినట్లు బీజాపుర్ ఎస్పీ జితేంద్ర కుమార్ యాదవ్ తెలిపారు. నేషనల్ పార్క్ అడవుల్లో దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు, పశ్చిమ సబ్ జోనల్ బ్యూరో ఇన్‌ఛార్జి సున్నం చంద్రయ్య ఎలియాస్ మంగు ఎలియాస్ పాపారావు.. నేషనల్ పార్క్ ఏరియా కమిటీ చీఫ్ దిలీప్ బెడ్జా నేతృత్వంలో పెద్దసంఖ్యలో మావోయిస్టులు ఉన్నారని నిఘావర్గాలకు సమాచారం అందింది. దీంతో డీఆర్‌జీ (డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్), ఎస్‌టీఎఫ్ (స్టేట్ టాస్క్‌ఫోర్స్), కోబ్రా బలగాలు ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలో జరిగిన ఎన్‌కౌంటర్ అనంతరం ఓ మహిళా మావోయిస్టు సహా నలుగురి మృతదేహాలను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి.



ఎముకల ఆరోగ్యానికి ఇవి తప్పనిసరి

- ✦ క్యాల్షియం: పాల పదార్థాలు, ఆకు కూరలు తీసుకోవడం
- ✦ డీ విటమిన్: కొవ్వుపుష్టితో ఉండే చేపలు తినడం, సూర్యరశ్మిలో గడపడం
- ✦ మెగ్నీషియం: గింజలు, డ్రైఫ్రూట్స్‌లో లభ్యమవుతాయి
- ✦ కె విటమిన్: బ్రోకలీ, కేల్(ఓ రకమైన ఆకు కూర)ను తినండి.

– క్రిస్టెన్ జకోబిట్జ్, న్యూట్రిషనిస్ట్

సైబర్ మోసగాళ్ల కొత్త ఎత్తుగడ

హెరిటేజ్ లోగోతో లింకులు పంపించి ఫోన్ల హ్యాకింగ్



హెరిటేజ్ గణతంత్ర దినోత్సవ బహుమతి రూ.50 వేలు గెలుచుకున్నట్లు సామాజిక మాధ్యమాల్లో వచ్చిన లింక్

కాకినాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే: సైబర్ మోసగాళ్లు కొత్త ఎత్తుగడలు వేస్తూ సామాన్యులకు వల విసురుతున్నారు. పండుగ ఆఫర్లు అంటూ ప్రముఖ కంపెనీల లోగోలతో సామాజిక మాధ్యమాల్లో లింకులు పంపిస్తున్నారు. వాటిపై క్లిక్ చేయగానే ఫోన్‌లోని డేటా లాగేస్తున్నారు. కాకినాడకు చెందిన కొందరికి శుక్రవారం అపరిచిత వ్యక్తుల నుంచి ఫోన్ పే లోగోతో లింక్‌లు వచ్చాయి. వాటిలో 'మొదట నేను ఇది నకిలీ అనుకున్నా. కానీ నిజంగా నాకు రూ.5 వేలు వచ్చాయి. మీరు కూడా ప్రయత్నించి చూడండి' అని ఉంది. ఆ లింక్ ఓపెన్ చేయగానే.. ఈ లింక్‌ను 5 గ్రూపులు, 15 మంది వ్యక్తులకు పంపితే మీ ఖాతాలో రూ.5 వేలు జమవుతాయని మెసేజ్ వచ్చింది. అది నమ్మిన కొందరు ఆ లింక్‌ను తెలిసిన వారికి పంపించారు. వాటిని ఓపెన్ చేసిన వారి ఫోన్‌లు హ్యాక్ అయినట్లు ఫిర్యాదులు వచ్చాయి. అదే క్రమంలో శనివారం హెరిటేజ్ సంస్థ గణతంత్ర దినోత్సవ ప్రత్యేక బహుమతులు అంటూ ఆ సంస్థ లోగోతో కూడిన ఓ లింక్ సర్క్యులేట్ అయ్యింది. అందులో 4 ప్రశ్నలు వేసిన హ్యాకర్లు.. వాటిని పూర్తి చేస్తే ఏకంగా రూ.50 వేలు పొందవచ్చని ఎర వేశారు. 'మీ వయసు ఎంత? మీరు పురుషుడా, స్త్రీనా? మీకు హెరిటేజ్ ఉత్పత్తులు తెలుసా? అవి బాగున్నాయా?' వంటి ప్రశ్నలు వేశారు. వాటికి సమాధానాలు ఇవ్వగానే ప్రత్యేక బహుమతులు స్క్రీన్‌పై ప్రత్యక్షమయ్యాయి. వాటిపై క్లిక్ చేస్తే, ఫోన్ హ్యాకర్ల చేతుల్లోకి వెళ్లేలా చేశారు. అధీకృతం కాని ఇలాంటి ప్రకటనలు నమ్మొద్దని పోలీసులు హెచ్చరించారు. ఎవరైనా లింక్‌పై క్లిక్ చేసి, డబ్బులు పోగొట్టుకుంటే 1930కి ఫిర్యాదు చేయాలని సూచించారు.

తెదేపా కార్యకర్త హత్యోదంతంలో..

11 మంది వైకాపా వర్గీయులపై కేసులు

- అల్లిపూడిలో కత్తులు, రాళ్లు, బ్లేడులతో రెచ్చిపోయిన ఆ పార్టీ మూకలు
- ఏ-1గా వైకాపా నాయకుడు చినబాబు

తుని, తుని పట్టణం, కోటనందూరు, రౌతులపూడి, న్యూస్‌టుడే: కాకినాడ జిల్లా కోటనందూరు మండలం అల్లిపూడిలో శుక్రవారం రాత్రి వైకాపా శ్రేణుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన తెదేపా కార్యకర్త లాలం బంగారయ్య (38) మృతదేహానికి తుని ప్రభుత్వ ఆసుపత్రిలో శనివారం పోస్టుమార్టం జరిగింది. అనంతరం మృతదేహాన్ని గ్రామానికి తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. దాదాపు 50 మంది వైకాపా శ్రేణులు మూకుమ్మడిగా తెదేపా కార్యకర్తలపై దాడికి పాల్పడ్డట్లు తేలింది. చీకట్లో కత్తులు, రాడ్లు, బ్లేడులు తదితర మారణాయుధాలతో విరుచుకుపడ్డారని ప్రత్యక్ష సాక్షుల ద్వారా పోలీసులు తెలుసుకున్నారు. ఈ దాడిలో ముగ్గురు తీవ్రంగా గాయపడగా.. తుని ఆసుపత్రిలో బంగారయ్య మృతిచెందారు. కాకినాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చింతకాయల శ్రీరామ్మూర్తి పరిస్థితి విషమంగా ఉంది. మరో కార్యకర్త దుర్గాప్రసాద్ చికిత్స పొంది ఇంటికి వెళ్లారు. వైకాపాకు చెందిన ఇద్దరు గాయపడగా వారికి చికిత్స అందించారు. వైకాపా నాయకుడు చింతకాయల చినబాబు ప్రోద్బలంతోనే ఈ దాడి జరిగిందని, అతన్ని ఏ-1గా చేర్చామని తుని గ్రామీణ సీఐ చెన్నకేశవరావు తెలిపారు. ఇతడిపై గతంలోనూ పలు కేసులు ఉన్నాయన్నారు. మరో 10 మంది నిందితులను ఎఫ్ఐఆర్‌లో చేర్చామన్నారు. కొందరు పరారీలో ఉండగా గాలిస్తున్నారు. అల్లిపూడిలో భారీ బందోబస్తు ఏర్పాటు చేసి 144 సెక్షన్ అమలు చేస్తున్నారు.

పాతకక్షల నేపథ్యంలో..

పాతకక్షలకు తోడు తెదేపా శ్రేణులను బలహీనపరచాలని పథకం ప్రకారం వైకాపా శ్రేణులు దాడికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. రాజమహేంద్రవరంలో ఓ వస్త్ర దుకాణానికి సంబంధించి ఇటీవల ఇరువర్గాల మధ్య జరిగిన స్వల్ప వివాదమే హత్యకు దారి తీసిందని చెబుతున్నారు. తెదేపా శ్రేణులపై దాడి చేయడం, ఓ కార్యకర్తను కిరాతకంగా హత్య చేయడాన్ని తుని ఎమ్మెల్యే యనమల దివ్య ఖండించారు. ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శ్రీరామ్మూర్తిని ఆమె పరామర్శించారు.



లాలం బంగారయ్య (పాత చిత్రం)



గాయపడ్డ శ్రీరామ్మూర్తిని పరామర్శిస్తున్న తుని ఎమ్మెల్యే దివ్య



వైకాపా అధినేత జగన్‌తో ప్రధాన నిందితుడు చినబాబు

ఎ.కొత్తపల్లిలోనూ వైకాపా దాడి

ఇద్దరు తెదేపా కార్యకర్తలకు గాయాలు


తొండంగి, న్యూస్‌టుడే: కాకినాడ జిల్లా తొండంగి మండలం ఎ.కొత్తపల్లిలో శుక్రవారం సాయంత్రం గుండాట వద్ద తెదేపా, వైకాపా నేతల మధ్య ఘర్షణ జరిగింది. రెచ్చిపోయిన వైకాపా వర్గీయులు రాళ్లు, కర్రలు, బీరు సీసాలతో తెదేపా కార్యకర్తలపై దాడికి దిగారు. దీంతో గ్రామంలో భయానక వాతావరణం నెలకొంది. వైకాపాకు చెందిన శిరసపల్లి శ్రీను, శిరసపల్లి అయ్యప్ప, మణికంఠ, పులిబంటి శ్రీను, మడుగుల సత్తిబాబు, కొక్కులూరి మల్లేశ్వరరావులు.. తెదేపా కార్యకర్తలు నామాల రామకృష్ణ, కొంజర్ల గోవిందులను కర్రలు, బీరు సీసాలతో కొట్టారు. గాయపడ్డవారిని ఎమ్మెల్యే యనమల దివ్య పరామర్శించారు. నిందితులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై జగన్‌మోహనరావు తెలిపారు.





కర్రలతో ఘర్షణకు దిగిన ఇరువర్గాలు ★ చికిత్స పొందుతున్న రామకృష్ణ (గోపి)

ప్రముఖ ఎముకల వైద్య నిపుణులు ఆదినారాయణరావు కన్నుమూత



విశాఖపట్నం(వన్‌టౌన్), న్యూస్‌టుడే: ప్రముఖ ఎముకల వైద్య నిపుణులు డాక్టర్ సుంకర ఆదినారాయణరావు (86) శనివారం సాయంత్రం విశాఖలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో కన్నుమూశారు. కొద్దిరోజులుగా వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్న ఆయన్ను 4 రోజుల క్రితం ఆసుపత్రిలో చేర్పించారు. పోలియో శస్త్రచికిత్స నిపుణుడిగా పేరొందిన ఆదినారాయణరావు ఎందరో పోలియో బాధితులకు నడక నేర్పారు. దేశంలో పలు రాష్ట్రాల్లో పోలియో వైద్య శిబిరాలను ఉచితంగా ఏర్పాటు చేశారు. విశాఖ కేజీహెచ్‌లో ఎముకల విభాగ ప్రొఫెసర్‌గా, విభాగాధిపతిగా సేవలందించారు. ఆర్సీడీ(రాణిచంద్రమణిదేవి) ఆసుపత్రి పర్యవేక్షక వైద్యాధికారిగానూ పనిచేశారు. ఎముకలు, పోలియో వైద్య రంగంలో ఆయన అందించిన సేవలకు 2022లో పద్మశ్రీ వరించింది. ఆయన సతీమణి డాక్టర్ ఆర్.శశిప్రభ ప్రముఖ ప్రసూతి వైద్య నిపుణురాలు. ఆమె ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ వైద్యవిద్యాశాఖ సంచాలకులుగా పనిచేసి పదవీ విరమణ పొందారు. ఆదినారాయణరావు అంత్యక్రియలు ఆదివారం మధ్యాహ్నం విశాఖలో నిర్వహిస్తామని ఆంధ్ర వైద్యకళాశాల పూర్వ విద్యార్థుల సంఘం కార్యదర్శి డాక్టర్ పీవీ సుధాకర్ తెలిపారు.

పరీక్ష పెట్టేసి.. చేతులెత్తేసి!

- కదలని ఆర్‌సెట్ 2024 ఇంటర్వ్యూలు
- రెండేళ్లుగా ప్రవేశాలు లేక అయోమయంలో పీజీ విద్యార్థులు

తిరుపతి (విద్య), న్యూస్‌టుడే: పరిశోధన రంగంలోకి రావాలని భావించే ఔత్సాహికులకు ఉన్నత విద్యామండలి నిర్ణయాలు శరాఘాతాలుగా మారుతున్నాయి. రాష్ట్రంలో ఆర్‌సెట్ ప్రవేశాలు రెండేళ్లుగా లేకపోవడంతో పీజీ విద్యార్థులు ఉద్యోగ, ఉపాధి రంగాల వైపు వెళ్లిపోతున్నారు. గతేడాది ప్రవేశాలకు రాష్ట్రవ్యాప్తంగా నవంబరులో పరీక్ష నిర్వహించి డిసెంబరు 15న ఫలితాలు ప్రకటించారు. ర్యాంకుల కేటాయింపు, కౌన్సెలింగ్ చేపట్టకపోవడంతో దాదాపు 1,800 పరిశోధన సీట్లను ఎప్పుడు భర్తీ చేస్తారో ప్రశ్నార్థకంగా మారింది.

వివాదాలకు వేదికగా ఎస్వీయూ..: ఎస్వీయూ ఆధ్వర్యంలో ఆర్‌సెట్ 2023-24ను సజావుగా నిర్వహించారు. మరుసటి ఏడాదీ ఉన్నత విద్యామండలి.. ఎస్వీయూకే బాధ్యతలు అప్పగించింది. పీసీ వెంకటేశ్వర్లును కోకన్వీనర్‌గా, ఆయన జూనియర్ అయిన ఆచార్య సురేంద్రబాబును కన్వీనర్‌గా నియమించింది. ఈ నియామకం, పదోన్నతి తదితర అంశాలు వివాదాస్పదం కావడంతో సురేంద్రబాబును తొలగించి.. ఆర్‌సెట్ నిర్వహణ బాధ్యతలను శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయానికి అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆచార్య ఉషను కన్వీనర్‌గా, ఆచార్య సుష్మను కోకన్వీనర్‌గా నియమించారు.

పరీక్ష ఇలా..: ఆర్‌సెట్‌లో ఆయా సబ్జెక్టులకు 200 మార్కుల్లో 140 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. మిగిలిన 60 మార్కులు విద్యార్థుల ప్రతిభ, పరిశోధన, వారి ధ్రువపత్రాల ఆధారంగా ఇంటర్వ్యూ సమయంలో కేటాయిస్తారు. ఆపై ర్యాంకులు ప్రకటించి ప్రవేశాలు కల్పిస్తారు.

2025–26 ప్రవేశాలపై అస్పష్టత: గత ఏడాది ప్రవేశాలు కొలిక్కి రాకపోవడం, ప్రస్తుతం విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంతవరకు ఉలుకూపలుకూ లేకపోవడంతో అభ్యర్థులు ఆవేదనకు గురవుతున్నారు. రాష్ట్రంలో నిర్వహించే పలు ప్రవేశ పరీక్షలకు సంబంధించిన కన్వీనర్లను ఇటీవల ప్రకటించారు. ఇందులో 2026కు సంబంధించిన పీజీ ప్రవేశాల ఆర్‌సెట్ కన్వీనర్‌ను నియమించకపోవడం గమనార్హం. ★ పెండింగ్ ప్రవేశాలకు సంబంధించి నాలుగు జోన్లుగా ఇంటర్వ్యూలు నిర్వహించి కౌన్సెలింగ్ చేపట్టే అవకాశం ఉందని, రెండు మూడు రోజుల్లో నిర్ణయం వెలువడవచ్చని భావిస్తున్నారు.

క్షమించండమ్మా.. వేధింపులు తట్టుకోలేక ఇలా చేస్తున్నా!

- ఇద్దరు పిల్లలకు విషమిచ్చి ఉరేసుకున్న తల్లి

నంద్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే: భర్త, ఇంట్లోని కుటుంబసభ్యుల వేధింపులు తాళలేక తన ఇద్దరు పిల్లలకు విషమిచ్చి తల్లి ఆత్మహత్య చేసుకుంది. ఈ విషాద ఘటన నంద్యాలలో చోటుచేసుకుంది. పోలీసులు, బాధితురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని లలితానగర్‌కు చెందిన ఉదయ్‌కిరణ్‌కు, ఎన్జీవో కాలనీకి చెందిన మల్లిక(27)కు ఏడేళ్ల కిందట వివాహమైంది. వీరికి కుమారుడు ఇషాంత్‌సాయి(5), కుమార్తె పరిణిత(7 నెలలు) సంతానం. కొన్నేళ్లపాటు ఈ దంపతుల సంసారం సజావుగా సాగింది. గత రెండేళ్ల నుంచి భర్త ఉదయ్‌కిరణ్, తోటికోడలు ప్రసన్న, ఆడపడుచు గీత సూటిపోటి మాటలతో మల్లికను నిత్యం వేధించేవారు. ఈ నేపథ్యంలోనే శుక్రవారం మల్లికపై భర్త దాడి చేశాడు. మల్లిక అన్న కార్తిక్ ఇంటికి చేరుకుని అందరికీ సర్దిచెప్పి వెళ్లిపోయారు. మల్లిక శనివారం ఉదయం గదిలోకి వెళ్లి తలుపులు తీయడం లేదని ఉదయ్‌కిరణ్ ఆమె కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి చెప్పాడు. కార్తిక్ వచ్చి ఇంటి తలుపులు తీయగా మల్లిక ఉరి వేసుకుని కనిపించారు. ఇద్దరు పిల్లలు మృతి చెంది ఉన్నారు. కొన ఊపిరితో ఉన్న మల్లికను ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు తెలిపారు. మల్లికను ఉదయ్‌కిరణ్, ఆడపడుచు, తోటికోడలు తరచూ వేధించేవారని, పిల్లలను, తల్లిని భర్తే హత్య చేసి ఉంటాడని ఆమె కుటుంబ సభ్యులు ఆరోపించారు. నిందితులపై హత్య కేసు నమోదు చేయాలని కోరారు. ఉదయ్‌కిరణ్, ఆయన కుటుంబసభ్యులు పరారీలో ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



భర్త ఉదయ్‌కిరణ్‌తో మల్లిక, పిల్లలు

ఆటో తగిలిందని.. డ్రైవర్‌ను కట్టేసి కొట్టారు

కనిగిరి, పామూరు, న్యూస్‌టుడే: రోడ్డుపై వెళ్తున్న వ్యక్తికి వెనుక నుంచి వచ్చిన ఆటో తగలడంతో.. అతని సన్నిహితులు ఆ ఆటో డ్రైవర్‌ను స్తంభానికి కట్టేసి కొట్టారు. ప్రకాశం జిల్లా పామూరు మండలం బొట్లగూడూరులో చోటుచేసుకున్న ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. పీసీ పల్లి మండలం గుంటుపల్లికి చెందిన చీమలదిన్నె మహర్షి శుక్రవారం ఆటోలో నిమ్మకాయలు వేసుకొని పామూరు మండలం బొట్లగూడూరు బయలుదేరారు. మార్గమధ్యలో ఎదురుగా వచ్చిన వాహనాన్ని తప్పించే క్రమంలో... నడిచి వెళుతున్న తిరుపతయ్యకు ఆటో తగిలింది. దీంతో ఆయనకు స్వల్ప గాయాలయ్యాయి. ఆగ్రహానికి గురైన తిరుపతయ్య తన స్నేహితులు, బంధువులైన కమ్మ ప్రసాద్, రేగలగడ్డ నాగేశ్వరరావు, దొడ్డేజి హరికృష్ణ, చిరుమామిళ్ల వెంకటేశ్వర్లు, చల్లా శ్రీనివాసులు, కోటపాటి వెంకటేశ్వర్లుతో పాటు మరికొందరిని అక్కడికి పిలిపించాడు. వారంతా మహర్షి జుట్టు పట్టుకొని బొట్లగూడూరులోని జాతీయ రహదారి పక్కకు తీసుకెళ్లి, అతని చొక్కా విప్పేసి ఓ ఇనుప రాడ్‌కు కట్టేశారు. అనంతరం బీరు సీసాలు, కర్రలతో దాడి చేసి కొట్టారు. ఈ ఘటనను ఓ యువకుడు సెల్‌ఫోన్‌లో చిత్రీకరించి సామాజిక మాధ్యమాల్లో పెట్టాడు. ఈ విషయం తెలుసుకున్న నిందితులు శుక్రవారం రాత్రి సదరు యువకుడి ఇంటి వద్దకు వెళ్లి ఆయనపై కూడా దాడికి యత్నించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఆటో డ్రైవర్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పది మందిపై డీఎస్పీ సాయిఈశ్వర్ యశ్వంత్ కేసు నమోదు చేశారు. వారిలో ఆరుగురిని అరెస్టు చేసినట్లు తెలిపారు. బొట్లగూడూరులో పికెట్ ఏర్పాటుచేశారు.



ఆటో డ్రైవర్ మహర్షిని కట్టేసిన తిరుపతయ్య స్నేహితులు

EENADU Vol: 52, Issue: 158 Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. Founder Ramoji Rao

ఈనాడు బిజినెస్ వారాంతం

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ లాభం రూ.19,807 కోట్లు



ముంబయి: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అక్టోబరు-డిసెంబరు త్రైమాసికంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ రూ.19,807 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని నమోదు చేసింది. అంత క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాల లాభం రూ.17,657 కోట్లతో పోలిస్తే ఇది 12.17 శాతం అధికం. స్టాండలోన్ ప్రాతిపదికన బ్యాంక్ లాభం 11.46 శాతం పెరిగి రూ.18,653.75 కోట్లకు చేరింది. నికర వడ్డీ ఆదాయం రూ.30,650 కోట్ల నుంచి 6.4 శాతం పెరిగి రూ.32,600 కోట్లకు చేరింది. వడ్డీయేతర ఆదాయం రూ.13,250 కోట్లుగా నమోదైంది. నికర వడ్డీ మార్జిన్ 3.35 శాతంగా నమోదైంది. నిర్వహణ వ్యయాలు రూ.18,770 కోట్లకు చేరాయి. కొత్త కార్మిక చట్టాల అమలుతో ఉద్యోగుల ప్రయోజనాల కోసం బ్యాంక్‌పై అదనంగా రూ.800 కోట్ల ప్రభావం పడింది. ఇది లేకపోతే నిర్వహణ వ్యయాలు రూ.17,110 కోట్ల నుంచి రూ.17,970 కోట్లకు చేరాయి.

✦ స్థూల నిరర్థక ఆస్తులు (జీఎన్‌పీఏ) రూ.35,179 కోట్లుగా నమోదయ్యాయి. ఏడాది క్రితం ఇవి రూ.36,019 కోట్లుగా ఉన్నాయి. స్థూల ఎన్‌పీఏలు 1.42 శాతం నుంచి 1.24 శాతానికి మెరుగయ్యాయి. నికర ఎన్‌పీఏలు రూ.11,588 కోట్ల నుంచి రూ.11,982 కోట్లకు పెరిగినా, నిష్పత్తి ప్రకారం చూస్తే 0.46 శాతం నుంచి 0.42 శాతానికి మెరుగయ్యాయి.

ఐపీఓకి రానున్న డిజిలాజిక్ సిస్టమ్స్

ఈనాడు, హైదరాబాద్: రక్షణ, ఏరోస్పేస్ రంగాలకు సాంకేతిక సేవలను అందిస్తోన్న హైదరాబాద్ సంస్థ డిజిలాజిక్ సిస్టమ్స్ లిమిటెడ్ తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ)కు రానుంది. ఈ నెల 20 నుంచి 22 వరకు ఈ ఐపీఓకి దరఖాస్తు చేసుకునేందుకు వీలుంది. రూ.10 ముఖ విలువ గల ఒక్కో షేరు ధరల శ్రేణిని రూ.98- 104గా కంపెనీ నిర్ణయించింది. పెట్టుబడిదారులు కనీసం 1200 ఈక్విటీ షేర్లకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఇష్యూలో భాగంగా రూ.69.67 కోట్ల విలువైన తాజా ఈక్విటీలను జారీ చేయనుంది. ఆఫర్ ఫర్ సేల్ కింద 11.50 లక్షల ఈక్విటీ షేర్లను రూ.11.33 కోట్లకు విక్రయించ నుంది. ఈ నెల 28న బీఎస్ఈ ఎస్ఎంఈ ప్లాట్‌ఫామ్‌లో ఈ కంపెనీ షేర్లు నమోదు అవుతాయి. ఐపీఓ ద్వారా సమీకరించిన నిధులలో రూ.51.73 కోట్లతో కొత్త ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని, రూ.8 కోట్లను రుణాలు తీర్చేందుకు వినియోగిస్తామని కంపెనీ సీఈఓ జె.శశాంక వర్మ వెల్లడించారు. మిగిలిన మొత్తాన్ని కార్పొరేట్ అవసరాలకు వినియోగిస్తామని తెలిపారు.

కోడి గుడ్డు

18న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100 గుడ్లు రూపాయలలో)

హైదరాబాద్	510
వరంగల్	512
విజయవాడ	525
తూ/ప గోదావరి	515
విశాఖపట్నం	515
చిత్తూరు	583

ఇండిగోకు రూ.22.20 కోట్ల జరిమానా

దేశీయ విమానయాన సంస్థ ఇండిగోకు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) రూ.22.20 కోట్ల జరిమానా విధించింది. గత డిసెంబరులో భారీ సంఖ్యలో విమాన సర్వీసులు రద్దుకావడంపై దర్యాప్తు జరిపిన డీజీసీఏ, ఈ మేరకు చర్యలు తీసుకుంది. ఇండిగో సీఈఓ పీటర్ ఎల్బర్స్ మరో ఇద్దరు సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లకు గట్టి హెచ్చరికలు జారీ చేసింది. నిబంధనలకు అనుగుణంగా రూ.50 కోట్ల బ్యాంక్ గ్యారెంటీని సమర్పించాల్సిందిగా ఆదేశించింది.

ఈవీ భవిత.. రాబోయే బడ్జెట్‌లో



- పీఎల్ఐలో మార్పులు అవసరం
- పెట్టుబడి పరిమితులు తగ్గిస్తేనే అంకురాలకు ఊరట
- డెలాయిట్ ఇండియా నివేదిక

ఈనాడు - హైదరాబాద్

దేశంలో విద్యుత్ వాహన (ఈవీ) రంగం కొన్నేళ్లుగా వృద్ధి చెందుతున్నప్పటికీ, 2030 నాటికి నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించాలంటే ప్రస్తుత విధానాల్లో సమూల మార్పులు అవసరమని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాలు (పీఎల్ఐ) పథకం నిబంధనలు, జీఎస్‌టీ రేట్లు, ఫేమ్ సబ్సిడీ కొనసాగింపు వంటి అంశాలపై 2026-27 కేంద్ర బడ్జెట్‌లో స్పష్టమైన నిర్ణయాలు ప్రకటించాల్సిన అవసరం ఉందని డెలాయిట్ ఇండియా విడుదల చేసిన నివేదిక పేర్కొంది. పెట్రోలు, డీజిల్ వాహనాలతో సమానంగా ఈవీలు నిలదొక్కుకోవాలంటే, ప్రభుత్వ చేయూత అవసరమని పరిశ్రమ పేర్కొంటోంది. రాయితీలతో పాటు మరి కొన్ని విధానపరమైన నిర్ణయాలూ అవసరమని పేర్కొంటోంది.

పెద్ద కంపెనీలకే ప్రయోజనం

కేంద్రం వాహన రంగాన్ని ప్రోత్సహించేందుకు తీసుకొచ్చిన పీఎల్ఐ పథకం ఉద్దేశం మంచిదే. అయితే ఈ నిబంధనలు ఈవీ రంగానికి పూర్తిగా మేలు చేయడం లేదని డెలాయిట్ నివేదిక తేల్చింది. ఈ పథకం కింద అర్హత సాధించాలంటే వాహన తయారీ కంపెనీలు (ఓఈఎం) అయిదేళ్లలో కనీసం రూ.2,000 కోట్ల పెట్టుబడి పెట్టాలి. ఇది పెద్ద కంపెనీలకు సాధ్యమే. కానీ, కొత్త ఆలోచనలతో వస్తున్న అంకురాలు, మధ్యతరహా పరిశ్రమలకు అంత తేలిక కాదని నివేదిక వివరించింది.

ద్విచక్ర వాహన ప్రయోగాలన్నీ అంకురాల్లోనే

దేశంలో ఈవీ విప్లవానికి నాంది పలికింది.. ప్రధానంగా ద్విచక్ర వాహన రంగంలోని అంకురాలే. కొత్తగా వస్తున్న స్టార్టప్‌లు బ్యాటరీ సాంకేతికతలో, మోటార్ల తయారీలో వినూత్న ప్రయోగాలు చేస్తున్నాయి. కానీ, రూ.2,000 కోట్ల పెట్టుబడి నిబంధన కారణంగా అవి పీఎల్ఐ ప్రయోజనాలకు దూరమవుతున్నాయి. అందుకే ఈ పరిమితిని తగ్గించాలని, లేకపోతే కొన్ని కంపెనీల గుత్తాధిపత్యం పెరిగే అవకాశం ఉందని నివేదిక తెలిపింది.

50% సమీకరణ ఎలా?

పీఎల్ఐ పథకంలో మరో ప్రధాన అంశం.. వాహనంలో ఉపయోగించే విడిభాగాల్లో కనీసం 50% దేశీయంగా తయారై ఉండాలి. ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యానికి ఇది సరైనదే అయినా, క్షేత్ర పరిస్థితులు వేరేగా ఉన్నట్లు డెలాయిట్ పేర్కొంది. ఈవీలో అత్యంత కీలకమైన బ్యాటరీ సెల్స్, ఎలక్ట్రానిక్ చిప్స్ కోసం చైనా, తైవాన్, కొరియా వంటి దేశాలపై మనం ఆధారపడుతున్నాం. దేశీయంగా గిగా ఫ్యాక్టరీలు ఇంకా పూర్తి స్థాయిలో అందుబాటులోకి రాలేదు. విడిభాగాలూ దొరకడం లేదు. ఫలితంగా 50% నిబంధన పాటించడం కష్టంగా మారుతోంది. అందుకే చాలా కంపెనీలు పీఎల్ఐకి అనర్హులవుతున్నాయి. దేశీయంగా సరఫరా వ్యవస్థ బలపడేవరకు ఈ నిబంధనను 50% నుంచి తగ్గించాలని డెలాయిట్ సూచించింది. వాహన తయారీదార్ల సంఘం సియామ్ కూడా ఇదే విషయాన్ని సూచించింది.

ఐటీసీ రావడం లేదు..

ప్రస్తుతం విద్యుత్ వాహనాలపై 5% వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) ఉంది. కానీ, ఈ వాహనాలకు గుండెకాయ వంటి లిథియం అయాన్ బ్యాటరీలపై 18% జీఎస్‌టీ ఉంది. విడిభాగాలపైనా 18-28% జీఎస్‌టీ వర్తిస్తోంది. దీనివల్ల తయారీదారులకు 'ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ)' సమస్య ఎదురవుతోందని నివేదిక తెలిపింది. ముడిసరుకుపై ఎక్కువ పన్ను కట్టి, తుది ఉత్పత్తిని తక్కువ పన్నుకు అమ్మడం వల్ల కంపెనీల వద్ద పన్ను బకాయిలు పేరుకుపోతున్నాయి. ఇది వారి వర్కింగ్ క్యాపిటల్‌ను దెబ్బతీస్తోంది.

✦ పబ్లిక్ ఛార్జింగ్ స్టేషన్లలో వాహనాన్ని ఛార్జింగ్ చేసుకుంటే, దాన్ని సేవ కింద పరిగణించి 18% జీఎస్‌టీ విధిస్తున్నారు. ఇది వినియోగదారుడికి భారంగా మారుతోంది. బ్యాటరీలు, ఛార్జింగ్ సేవలపై జీఎస్‌టీని 5 శాతానికి పరిమితం చేయాలని పరిశ్రమ కోరుతోంది.

మరో కొత్త పథకం రావాలి

ఫేమ్-2 పథకం ముగియడం, మరో దీర్ఘకాలిక భరోసా లేకపోవడంతో వాహన కంపెనీలు కొత్త మోడళ్లను విడుదల చేసేందుకు వెనకడుగువేస్తున్నాయని నివేదిక పేర్కొంది. సబ్సిడీలు పూర్తిగా ఎత్తివేస్తే ఈవీల ధరలు 20-30% పెరగొచ్చు. పెట్రోలు, డీజిల్ వాహనాలతో పోలిస్తే, ఈవీల ధరలు అధికం. కాబట్టి, మరో మూడేళ్లయినా రాయితీలు కొనసాగించేందుకు కొత్త పథకం తేవాలని పరిశ్రమ వర్గాలు ఆశిస్తున్నాయి. పీఎం ఇ-డ్రైవ్ వంటి పథకాలను భారీ నిధులతో ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

తగ్గిన ఐసీఐసీఐ బ్యాంక్ లాభం



ముంబయి: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) అక్టోబరు- డిసెంబరు త్రైమాసికంలో ఐసీఐసీఐ బ్యాంక్ ఏకీకృత ప్రాతిపదికన రూ.12,537.98 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో బ్యాంక్ నికర లాభం రూ.12,883.37 కోట్లతో పోలిస్తే ఇది 2.68 శాతం తక్కువ. సెప్టెంబరు త్రైమాసికంలో ఐసీఐసీఐ బ్యాంక్ రూ.13,537.06 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. వ్యవసాయ రుణాలను ప్రాధాన్య రంగ రుణాలుగా తప్పుగా వర్గీకరించడంతో ఆర్‌బీఐ ఆదేశాలకు అనుగుణంగా రూ.1283 కోట్ల కేటాయింపులు చేయడం ప్రభావం చూపింది.

✦ స్టాండలోన్ ప్రాతిపదికన చూస్తే.. బ్యాంక్ లాభం రూ.11,318 కోట్లుగా ఉంది. నికర వడ్డీ ఆదాయం 7.7 శాతం వృద్ధి చెంది రూ.21,932 కోట్లకు చేరింది. రుణాలు 11.5 శాతం వృద్ధి చెందడం ఇందుకు కలిసొచ్చింది. నికర వడ్డీ మార్జిన్ 0.05 శాతం పెరిగి 4.30 శాతానికి చేరింది. వడ్డీయేతర ఆదాయం 12.4% వృద్ధితో రూ.7,525 కోట్లకు చేరింది. కొత్త కార్మిక చట్టాలను అమలు చేయడానికి రూ.145 కోట్లు పక్కన పెట్టినట్లు బ్యాంక్ తెలిపింది. దీంతో మొత్తం కేటాయింపులు రెట్టింపు రూ.2,556 కోట్లకు చేరాయి. వ్యవసాయ రుణాలకు సంబంధించి ఆర్‌బీఐ ఆదేశాలకు అనుగుణంగా రూ.1283 కోట్ల కేటాయింపులు ఇందులో ఉన్నాయి. తాజా మొండి బకాయిలు రూ.5,304 కోట్ల నుంచి రూ.5,356 కోట్లకు తగ్గాయి. స్థూల నిరర్థక ఆస్తుల నిష్పత్తి 1.58 శాతం నుంచి 1.53 శాతానికి మెరుగుపడింది. కార్పొరేట్ రుణాలు 5.6 శాతం, రిటెయిల్ రుణాలు 7.2% చొప్పున వృద్ధి చెందాయి.

✦ ఐసీఐసీఐ బ్యాంక్ ఎండీ, సీఈఓ సందీప్ భక్షి పదవీకాలాన్ని రెండేళ్ల పాటు పొడిగించేందుకు బోర్డు అనుమతి ఇచ్చింది.

బంగారం ధరలను రోజంతా మార్చకూడదు

మలబార్ గ్రూప్ ఛైర్మన్ ఎం.పి.అహమ్మద్



దేశంలో బంగారం ధరల నిర్ణయంలో కొందరు వ్యాపారులు అనుసరిస్తున్న తీరు వల్ల, విశ్వసనీయత తగ్గుతుందని మలబార్ గ్రూప్ ఛైర్మన్ ఎం.పి.అహమ్మద్ పేర్కొన్నారు. బంగారం అంతర్జాతీయ ధరలు, డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకపు విలువ, బంగారంపై వర్తించే పన్నులు కలిపి దేశీయంగా పసిడికి ధర నిర్ణయించడం సంప్రదాయకంగా వస్తుంది. ముందురోజు రాత్రి సమయంలో ట్రేడింగ్ ముగిసేసమయానికి ఉన్న ధరకు అనుగుణంగా, ప్రతిరోజు ఉదయం 9.30 గంటలకల్లా, ఆయా ప్రాంతాల అసోసియేషన్లు బంగారం ధరను ప్రకటించడం సంప్రదాయంగా వస్తోందని అహ్మద్ గుర్తు చేశారు. ధరల్లో మరీ అధిక ఒడుదొడుకులు ఏర్పడకపోతే, ఉదయం ప్రకటించిన ధరనే రోజంతా ఆభరణాల వర్తకులు అనుసరించాల్సి ఉంది. అయితే ఇటీవలి కాలంలో కొందరు వ్యాపారులు ఏకపక్షంగా ఒక రోజులోనే పలు మార్లు బంగారం ధరలను పెంచేస్తున్నారని మలబార్ ఛైర్మన్ పేర్కొన్నారు. ఆన్‌లైన్ ధరలకు అనుగుణంగా, ఎప్పటికప్పుడు ధరను సవరిస్తూ పోతే, కొనుగోలుదార్లలో విశ్వసనీయతను పసిడి రంగమే కోల్పోతుందని అహ్మద్ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇలాంటి తేడా రాకుండా చూసేందుకే మలబార్ సంస్థ 'దేశం అంతటా బంగారానికి ఒకే ధర'ను అమలు చేస్తోందని గుర్తు చేశారు. బంగారంపై పన్ను రేటు దేశవ్యాప్తంగా ఒకటే ఉన్న నేపథ్యంలో, ఒక్కోచోట ఒక్కో ధర ఎందుకు అమలు చేయాలని ప్రశ్నించారు.

దేశీయంగా ఏఐ చిప్‌ల తయారీ

బ్లెయిజ్ సీఈఓ దినకర్



ఈనాడు, హైదరాబాద్: కృత్రిమ మేధ (ఏఐ) రంగంలో కేవలం సాంకేతికతకే పరిమితం కాకుండా, దేశీయంగానే ఏఐ చిప్‌లు, సిస్టమ్స్‌ను రూపొందిస్తున్నట్లు బ్లెయిజ్ సీఈఓ దినకర్ మునగాల తెలిపారు. ఏఐ శిక్షణతోపాటు, దానిని తక్షణమే విశ్లేషించే ఎడ్జ్ కంప్యూటింగ్‌పై తాము ప్రధానంగా దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం వాడుకలో ఉన్న సాధారణ సీసీటీవీ కెమెరాలకు తమ చిప్‌ల ద్వారా తక్కువ ఖర్చుతోనే 'ఇంటెలిజెన్స్'ను జోడించవచ్చన్నారు. తద్వారా మౌలిక సదుపాయాలను పూర్తిగా మార్చాల్సిన అవసరం ఉండదు. ట్రాఫిక్ నిర్వహణ, భద్రత వంటి రంగాల్లో ఏఐ సేవలను పొందేందుకు ఇది ఎంతో దోహదం చేస్తుందని పేర్కొన్నారు. దేశంలో ఏఐ పరిష్కారాలు ఆచరణాత్మకంగా, తక్కువ ఖర్చుతో అందుబాటులోకి రావాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. 'ఇప్పటికే దేశీయంగా ట్రాఫిక్ పర్యవేక్షణలో మా చిప్‌లు కీలక పాత్ర పోషిస్తున్నాయి. విభిన్న రాతలు, ప్రాంతీయ భాషల్లో ఉండే క్లిష్టమైన నంబరు ప్లేట్లను సైతం కచ్చితత్వంతో గుర్తిస్తున్నాయి. వ్యవసాయంలో కలుపు మొక్కల గుర్తింపు, పారిశ్రామిక ఆటోమేషన్ వంటి రంగాల్లోనూ ఏఐ వినియోగం విస్తృతం కావాలి. దీనికోసం స్థానిక అవసరాలకు అనుగుణంగా డేటా సెంటర్లను ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉంది' అని దినకర్ అన్నారు. భవిష్యత్తులో డేటా సెంటర్లు, ఎల్‌ఎల్‌ఎం, ఎస్‌ఎల్‌ఎంను నిర్వహించగల అత్యాధునిక చిప్‌లపై పనిచేస్తున్నట్లు దినకర్ వివరించారు. ఏఐ అనేది ఒక సాధనం మాత్రమేనని, దీనిని ఉపయోగించి వాస్తవ సమస్యల పరిష్కారానికి యువత కృషి చేయాలన్నారు. దేశంలో సెమీకండక్టర్ ఫ్యాబ్రికేషన్ యూనిట్ల ఏర్పాటు కోసం పదేళ్ల దీర్ఘకాలిక ప్రణాళికలతో సిద్ధం కావాలని, అప్పుడే తైవాన్ విజయం సాధ్యమవుతుందని విశ్లేషించారు.

4 అంతర్జాతీయ బ్రాండ్ల హక్కులు కొనుగోలు చేసిన రిలయన్స్ కన్జ్యూమర్

దిల్లీ: ముకేశ్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్‌ఐఎల్) అనుబంధ ఎఫ్ఎంసీజీ సంస్థ రిలయన్స్ కన్జ్యూమర్ ప్రోడక్ట్స్ లిమిటెడ్ (ఆర్‌సీపీఎల్) పలు అంతర్జాతీయ బ్రాండ్ల హక్కులను కొనుగోలు చేసింది. బ్రిల్‌క్రీమ్, టోని అండ్ గై, బడేడాస్ వంటి బ్రాండ్లు ఇందులో ఉన్నాయి. అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న వ్యక్తిగత సంరక్షణ, సౌందర్య విపణిలో విస్తరించేందుకు ఈ హక్కుల కొనుగోలు కలిసొస్తుందని కంపెనీ తెలిపింది. యూకేకి చెందిన స్పెషలిస్ట్ బ్రాండ్ మాటేను సైతం కొనుగోలు చేసింది. చిన్నారుల వ్యక్తిగత సంరక్షణ విభాగంపై దృష్టి సారించేందుకు ఈ కొనుగోలు చేసినట్లు ఆర్‌ఐఎల్ 'ఇన్వెస్టర్ ప్రజెంటేషన్' ప్రకారం తెలుస్తోంది. ఈ 4 అంతర్జాతీయ బ్రాండ్ల హక్కుల కొనుగోలు కోసం ఎంత మొత్తం వెచ్చించిందనే ఆర్థిక వివరాలను ఆర్‌సీపీఎల్ బహిర్గతం చేయలేదు. దేశీయ, అంతర్జాతీయ విపణుల్లో ఈ బ్రాండ్లను విస్తరించనున్నట్లు తెలిపింది. బ్రిల్‌క్రీమ్ బ్రిటిష్ బ్రాండ్. ఇది పురుషుల హెయిర్ స్టైలింగ్ ఉత్పత్తుల బ్రాండ్. టోని అండ్ గై కూడా ప్రీమియం కేశ సంరక్షణ, స్టైలింగ్ బ్రాండ్. బడేడాస్ జర్మనీ బ్రాండ్. వ్యక్తిగత సంరక్షణ ఉత్పత్తులకు సంబంధించిన బ్రాండ్ ఇది. సహజ మొక్కల నుంచి సేకరించిన ప్రీమియం ఉత్పత్తులు ఇందులో ఉన్నాయి.

ఈ ఏడాదిలో విన్ ఫాస్ట్ నుంచి 3 మోడళ్లు



దిల్లీ: ఈ ఏడాది దేశంలో మూడు కొత్త మోడళ్లతో పాటు విక్రయ కేంద్రాలను రెట్టింపు చేసే యోచనలో ఉన్నట్లు విద్యుత్ వాహన తయారీ సంస్థ విన్ ఫాస్ట్ ఇండియా ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ) తపన్ ఘోష్ తెలిపారు. ముందుగా ఏడు సీట్ల ఎంపీవీ (మల్టీ పర్పస్ వెహికల్)ని విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. కుటుంబ, వాణిజ్య అవసరాలకు వినియోగించడానికి వీలుగా ఉండే ప్రీమియం ఎలక్ట్రిక్ ఎంపీవీ ఇది అని వెల్లడించారు. అయితే విడుదల చేసే ప్రతి మోడల్ ఇంకో మోడల్‌కు భిన్నంగా వివిధ విభాగాలకు, అవసరాలకు తగ్గట్టుగా ఉంటాయని పేర్కొన్నారు. ట్రెండ్‌ను అనుసరించడం కాకుండా భద్రత, నమ్మకం, దీర్ఘకాల విలువ గల, బ్రాండ్‌ను సుదీర్ఘ కాలం నిలబెట్టే ప్రమాణాలను అందించడంపై దృష్టి పెట్టినట్లు వివరించారు.

✦ దేశీయంగా విక్రయ కేంద్రాల సంఖ్యను 75కు చేర్చడం లక్ష్యం అని వెల్లడించారు. ప్రస్తుతం మెట్రో, ప్రథమ, ద్వితీయ నగరాల్లో విక్రయశాలలు ఉన్నాయని.. త్వరలోనే మూడు, నాలుగో అంచె నగరాలకు విస్తరించాలని భావిస్తున్నట్లు వివరించారు. పెద్ద నగరాల్లో ఉన్న విక్రయ శాలలను పెంచాలని కూడా చూస్తున్నట్లు పేర్కొన్నారు.

✦ గతేడాది తమిళనాడులో సంస్థ దేశీయంగా వాహనాలను ఉత్పత్తి చేయడం ప్రారంభించింది. ఇప్పటివరకు దేశంలో వీఎఫ్ 6, వీఎఫ్ 7 ఎలక్ట్రిక్ ఎస్‌యూవీలను సంస్థ విడుదల చేసింది. 2025 చివరి కల్లా సంస్థ ప్రధాన నగరాల్లో 35 షోరూములను స్థాపించింది.

దక్షిణాసియా వృద్ధికి చుక్కాని భారత్

ముఖ్య ఆర్థిక వేత్తలతో డబ్ల్యూఈఎఫ్ సర్వే

ప్రపంచ ఆర్థిక పరిస్థితులు ఈ ఏడాది బలహీనంగా ఉంటాయని.. అయితే వృద్ధిపరంగా దక్షిణాసియా వెలుగు చుక్కలా మారుతుందని, ఇందులో భారత్ కీలకపాత్ర వహిస్తుందని ముఖ్య ఆర్థిక వేత్తలు అంచనా వేస్తున్నారు. అమెరికా అధిక సుంకాల ప్రభావం వంటివి ఇబ్బంది పెడుతున్నా, భారత్ రాణిస్తుందనే ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) సర్వే తేల్చి చెప్పింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వరంగ, ప్రైవేటు కంపెనీల్లోని ముఖ్య ఆర్థిక వేత్తల అభిప్రాయాలతో ఈ నివేదికను రూపొందించినట్లు డబ్ల్యూఈఎఫ్ తెలిపింది. దావోస్ ఆర్థిక సదస్సుకు ముందుగా 'చీఫ్ ఎకనామిస్ట్స్ అవుట్‌లుక్' పేరిట శుక్రవారం విడుదల చేసిన ఈ నివేదిక ప్రకారం..



✦ కొన్ని అంశాల్లో మెరుగుపడినా, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అనిశ్చితి కొనసాగుతోంది. రుణాలు పెరిగిపోతుండటం, భౌగోళిక-ఆర్థిక ఉద్రిక్తతలు అధికమవ్వడం, కృత్రిమమేధ సాంకేతికత (ఏఐ) వల్ల కొత్త అవకాశాలు వస్తుండగా, ఉద్యోగాల్లో కోతల వంటి నష్టభయాలను ఎదుర్కోవాల్సి వస్తుండటం ఇందుకు కారణం.

✦ ప్రపంచ ఆర్థిక పరిస్థితులు మరింత బలహీనపడతాయని 53% మంది ఆర్థిక వేత్తలు అంచనా వేశారు. 2025 సెప్టెంబరులో ఈ సంఖ్య 72 శాతంగా ఉంది.

✦ ప్రాంతాల వారీగా చూస్తే దక్షిణాసియా వృద్ధి పటిష్ఠంగా ఉంటుందని 60% మంది, అత్యంత పటిష్ఠంగా ఉంటుందని 6% మంది పేర్కొన్నారు. ఇందుకు భారత్ కారణమవుతుందని తెలిపారు. గత సెప్టెంబరులో ఇలా అంచనా వేసినవారు 31% మందే. అమెరికా పరిస్థితులు మెరుగవుతాయని 69% మంది, వృద్ధి పటిష్ఠంగా ఉంటుందని 11% మంది అంచనా వేశారు. ఐరోపా వృద్ధి బలహీనంగానే ఉండొచ్చని 53% మంది అంచనా వేశారు. ఒకమాదిరి వృద్ధితో సాగొచ్చని 44% మంది వివరించారు.

✦ అమెరికా సుంకాలు ఇబ్బంది పెడుతున్నా, భారత ఆర్థిక వ్యవస్థ సెప్టెంబరు త్రైమాసికంలో 8.2% వృద్ధి చెందడాన్ని నివేదిక ప్రస్తావించింది. కార్మిక సంస్కరణలకు తోడు అమెరికా టెక్నాలజీ సంస్థల పెట్టుబడుల ఫలితంగా ఏఐ వినియోగం పెరుగుతోందని వివరించింది. రాబోయే 10 ఏళ్లలో వృద్ధిపై ఏఐ పెట్టుబడుల ప్రభావం గణనీయంగా సానుకూలంగా ఉంటుందని 36% మంది అంచనా వేశారు.

✦ ద్రవ్యోల్బణం అదుపులోనే ఉన్నా, పరపతి విధానాల్లో మార్పు ఉండకపోవచ్చని 85% మంది పేర్కొన్నారు.

క్రిప్టోలు, బంగారంపై

క్రిప్టోకరెన్సీల భవిత ఆశాజనకంగా ఉండకపోవచ్చని, మార్కెట్ ఒడుదొడుకులు ఇందుకు కారణమవుతాయని 62% మంది అంచనా వేశారు. బంగారం ధర గరిష్ఠస్థాయిలకు చేరిందనే 54% మంది పేర్కొన్నారు.

కృత్రిమ మేధతో స్వల్పంగా ఉద్యోగ కోతలుంటాయ్

కృత్రిమమేధ వల్ల ఉత్పాదకత అమెరికా, చైనాల్లో రాబోయే రెండేళ్లలో మెరుగవుతుందనే అంచనాను ప్రతి అయిదుగురు ఆర్థిక వేత్తల్లో నలుగురు వ్యక్తం చేశారు. ఈ సాంకేతికతను స్వీకరించడంలో ఐటీ రంగం వేగంగా ఉంది. తరవాత స్థానాల్లో ఆర్థిక సేవలు, సరఫరా వ్యవస్థలు, ఆరోగ్య సంరక్షణ, ఇంజినీరింగ్, రిటెయిల్ రంగాలుంటాయి. ఏఐ వల్ల ఉద్యోగ కోతలు రాబోయే రెండేళ్లలో కొంతమేర ఉంటాయనే మూడింట రెండు వంతుల మంది ఆర్థిక వేత్తలు పేర్కొన్నారు. 10 ఏళ్ల పాటు ఉద్యోగ కోతలుంటాయని 57% మంది, దీర్ఘకాలంలో ప్రయోజనాలుంటాయని 37% మంది అంచనా వేస్తున్నారు.

రాణించిన యెస్ బ్యాంక్

ముంబయి: ప్రైవేటు రంగ యెస్ బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అక్టోబరు-డిసెంబరు త్రైమాసికంలో రూ.952 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. అంత క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాల లాభం రూ.612 కోట్లతో పోలిస్తే ఇది 55 శాతం అధికం. సెప్టెంబరు త్రైమాసికంలో రూ.654 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. కొత్త కార్మిక చట్టాల అమలులో భాగంగా గ్రాట్యుటీ కోసం రూ.155 కోట్లు కేటాయించింది. నికర వడ్డీ ఆదాయం 10.9 శాతం పెరిగి రూ.2,466 కోట్లకు చేరింది. వడ్డీయేతర ఆదాయం 8 శాతం పెరిగి రూ.1,633 కోట్లకు చేరింది. నికర వడ్డీ మార్జిన్ 0.1 శాతం పెరిగింది. రుణ వృద్ధి 5.2 శాతంగా నమోదైంది. 2025-26లో 8 శాతం లక్ష్యంగా పెట్టుకున్నట్లు బ్యాంక్ సీఈఓ, ఎండీ ప్రశాంత్ కుమార్ తెలిపారు. ఆస్తుల నాణ్యతకొస్తే స్థూల మొండి బకాయిలు రూ.1,248 కోట్ల నుంచి రూ.1,050 కోట్లకు తగ్గాయి. స్థూల నిరర్థక ఆస్తుల నిష్పత్తి 1.5 శాతం నుంచి 0.1 శాతానికి మెరుగైంది. మొత్తం కేటాయింపులు రూ.259 కోట్ల నుంచి రూ.21.89 కోట్లకు తగ్గాయి. బ్యాంక్ కనీస మూలధన నిష్పత్తి 14.5 శాతంగా నమోదైంది.

ఐడీబీఐ బ్యాంక్ లాభం రూ.1935 కోట్లు

దిల్లీ: డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికంలో ఐడీబీఐ బ్యాంక్ రూ.1935 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో బ్యాంక్ నికర లాభం రూ.1908 కోట్లుగా ఉంది. మొత్తం ఆదాయం రూ.8,565 కోట్ల నుంచి రూ.8,282 కోట్లకు తగ్గింది. వడ్డీ ఆదాయం కూడా రూ.7,816 కోట్ల నుంచి రూ.7,074 కోట్లకు తగ్గింది. స్థూల నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏ) 3.57 శాతం నుంచి 2.57 శాతానికి మెరుగుపడ్డాయి. నికర ఎన్‌పీఏలు 0.18 శాతం వద్ద స్తబ్దుగా ఉన్నాయి.

యూకో బ్యాంక్ లాభంలో 16% వృద్ధి

దిల్లీ: ప్రభుత్వ రంగ యూకో బ్యాంక్, అక్టోబరు-డిసెంబరు త్రైమాసికంలో రూ.740 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. 2024-25 ఇదే త్రైమాసికంలో బ్యాంక్ ఆర్జించిన రూ.639 కోట్ల నికర లాభంతో పోలిస్తే ఇది 16 శాతం ఎక్కువ. వడ్డీ ఆదాయం పెరగడం, మొండి బకాయిలు తగ్గడం ఇందుకు కలిసొచ్చింది. మొత్తం ఆదాయం రూ.7,406 కోట్ల నుంచి రూ.7,521 కోట్లకు వృద్ధి చెందింది. వడ్డీ ఆదాయం రూ.6,220 కోట్ల నుంచి రూ.6,652 కోట్లకు పెరిగింది. నికర వడ్డీ ఆదాయం రూ.2,378 కోట్ల నుంచి 11.27% అధికమై రూ.2,646 కోట్లుగా నమోదైంది. స్థూల నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏలు) 2.91 శాతం నుంచి 2.41 శాతానికి, నికర ఎన్‌పీఏలు 0.63 శాతం నుంచి 0.36 శాతానికి పరిమితమయ్యాయి. దేశీయ నికర వడ్డీ మార్జిన్ 3.27 శాతంగా ఉంది.

✦ నిధుల సమీకరణకు సరైన సమయం కోసం ఎదురుచూస్తున్నామని యూకో బ్యాంక్ వెల్లడించింది. కనీస ప్రజా షేర్‌హోల్డింగ్ నిబంధన అందుకునేందుకు గడువు పొడిగించాల్సిందిగా సెబీని కోరనున్నట్లు తెలిపింది.

555% పెరిగిన ఆర్‌బీఎల్ బ్యాంక్ లాభం

ముంబయి: ప్రైవేట్ రంగ ఆర్‌బీఎల్ బ్యాంక్, డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికంలో రూ.214 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో బ్యాంక్ ఆర్జించిన రూ.33 కోట్ల నికర లాభంతో పోలిస్తే ఇది 555% అధికం. జూన్ త్రైమాసికంలో బ్యాంక్ లాభం రూ.179 కోట్లుగా ఉంది. నికర వడ్డీ ఆదాయం 5 శాతం పెరిగి రూ.1,657 కోట్లకు చేరింది. అడ్వాన్సుల్లో 14% వృద్ధి ఇందుకు దోహదపడింది. నికర వడ్డీ మార్జిన్ 0.12% మెరుగుపడి 4.63 శాతంగా నమోదైంది. సమీక్షిస్తున్న త్రైమాసికంలో మొత్తం అడ్వాన్సులు 12% వృద్ధి చెందాయని బ్యాంక్ ఎండీ, సీఈఓ ఆర్.సుబ్రమణియ కుమార్ పేర్కొన్నారు. స్థూల నిరర్థక ఆస్తులు 1.04 శాతం తగ్గి 1.88 శాతానికి మెరుగుపడ్డాయి.

1.25 లక్షల టెక్ కొలువులు



2026పై అడెకో ఇండియా అంచనా

భారతీయ టెక్ రంగంలో నియామకాలు తిరిగి ఊపందుకోనున్నాయి. ఈ ఏడాది టెక్ నియామకాలు, గతేడాదితో పోలిస్తే 12-15% పెరిగే అవకాశం ఉందని వర్క్‌ఫోర్స్ సొల్యూషన్స్ సంస్థ అడెకో ఇండియా వెల్లడించింది. శాశ్వత, తాత్కాలిక, ఒప్పంద ప్రాతిపదికన జరిగే ఈ నియామకాల ద్వారా దాదాపు 1.25 లక్షల మందికి కొత్త ఉద్యోగాలు లభిస్తాయని తెలిపింది. గతంలో డిజిటల్ సేవలను కేవలం అదనపు హంగులుగా చూసిన నాన్-టెక్ పరిశ్రమలు, ఇప్పుడు తమ వ్యాపార నమూనాల్లో కీలక మార్పులు చేస్తున్నాయి. కృత్రిమ మేధ (ఏఐ), డేటా ఇంజినీరింగ్, సైబర్ సెక్యూరిటీ వంటి విభాగాలను తమ వ్యాపారాల్లోకి తీసుకొస్తున్నాయి. దీంతో 2026.. టెక్ నియామకాలకు ఒక కీలక మలుపుగా మారనుందని నివేదిక విశ్లేషించింది.

ఐటీ, ఐటీ అనుబంధ సేవల రంగం 2025 నుంచే స్థిరీకరణ దిశగా అడుగులు వేయడం ప్రారంభించింది. 2023-24 మధ్య కాలంలో నెలకొన్న అనిశ్చితి తర్వాత, ఏఐ ఇంజినీరింగ్, క్లౌడ్ ట్రాన్స్‌ఫర్మేషన్, సైబర్ సెక్యూరిటీ, డేటా ప్లాట్‌ఫామ్స్ ఆధునికీకరణ వంటి విభాగాల్లో గిరాకీ క్రమంగా పెరుగుతూ వచ్చింది. 'పరిశ్రమలు క్రమంగా పునరుద్ధరణ దిశగా సాగుతున్నాయి. క్యాంపస్ నియామకాలూ మెరుగవుతున్నాయి. కంపెనీలు తిరిగి కొత్త ఉద్యోగుల కోసం అవసరమైన కార్యక్రమాలను ప్రారంభిస్తున్నాయి' అని అడెకో ఇండియా డైరెక్టర్, బిజినెస్ హెడ్ సంకేత్ చెంగప్ప తెలిపారు.

అవసరంగా మారిన ఏఐ, సైబర్ సెక్యూరిటీ

ఏఐ, డేటా, సైబర్ సెక్యూరిటీ వంటి సాంకేతికతలు ప్రయోగాత్మక దశల నుంచి సంస్థల ప్రధాన అవసరాలుగా మారాయి. ఈ విభాగాల్లో గిరాకీ ఏకంగా 51% పెరిగినట్లు నివేదిక పేర్కొంది. ఇప్పటికే దాదాపు 40% పెద్ద సంస్థలు ప్రయోగాత్మక జనరేటివ్ ఏఐ ప్రాజెక్టులను కార్యరూపంలోకి తెచ్చాయి. గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు (జీసీసీ) సైబర్ సెక్యూరిటీకి బోర్డు స్థాయిలో ప్రాధాన్యం ఇస్తుండగా, టెక్ ఏతర రంగాలు ఆటోమేషన్‌ను వేగవంతం చేసేందుకు పెద్ద ఎత్తున టెక్ బృందాలను ఏర్పాటు చేసుకుంటున్నాయి.

నిపుణుల కొరత.. పెరిగిన వేతనాలు..

ఒకవైపు ఉద్యోగావకాశాలు పెరుగుతుండగా, మరోవైపు పరిశ్రమకు అవసరమైన నిపుణుల కొరత వేధిస్తోంది. 2025 నాటికి నైపుణ్య లోటు 44 శాతానికి చేరుకుంది. దీనివల్ల నైపుణ్యాలున్న అభ్యర్థుల కోసం పోటీ పెరిగి, వేతన ప్యాకేజీలు 2024తో పోలిస్తే సగటున 18% అధికంగా లభిస్తున్నాయి. ఏఐ, సైబర్ సెక్యూరిటీ, డేటా ఇంజినీరింగ్ వంటి విభాగాలు 45% నైపుణ్య లోటును ఎదుర్కొంటున్నాయి. రాబోయే రోజుల్లో డిజిటల్ పరివర్తన వేగం, నిపుణుల లభ్యతపైనే ఆధారపడి ఉంటుందని చెంగప్ప అభిప్రాయపడ్డారు.

కీలకంగా..

ప్రస్తుత టెక్ ఆధారిత నియామకాల్లో బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా (బీఎఫ్ఎస్ఐ), ఆరోగ్య సంరక్షణ, తయారీ, లాజిస్టిక్స్ రంగాలు ముందు వరసలో ఉన్నాయి. మొత్తం టెక్ ఉద్యోగాల్లో ఈ రంగాల వాటా దాదాపు 38 శాతంగా ఉందని అడెకో ఇండియా నివేదిక స్పష్టం చేసింది.

ఈనాడు సినిమా

ఇలాంటి సినిమాలు మళ్లీ చేయాలని ఉంది: రవితేజ

“ఇద్దరమ్మాయిల మధ్య నలిగిపోయే వ్యక్తిగా నటించాలన్న కోరిక 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' చిత్రంతో తీరింది” అన్నారు కథానాయకుడు రవితేజ. ఈ చిత్ర విజయంలో పూర్తి క్రెడిట్ దర్శకుడు కిశోర్ తిరుమల, సంగీత దర్శకుడు భీమ్స్‌కే దక్కుతుందని తెలిపారు. రవితేజ హీరోగా కిశోర్ తెరకెక్కించిన ఈ సినిమాని సుధాకర్ చెరుకూరి నిర్మించిన సంగతి తెలిసిందే. ఆషికా రంగనాథ్, డింపుల్ హయాతి కథానాయికలు. ఈ చిత్రం ప్రస్తుతం థియేటర్లలో సందడి చేస్తున్న నేపథ్యంలో శనివారం హైదరాబాద్‌లో సక్సెస్‌మీట్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హీరో రవితేజ మాట్లాడుతూ.. “ఈ సంక్రాంతికి ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్. అన్ని చిత్రాలతో పాటు మా సినిమా కూడా చాలా బాగుంది. ఈ చిత్రాన్ని విజయవంతం చేసిన ప్రేక్షక మహాశయులకు కృతజ్ఞతలు. దీనికి ఇంకా మంచి రన్ ఉంటుంది. దర్శకుడు కిశోర్‌కి సహజంగానే మంచి కామెడీ టైమింగ్ ఉంది. బాలు మహేంద్ర, జంధ్యాల, క్రేజీ మోహన్ లాంటి ఫ్లేవర్ ఉన్న రైటింగ్ తనది. ఎమోషన్.. ఎంటర్‌టైన్‌మెంట్‌ను అద్భుతంగా రాస్తాడు. ఇలా ఆర్గానిక్ కామెడీతో కూడిన సినిమాని రాఘవేంద్రరావు దర్శకత్వంలో చేయాల్సింది కానీ, వర్కవుట్ అవ్వలేదు. ఇప్పుడది కిశోర్ ద్వారా నెరవేరింది. ఇలాంటి సినిమాలు మళ్లీ చేయాలని ఉంది. మా అమ్మ, సునీల్ వాళ్ల అమ్మ బెస్ట్ ఫ్రెండ్స్. వాళ్ల వెటకారమే మా ఇద్దరికీ వచ్చిందనుకుంటా. ఇందులో సునీల్‌తో చేసిన ప్రతి సీన్‌ను విపరీతంగా ఎంజాయ్ చేశా” అన్నారు. “ఈ సంక్రాంతికి ఇంత బ్లాక్‌బస్టర్ ఇచ్చినందుకు అందరికీ కృతజ్ఞతలు. దీనికి అన్ని వైపుల నుంచి చాలా మంచి సినిమా అనే ఆదరణ లభిస్తోంది” అన్నారు నిర్మాత సుధాకర్ చెరుకూరి. దర్శకుడు కిశోర్ మాట్లాడుతూ.. “ఈ సినిమా చూసి థియేటర్లలో ప్రేక్షకులు నాన్‌స్టాప్‌గా నవ్వుతున్నారు. ప్రతి పాత్రను చాలా ఎంజాయ్ చేస్తున్నారు. రవితేజ వల్లే మేము అనుకున్నది వందకి వందశాతం తెరపై చూపించగలిగా” అన్నారు. ఈ కార్యక్రమంలో డింపుల్ హయాతి, సునీల్, మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.


సుధాకర్, కిశోర్ తిరుమల, రవితేజ, డింపుల్ హయాతి, సునీల్

'ఊర్వశి' శారద.. భారతీయ సినీప్రియులకు ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేని పేరిది. 'మనుషులు మారాలి', 'జస్టిస్ చౌదరి', 'సర్దార్ పాపారాయుడు', 'బొబ్బిలి బ్రహ్మన్న', 'ఏవండీ ఆవిడ వచ్చింది', 'అమ్మ రాజీనామా', 'స్టాలిన్', 'యోగి'.. ఇలా ఆమె పేరు చెప్పగానే కళ్ల ముందు కదలాడే విజయవంతమైన చిత్రాలెన్నో. ఆరున్నర దశాబ్దాల సినీ ప్రయాణంలో అన్ని దక్షిణాది భాషలతో పాటు హిందీలోనూ విలక్షణమైన పాత్రలు పోషించి.. భారతీయ చిత్ర పరిశ్రమపై చెరగని ముద్ర వేశారు. ఇప్పుడామె మలయాళ చిత్ర పరిశ్రమకు అందించిన సేవలకు గానూ కేరళ ప్రభుత్వం ఇచ్చే అత్యున్నత సినిమా పురస్కారం 'జేసీ డానియల్ అవార్డు - 2024'కు ఎంపికయ్యారు. ఈనెల 25న తిరువనంతపురంలో జరగనున్న కేరళ రాష్ట్ర చలన చిత్ర అవార్డుల ప్రదానోత్సవంలో ముఖ్యమంత్రి పినరయి విజయన్ చేతుల మీదుగా శారద ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు. ఈ నేపథ్యంలోనే 'ఈనాడు సినిమా' ఆమెతో ప్రత్యేకంగా ముచ్చటించింది. ఆ విశేషాలివి..

ఈ పేరు ప్రఖ్యాతులు.. అవార్డులు అన్నీ అమ్మ చలవే!

ఈ ప్రేమను ఆఖరి శ్వాస వరకు గుర్తు పెట్టుకుంటా!

“కేరళ ప్రభుత్వం జేసీ డానియల్ ప్రతిష్ఠాత్మక పురస్కారానికి నన్ను ఎంపిక చేయడం చాలా ఆనందంగా ఉంది. మలయాళ చిత్రసీమ.. అక్కడి ప్రేక్షకులు నాపై చూపించిన ఈ ప్రేమను నా ఆఖరి శ్వాస వరకు మర్చిపోను. వాళ్లు లేకపోతే నేను లేను. కెరీర్ ఆరంభంలో తెలుగులో నేను కొన్ని చిత్రాల్లో కామెడీ వేషాలు వేశా. ఆ సందర్భంలో 'ఆ పాత్రలు కూడా ఈ అమ్మాయికి సరిగా చేత కావట్లేద'నే ఫీలింగ్ కొందరిలో వినిపించింది. అలాంటి తరుణంలో 'శకుంతల' అనే సినిమా కోసం మలయాళ పరిశ్రమ నుంచి పిలుపు రావడం.. అది కూడా ప్రముఖ దర్శక నిర్మాత కుంచాకోతో కలిసి పని చేసే అవకాశం రావడం నా సినీ ప్రయాణాన్ని మలుపు తిప్పింది. నన్ను ఓ స్టార్ నటిగా నిలబెట్టింది. అందుకే నాకు అంత గొప్ప అవకాశాన్నిచ్చిన కుంచాకోని జీవితంలో ఎప్పటికీ మర్చిపోను”.


శారద

“నేను చిత్ర పరిశ్రమలోకి స్థిరపడతానని, ఈస్థాయిలో గుర్తింపు తెచ్చుకుంటానని ఎప్పుడూ ఊహించలేదు. నాకంత గొప్ప అభినయ శక్తి కూడా ఉండేది కాదు. సినిమాల వల్ల నా చదువును కూడా 8వ తరగతితోనే ఆపేశాను. ఏ విషయంలోనైనా నా గురువు మా అమ్మే. ఆమె ఎప్పుడూ 'నా కూతురు ప్రతి వేషాన్నీ చక్కగా చేయాలి. గొప్ప పేరు పొందాల'ని మాత్రం ఆలోచించేది. అంతే తప్ప నటన పరంగా నాకెలాంటి సలహాలూ.. సూచనలైతే ఇచ్చేది కాదు. ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోమని చెప్పేది. నాన్న మాత్రం క్రమశిక్షణ ఎలా ఉండాలో

ఆరోజు అమ్మ కంటతడి పెట్టుకుంది!

నేర్పించారు. అప్పట్లో మాకు కారుండేది కాదు. సినిమా యూనిట్ నుంచి ఆరు గంటల కల్లా కారొచ్చేది.. నేను అయిదున్నర కల్లా రెడీ అయ్యి కూర్చోవాలని నాన్న చెప్పేవారు. అదే సమయపాలన నాకు ఆ తర్వాత కూడా అలవాటైపోయింది. నేనెప్పుడూ సెట్‌కు ఆలస్యంగా వెళ్లిన సందర్భాలు లేవు. 'అమ్మయెన్న స్త్రీ' అనే మలయాళ సినిమాకి గానూ నేను తొలిసారి జాతీయ పురస్కారానికి ఎంపికైనప్పుడు అమ్మ ఎంతో సంబరపడింది. నాతో పాటు అమ్మని దిల్లీకి తీసుకెళ్లా. ఆ పురస్కారం తీసుకొచ్చి అమ్మ చేతుల్లో పెట్టగానే గర్వంతో కంటతడి పెట్టుకుంది. ఆమె కల నెరవేరినందుకు సంబరపడింది”.

సినిమా మాటెత్తితేనే నాన్న కోప్పడేవారు..

“నాకు జన్మనిచ్చింది.. సినీ నటిగా జన్మనిచ్చింది మా అమ్మ సత్యవతే. నన్ను నటిని చేయాలన్న ఆలోచన మా అమ్మకు ఎందుకు వచ్చిందో తెలియదు కానీ, నేను తప్పకుండా ఇండస్ట్రీలో రాణిస్తానని బలంగా నమ్మింది. నిజానికి అప్పటికి నేను ఏమంత గొప్పగా కనిపించేదాన్నీ కాదు. కానీ, అమ్మ నా గురించి చాలా గొప్పగా ఊహించుకునేది. నాన్న మాత్రం నన్ను ఇండస్ట్రీలోకి పంపడానికి తొలుత అసలు ఒప్పుకోలేదు. సినిమా, నటన పేరెత్తితేనే చాలా కోప్పడేవారు. దాంతో ఓసారి మా అమ్మ ఆయన కాళ్లు పట్టుకుని ఏడ్చారు. 'మనమ్మాయి తప్పకుండా పెద్ద ఆర్టిస్ట్ అవుతుంది. నా మాట నమ్మండ'ని బతిమాలి ఒప్పించారు. దాంతో నాన్న కూడా ఆమెని నొప్పించలేక సరేనని చెప్పి నన్ను చెన్నైకి తీసుకొచ్చారు. అలా అమ్మ ప్రోత్సాహంతోనే నటన వైపు నా ప్రయాణం మొదలైంది. అందుకే ఇప్పటికీ రోజు ఉదయం నిద్ర లేవగానే అమ్మ వాళ్లకి తొలుత నమస్కారం పెట్టుకుంటా. ఇప్పుడు నటిగా నాకింత పేరు ప్రఖ్యాతులు, అవార్డులు ఏవి దక్కాయన్నా అన్నీ అమ్మ చలవే. ఇప్పుడొచ్చిన ఈ జేజీ డానియల్ అవార్డు కూడా ఆమెకే చెందుతుంది”.

ద్రౌపది పాత్ర.. ఎన్టీఆర్ చెప్పిన ధైర్యం

“క్రమశిక్షణ, సమయపాలనలో రామారావు చాలా పక్కాగా ఉండేవారు. ఆయన నాతో 'దాన వీర శూర కర్ణ'లో ద్రౌపది పాత్ర చేయించారు. అప్పటి వరకు నేను అలాంటి పౌరాణిక పాత్రలు చేయలేదు. నాకు చేత కాదు. తొలిరోజు సెట్‌లో డైలాగ్ చెప్పలేక భయపడుతుంటే ఆయన నా దగ్గరకొచ్చి 'మీరేం భయపడొద్దు. మీరు చక్కగా నటిస్తారు. భయంతో డైలాగ్ చెప్పలేకపోతున్నారు. ఇంటికెళ్లి హాయిగా విశ్రాంతి తీసుకుని, డైలాగ్ మళ్లీ చదువుకుని రండ'ని ధైర్యం చెప్పారు. నేను తను చెప్పినట్లే చేసి సెట్‌కి తిరిగొచ్చాక ఫస్ట్ టేక్‌లోనే షాట్ ఓకే అయిపోయింది. అప్పట్లో రామారావు తోటి నటీనటుల్ని అలాగే ప్రోత్సహించి, ధైర్యానిచ్చేవారు. అలాగే ఏఎన్నార్, కృష్ణ, కృష్ణంరాజు, శోభన్ బాబు.. ఇలా నేను కలిసి పని చేసిన ప్రతి హీరో నన్నెంతో ప్రోత్సహించారు. ఏ భాషలో నైనా సరే నేనెప్పుడూ ఇబ్బంది పడింది లేదు. ఇక తమిళంలో ఎంజీఆర్‌తో నేను ఒకే ఒక్క సినిమా చేశా. అది తమిళనాడులో చాలా ప్రాచుర్యం పొందింది. అదెంతలా అంటే అక్కడ నేను ఏదైనా వేడుకలో పాల్గొంటే.. 'తలైవర్ చెల్లెలు వచ్చింది' అని చెప్పేవాళ్లు”.

సరస్వతి... శారదగా

“నా అసలు పేరు సరస్వతి దేవి. నేను ఇండస్ట్రీలోకి వచ్చే సరికి చెన్నైలో చాలా మంది సరస్వతులు ఉండేవాళ్లు. అందుకే నన్ను ఆయన మిత్రుడు సరస్వతి అనే అర్థం వచ్చేలా నా పేరుని శారదగా మార్చారు. కెరీర్ ఆరంభంలో ఒకానొక సందర్భంలో నాన్న నన్ను తిరిగి ఇంటికి తీసుకెళ్లాలని అనుకున్నారు. అప్పుడు నాకు సరైన కామెడీ పాత్రలు కూడా రావట్లేదు. సరిగ్గా అప్పుడే గాయని జానకి భర్త రాంప్రసాద్ వల్ల నాకు మలయాళ చిత్రసీమలోకి అడుగు వేసే అవకాశం వచ్చింది”.

అందుకే సినిమాలు మానేశా..

“ఇన్నేళ్ల సినీ ప్రయాణంలో కథానాయికగా, సహాయ నటిగా ఎన్నో విజయవంతమైన చిత్రాల్లో గొప్ప విలక్షణమైన పాత్రలు పోషించా. భగవంతుడు నాకిచ్చిన ఈ ప్రయాణం చాలా సంతృప్తినిచ్చింది. ఇక జీవితంలో అనుకున్నది సాధించేశా అనిపించింది. అందుకే సినిమాల నుంచి విరామం తీసుకున్నా. నటిగా పలానా పాత్ర చేయలేదే అనే అసంతృప్తి నాకేమీ లేదు. నేను ఎన్నో రకాల పాత్రలు చేశా. 'మనుషులు మారాలి' సినిమాని నాలుగు భాషల్లో తీస్తే.. అన్నింట్లో నేనే నాయికగా నటించాను. అప్పట్లో అదొక రికార్డ్. ప్రస్తుతం నేను సినిమాలు కూడా చూడట్లేదు. కొన్నాళ్ల క్రితం కంటికి ఆపరేషన్ జరిగింది. డాక్టర్ కళ్లపై ఒత్తిడి పడనీయకుండా చూసుకోమని చెప్పారు. అందుకే టీవీ, సినిమాలు చూడటం మానేశా. పొద్దున్నే లేవగానే కాసేపు ధ్యానం చేసుకుంటా. ఆ తర్వాత దైవారాధనలో గడుపుతా. నెలకొకసారి ఇంటి దగ్గర్లో ఉన్న గుడికి వెళ్లొస్తుంటా. అప్పుడప్పుడు జానకి, మణిమాలలతో ఫోన్లో మాట్లాడుతుంటా”.

అతిరథి వేడుకలు మొదలయ్యేది అప్పుడే!


టొవినో థామస్, బసిల్ జోసెఫ్

మలయాళ కథానాయకులు టొవినో థామస్, బసిల్ జోసెఫ్, వినీత్ శ్రీనివాసన్ కలిసి 'అతిరథి' సినిమాతో తెరపై సందడి చేయడానికి సన్నద్ధమవుతున్నారు. అరుణ్ అనిరుధన్ దర్శకత్వం వహించారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. దీన్ని ఓనం పండగ సందర్భంగా తీసుకురాబోతున్నట్లు ఇప్పటికే ప్రకటించింది చిత్రబృందం. తాజాగా ఈ చిత్రాన్ని అనుకున్న తేదీ కన్నా ముందుగానే థియేటర్లలోకి తీసుకొస్తున్నట్లు తెలుపుతూ.. సామాజిక మాధ్యమాల వేదికగా ఓ పోస్టర్‌ను పంచుకుంది. “వేడుకలు ఇప్పుడు మొదలవుతున్నాయి.. మే 14న బాణసంచా పేలబోతుంది” అనే వ్యాఖ్యను జోడించింది. డా.అనంతు ఎస్, బసిల్ జోసెఫ్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. దర్శన రాజేంద్రన్, జరీన్ షిహాబ్ తదితరులు ఈ చిత్రంలో నటిస్తున్నట్లు తెలుస్తోంది. కాలేజీ బ్యాక్‌డ్రాప్ నేపథ్యంలో దీన్ని తీర్చిదిద్దుతున్నట్లు చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి.

'తుడరుమ్' దర్శకుడితో మరోసారి?


మోహన్‌లాల్

గతేడాది 'తుడరుమ్' సినిమాతో మంచి విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నారు మలయాళ అగ్రహీరో మోహన్‌లాల్. దర్శకుడు తరుణ్ మూర్తి తెరకెక్కించిన ఈ చిత్రంలో ఆయన ట్యాక్సీ డ్రైవర్‌గా కనిపించి సినీప్రియుల్ని ఆకట్టుకున్నారు. తాజాగా మోహన్‌లాల్ తన రాబోయే ప్రాజెక్టు కోసం మరోసారి తరుణ్ మూర్తితో చేతులు కలిపినట్లు తెలుస్తోంది. 'ఎల్365' (వర్కింగ్ టైటిల్) పేరుతో దీన్ని రూపొందించనున్నట్లు సమాచారం. ఈ నెల 23న చిత్రీకరణ ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నారని, ఇప్పుడు రాబోయే చిత్రాన్ని మునుపటి కన్నా భారీగా తీర్చిదిద్దాలని నిర్ణయించుకున్నట్లు మోహన్‌లాల్ సన్నిహిత వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం ఆయన 'దృశ్యం 3', 'పేట్రియాట్' లాంటి సినిమా చిత్రీకరణలతో బిజీగా ఉన్నారు.


నీలిమ గుణ, పృథ్వీ, భూమిక, సారా అర్జున్, గుణశేఖర్, యుక్త గుణ, విఘ్నేశ్ గవిరెడ్డి, రాగిణి గుణ

'యుఫోరియా' చూస్తే వాళ్లకి నాపై కోపం వస్తుంది – గుణశేఖర్

“కుటుంబంతో కలిసి చూడాల్సిన సినిమా 'యుఫోరియా'. ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న కొన్ని దారుణాల్ని ఉన్నది ఉన్నట్లుగా తెరకెక్కించా. యువత ఎంత తప్పుదోవ పడుతుందన్నది బోల్డ్‌గా చూపించా” అన్నారు దర్శకుడు గుణశేఖర్. ఆయన తెరకెక్కించిన ఈ సినిమాలో భూమిక, సారా అర్జున్, విఘ్నేశ్ గవిరెడ్డి, గౌతమ్ మేనన్ ప్రధాన పాత్రలు పోషించారు. రాగిణి గుణ సమర్పణలో నీలిమ గుణ నిర్మించారు. ఈ సినిమా ఫిబ్రవరి 6న ప్రేక్షకుల ముందుకు రానున్న నేపథ్యంలో శనివారం హైదరాబాద్‌లో ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా భూమిక మాట్లాడుతూ.. “ఇది నాకు చాలా ప్రత్యేకమైన సినిమా. 23ఏళ్ల తర్వాత గుణశేఖర్‌తో కలిసి పని చేయడం సంతోషంగా ఉంది. ఈ చిత్రం చేస్తున్నప్పుడు నాకు మా అబ్బాయి గుర్తొచ్చాడు. పిల్లల్ని ఎలా పెంచాలనేది అందరూ తెలుసుకోవాలి” అన్నారు. “ఇది చాలా సున్నితమైన అంశంతో రూపొందింది. ఈ కథ విన్నప్పుడు భావోద్వేగానికి లోనయ్యా. ఇది కచ్చితంగా అందరూ మెచ్చే సినిమా అవుతుంది” అంది నటి సారా అర్జున్. దర్శకుడు గుణ శేఖర్ మాట్లాడుతూ.. “నా మనసుని కదిలించిన కథ ఇది. ఈ చిత్రం చూస్తున్నప్పుడు కొందరు మధ్యలోనే వెళ్లిపోయే అవకాశముంది. ఎందుకంటే వాళ్లకి నాపై కోపం వస్తుంది. కచ్చితంగా ఈ చిత్రం చూశాక అందరూ ఆలోచిస్తారు. ప్రతి కుటుంబం దీనితో కనెక్ట్ అవుతుంది. ఈ కథ వింటున్నప్పుడే నీలిమ దీనికి సారా అర్జున్ అయితే బాగుంటుందని చెప్పింది. ఆమె నటిస్తానంటేనే ఈ సినిమా తీద్దాం లేదంటే ఆపేద్దాం అని నీలిమతో చెప్పా. ఈ చిత్రం విడుదలయ్యాక భూమిక తప్పకుండా అందరి ప్రశంసలు అందుకుంటుంది” అన్నారు. ఈ కార్యక్రమంలో నీలిమ, పృథ్వీ అడ్డాల, యుక్త గుణ, విఘ్నేశ్ గవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


శ్రీలీల

బాలీవుడ్‌లో మరొకటి?

'పరాశక్తి' సినిమాతో ఈ ఏడాదికి స్వాగతం పలికింది అందాల తార శ్రీలీల. ప్రస్తుతం భాషతో సంబంధం లేకుండా అలరిస్తున్న ఈ భామ.. హీరో కార్తిక్ ఆర్యన్‌తో ఓ హిందీ చిత్రంలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పుడామె మరో బాలీవుడ్ సినిమాకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ధర్మ ప్రొడక్షన్స్ నిర్మాణంలో రూపొందుతున్న చిత్రం 'నాగ్జిల్లా'. ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ చేసుకుంటోన్న ఈ చిత్రంలో కథానాయికగా శ్రీలీలను ఎంపిక చేసిందట చిత్ర బృందం. ఫాంటసీ నేపథ్యంలో తీర్చిదిద్దుతున్న ఈ చిత్రంలో కూడా కార్తిక్ ఆర్యనే హీరో కావడం విశేషం. అన్నీ అనుకున్నట్లుగా జరిగితే.. శ్రీలీల, కార్తిక్ కాంబినేషన్‌లో ఇది రెండో సినిమా అవుతుందని నిర్మాణ సంస్థ సన్నిహిత వర్గాలు తెలిపాయి. మరి తన డ్యాన్స్‌లతో తెరపై మ్యాజిక్ చేసే శ్రీలీల.. కార్తిక్‌తో కలిసి నాగలోకంలో ఎలాంటి హంగామా చేస్తుందో చూడాలంటే కొన్ని రోజులు వేచి చూడాల్సిందే.

జూన్‌లో.. 'ధమాల్ 4'


అజయ్ దేవగణ్

'ధమాల్' ఫ్రాంచైజీలో భాగంగా వస్తోన్న సినిమా 'ధమాల్ 4'. బాలీవుడ్ కథానాయకుడు అజయ్ దేవగణ్, రితేశ్ దేశ్‌ముఖ్, అర్షద్ వార్సీ, సంజయ్ మిశ్రా, జావేద్ జాఫేరి ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. కామెడీ నేపథ్యంలో రూపొందుతున్న ఈ చిత్రానికి ఇంద్ర కుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ సినిమా విడుదల తేదీని ఖరారు చేసుకుంది. ప్రేక్షకుల్లో నవ్వులు పూయించేందుకు ఈ చిత్రం జూన్ 12న థియేటర్లలో విడుదల కానుంది. ఈ విషయాన్ని నిర్మాణ సంస్థ టీ సిరీస్ బ్రేకింగ్ న్యూస్ అంటూ.. ఇన్‌స్టాలో ఓ పోస్టర్‌తో అధికారికంగా విడుదల తేదీని ప్రకటించింది. ప్రస్తుతం అజయ్ 'రేంజర్', 'దృశ్యం 3' లాంటి పలు సినిమాల చిత్రీకరణలతో బిజీగా ఉన్నాడు.

ప్రతీ కథ ఓ చిన్న పరిచయంతోనే..


'బేబీ గర్ల్'

'సర్వం మాయ' చిత్రంతో భారీ విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నారు మలయాళ నటుడు నివిన్ పౌలీ. గతేడాది క్రిస్మస్ సందర్భంగా విడుదలైన ఈ చిత్రం విమర్శకుల ప్రశంసలు అందుకుని బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లని సాధించింది. నివిన్ తదుపరి చిత్రాల్లో భాగంగా 'బేబీ గర్ల్' అనే సినిమాలో నటించాడు. అరుణ్ వర్మ దర్శకత్వం వహించిన ఈ సినిమాని లిస్టిన్ స్టీఫెన్ నిర్మించారు. ఈ సినిమా ఈ నెల 23న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో చిత్ర బృందం అధికారిక ట్రైలర్‌ను ఆవిష్కరించింది. “ప్రతీ కథ ఓ చిన్న పరిచయంతో మొదలవుతుంది.. ప్రతి కల ఒక స్ఫూర్తితో ప్రారంభమవుతుంది” అనే క్యాప్షన్‌తో సామాజిక మాధ్యమాల వేదికగా విడుదల చేసింది. “ఇది మనకు అత్యవసర పరిస్థితి.. ఇక్కడ మనం తప్ప ఎవరూ లేరు. నేను అటెండర్‌ని', 'ఇప్పుడామె ఫిర్యాదు చేస్తే మీరంతా చిక్కుకుపోతారు.. ఇది చిన్న పని కాదు” లాంటి సంభాషణలతో సాగుతున్న ఈ ట్రైలర్ ప్రేక్షకులలో ఆసక్తిని రేకెత్తించేలా ఉంది. ఒక శిశువుని కిడ్నాప్ చేసిన కథాంశంతో థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని రూపొందించినట్లు ట్రైలర్‌తో స్పష్టమవుతుంది. ఈ సినిమాలో నివిన్ అటెండర్‌గా ప్రేక్షకులను అలరించనున్నాడు. ఈ చిత్రంలో లిజోమోల్ జోస్, సంగీత్ ప్రతాప్, అభిమన్యు తిలకన్ కీలకపాత్రలు పోషించారు.

ఆ గౌరవాన్ని అంత తేలికగా తీసుకోలేను!


విక్రాంత్ మాస్సే

వైవిధ్యమైన కథలతో ప్రేక్షకుల్ని అలరిస్తుంటారు బాలీవుడ్ హీరో విక్రాంత్ మాస్సే. 'ట్వెల్త్ ఫెయిల్' చిత్రానికి గానూ జాతీయ స్థాయిలో నిలిచిన ఈయన.. ఆ గౌరవాన్ని అంత తేలికగా తీసుకోలేనని అంటున్నారు. ఇటీవలే ఓ కార్యక్రమంలో పాల్గొన్న విక్రాంత్ ఉత్తమ నటుడిగా జాతీయ అవార్డును గెల్చుకున్న క్షణాల్ని గుర్తుచేసుకున్నారు. “ఇది నేను చాలా కాలంగా ఎదురుచూస్తున్న కల. 2004లో నేను కెరీర్‌ను ప్రారంభించా. అప్పుడు నటన గురించి నాకేమీ తెలియదు. రోజులు గడుస్తున్నకొద్దీ ఈ కళను నేర్చుకోవడం ప్రారంభించాను. నా జీవితమంతా కెమెరా ముందు గడపాలని తెలుసుకున్నా. ఎందుకంటే కథలు చెప్పడం, ప్రజలకు ప్రాతినిధ్యం వహించడం నాకు నిజంగా నచ్చిన విషయం. జాతీయ అవార్డు కేవలం ఒక వేడుక లాంటి క్షణం కాదు.. బాధ్యతను గుర్తుచేస్తుంది. గుర్తింపుతో వచ్చే బరువు ఇది. ప్రతి నటుడు తన సినిమాను ప్రశంసించాలని కలలు కంటాడు. ఆ కల నిజమైనప్పుడు చాలా ఆనందంగా ఉంటుంది. అలాగే మీరు మరింత కష్టపడి మెరుగ్గా పని చేయాల్సిన బాధ్యత కూడా ఉంటుంది” అని అన్నారు విక్రాంత్ మాస్సే.

సెంచరీతో చెలరేగిన అఖిల్


అఖిల్

సెలబ్రిటీ క్రికెట్ లీగ్ (సీసీఎల్)-2026 సీజన్‌లో తెలుగు వారియర్స్ బోణీ కొట్టింది. శనివారం ఏసీఏ-వీడీసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో పంజాబ్ దే షేర్‌తో జరిగిన మ్యాచ్‌లో వారియర్స్ 52 పరుగుల తేడాతో విజయం సాధించింది. కెప్టెన్ అఖిల్ ఫోర్లు, సిక్సర్లతో చెలరేగి సెంచరీ సాధించడంతో అభిమానుల్లో జోష్ నింపింది. ● మొదట బ్యాటింగ్ చేసిన తెలుగు వారియర్స్ జట్టు 20 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 184 పరుగులు చేసింది. అక్కినేని అఖిల్ (101 పరుగులు 56 బంతుల్లో 7×4, 6×6) సెంచరీతో కదం తొక్కగా, అశ్విన్‌బాబు (60 పరుగులు 51 బంతుల్లో 9×4) జట్టుకు భారీ స్కోరు అందించారు. అనంతరం పంజాబ్ దే షేర్ జట్టు 18.2 ఓవర్లలో 132 పరుగులకు ఆలౌటైంది. జట్టులో కరణ్‌వాణి 56, హర్డీసంధు 28 పరుగులు చేశారు. తెలుగు వారియర్స్ బౌలర్లు వినయ్ మహదేవ్ 3, సామ్రాట్ 2 రెండు వికెట్లు తీశారు. అంతకుముందు జరిగిన మ్యాచ్‌లో బెంగాల్ టైగర్స్ జట్టు 4 వికెట్ల తేడాతో ముంబయి హీరోస్‌పై గెలిచింది. ● తెలుగు వారియర్స్ కెప్టెన్ అఖిల్ 6 సిక్స్‌లు, బెంగాల్ టైగర్స్ జట్టు క్రీడాకారుడు జిమ్మీ బెనర్జీ 10 సిక్స్‌లు కొట్టడంతో అభిమానులు కేరింతలు కొట్టారు. – న్యూస్‌టుడే, విశాఖపట్నం

అందర్నీ అలరించేలా 'రామ్ భజరంగ్'


సందీప్, మానస, రాజ్‌తరుణ్

రాజ్‌తరుణ్, సందీప్ మాధవ్ హీరోలుగా సీహెచ్ సుధీర్‌రాజు తెరకెక్కించిన చిత్రం 'రామ్ భజరంగ్'. స్వాతి సుధీర్, రవి బాల నిర్మించారు. సిమ్రత్ కౌర్, సత్న టీటస్, ఛాయా దేవి, మానస రాధాకృష్ణన్ కథానాయికలు. ఈ సినిమా త్వరలో థియేటర్లలోకి రానున్న నేపథ్యంలో ఇటీవల హైదరాబాద్‌లో ఈ చిత్ర గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా హీరో రాజ్‌తరుణ్ మాట్లాడుతూ.. “అందర్నీ అలరించే విభిన్నమైన స్క్రిప్ట్‌తో రూపొందిన చిత్రమిది. నేనిందులో భిన్నమైన లుక్‌లో కనిపిస్తా. ఈ సినిమా కచ్చితంగా అందరికీ నచ్చుతుంది” అన్నారు. “మంచి మాస్ సినిమా చేయాలని ఈ కథ రాసుకున్నా. దీనికి మణిశర్మ సంగీతం, విన్‌సెంట్ ఛాయాగ్రహణం ఆకర్షణగా నిలుస్తాయి” అన్నారు దర్శకుడు సుధీర్ రాజు. ఈ కార్యక్రమంలో సందీప్ మాధవ్, రవి బాల, స్వాతి, మానస తదితరులు పాల్గొన్నారు.

రైలు బయల్దేరడానికి 8 గంటల్లోపైతే టికెట్లపై రిఫండు రాదు

• వందేభారత్ స్లీపర్ నిబంధనలు

ఈనాడు, దిల్లీ: వందేభారత్ స్లీపర్‌లో బెర్తులు ఖరారైనవారు తమ టికెట్లను రైలు బయలుదేరడానికి 8 గంటల కంటే తక్కువ వ్యవధిలో రద్దు చేసుకుంటే పైసా కూడా వెనక్కి రాదు. రైల్వేశాఖ శనివారం రాత్రి జారీచేసిన నిబంధనలు ఈ విషయాన్ని స్పష్టంచేశాయి. ఈ రైళ్లలో ఖరారైన టికెట్లను రైలు బయల్దేరడానికి కనీసం 72 గంటలముందు రద్దు చేసుకుంటే 25% మినహాయించుకొని మిగతా మొత్తం వాపసు చేస్తారు. 72 గంటల నుంచి 8 గంటల ముందు వరకు మధ్యలో ఎప్పుడు టికెట్ రద్దు చేసుకున్నా 50% మినహాయించుకుంటారు. వ్యవధి ఎనిమిది గంటలలోపు అయితే ఎలాంటి రిఫండు రాదు.

కోటి మందిని కాపాడా

• భారత్, పాక్‌ల మధ్య యుద్ధం ఆపా
• మరోసారి ట్రంప్ వ్యాఖ్య

న్యూయార్క్, వాషింగ్టన్: భారత్, పాకిస్థాన్ మధ్య యుద్ధాన్ని తానే ఆపానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోసారి పేర్కొన్నారు. అంతేకాదు.. దీనివల్ల కోటి మంది ప్రజల ప్రాణాలను కాపాడగలిగానని తెలిపారు. ఈ క్రెడిట్‌ను పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ కూడా తనకు ఇచ్చారని వెల్లడించారు. ఇది తనకే గౌరవమని వ్యాఖ్యానించారు. శుక్రవారం ఫ్లోరిడాలో జరిగిన కార్యక్రమంలో ట్రంప్ మాట్లాడారు. 'ఏడాదిలోపే 8 శాంతి ఒప్పందాలను కుదిర్చా. గాజాలో యుద్ధాన్ని ఆపేశా. పశ్చిమాసియాలో శాంతిని నెలకొల్పా. దీనిని ఎవరూ ఊహించలేదు' అని పేర్కొన్నారు. యుద్ధాలను ఆపిన వారికి నోబెల్ ఇవ్వాలని, అయితే తనకు రాజకీయ కారణాలతో ఆ గౌరవం దక్కలేదని పరోక్షంగా వ్యాఖ్యానించారు.

రష్యాకు చట్టవిరుద్ధంగా విమాన భాగాల సరఫరాకు కుట్ర

• అమెరికాలో భారత వ్యక్తికి 30 నెలల జైలు శిక్ష

న్యూయార్క్: అమెరికా నుంచి రష్యాకు చట్టవిరుద్ధంగా విమాన భాగాలను ఎగుమతి చేయడానికి కుట్ర పన్నారన్న అభియోగాలపై సంజయ్ కౌశిక్ (58) అనే భారత వ్యక్తికి అమెరికాలో 30 నెలల జైలు శిక్ష పడింది. లాభాపేక్షతో ఉద్దేశపూర్వకంగానే కౌశిక్ ఈ చర్యలకు పాల్పడ్డారని ఒరెగాన్ జిల్లా న్యాయమూర్తి స్కాట్ బ్రాడ్‌ఫోర్డ్ పేర్కొన్నారు. దిల్లీకి చెందిన కౌశిక్ రష్యాలోని కొన్ని కంపెనీలకు పలు నియంత్రిత విమాన భాగాలను ఎగుమతి చేయడానికి 2023 సెప్టెంబరులో కుట్రపన్నినట్లు కోర్టు దస్త్రాలు తెలుపుతున్నాయి.

21 నుంచి 29 వరకు రాష్ట్రపతి భవన్ సందర్శన నిలిపివేత

దిల్లీ: సాధారణ ప్రజానీకం రాష్ట్రపతి భవన్ సందర్శించడాన్ని ఈనెల 21 నుంచి 29 వరకు నిలిపివేస్తున్నట్లు శనివారం అధికారిక ప్రకటన వెల్లడించింది. గణతంత్ర వేడుకలు, బీటింగ్ రిట్రీట్ కార్యక్రమాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. సాధారణ సందర్శకుల కోసం రాష్ట్రపతి భవన్‌లోని సర్క్యూట్ 1 విభాగాన్ని తెరచి ఉంచడం పరిపాటి. ఈ విభాగం గుండా సందర్శకులు రాష్ట్రపతి భవన్ ప్రధాన భవనాన్ని సందర్శిస్తూ ఉంటారు. ఈనెల 26న కర్తవ్యపథ్‌లో గణతంత్ర దినోత్సవ కవాతు జరుగుతుంది. గణతంత్ర వేడుకల ముగింపునకు సూచనగా ఈనెల 29న విజయ్ చౌక్‌లో బీటింగ్ రిట్రీట్ కార్యక్రమం నిర్వహిస్తారు.

చరిత్ర గురించి నేటితరం తెలుసుకోవాలి


• జైపుర్ సాహిత్య వేడుకల్లో సుధామూర్తి



జైపుర్: ఈ భూమి, మనం అనుభవిస్తున్న స్వేచ్ఛ ఊరికే రాలేదన్న విషయాన్ని నేటి తరం చిన్నారులు కచ్చితంగా తెలుసుకోవాలని రాజ్యసభ ఎంపీ, రచయిత్రి సుధామూర్తి అభిప్రాయపడ్డారు. మన పూర్వీకుల త్యాగాలు, కష్టాలు, దేశ చరిత్ర గురించి వారికి వివరించాలి, లేదంటే భవిష్యత్తుకు అర్థం లేకుండా పోతుందని పేర్కొన్నారు. రాజస్థాన్‌లో జరుగుతున్న జైపుర్ సాహిత్య వేడుకల్లో సుధామూర్తి ప్రసంగించారు. దేశ విభజన కోసం ఆనాడు తీసుకున్న ఓ తప్పుడు నిర్ణయం ఎన్నోతరాలపై ప్రభావం చూపిస్తోందని ఆమె వివరించారు. భారత సంప్రదాయాలు, సంస్కృతి, భాషల గురించి అవగాహన లేని ఓ వ్యక్తి (నాటి వైస్రాయ్‌ ఉద్దేశించి) పెన్సిల్‌తో గీతగీసి ఇది మీ సరిహద్దులని చెప్పారన్నారు. ఆ విభజన కారణంగా పాకిస్థాన్, బంగ్లాదేశ్ దేశాలకు వలస వెళ్లినవారి గురించి ఆలోచిస్తే ఎంతో బాధగా ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఓసారి పాకిస్థాన్ వెళ్లినప్పుడు అక్కడి మ్యూజియంలో తాను విదేశీయురాలినని ఎక్కువ ఛార్జి చేశారని సుధామూర్తి పేర్కొన్నారు. అది ఒకప్పుడు మన అఖండ భారతంలోని భాగమేనని, సరిహద్దుల కారణంగా విదేశమైందన్న ఆలోచన తనకు ఎంతో బాధను కలిగించిందని గుర్తుచేసుకున్నారు. ఈ విషయాలన్నీ యువతరానికి తెలియజేసేందుకు 'ది మ్యాజిక్ ఆఫ్ ది లాస్ట్ ఇయర్‌రింగ్స్' పుస్తకాన్ని రాసినట్లు పేర్కొన్నారు. తన మనవరాలు అనౌష్కశర్మను ఆధారంగా చేసుకునే ఈ పుస్తకంలోని ప్రధాన పాత్రను తీర్చిదిద్దినట్లు పేర్కొన్నారు.

నోబెల్‌ను వదులుకున్న గ్రహీతలు

• కొందరు వేలం వేస్తే.. ఇంకొందరు అమ్మేశారు



నోబెల్ ప్రైజ్.. ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారాన్ని అందుకోవాలని ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది శాస్త్రవేత్తలు, రచయితలు కలలు కంటారు. ఈ అవార్డు అందుకోవడాన్ని అత్యంత గౌరవంగా భావిస్తారు. అలాంటి పురస్కారాన్ని వెనెజువెలా విపక్ష నేత మారియా కొరీనా మచాడో.. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు ఇచ్చేశారు. ఇది చర్చనీయాంశంగా మారింది. ఇలా నోబెల్ పురస్కారాన్ని వదులుకోవడం కొత్తేం కాదు. గతంలో పలువురు గ్రహీతలు అనేక కారణాలతో వాటిని వేలం వేయడం, విక్రయించడం, బహుమతిగా ఇవ్వడం చేశారు. ఆ సందర్భాలలోకి చూద్దాం..

◆ 2021లో రష్యా జర్నలిస్టు దిమిత్రి మురతోవ్ నోబెల్ శాంతి బహుమతి అందుకున్నారు. ఆ మరుసటి ఏడాదే దాన్ని వేలం వేశారు. రికార్డు స్థాయిలో 103.5 మిలియన్ డాలర్లు పలికింది. ఆ మొత్తాన్ని ఉక్రెయిన్ శరణార్థుల చిన్నారుల సంక్షేమం కోసం యునిసెఫ్‌కు విరాళంగా ఇచ్చారు.

◆ అమెరికా శాస్త్రవేత్త జాన్ నాష్ 1994లో అర్థశాస్త్రంలో నోబెల్ తీసుకున్నారు. 2019లో క్రిస్టీస్ ఆక్షన్ సంస్థ ఆ అవార్డును వేలం వేయగా.. 7,35,000 డాలర్లు పలికింది. ఈ మొత్తాన్ని జాన్ సి.ఎం. నాష్ ట్రస్ట్‌కు విరాళంగా ఇచ్చేశారు.

◆ 1962లో అమెరికా శాస్త్రవేత్త జేమ్స్ డి.వాట్సన్ వైద్యశాస్త్రంలో నోబెల్ అందుకున్నారు. శాస్త్రీయ పరిశోధనల కోసం విరాళాలు సేకరించేందుకు ఆ పురస్కారాన్ని విక్రయించారు. దీన్ని రష్యా బిలియనీర్ అలిషెర్ ఉస్మనోవ్ కొనుగోలు చేశారు. అయితే ఆ పురస్కారాన్ని అలిషెర్ తన వద్ద ఉంచుకోకుండా తిరిగి వాట్సన్‌కే ఇచ్చేశారు. ఈ అవార్డు శాస్త్రవేత్త వద్ద ఉండటమే సరైందని ఉస్మనోవ్ పేర్కొన్నారు.

◆ 1939లో సోవియట్ యూనియన్.. ఫిన్‌లాండ్‌ను ఆక్రమించింది. ఆ సమయంలో ఫిన్‌లాండ్ ప్రజల కోసం విరాళాలు సేకరించేందుకు డెన్మార్క్ శాస్త్రవేత్తలు నీల్స్ బోర్, ఆగస్ట్ క్రోగ్ తమ నోబెల్ పురస్కారాలను వేలం వేశారు. ఈ వేలంలో అవార్డు కొనుక్కున్నవారు కొంతకాలం తర్వాత డెన్మార్క్ మ్యూజియంలకు వాటిని ఇచ్చేశారు.

◆ నీల్స్ బోర్ కుమారుడు ఆగె బోర్ కూడా 1975లో ఫిజిక్స్‌లో నోబెల్ అందుకున్నారు. దాన్ని 2011లో వేలం వేశారు. 2019లో ఆయనకు మరోసారి నోబెల్ దక్కడం విశేషం.

◆ నాజీ సానుభూతిపరుడైన నార్వే రచయిత నట్ హమ్సున్‌కు 1920లో నోబెల్ సాహిత్య పురస్కారం దక్కింది. దాన్ని ఆయన రెండో ప్రపంచ యుద్ధం సమయంలో నాజీ జర్మనీ మంత్రి జోసెఫ్ గోబెల్స్‌కు బహుమతిగా ఇచ్చేశారు.

◆ తన నోబెల్‌ను ట్రంప్‌నకు ఇచ్చిన మచాడో.. వెనెజువెలా ప్రజల స్వేచ్ఛ కోసం కృషి చేస్తున్న ట్రంప్‌నకు ఇది గుర్తింపు అని పేర్కొన్నారు. ఈ పరిణామంపై నోబెల్ కమిటీ కూడా స్పందించింది. ఇలా తన పురస్కారాన్ని మరొకరికి ఇవ్వడం చట్టబద్ధం కాదని స్పష్టం చేసింది. నోబెల్ కమిటీ నిబంధనల ప్రకారం.. ఒకసారి నోబెల్ ప్రకటించిన తర్వాత.. దాన్ని రద్దు, బదిలీ చేయడం లేదా ఇతరులతో పంచుకోవడం కుదరదు. అయితే గ్రహీతలు తమ మెడల్ లేదా నగదు బహుమతిని ఏవిధంగా వినియోగించుకోవాలో వారికే స్వేచ్ఛ ఉంటుంది. కానీ, అధికారికంగా మాత్రం పురస్కారం వారి పేరు మీదే ఉంటుంది.

- నేషనల్ డెస్క్

ఇరాన్‌లో ప్రశాంతత!

టెహ్రాన్: గత నెల 28వ తేదీన దేశంలో మొదలైన ఆందోళనలు క్రమంగా శాంతించినట్లు కనిపిస్తోంది. దేశంలో ఆర్థిక అస్తవ్యస్త పరిస్థితులకు నిరసనగా మొదలైన ఆందోళనలు హింసాత్మకంగా మారిన సంగతి తెలిసిందే. ఈ ఘటనల్లో మొత్తం 3,090 మంది మృతి చెందారు. ఇందులో ఆందోళనకారులు, భద్రతా సిబ్బంది ఉన్నారు.

◆ రాజధాని టెహ్రాన్‌లో ఇప్పుడిప్పుడే ఇంటర్నెట్ సేవలు అందుబాటులోకి వస్తున్నాయి. ఆందోళనలు ఉద్ధృతం కావడంతో ఈ నెల 8వ తేదీ నుంచి ఇంటర్నెట్, ఫోన్ సేవలను ప్రభుత్వం నిలిపేసింది.

◆ ఆందోళనలను కొనసాగించాలని ప్రవాసంలో ఉన్న యువరాజు రెజా పహ్లవీ మరోసారి పిలుపునిచ్చినా శనివారం ఎటువంటి నిరసనల సంకేతాలు కనిపించలేదు. టెహ్రాన్ వీధులన్నీ ప్రశాంతంగా కనిపించాయి.

◆ ఆందోళనల్లో పాల్గొన్న వారిని ఉరి తీయాల్సిందేనని ప్రముఖ మత గురువు ఆయతుల్లా అహ్మద్ ఖతామీ పిలుపునిచ్చారు. శుక్రవారం ప్రార్థనల అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆందోళనకారులు ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తొత్తులని ఆరోపించారు. అమెరికన్లు, యూదులు శాంతిని కోరుకోరని విమర్శించారు.

దాడుల్లో 350 మసీదులు, 126 ప్రార్థనా మందిరాలు, 20 ఇతర పవిత్ర స్థలాలు ధ్వంసమయ్యాయని తెలిపారు. 80 మంది మత గురువుల ఇళ్లనూ ధ్వంసం చేశారని వివరించారు. 400 ఆసుపత్రులు, 106 అంబులెన్సులు, 71 అగ్నిమాపక వాహనాలు, 50 అత్యవసర సేవల వాహనాలు ధ్వంసమయ్యాయని వెల్లడించారు.



ఇరాన్ ఆందోళనల్లో మృతి చెందినవారికి అమెరికాలోని వాషింగ్టన్‌లో నివాళులర్పిస్తున్న ప్రజలు

దిల్లీకి చేరుకున్న భారతీయులు

దిల్లీ: ఇరాన్‌లో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో అక్కడి భారతీయులు స్వదేశానికి పయనమవుతున్నారు. శుక్రవారం అర్ధరాత్రి దిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి ఒక బృందం చేరుకుంది. భారత్‌కు చేరుకోగానే వారంతా భావోద్వేగానికి గురయ్యారు. తమను స్వదేశానికి సురక్షితంగా తీసుకొచ్చినందుకు ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. 'మేం నెల రోజులుగా ఇరాన్‌లో ఉన్నాం. కానీ గత వారం పది రోజుల్లో పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. బయటకు వెళ్తే ఆందోళనకారులు కార్లను అడ్డుకునేవారు. కొంత ఇబ్బంది కలిగించేవారు. ఇంటర్నెట్ పూర్తిగా నిలిపివేయడంతో కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వలేక చాలా ఆందోళన చెందాం. ఎంబసీని సంప్రదించలేకపోయాం' అని ఓ ప్రయాణికుడు తెలిపారు. ఇరాన్ నుంచి తిరిగొస్తున్న వారి కోసం అనేక కుటుంబాలు విమానాశ్రయానికి చేరుకున్నాయి. తమ బంధువులు సురక్షితంగా తిరిగొస్తుండటంతో కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



నెదర్లాండ్స్ రాజధాని ఆమ్‌స్టర్‌డ్యామ్‌లో జాతీయ తులిప్ దినోత్సవం సందర్భంగా ఆకట్టుకున్న రంగుల వెలుగులు

గ్రోక్‌పై మస్క్ మాజీ ప్రేయసి దావా

న్యూయార్క్: డీప్‌ఫేక్‌ద్వారా సృష్టించిన తన అసభ్య చిత్రాలను ప్రసారం చేసిన గ్రోక్‌పై ఎలాన్ మస్క్ మాజీ ప్రేయసి యాష్లీ సెయింట్ క్లెయిర్ దావా వేశారు. గ్రోక్ సంస్థ మస్క్‌దే. ఆయన 16 నెలల కుమారుడు రోములస్‌కు తల్లి అయిన క్లెయిర్ రచయిత్రి, రాజకీయ వ్యూహకర్త. తాను 14 ఏళ్ల వయసులో ఉన్నప్పుడు తీసిన ఫొటోను ఎడిట్ చేసి అసభ్య చిత్రాలను సృష్టించారని ఆమె తెలిపారు.

తన అసభ్య డీప్‌ఫేక్‌ల గురించి గత సంవత్సరమే ఎక్స్‌కు ఫిర్యాదు చేశానని, ముందు వాటిని తొలగిస్తామంటూ మాట్లాడిన నిర్వాహకులు తరువాత తన ఎక్స్ ప్రీమియం ఖాతాను తొలగించారని క్లెయిర్ తెలిపారు. దీంతో గురువారం దావా వేశానని వెల్లడించారు. మహిళలు, బాలబాలికలను నగ్నంగా ఉన్నట్లు చూపే ఫొటోల ప్రసారానికి గ్రోక్ అనుమతించడంపై ప్రపంచమంతటా ఇప్పటికే నిరసన వ్యక్తమవుతోంది.

భారత్‌తోనే అమెరికాకు ప్రయోజనం

• రిపబ్లికన్ సభ్యుడి స్పష్టీకరణ

ఇంటర్నెట్ డెస్క్: పాకిస్థాన్ కంటే భారత్‌తో సంబంధాలే అమెరికాకు లాభదాయకమని కాంగ్రెస్ సభ్యుడు మెక్ కార్మిక్ (రిపబ్లికన్) స్పష్టం చేశారు. భారత్‌తోనే సంబంధాలను బలోపేతం చేసుకోవాలని ట్రంప్ యంత్రాంగానికి సూచించారు. అమెరికాకు పెట్టుబడులు తెచ్చేది భారతే తప్ప పాక్ కాదని పేర్కొన్నారు. ప్రతిభావంతులైన వేల మంది నిపుణులు, ఉద్యోగులు భారత్ నుంచి వస్తున్నారని తెలిపారు. దేశాభివృద్ధిలో వారు కీలక పాత్ర పోషిస్తున్నారని వివరించారు. అమెరికన్ కంపెనీలు భారత్‌లో పెట్టుబడులు పెట్టడానికే ఆసక్తి చూపుతాయని, ఆ దేశాన్ని దూరం చేసుకుంటే అమెరికాకే నష్టమని వ్యాఖ్యానించారు. రష్యా నుంచి చమురు కొనుగోళ్లను తగ్గించుకోవాల్సిందిగా ఎన్నిసార్లు హెచ్చరించినప్పటికీ మాస్కో నుంచి భారత్ చమురు కొనడం ట్రంప్‌నకు నచ్చట్లేదని మెక్ కార్మిక్ పేర్కొన్నారు. అందువల్లే ట్రంప్ భారత్‌తో కఠినంగా వ్యవహరిస్తున్నారని, భారత ప్రధాని మోదీ తమ జాతీయ ప్రయోజనాల రీత్యా చౌకగా లభించే రష్యా చమురును కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపుతున్నారని తెలిపారు.


రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని రక్షించండి

• సీజేఐకి మమత విజ్ఞప్తి



జల్‌పాయిగుడి: దేశ రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని, న్యాయ వ్యవస్థను రక్షించాలని పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ శనివారం భారత ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్‌ను అభ్యర్థించారు. కలకత్తా హైకోర్టు జల్‌పాయిగుడి సర్క్యూట్ బెంచి నూతన భవన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రసంగిస్తూ ఆమె ఈ మాటలన్నారు. దర్యాప్తు సంస్థలు దేశ ప్రజానీకం పట్ల తప్పుగా వ్యవహరించకుండా రక్షణ కల్పించాలని మమత సీజేఐని కోరారు. "దయచేసి రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని, న్యాయవ్యవస్థను, చరిత్రను, భౌగోళికాన్ని, దేశ సరిహద్దులను వినాశనం నుంచి రక్షించండి" అని సీజేఐకి మమత విజ్ఞప్తి చేశారు. "మీరు రాజ్యాంగ పరిరక్షకులు. మేం న్యాయపరంగా మీ సంరక్షణలో ఉన్నాం. న్యాయవ్యవస్థలో మిమ్మల్ని మించినవారు ఎవరూ లేరు. కుల, మతాల ప్రాతిపదికన వివక్ష ఉండరాదని దేశ ప్రజల తరఫున విజ్ఞప్తి చేస్తున్నాను. ఐకమత్య సాధన కోసం పనిచేద్దాం, మాట్లాడదాం, ఆలోచిద్దాం'' అని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీజేఐ జస్టిస్ సూర్యకాంత్‌తో పాటు కలకత్తా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్ పాల్, పలువురు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తులు, పశ్చిమ బెంగాల్ న్యాయశాఖ మంత్రి మొలోయ్ ఘటక్ తదితరులు పాల్గొన్నారు.

జంట నాగుపాముల ఆగ్రహం.. 3 గంటలు ఆగిన నిర్మాణపనులు



ఈటీవీ భారత్: రాజస్థాన్‌లోని అజ్మేర్ సమీప ఖరేఖడీ రోడ్డులో జరుగుతున్న హోటలు నిర్మాణపనులు జంట నాగుపాముల కారణంగా మూడు గంటలసేపు నిలిచిపోయాయి. బుల్డోజరుతో చేపట్టిన తవ్వకం పనుల్లో మగ నాగుపాము గాయపడింది. దీంతో ఆడపాము బుసలు కొడుతూ ఆ దరిదాపుల్లోకి ఎవరినీ రానివ్వలేదు. పాములు పట్టే వ్యక్తికి కబురు పెట్టగా.. అతడు రెండు పాములను పట్టుకొని సమీప అడవిలో విడిచి పెట్టాడు.



అస్సాంలోని గువాహటీలో ప్రధాని నరేంద్రమోదీ పర్యటన సందర్భంగా శనివారం 'బాగురుంబా' బోడో జానపద నృత్యాన్ని ప్రదర్శిస్తున్న 10వేల మంది కళాకారులు

పప్పు ధాన్యాలపై భారత్ సుంకాలు తగ్గించేలా చూడండి

• ట్రంప్‌నకు సెనేటర్ల విజ్ఞప్తి

వాషింగ్టన్: భారత దేశానికి ఎగుమతి చేసే పప్పు ధాన్యాలపై సుంకాల తగ్గింపునకు చొరవ తీసుకోవాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు ఇద్దరు రిపబ్లికన్ సెనేటర్లు విజ్ఞప్తి చేశారు. అధిక సుంకాలవల్ల రైతులకు నష్టం కలుగుతోందని మోంటానా, నార్త్ డకోటా సెనేటర్లు స్టీవ్ డయన్స్, కెవిన్ క్రేమర్‌లు శుక్రవారం ట్రంప్‌నకు రాసిన లేఖలో పేర్కొన్నారు. ఈ రెండు రాష్ట్రాల్లో బఠాణీ, సెనగలు, రాజ్‌మా చిక్కుడు తదితర పప్పు ధాన్యాలు పెద్ద ఎత్తున సాగవుతున్నాయి. ప్రపంచంలో అత్యధికంగా 27 శాతం పప్పు ధాన్యాల వినియోగదారు భారత దేశమే కాబట్టి సుంకాలు తగ్గించడానికి ప్రధాని నరేంద్ర మోదీని ఒప్పిస్తే అమెరికన్ ఉత్పత్తిదారులకు, భారతీయ వినియోగదారులకు ప్రయోజనకరంగా ఉంటుందని వారు వివరించారు. అమెరికన్ పప్పు ధాన్యాలపై సుంకాన్ని నిరుడు 30 శాతానికి భారత్ పెంచిందని తెలిపారు. దీనివల్ల అమెరికా రైతులు ఇతర దేశాలతో పోటీపడలేకపోతున్నారని తెలిపారు.

అమెరికా, పాక్ సైనిక విన్యాసాలు విశ్వగురువు దౌత్యానికి ఎదురుదెబ్బ

• కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ విమర్శ

దిల్లీ: 'ఇన్‌స్పైర్డ్ గాంబిట్-2026' పేరిట అమెరికా-పాకిస్థాన్ దళాల నిర్వహించిన సంయుక్త సైనిక విన్యాసాలను ఉద్దేశిస్తూ మోదీ ప్రభుత్వంపై కాంగ్రెస్ శనివారం విమర్శలు గుప్పించింది. ప్రగల్భాలు పలికే స్వీయ ప్రకటిత విశ్వగురువు(మోదీ) దౌత్యానికి ఈ విన్యాసాలు మరో దెబ్బ అని పార్టీ సీనియర్ నేత జైరాం రమేశ్ ఆరోపించారు. "పాకిస్థాన్ తమకు అసాధారణ భాగస్వామి అని గత ఏడాది జూన్‌లో అమెరికా సెంట్రల్ కమాండ్ జనరల్ మైఖేల్ కునిల్లా వెల్లడించారు. 2025 ఏప్రిల్‌లో పహల్గాం ఉగ్రదాడి సూత్రధారి అయిన పాక్ సైన్యాధ్యక్షుడు అసీం మునీర్‌ను అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పలుమార్లు స్వయంగా ప్రశంసించారు. ఆపరేషన్ సిందూర్‌ను నిలిపివేయడానికి తాను జోక్యం చేసుకున్నానని కూడా పలుమార్లు ఆయన ప్రకటించారు" అని రమేశ్ విమర్శించారు.

అత్యాచారాలను మహిళల అందంతో ముడిపెట్టిన కాంగ్రెస్ ఎమ్మెల్యే

భోపాల్: మహిళలపై అత్యాచారాలను అందంతో ముడిపెట్టి షెడ్యూల్డ్ కులాలు, తెగలకు చెందిన స్త్రీలపై లైంగిక నేరాలను తీర్థఫలం(తీర్థయాత్రల బహుమతులు) అంటూ మధ్యప్రదేశ్ కాంగ్రెస్ ఎమ్మెల్యే ఫూల్ సింగ్ బరైయా వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఇందౌర్ కలుషిత తాగునీటిపై లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ శనివారం మాట్లాడుతున్నప్పుడు ఈ వ్యాఖ్యలు వెలుగులోకి వచ్చాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ యాదవ్, భాజపా ఎంపీలు ఫూల్ సింగ్ ఈ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఫూల్ సింగ్‌పై రాహుల్‌గాంధీ చర్యలు తీసుకుంటారని ఆశాభావం వ్యక్తంచేశారు. ఈ ప్రకటనతో కాంగ్రెస్ విభేదించింది. దీనిపై స్పష్టత ఇవ్వాలని ఫూల్ సింగ్‌ను కోరినట్లు తెలిపింది. వివాదాల నడుమ ఫూల్ సింగ్ తన వాదనకు కట్టుబడి ఉన్నారు. అణగారిన వర్గాలకు చెందిన రాష్ట్రంలోని 40 కోట్ల దళిత మహిళల ప్రయోజనాల కోసం మాట్లాడినట్లు ఆయన తెలిపారు. పార్టీ, రాహుల్‌గాంధీకి ఈ వ్యాఖ్యలతో ఎటువంటి సంబంధం లేదని ఫూల్ సింగ్ స్పష్టంచేశారు.



అమెరికాలో బందీలుగా ఉన్న వెనెజువెలా మాజీ అధ్యక్షుడు నికోలస్ మదురో దంపతులను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ కారకాస్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజలు

అమెరికాకు వెనెజువెలా చమురు

ఈటీవీ భారత్: వెనెజువెలాతో భారీ చమురు ఒప్పందానికి అంగీకరించినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. వెనెజువెలా నుంచి 50 మిలియన్ బ్యారెళ్ల చమురు తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ చమురు విలువ సుమారు 5.2 బిలియన్ డాలర్లు ఉంటుందని పేర్కొన్నారు. వాషింగ్టన్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో మీడియాతో మాట్లాడిన ట్రంప్.. వెనెజువెలా కొత్త పాలకులు తమను సంప్రదించారని చెప్పారు.

యూపీ కోర్టు సముదాయాలు దేశానికి ఆదర్శమవుతాయి: సీజేఐ

చందౌలీ: ఉత్తర్‌ప్రదేశ్‌లో నిర్మిస్తున్న సమీకృత న్యాయస్థాన సముదాయాలు పూర్తయ్యాక యావద్దేశానికి ఆదర్శంగా, ప్రామాణికంగా నిలుస్తాయని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. రూ.1,500 కోట్లతో ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఆరు జిల్లాల్లో సమగ్ర న్యాయస్థాన భవన సముదాయాల నిర్మాణానికి శనివారం వేద మంత్రోచ్చారణల మధ్య ఆయన శంకుస్థాపన చేశారు. పది కోర్టు సముదాయాలు నిర్మిస్తామని యూపీ ముఖ్యమంత్రి ప్రకటించగా వాటిలో ఆరింటి నిర్మాణం ఒకేసారి ప్రారంభం కావడం గణనీయ విజయమని ఆయన పేర్కొన్నారు. తాను ఏ రాష్ట్రానికి వెళ్లినా ఉత్తర్‌ప్రదేశ్‌ను ఉదాహరణగా సగర్వంగా చెబుతుంటానని, అన్ని రాష్ట్రాల్లో ఇలాంటి నిర్మాణాలు రావాలని తెలిపారు. జిల్లా కోర్టులకు భారత రాజ్యాంగం ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చిందని, ప్రజలందరికీ న్యాయం అందుబాటులో ఉండాలన్న రాజ్యాంగ లక్ష్యాన్ని బలమైన జిల్లా న్యాయవ్యవస్థ నెరవేరుస్తుందని చెప్పారు.

ఉగాండా అధ్యక్షునిగా ఏడోసారి ముసెవేని గెలుపు

కంపాలా (ఉగాండా): ఉగాండా అధ్యక్షుడు యోవేరి ముసెవేని ఏడోసారి దేశాధ్యక్ష స్థానాన్ని కైవసం చేసుకున్నారు. పోలైన మొత్తం ఓట్లలో ఆయనకు 71.65 శాతం దక్కాయని శనివారం వెల్లడైన అధికారిక ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి. వ్యతిరేక ప్రదర్శనలు, ఇంటర్నెట్ షట్‌డౌన్ మధ్య సాగిన ఈ ఎన్నికలో విజయం సాధించడానికి ముసెవేని మోసపూరిత విధానాలను అవలంబించారని ఆరోపించిన ఆయన ప్రత్యర్థి బాబీ వైన్ 24.72 శాతం ఓట్లు పొందారు. ఎన్నికల్లో అక్రమ మార్గాలను అనుసరించారని, తన పోలింగ్ ఏజెంట్లను అపహరించారని బాబీ వైన్ ఆరోపించారు. ఈ ఎన్నికల ఫలితాన్ని నకిలీదిగా పేర్కొంటూ సరైన ఫలితాలు ప్రకటించే వరకూ శాంతియుతంగా ప్రదర్శనలు నిర్వహించాలని ఆయన ఉగాండా ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

రాజ్యాంగ లక్షణాల్లో ముఖ్యం ప్రజాస్వామ్య ప్రగతికి దోహదం



ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
ఇండియన్ పాలిటీ

హక్కులను పేర్కొనే సంప్రదాయం పాశ్చాత్య దేశాల్లో ప్రారంభమైంది. తొలిసారిగా అమెరికా రాజ్యాంగంలో 'బిల్ ఆఫ్ రైట్స్' అనే పేరుతో హక్కులు పొందుపర్చారు. భారత రాజ్యాంగ లక్షణాల్లో ప్రాథమిక హక్కులు అత్యంత ముఖ్యమైనవి. ఈ హక్కులు భారత పౌరుల సంపూర్ణ వ్యక్తిత్వ వికాసం, ప్రాథమిక జీవన విధానం, రాజకీయ ప్రజాస్వామ్య ప్రగతికి దోహదపడతాయి. ప్రాథమిక హక్కులను అమెరికా సంయుక్త రాష్ట్రాల నుంచి గ్రహించారు. రాజ్యాంగంలోని 3వ భాగాన్ని 'భారత మాగ్నాకార్టా'గా పేర్కొంటారు.

ప్రాథమిక హక్కులు

నేపథ్యం

1895లో బాలగంగాధర్ తిలక్ మొట్టమొదటిసారిగా 'స్వరాజ్ బిల్లు' ద్వారా భారతీయులకు సమాన హక్కులు కావాలని డిమాండ్ చేశారు. 1911లో కోల్‌కతాలో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ సమావేశంలో హక్కులపై ప్రవేశపెట్టిన తీర్మానాన్ని ఆమోదించారు.

❖ 1922లో మహాత్మాగాంధీ 'యంగ్ ఇండియా' పత్రికలో భారతీయులకు హక్కులు ఉండాలని పేర్కొన్నారు. 1925లో అనిబిసెంట్ 'కామన్వెల్త్ ఆఫ్ ఇండియా' బిల్లులో ఐర్లాండ్ రాజ్యాంగంలో ప్రస్తావించిన విధంగానే భారతీయులకు ప్రాథమిక హక్కులు కావాలని డిమాండ్ చేశారు.

❖ 1927లో మద్రాసులో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ సమావేశం ప్రాథమిక హక్కుల ప్రాతిపదికన భవిష్యత్ రాజ్యాంగాన్ని రూపొందించాలని డిమాండ్ చేసింది.

❖ 1928లో మోతీలాల్ నెహ్రూ ప్రాథమిక హక్కులు పొందటం భారత పౌరుల ప్రాథమిక అవసరమని తన నివేదికలో పేర్కొన్నారు.

❖ 1931లో కరాచీలో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ సమావేశం భారతీయులకు ప్రాథమిక హక్కులు ఇవ్వాలని డిమాండ్ చేసింది.

❖ 1931 లండన్‌లో జరిగిన రెండో రౌండ్ టేబుల్ సమావేశంలో గాంధీజీ భారత రాజ్యాంగంలో ప్రాథమిక హక్కులు చేర్చాలని డిమాండ్ చేశారు.

❖ 1946లో భారత రాజ్యాంగ పరిషత్ ప్రాథమిక హక్కుల విధివిధానాలను రూపొందించడానికి కొన్ని కమిటీలను ఏర్పాటు చేసింది. అవి:

- ప్రాథమిక హక్కుల కమిటీ: దీని ఛైర్మన్ సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్
- ప్రాథమిక హక్కుల ఉప కమిటీ: దీని ఛైర్మన్ - జె.బి.కృపలానీ

❖ బెనగల్ నరసింహారావును భారత చిత్తు రాజ్యాంగ నిర్మాతగా పేర్కొంటారు.

❖ రాజ్యాంగంలోని మూడో భాగంలో 12 నుంచి 35 వరకు ఉన్న అధికరణలు ప్రాథమిక హక్కుల గురించి తెలియజేస్తాయి.

ప్రాథమిక హక్కులు - వర్గీకరణ

1950 జనవరి 26న భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చే నాటికి 7 ప్రాథమిక హక్కులు ఉండేవి. ప్రస్తుతం 6 ప్రాథమిక హక్కులు ఉన్నాయి. అవి:

- సమానత్వపు హక్కు (14 - 18)
- స్వేచ్ఛా స్వాతంత్ర్యపు హక్కు (19 - 22)
- పీడనాన్ని నిరోధించే హక్కు (23 - 24)
- మత స్వాతంత్ర్యపు హక్కు (25 - 28)
- విద్యా, సాంస్కృతిక హక్కు (29, 30)
- ఆస్తి హక్కు (31)
- రాజ్యాంగ పరిహారపు హక్కు (32)

❖ 1978లో 44వ రాజ్యాంగ సవరణ ద్వారా జనతా ప్రభుత్వ కాలంలో ఆస్తి హక్కును ప్రాథమిక హక్కుల జాబితా నుంచి తొలగించారు. ప్రస్తుతం ఆస్తి హక్కు 12వ భాగంలో 300 (ఎ) నిబంధనలో చట్టబద్ధ హక్కుగా ఉంది.

12వ నిబంధన

ఈ నిబంధన రాజ్యం నిర్వచనాన్ని వివరిస్తుంది. దీని ప్రకారం రాజ్యం అంటే

- కేంద్ర ప్రభుత్వం/భారత ప్రభుత్వం
- రాష్ట్ర ప్రభుత్వాలు
- స్థానిక సంస్థలు
- భారత ప్రభుత్వ అధీనంలో ఉన్న అన్ని రకాల రాజ్యాంగబద్ధ, చట్టబద్ధమైన సంస్థలు, ఏజెన్సీలు.

సుప్రీంకోర్టు వివిధ కేసులను విచారించే సందర్భంలో రాజ్యానికి ఇచ్చే నిర్వచనం గురించి పేర్కొంది.

అజయ్ హాసియా vs ఖలీద్ ముజీబ్ (1981): జస్టిస్ పి.ఎన్.భగవతి నేతృత్వంలోని ధర్మాసనం ఇచ్చిన తీర్పు రాజ్యం నిర్వచనానికి ఒక స్పష్టతను చేకూర్చింది. రాజ్యం పరిధిలోకి కింది సంస్థలు వస్తాయని వివరించింది. అవి:

- రాజ్య పరిధిలో ఉన్న సంస్థలు
- రాజ్యాంగం ద్వారా ఏర్పాటు చేసిన సంస్థలు
- ప్రభుత్వ ఆర్థిక సహాయంపై ఆధారపడే సంస్థలు
- పన్నులు విధించే సంస్థలు
- ఒక సంస్థ రాజ్య సంరక్షణలో ఉంటూ గుత్తాధిపత్య ధోరణిని అవలంబిస్తే, దాన్ని రాజ్య ఏజెన్సీగా భావించవచ్చు.
- ప్రభుత్వ నియంత్రణలో ఉన్న సంస్థలు
- శాసనాలు రూపొందించే సంస్థలు
- ప్రభుత్వ ఆర్థిక సహాయం మెజారిటీగా పొందే సంస్థలు
- ఒక ప్రభుత్వ శాఖను ప్రత్యేకంగా ఒక సంస్థకు బదిలీ చేసినప్పుడు, దాన్ని రాజ్య ఏజెన్సీగా పేర్కొనవచ్చు.

13 నిబంధన

ఈ నిబంధన భారతదేశ న్యాయవ్యవస్థకు న్యాయసమీక్ష అధికారం కల్పిస్తుంది. అంటే ప్రాథమిక హక్కులకు విరుద్ధంగా ఉన్న శాసనాలు (చట్టాలు) చెల్లవు.

13(1) నిబంధన: రాజ్యాంగం అమల్లోకి రాకముందు రూపొందించిన చట్టాలు, ప్రస్తుత రాజ్యాంగంలోని హక్కులను ఉల్లంఘించేలా ఉంటే అవి చెల్లవు.

◆ 1950 జనవరి 26న రాజ్యాంగం అమల్లోకి వచ్చేనాటికి ఉన్న చట్టాలను రాజ్యాంగ పూర్వ చట్టాలుగా పేర్కొంటారు.

13(2) నిబంధన: ప్రాథమిక హక్కులను హరించే విధంగా ప్రభుత్వం ఎలాంటి శాసనాలు/చట్టాలు చేయరాదు. ఒకవేళ చేసినా అవి చెల్లవు.

13(3) నిబంధన: ఈ నిబంధన శాసనం అనే పదాన్ని వివరిస్తుంది. శాసనం అనే అర్థంలో కింది అంశాలు పరిగణనలోకి వస్తాయి. అవి:

- ఆర్డినెన్స్‌లు
- ఉత్తర్వులు (ఆర్డర్స్)
- ఉపవిధులు (బై-లాస్)
- నియమాలు (రూల్స్)
- రెగ్యులేషన్స్
- నోటిఫికేషన్స్
- ఆచారాలు
- సంప్రదాయాలు
- కేంద్ర, రాష్ట్ర శాసనసభలు రూపొందించిన శాసనాలు.

◆ పైన పేర్కొన్న అంశాలు కూడా ప్రాథమిక హక్కులను ఉల్లంఘించేలా ఉంటే అవీ చెల్లవు.

13(4) నిబంధన: 368వ నిబంధనను అనుసరించి చేసిన రాజ్యాంగ సవరణలు శాసనాలు కావు. 13వ నిబంధన పరిధిలోకి రావు. అంటే న్యాయసమీక్ష చేయడానికి వీల్లేదు. ఈ అంశాన్ని 24వ రాజ్యాంగ సవరణ చట్టం-1971 ద్వారా చేర్చారు.

శంకరీ ప్రసాద్ vs యూనియన్ ఆఫ్ ఇండియా: 1951లో చేసిన మొదటి రాజ్యాంగ సవరణ ప్రాథమిక హక్కులను హరించేలా ఉందని సుప్రీంకోర్టులో సవాల్ చేశారు.

◆ ఈ కేసులో సుప్రీంకోర్టు రాజ్యాంగ సవరణ అనేది శాసనం కాదని ప్రకటించింది. సాధారణ చట్టాల మాదిరిగానే రాజ్యాంగ సవరణలను న్యాయసమీక్షకు గురిచేయొద్దని తీర్పునిచ్చింది. ఈ కేసులోనే సుప్రీంకోర్టు మొదటిసారిగా న్యాయసమీక్ష అధికారాన్ని వినియోగించింది.

గోలక్‌నాథ్ vs స్టేట్ ఆఫ్ పంజాబ్: ఈ కేసులో సుప్రీంకోర్టు ప్రాథమిక హక్కులను సవరించే అధికారం పార్లమెంట్‌కు లేదని, రాజ్యాంగ సవరణలను కూడా న్యాయ సమీక్షకు గురిచేస్తామని తీర్పునిచ్చింది.

ప్రాస్పెక్టివ్ ఎఫెక్ట్ (Prospective Effect): సుప్రీంకోర్టు గోలక్‌నాథ్ కేసులో ఇచ్చిన తీర్పు, అంతకుముందు ఇచ్చిన తీర్పులకు వర్తించదని పేర్కొంది. ఇలా అంతకుముందు ఇచ్చిన తీర్పులకు వర్తించకుండా, రాబోయే వాటికి వర్తించడాన్ని 'ప్రాస్పెక్టివ్ ఎఫెక్ట్' అంటారు.

కేశవానంద భారతి vs కేరళ ప్రభుత్వం:

13(4) నిబంధన రాజ్యాంగబద్ధతను సమర్థిస్తూనే రాజ్యాంగ సవరణ అనేది రాజ్యాంగం మౌలిక స్వరూపాన్ని మార్చకూడదని పేర్కొంది. ప్రాథమిక హక్కులతో సహా రాజ్యాంగాన్ని సవరించే హక్కు పార్లమెంట్‌కు ఉందని సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పునిస్తూ, 24వ రాజ్యాంగ సవరణ చట్టబద్ధమేనని పేర్కొంది. సుప్రీంకోర్టు ఈ కేసులోనే మౌలిక స్వరూపం అనే పదాన్ని మొట్టమొదటిసారిగా ప్రస్తావించింది.

మినర్వామిల్ vs యూనియన్ ఆఫ్ ఇండియా: సుప్రీంకోర్టు ఈ కేసులో 42వ రాజ్యాంగ సవరణను ప్రశ్నించింది. ప్రాథమిక హక్కులు రాజ్యాంగ స్వరూపంలో భాగమని, వాటి ప్రాధాన్యతను తగ్గించడం రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించింది.



రచయిత
డా. వి.కుమారస్వామి
విషయ నిపుణులు

Word of the Day

894

Skeptic

Telugu meaning: సంశయవాది, అవిశ్వాసి

English meaning: The word skeptic (స్కెప్టిక్) is a noun that refers to a person who doubts or questions accepted opinions or claims without sufficient evidence.

Synonyms: Doubter, Questioner ***Antonyms:*** Believer, Supporter

Usage: **1.** As a skeptic, he demanded concrete proof before accepting the new theory.

2. Healthy skepticism helps individuals avoid misinformation and make rational decisions.

Current Affairs



The United States has announced a major immigration clampdown that affects citizens from 75 countries across Asia, Africa, Europe, and South America. Starting January 21, US embassies and consulates will indefinitely pause immigrant visa processing for these nations. Somalia, Russia, Iran, Afghanistan, Brazil, Nigeria, Thailand, Pakistan and Bangladesh are among the countries impacted by the new move. India has been excluded from the list of 75 countries facing the immigrant visa suspension.

☛ The decision effectively closes the door to new travel to the United States for over a third of the nearly 200 countries worldwide.



India and Israel on 14 January 2026, signed a Joint Ministerial Declaration of Intent to strengthen bilateral collaboration in the fisheries and aquaculture sectors, marking a significant expansion of cooperation between the two strategic partners. The declaration was signed during a high-level visit by an Indian delegation led by Union Minister for Fisheries, Animal Husbandry and Dairying and Panchayati Raj Rajiv Ranjan Singh, who was in Israel from January 13 to 15 to participate in the second global summit on "Blue Food Security: Sea the Future 2026" held in Eilat.




Senior IPS officer Rakesh Aggarwal was appointed as the Director General of the National Investigation Agency (NIA) on 14 January 2026. He is a 1994 batch Indian Police Service (IPS) officer of Himachal Pradesh cadre, is currently special director general in the anti-terror agency. He has also been holding the additional charge of the post of DG, NIA. The Appointments Committee of the Cabinet has approved his appointment as DG, NIA for a tenure up to August 31, 2028 the date of his superannuation.

For more Current Affairs: Scan QR code

జనరల్ స్టడీస్ - భారతదేశ చరిత్ర

కేబినెట్ మిషన్ ప్రణాళిక



కాంగ్రెస్, ముస్లింలీగ్‌ల మధ్య అధికమైన అసంతృప్తులతో వేవెల్ ప్రణాళిక వీగిపోయింది. స్వేచ్ఛా భారతమే లక్ష్యంగా కాంగ్రెస్ జాతీయ నాయకులు, ప్రజలు, పాకిస్థాన్ ఏర్పాటే ధ్యేయంగా ముస్లింలీగ్ ఉద్యమాన్ని ఉద్ధృతం చేశాయి. ఈ సమయంలోనే బ్రిటన్‌లో అధికారం చేతులు మారింది. ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన అట్లీ భారతదేశ సమస్య పరిష్కారం కోసం ముగ్గురు కేబినెట్ మంత్రుల బృందాన్ని ఇండియాకు పంపాడు. ఈ మంత్రిత్రయం ప్రతిపాదించిన అంశాలు, భారత నాయకుల స్పందన, జిన్నా వ్యతిరేక ప్రదర్శనకు కారణాలు తదితరాలపై పోటీపరీక్షార్థులకు అవగాహన ఉండాలి.

భారతదేశానికి స్వాతంత్ర్యం ఇవ్వాలనే ప్రతిపాదనకు వ్యతిరేకి అయిన బ్రిటన్ ప్రధాని విన్‌స్టన్ చర్చిల్ నేతృత్వంలోని కన్జర్వేటివ్ పార్టీ 1945లో ఇంగ్లండ్‌లో జరిగిన సాధారణ ఎన్నికల్లో ఓడిపోయింది. దీంతో చర్చిల్ తన అధికారాన్ని కోల్పోయాడు.


కేబినెట్ మిషన్ ప్లాన్

కేబినెట్ మిషన్ బృందంలో లార్డ్ పెథిక్ లారెన్స్ (ఛైర్మన్), సర్ స్టాఫర్డ్ క్రిప్స్ (సభ్యుడు), ఎ.వి.అలెగ్జాండర్ (సభ్యుడు) ఉన్నారు. వీరు 1946 మార్చి 24న భారతదేశానికి వచ్చారు.

కేబినెట్ మిషన్ ప్లాన్ ప్రధానాంశాలు, ప్రత్యక్ష చర్యా దినోత్సవం మొదలైన అంశాలతో సహా పూర్తి సమాచారం 'ఈనాడు ఈప్రతిభ' వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో ఈ-బుక్ రూపంలో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

ఎడ్వర్డ్ ఫ్రాంక్లాండ్

శాస్త్రవేత్తలు విశేషాలు



ఈయన ఇంగ్లండ్‌కు చెందిన ప్రముఖ రసాయన శాస్త్రవేత్త. స్ట్రక్చరల్ కెమిస్ట్రీ రంగంలో విశేష పరిశోధనలు చేశారు. ఆర్గానోమెటాలిక్ కెమిస్ట్రీ స్థాపకుల్లో ఒకరు. మూలకాలు స్థిర నిష్పత్తుల్లో మిళితం అవుతాయని ప్రతిపాదించారు. వేలన్సీ భావనను అధికారికంగా ప్రవేశపెట్టారు. ఈయన్ను 'వేలన్సీ పితామహుడిగా' (Father of Valency) పేర్కొంటారు. లండన్‌లో నీటి నాణ్యతను అధ్యయనం చేశారు. హీలియం మూలకాన్ని కనుక్కున్నారు. తన ప్రయోగాలు, ఆవిష్కరణల ద్వారా రసాయనశాస్త్ర అభివృద్ధికి తోడ్పాటు అందించారు. జనవరి 18న ఎడ్వర్డ్ ఫ్రాంక్లాండ్ జయంతి సందర్భంగా ఆయన జీవితంలోని ముఖ్య విషయాల గురించి తెలుసుకుందాం..!

బాల్యం – వృత్తి జీవితం

- ఎడ్వర్డ్ ఫ్రాంక్లాండ్ 1825, జనవరి 18న ఇంగ్లండ్‌లోని కాటెరాల్‌లో జన్మించారు. 1833లో జేమ్స్ వాలసే ప్రైవేట్ పాఠశాలలో చేరారు.
- 1840లో లాంకాస్టర్‌లో స్టీఫెర్ రాస్ అనే డ్రగ్గిస్ట్ వద్ద అప్రెంటిస్‌గా చేరారు. వివిధ రసాయన సమ్మేళనాలను కలపడం ద్వారా ఔషధాల తయారీపై పట్టు పెంచుకున్నారు.
- 1847లో జర్మనీ వెళ్లి మార్బర్గ్ యూనివర్సిటీలో చేరారు. అక్కడ రాబర్ట్ బన్సెల్ ఆధ్వర్యంలో అనేక పరిశోధనల్లో పాలుపంచుకున్నారు.

చివరగా: ఆధునిక రసాయనశాస్త్ర నిర్మాణానికి కృషి చేసిన ప్రముఖ వ్యక్తుల్లో ఎడ్వర్డ్ ఫ్రాంక్లాండ్ ఒకరు. వివిధ రకాల బొగ్గుల నుంచి వెలువడే వాయువులను సమగ్రంగా విశ్లేషించిన మొదటి వ్యక్తి ఈయనే. ఎడ్వర్డ్ ఫ్రాంక్లాండ్ 1899, ఆగస్టు 9న మరణించారు.

ఎడ్వర్డ్ ఫ్రాంక్లాండ్ పొందిన పురస్కారాలు - గౌరవాలు, గతంలో అడిగిన ప్రశ్నలు - జవాబుల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

నోటిఫికేషన్స్

అప్రెంటిస్ పోస్టులు

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర (బీఓఎం) 2025-26 ఆర్థిక సంవత్సరానికి అప్రెంటిస్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. మొత్తం పోస్టుల సంఖ్య 600. అర్హులైన అభ్యర్థులు 2026, జనవరి 25లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

డిజిటల్ ఇండియా కార్పొరేషన్‌లో ఉద్యోగాలు

దిల్లీలోని డిజిటల్ ఇండియా కార్పొరేషన్ తాత్కాలిక ప్రాతిపదికన వివిధ విభాగాల్లో ఫుల్ స్టాక్ డెవలపర్, ఏఐ/ఎంఎల్ ఇంజినీర్, టెక్నికల్ లీడ్ తదితర ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. మొత్తం పోస్టుల సంఖ్య 9. అర్హులైన అభ్యర్థులు 2026, జనవరి 26లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

రిసెర్చ్ సైంటిస్ట్ ఉద్యోగాలు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ దిల్లీ (ఐఐటీ దిల్లీ) ఒప్పంద ప్రాతిపదికన ప్రాజెక్ట్ రిసెర్చ్ సైంటిస్ట్, ప్రాజెక్ట్ టెక్నికల్ సపోర్ట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. మొత్తం పోస్టుల సంఖ్య 17. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసేందుకు చివరి తేదీ 2026 జనవరి 30.

దరఖాస్తు చేశారా..?


కింది ఉద్యోగాలకు నేడే (జనవరి 18) చివరి తేదీ


- ఈడీసీఐఎల్ ఆంధ్రప్రదేశ్‌లో 424 కౌన్సిలర్ ఉద్యోగాలు. బీఏ/ బీఎస్సీ/ ఎంఏ/ ఎంఎస్సీ ఉత్తీర్ణులు అర్హులు.
- ఫోరెన్సిక్ సైన్స్ యూనివర్సిటీలో సైంటిఫిక్ పోస్టులు. బ్యాచిలర్ డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణులు అర్హులు.


పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.


Embedded Figures


Directions(Q.s: 1 - 14): *In each of the following questions, you are given a quetion figure followed by four alternative figures (A), (B), (C) and (D) such that question figure is embedded in one of them. Trace out the alternative figure which contains question figure as its part.*


1.



2.


3.



4.



5.



6.




7.



Railway Exams
Reasoning


8.



9.


10.


11.



12.


13.


14.


Scan the QR code for Key

These model questions were prepared by subject experts

నా బంగ్లాను కూల్చినవారిని

ప్రజలు వెళ్లగొట్టారు: కంగనా



ఇంటర్నెట్ డెస్క్: మహారాష్ట్ర మున్సిపల్ ఎన్నికల్లో మహాయుతి కూటమి ఘనవిజయం సాధించడంపై భాజపా ఎంపీ, నటి కంగనా రనౌత్ ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గతంలో ముంబయిలోని తన కార్యాలయాన్ని కూల్చివేత ఘటనను గుర్తుచేసుకుంటూ ఉద్ధవ్‌ఠాక్రే పార్టీపై ఆమె విమర్శలు గుప్పించారు. "బీఎంసీ (బృహన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్) ఎన్నికల్లో భాజపా ఘనవిజయం సాధించడం చాలా గొప్ప విషయం. గతంలో నన్ను వేధించినవారిని, నా బంగ్లాను కూల్చేసినవారిని, మహారాష్ట్ర నుంచి వెళ్లిపోవాలని నన్ను బెదిరించినవారిని.. ఇప్పుడు రాష్ట్రమే వెలేసింది. మహిళలపై ద్వేషభావం ఉన్న బంధుప్రీతి మాఫియాకు ప్రజలు సరైన చోటు చూపించారు" అని కంగనా రనౌత్ దుయ్యబట్టారు. ముంబయిలోని బాంద్రాలో గల కంగనా కార్యాలయంలో కొంత భాగాన్ని 2020లో అప్పటి బీఎంసీ అధికారులు అక్రమ కట్టడం పేరుతో కూల్చేశారు. దీనిపై అప్పట్లో ఆమె ముంబయి కోర్టును ఆశ్రయించగా.. అధికారుల తీరుపై న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. "బీఎంసీది ఉద్దేశపూర్వక చర్యలాగే ఉంది. కంగనాను బెదిరించేందుకే ఆమె కార్యాలయాన్ని కూల్చినట్లుగా స్పష్టంగా తెలుస్తోంది. ఈ చర్యలను తక్షణమే ఆపాలి. నటికి జరిగిన నష్టాన్ని బీఎంసీయే పూడ్చాలి" అని కోర్టు నాడు తీర్పు వెలువరించింది.

తూర్పు పసిఫిక్ ప్రాంతంలో పైలట్లు జాగ్రత్తగా ఉండాలి

- అమెరికా విమానాలకు ఎఫ్‌ఏఏ హెచ్చరిక

వాషింగ్టన్: అమెరికా విమానయాన సంస్థలకు అగ్రరాజ్య ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్‌ఏఏ) హెచ్చరికలు జారీ చేసింది. మెక్సికో, సెంట్రల్ అమెరికా, పనామా సహా తూర్పు పసిఫిక్ మహా సముద్రంలోని కొన్ని ప్రాంతాల గగనతలం మీదుగా ప్రయాణిస్తున్నపుడు పైలట్లు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించింది. సైనిక కార్యకలాపాల నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో ముప్పు ఎదురయ్యే అవకాశం ఉందని అమెరికాలోని ఎయిర్‌లైన్ సంస్థలను హెచ్చరించింది. ఈ మేరకు అడ్వైజరీని జారీ చేసింది. "విమానం ఎంత ఎత్తులో ఉన్నా.. ల్యాండింగ్, టేకాఫ్ దశల్లో ఉన్నా సరే.. వాటికి ముప్పు ఎదురయ్యే ప్రమాదం ఉంది" అని ఎఫ్‌ఏఏ ఆ నోటీసుల్లో స్పష్టం చేసింది. సాధారణంగా సమీప ప్రాంతాల్లో యుద్ధం లేదా ఉద్రిక్త పరిస్థితులు ఉన్న సమయంలో ఎఫ్‌ఏఏ ఇలాంటి నోటీసులు జారీ చేస్తుంటుంది. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా కట్టడి పేరుతో వెనెజువెలా దేశాధినేతగా ఉన్న నికోలస్ మదురో, ఆయన భార్యను అమెరికా దళాలు బంధించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే మిగతా లాటిన్ అమెరికా దేశాలకు ట్రంప్ హెచ్చరికలు జారీ చేశారు. ఈ పరిణామాల వేళ ఎఫ్‌ఏఏ అడ్వైజరీ నోటీసులు జారీ చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.



మంచు గడ్డ కింద చేపల వేట

దక్షిణ కొరియాలోని హ్వాచియెన్‌లో మంచు ఉత్సవం సందర్భంగా గడ్డకట్టిన ఓ సరస్సు వద్ద శనివారం నిర్వహించిన చేపల వేటలో పాల్గొన్న ఔత్సాహికులు

ఆ విన్యాసాలు బ్రిక్స్‌లో భాగం కాదు

అందుకే మేం దూరం: భారత్

దిల్లీ: దక్షిణాఫ్రికా ఆధ్వర్యంలో చేపట్టిన బహుళపక్ష నౌకాదళ యుద్ధవిన్యాసాలకు దూరంగా ఉండటానికి కారణాలను భారత్ వివరించింది. అవి 'బ్రిక్స్' కూటమి సంస్థాగత కార్యకలాపాల్లో భాగం కాదని పేర్కొంది. ఆ విన్యాసాలు దక్షిణాఫ్రికా జలాల్లో జరిగాయి. అందులో చైనా, రష్యా, ఇరాన్, ఈజిప్ట్, ఇండోనేసియా, సౌదీ అరేబియా, యూఏఈ తదితర దేశాలు పాల్గొన్నాయి. వారం పాటు జరిగిన ఈ విన్యాసాలు.. ఇరాన్‌లో నిరసనలను అణచివేస్తున్న ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకొని సైనిక దాడులు జరగొచ్చన్న అంచనాల నేపథ్యంలో చోటుచేసుకున్నాయి. ఆ యుద్ధక్రీడలు పూర్తిగా దక్షిణాఫ్రికా చొరవతో జరిగాయని భారత విదేశీ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జయస్వాల్ పేర్కొన్నారు. "అందులో 'బ్రిక్స్' కూటమిలోని కొన్ని దేశాలు పాలుపంచుకున్నాయి. అన్ని దేశాలూ పాల్గొనలేదు. ఆ విన్యాసాలు కూటమి సంస్థాగత లేదా సాధారణ కార్యకలాపాలు కావు" అని వివరించారు.

నిధులున్నాయ్.. నిబద్ధత కావాలి: గడ్కరీ

విదిశ: భారత దేశానికి నిధుల కొరత లేదని, ప్రభుత్వంవద్ద అక్షయ పాత్ర ఉందని, కావాల్సిందల్లా గ్రామాలు, పేదలు, రైతుల శ్రేయస్సు కోసం శ్రమించే రాజకీయ నాయకులేనని కేంద్ర మంత్రి గడ్కరీ వ్యాఖ్యానించారు. మధ్యప్రదేశ్‌లోని విదిశలో పలు రహదారి ప్రాజెక్టులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిధులు కేటాయించాలని ముఖ్యమంత్రి మోహన్ యాదవ్, కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌లు గడ్కరీకి విజ్ఞప్తి చేశారు. దీంతో ఆయన స్పందించారు. మన దగ్గర అక్షయ పాత్ర ఉందని, ప్రజా సంక్షేమానికి నిధుల కొరతే లేదని తెలిపారు. తన పనిలో 90 శాతం రైతుల కోసమేనని, వారు ఆత్మహత్యలు చేసుకోవాల్సిన అగత్యాన్ని తప్పించడమే తన ధ్యేయమని తెలిపారు.

పాక్‌లో రోడ్డు ప్రమాదం.. 14 మంది మృతి

లాహోర్: పాకిస్థాన్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. పొగమంచు కారణంగా.. దారి సరిగా కనిపించక, ఓ ట్రక్కు వంతెన కిందికి పడిపోయింది. ఈ ఘటనలో 14 మంది మృతి చెందారు. వారిలో ఆరుగురు చిన్నారులు ఉన్నారు. 23 మంది ప్రయాణికులున్న ట్రక్కులో దాదాపు ఒకే కుటుంబానికి చెందినవారే ఉన్నారు. వారంతా శనివారం ఇస్లామాబాద్ నుంచి ఫైసలాబాద్‌కు ఓ అంత్యక్రియలకు హాజరయ్యేందుకు వెళ్తున్న సమయంలో సర్గోదా జిల్లాలోని కోట్ మోమిన్‌లో ఈ విషాద ఘటన చోటుచేసుకుంది.



గణతంత్ర వేడుకలు పురస్కరించుకొని దిల్లీలోని విజయ్ చౌక్‌లో బ్యాక్ట్రియన్ ఒంటెపై కవాతు సాధనలో పాల్గొన్న సైన్యానికి చెందిన రీమౌంట్ వెటర్నరీ కోర్ సిబ్బంది

రిపబ్లిక్ డేకు ఉగ్ర ముప్పు!

దిల్లీ: ఈ ఏడాది గణతంత్ర వేడుకలను ఉగ్ర సంస్థలు లక్ష్యంగా చేసుకునే అవకాశముందని నిఘా వర్గాలు హెచ్చరించాయి. ఖలిస్థానీ, బంగ్లాదేశ్ కేంద్రంగా పని చేస్తున్న సంస్థలు దిల్లీసహా దేశంలోని ప్రముఖ నగరాల్లో దాడులకు ప్రణాళికలు రచించవచ్చని తెలిపాయి. దేశ అంతర్గత భద్రతను దెబ్బతీసేందుకు ఖలిస్థానీ, ఇతర రాడికల్ గ్రూపులు స్థానిక గ్యాంగ్‌స్టర్లను ఉపయోగించుకుంటున్నారని పేర్కొన్నాయి. హరియాణా, పంజాబ్, దిల్లీ, ఉత్తర్ ప్రదేశ్, రాజస్థాన్‌లలో ఉగ్ర నెట్‌వర్కుల కదలికలకు సంబంధించి సమాచారం అందినట్లు తెలిపాయి. గతేడాది దిల్లీలోని ఎర్రకోట వద్ద పేలుడు జరిగిన నేపథ్యంలో నిఘా వర్గాల హెచ్చరికలతో అధికారులు అప్రమత్తమయ్యారు. దిల్లీ సహా ఇతర ప్రముఖ నగరాల్లో భద్రతను కట్టుదిట్టం చేయాలని అన్ని రాష్ట్రాలకు ఆదేశాలు జారీ చేశారు.

రాజ్యసభలో ఆ బిల్లు 30 ఏళ్లుగా పెండింగ్‌లోనే..!

దిల్లీ: రాజ్యసభలో ప్రస్తుతం 19 ప్రభుత్వ బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు తాజా నివేదిక ఒకటి వెల్లడించింది. ఇందులో ఓ బిల్లు 1992 నుంచి పెండింగ్‌లో ఉండటం గమనార్హం. ఇది జనాభా నియంత్రణ, చిన్న కుటుంబాలను ప్రోత్సహించేందుకు ఉద్దేశించిన బిల్లుగా తెలుస్తోంది. ఎన్నికల్లో పోటీ చేసే వారికి ఇద్దరు పిల్లల నిబంధనతోపాటు.. ఇద్దరు కన్నా ఎక్కువ మంది పిల్లలుంటే ఎంపీ లేదా ఎమ్మెల్యేగా అనర్హులుగా ప్రకటించాలని ఇందులో ప్రతిపాదించారు. 1997 నాటి దిల్లీ అద్దెల(సవరణ) బిల్లు, నాణ్యమైన విత్తనాల అమ్మకం, ఎగుమతి, దిగుమతికి చెందిన సీడ్ బిల్లు-2004, అంతర్రాష్ట్ర వలస కార్మికులకు చెందిన 2011 నాటి సవరణ బిల్లు, భవన నిర్మాణ కార్మికుల బిల్లు, భవన కల్పన కార్యకలాపాల బిల్లు మొదలైనవి పెండింగ్‌లోనే ఉన్నాయి. లోక్‌సభ రద్దైనప్పుడు పెండింగ్ బిల్లులు కూడా వీగిపోతాయి. వాటిని మళ్లీ ప్రవేశపెట్టాల్సి ఉంటుంది. కానీ, రాజ్యసభ శాశ్వత సభ. కాబట్టి ఎప్పటికీ రద్దు కాదు. బిల్లులు సజీవంగా ఉంటాయి.

ఆఫ్రికా దక్షిణ దేశాల్లో కుండపోత వర్షాలు

- 100 మందికి పైగా మృతి

కొమాటీ: ఆఫ్రికా దక్షిణ ప్రాంతంలోని మొజాంబిక్, జింబాబ్వే, దక్షిణాఫ్రికా దేశాలలో కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. దాదాపు 100 మందికి పైగా మృతి చెందారు. లక్షల మంది నిరాశ్రయులయ్యారు. రానున్న రోజుల్లో మరింత భారీవర్షాలు కురవొచ్చన్న వాతావరణ శాఖ హెచ్చరికలు వారిని మరింతగా కలవరపెడుతున్నాయి. మొజాంబిక్‌లో వర్షాలు, వరదల కారణంగా 2 లక్షల మందికి పైగా ప్రభావితులయ్యారు. వేల సంఖ్యలో ఇళ్లు ధ్వంసమయ్యాయి. జింబాబ్వేలో వర్షాల వల్ల 70 మంది మరణించగా.. 1000కి పైగా ఇళ్లు పూర్తిగా కొట్టుకుపోయాయి. పాఠశాలలు, రోడ్లు, వంతెనలు దెబ్బతిన్నాయి. దక్షిణ ఆఫ్రికాలో మృతుల సంఖ్య 30 చేరింది. సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. హెలికాప్టర్లను రంగంలోకి దింపి, బాధితుల్ని రక్షిస్తున్నారు. ప్రఖ్యాత క్రుగర్ నేషనల్ పార్క్‌ను కూడా తాత్కాలికంగా మూసివేశారు. అందులో చిక్కుకున్న 600 మంది పర్యాటకులు, పార్కు సిబ్బందిని సహాయక బృందాలు సురక్షిత ప్రాంతాలకు తరలించాయి. లా నినా వల్ల వాతావరణంలో వచ్చే మార్పుల వల్ల ఆఫ్రికాలోని ఏడు దేశాలను వర్షాలు ముంచెత్తుతున్నాయని అమెరికా వాతావరణ హెచ్చరికల వ్యవస్థ తెలిపింది.

ఆపరేషన్ సిందూర్ వీరులకు స్మారకం

రాజౌరి/జమ్మూ: ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థానీ ఫిరంగి గుళ్ల దాడిలో మరణించిన భారతీయ వీరుల కోసం ఒక స్మారక చిహ్నాన్ని రాజౌరి జిల్లాలోని గుజ్జర్ మండీ చౌక్‌లో నెలకొల్పినట్లు అధికారులు శనివారం తెలిపారు. ఈ స్మారక చిహ్న ప్రతిష్ఠాపనను స్థానికులు స్వాగతించారు. పహల్గాం ఉగ్ర దాడికి ప్రతిగా భారత్ నిరుడు మే నెల 7వ తేదీన పాక్‌పై ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. దానికి ప్రతిగా మే 10న రాజౌరిలోని గుజ్జర్ మండీ చౌక్‌లోని జనావాస ప్రాంతాలపై పాక్ ఫిరంగులతో దాడులు చేసింది. ఒక ఫిరంగి గుండు రాజౌరి అదనపు జిల్లా అభివృద్ధి కమిషనర్ రాజ్ కుమార్ థప్పా అధికార నివాసంపై పడటంతో ఆయన మరణించారు. థప్పాతో పాటు సుబేదార్ మేజర్ పవన్ కుమార్, మరో ముగ్గురు సైనిక సిబ్బంది మరణించారు. వారందరి కుటుంబసభ్యుల చిత్రాలను స్మారక చిహ్నంవద్ద ఏర్పాటు చేశారు.

వెనెజువెలాకు కృతజ్ఞతగా బెంగాల్ పాఠశాల ప్రార్థనలు

ఈటీవీ భారత్: పశ్చిమబెంగాల్‌లోని ఉత్తర 24 పరగణాల జిల్లాలో గల బగూ గ్రామ ప్రజలు వెనెజువెలా రాజకీయ సంక్షోభంపై తీవ్రంగా కలతచెందుతూ ఆ దేశంలో సత్వరం శాంతి నెలకొనాలని ప్రార్థనలు చేస్తున్నారు. ఎక్కడో దాదాపు 20వేల మైళ్ల దూరాన గల వెనెజువెలాతో ఈ గ్రామానికి రెండు దశాబ్దాల క్రితం ఏర్పడిన అనుబంధమే



చావెజ్ చిత్రపటంతో విద్యార్థుల ప్రార్థనలు

దీనికి కారణం. గ్రామంలో స్వాతంత్ర్య సమరయోధులు నెలకొల్పిన 1942 నాటి బగూ జూనియర్ బేసిక్ స్కూలును 2004లో అప్పటి వెనెజువెలా అధ్యక్షుడు హ్యూగో చావెజ్ సందర్శించారు. అప్పటి బెంగాల్ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య సారథ్యంలోని వామపక్ష ప్రభుత్వ చొరవతో ఈ పర్యటన ఏర్పాటైంది. విద్యార్థులతో ముచ్చటించిన చావెజ్ పాఠశాల అభివృద్ధి పనులకు రూ.12.5 లక్షల గ్రాంటు ప్రకటించారు. ఆ నిధులతో కొత్త తరగతి గదులు, క్రీడామైదానం నిర్మించారు. ఆ కృతజ్ఞతతోనే వెనెజువెలాలో మళ్లీ శాంతి నెలకొనాలని బగూ పాఠశాలలో వారానికి రెండు రోజులు ప్రార్థనలు చేస్తున్నట్లు హెడ్‌మాస్టర్ సందీప్‌బైద్య తెలిపారు.

అప్పలరాజు నిర్బంధంపై జోక్యం చేసుకోండి

రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు కిసాన్ సభ లేఖ

ఈనాడు, దిల్లీ: కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు అనకాపల్లి జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం పెద్దఎత్తున చేపడుతున్న భూసేకరణకు వ్యతిరేకంగా ఆందోళనకు దిగిన అఖిల భారత కిసాన్ సభ జిల్లా కార్యదర్శి ఎం.అప్పలరాజును ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చట్టవిరుద్ధంగా నిర్బంధించిందని, ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు ఆ సంస్థ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు కిసాన్ సభ శనివారం రాష్ట్రపతికి లేఖ రాసింది. అనకాపల్లి జిల్లాలో ఆర్సెలర్ మిత్తల్, జిందాల్ సిమెంట్, బల్క్ డ్రగ్ సిటీ కోసం రాష్ట్ర ప్రభుత్వం లక్షల ఎకరాలు సేకరించి రైతులను నిరాశ్రయులుగా మారుస్తోందని ఆ సంస్థ ప్రధాన కార్యదర్శులు విజూ కృష్ణ, బి.వెంకట్, రాజ్యసభ సభ్యుడు వి.శివదాసన్‌లు లేఖలో పేర్కొన్నారు. 'భూసేకరణకు వ్యతిరేకంగా రైతులతో కలిసి ఆందోళన చేపట్టిన అప్పలరాజును ప్రభుత్వం నిర్బంధించింది. 20 రోజులుగా కుటుంబ సభ్యులకు కూడా ఆయన్ను చూపడం లేదు. దీనిపై తక్షణమే జోక్యం చేసుకోవాలి. ప్రజాస్వామ్య ఉద్యమాలు, ప్రజాసంఘాలకు వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వం అణచివేతకు పాల్పడకుండా ఆదేశించాలి' అని లేఖలో కోరారు.

వైకాపా నాయకుడి భూ ఆక్రమణ యత్నం

తెదేపా కేంద్ర కార్యాలయంలో బాధితురాలి ఫిర్యాదు

ఈనాడు, అమరావతి : తనకు ప్రభుత్వం కేటాయించిన రెండు సెంట్ల భూమిని స్థానిక వైకాపా నాయకుడు కబ్జా చేయాలని చూస్తున్నాడని... దీన్ని అడ్డుకున్న తన కుటుంబ సభ్యులపై దాడి చేశాడని అన్నమయ్య జిల్లా మదనపల్లి మండలం రేకులకుంటపల్లికి చెందిన శంకరమ్మ వాపోయారు. తనకు న్యాయం చేయాలని కోరుతూ మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో శనివారం ఫిర్యాదు చేశారు. వివిధ సమస్యలతో వచ్చిన బాధితుల నుంచి ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, రాష్ట్ర కనీస వేతన సలహాబోర్డు ఛైర్మన్ పెళ్లకూర శ్రీనివాసులురెడ్డి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. ఏళ్లుగా తమ సాగులో ఉన్న ప్రభుత్వ భూమిని ఆక్రమించాలని చూస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని అనకాపల్లి జిల్లా సబ్బవరానికి చెందిన కాసుల నాయుడు కోరారు. గ్రామ రికార్డుల్లో తమ కుటుంబానికి సంబంధించిన వివరాలు తప్పుగా నమోదయ్యాయని.. వీటిని సరిచేయాలని బాపట్ల జిల్లా కొల్లూరు మండలం రావికంపాడుకు చెందిన కె.వెంకటేశ్వర్లు విజ్ఞప్తి చేశారు.

10శాతం ఉద్యోగులు, పెన్షనర్లకు

అందని కరవు భత్యం బకాయిలు

- సాంకేతిక సమస్యలే కారణం
- దిద్దుబాటు చర్యలు ప్రారంభించిన అధికార యంత్రాంగం

ఈనాడు, అమరావతి: ఉద్యోగులకు, పెన్షనర్లకు రాష్ట్ర ప్రభుత్వం పాత కరవు భత్యం బకాయిలను సంక్రాంతికి చెల్లించేందుకు ఏర్పాట్లు చేసినా 10 శాతం మందికి సాంకేతిక సమస్యలు, ఇతర కారణాల వల్ల ఆ సొమ్ము చేరలేదు. కొందరు పెన్షనర్ల ఖాతాలు మూసివేసి ఉండటం, పెన్షనర్లు చనిపోయినా బిల్లుల్లో మార్పులు చేయకపోవడం వల్ల కూడా సమస్యలు ఎదురయ్యాయి. ఈ విషయంలో సాంకేతిక సమస్యలను సరిదిద్దడంతో పాటు కొంత మేర నిధులనూ సర్దుబాటు చేయాల్సి ఉంది. కొద్దిమంది ఉద్యోగులు, పెన్షనర్ల నుంచి తమకు ఇంకా బకాయిలు అందలేదని సమాచారం రావడంతో ఖజానా విభాగం రాష్ట్ర అధికారులు ఈ అంశంపై లోతుగా పరిశీలిస్తున్నారు. సోమవారం నాటికి ఇంకా ఎంత మందికి కరవు భత్యం బకాయిలు జమ చేయాల్సి ఉందన్న సమాచారం పక్కాగా తేలుతుంది.

◆ రాష్ట్ర ప్రభుత్వం 2018, 2019 సంవత్సరాలకు సంబంధించిన కరవు భత్యం బకాయిలు చెల్లించాలని నిర్ణయించి సంక్రాంతికి 90 శాతం మేర చెల్లింపులు పూర్తి చేసింది. 2018 జులై ఒకటి నుంచి 27.24శాతం నుంచి 30.39శాతం వరకు పెంచిన కరవు భత్యం బకాయిలు 2020 డిసెంబర్ 31 వరకు 30 నెలల కాలానికి నగదు రూపంలో ఇవ్వవలసి ఉంది. ఈ బకాయిలను ఖజానా అధికారులు మూడు బిల్లుల రూపంలో సమర్పించారు. పాత పెన్షన్ విధానంలో ఉన్న ఉద్యోగులకు జీపీఎఫ్ ఖాతాల్లో జమ చేశారు. మిగిలిన వారిలో 90 శాతానికి పైగా పెన్షనర్లకు, సీపీఎస్ ఉద్యోగులకు నిధులు జమ చేశారు.

◆ 2019 జనవరి 1 నుంచి 30.39 శాతం నుంచి 33.53 శాతం వరకు పెంచిన కరవు భత్యం బకాయిలు కూడా ఇదే తరహాలో చెల్లించాల్సి ఉంది. ఈ బకాయిలు 2021 జూన్ 30 వరకు (30 నెలలకు) మొత్తం చెల్లించాల్సి ఉంది. ఇవి కూడా మూడు బిల్లుల రూపంలో సమర్పించారు. 90శాతం మందికి చెల్లింపులు పూర్తయ్యాయి.

ఖాతాలు మూసివేయడం వల్లనే

ఈ బిల్లులన్నీ 2019, 2020లో సమర్పించినవే. అప్పటి నుంచి బకాయిలు చెల్లించకపోవడం వల్ల ప్రతి సంవత్సరం తదుపరి ఏడాదికి ఈ బిల్లులను బదిలీ చేస్తున్నారు. గత నాలుగైదు ఏళ్లలో పెన్షనర్లలో అనేక మంది చనిపోయారు. దీంతో వారి బ్యాంకు ఖాతాలు మూసివేశారు. చనిపోయిన వారి కుటుంబ సభ్యులకు ఈ బకాయిలు చెల్లించాలి. అయితే ఆ ఖాతాలకు సొమ్ములు వెళ్లినా ఖాతాలు మూసి ఉండటంతో నిధులు జమ కాలేదు. దీనిపై ఖజానా అధికారులు దృష్టి సారించారు.

ఇతరత్రా కారణాలూ ఉన్నాయి

కొన్ని బిల్లులు 2019, 2020లో సమర్పించినా ఇతరత్రా కారణాల వల్ల వాటిని రద్దు చేసి మళ్లీ ఆ కరవు భత్యం బకాయిలకు సంబంధించి 2025లో కొత్తగా బిల్లులు సమర్పించినవీ ఉన్నాయి. ప్రస్తుత చెల్లింపుల క్రమంలో ఆర్థికశాఖ ఆ బిల్లులను పరిగణనలోకి తీసుకోకపోవడం వల్ల కూడా కొందరికి కరవు భత్యం బకాయిల సొమ్ము అందలేదు. ఈ నేపథ్యంలో ఈ సమస్యలను సరిదిద్దే పనుల్లో ఆర్థికశాఖ, ఖజానా విభాగాలు నిమగ్నమయ్యాయి.

సంప్రదాయానికి, సాంకేతికతకు సమ ప్రాధాన్యం

- 'ఎక్స్'లో సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: పండుగల నిర్వహణతో అటు సంప్రదాయానికి.. ఇటు టెక్నాలజీతో పరిశ్రమలకు ప్రాధాన్యమిస్తూ రాష్ట్రాభివృద్ధికి పనిచేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. మన విలువలు, ఆచారాలు పాటిస్తూనే తెలుగు జాతిని నంబర్ వన్‌గా నిలిపేందుకు ప్రయత్నిస్తామని మరోసారి మాటిస్తున్నానంటూ 'ఎక్స్'లో శనివారం పోస్టు చేశారు. 'రాష్ట్రంలో ప్రతి పల్లెలో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. ప్రజలు దేశ విదేశాల నుంచి తరలివచ్చి భోగి, సంక్రాంతి, కనుమ పండుగల తెలుగు సంప్రదాయాన్ని చాటారు. ఎవరు ఎక్కడున్నా సంక్రాంతికి జన్మభూమికి వచ్చి కుటుంబసభ్యులు, బంధుమిత్రులు, సొంత గ్రామస్థులతో గడిపే సంప్రదాయంలో భాగంగా నేను కూడా నా కుటుంబంతో కలిసి నారావారిపల్లిలో జరిగిన సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్నా. ఇది ఎంతో సంతృప్తినిచ్చింది. జగ్గన్నతోట ప్రభల తీర్థం కార్యక్రమాన్ని ఈసారి రాష్ట్ర పండుగగా జరిపాం. ఈ ప్రభల పండుగ మన సంస్కృతిని చాటింది. కాకినాడలో ఏఎం గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశా. దేశంలోనే తొలిసారి ఏర్పాటు చేస్తున్న ఈ ప్లాంటుతో ఏడాదికి 1.5 మిలియన్ టన్నుల గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి అవుతుంది' అని పేర్కొన్నారు.

ఏపీ ఐఏఎస్ కేడర్ బలం 239 నుంచి 259కి పెంపు

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్ ఐఏఎస్ కేడర్ బలాన్ని 239 నుంచి 259కి పెంచుతూ కేంద్ర సిబ్బంది, శిక్షణ వ్యవహారాలశాఖ శనివారం నోటిఫికేషన్ జారీచేసింది. 2017 నవంబరు 10 తర్వాత రాష్ట్ర ఐఏఎస్ కేడర్ స్ట్రెంగ్త్‌ను పెంచుతూ కేంద్రం నిర్ణయం తీసుకోవడం ఇదే ప్రథమం. ఇందులో సీనియర్ డ్యూటీ పోస్టులను 130 నుంచి 141కి పెంచింది. వీటిలో ప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శి పోస్టుల సంఖ్య 2 నుంచి 3కి చేరాయి. రాష్ట్రంలో జిల్లాల సంఖ్య పెరిగిన విషయాన్ని దృష్టిలో ఉంచుకొని కలెక్టర్, జాయింట్ కలెక్టర్ పోస్టులను ఇదివరకున్న 13 నుంచి 26 చేసింది. ఐటీడీఏ పీఓ, డీఆర్‌డీఏ, జడ్పీ సీఈఓ పోస్టుల సంఖ్యను 8 నుంచి 5కి, డైరెక్టర్ పోస్టుల సంఖ్యను 28 నుంచి 20కి తగ్గించింది.

కేడర్ స్ట్రెంగ్త్‌లో వచ్చిన మార్పులు ఇవీ..

వివరం	2017లో	2026లో
మొత్తం పోస్టులు	239	259
ఇందులో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్	167	181
ప్రమోషన్ల ద్వారా భర్తీచేసే పోస్టులు	72	78
మొత్తంలో సీనియర్ పోస్టులు	130	141
ఇందులో సెంట్రల్ డిప్యుటేషన్ రిజర్వ్(40%)	52	56
స్టేట్ డిప్యుటేషన్ రిజర్వ్25%)	32	35
ట్రైనింగ్ రిజర్వ్(3.5%)	4	4
లీవ్‌రిజర్వ్, జూనియర్ పోస్టుల రిజర్వ్	21	23

డాక్టర్ ఆదినారాయణరావు మృతికి పవన్‌కల్యాణ్ సంతాపం

ఈనాడు, అమరావతి : ప్రముఖ ఎముకల వైద్య నిపుణులు డా.సుంకర ఆదినారాయణరావు మృతికి ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సంతాపం తెలిపారు. దశాబ్దాలుగా వైద్యవృత్తిలో ఉన్న ఆయన పోలియోతో బాధపడేవారికి విశేష సేవలందించారని శనివారం ఓ ప్రకటనలో కొనియాడారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

బీసీసీఐ అబ్జర్వర్‌గా కేడీసీఏ సెక్రటరీ రవీంద్రచౌదరి

ఈనాడు, అమరావతి: నాగ్‌పూర్‌లో ఈ నెల 21న జరగనున్న ఇండియా వర్సెస్ న్యూజిలాండ్ మొదటి టీ-20 మ్యాచ్‌కి అబ్జర్వర్‌గా కేడీసీఏ(కృష్ణ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్) కార్యదర్శి ఎం.రవీంద్రచౌదరి నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు ఏసీఏ అధ్యక్షుడు కేశినేని చిన్ని అభినందనలు తెలిపారు.

తెలంగాణ మున్సిపల్ రిజర్వేషన్లలో బీసీలకు అన్యాయం: ఆర్.కృష్ణయ్య

కాచిగూడ, న్యూస్‌టుడే: తెలంగాణలో మున్సిపల్ రిజర్వేషన్లలో బీసీలకు అన్యాయం చేశారని ఎంపీ ఆర్.కృష్ణయ్య విమర్శించారు. 121 మున్సిపాలిటీల్లో బీసీలకు 38 మాత్రమే కేటాయించారన్నారు. తెలంగాణలో 56 శాతం ఉన్న బీసీలకు గత ఎన్నికల్లో 34 శాతం కేటాయిస్తే ప్రస్తుత ఎన్నికల్లో 31 శాతానికి తగ్గించారని ఆరోపించారు.

ఇసుక కుప్పను ఢీకొట్టి.. పొలాల్లోకి పల్టీలు కొట్టి..

- ప్రమాదంలో కస్తూర్బా ఎస్‌వో, ప్రధానోపాధ్యాయురాలి మృతి



కల్పన గీతారెడ్డి

ఈనాడు, సూర్యాపేట, న్యూస్‌టుడే, జాజిరెడ్డిగూడెం: తెలంగాణలోని సూర్యాపేట జిల్లా అర్వపల్లిలోని నకిరేకల్-మల్లంపల్లి 365 జాతీయ రహదారిపై శనివారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో తుంగతుర్తి కస్తూర్బా విద్యాలయం ప్రత్యేకాధికారిణి (ఎస్‌వో) మామిడాల కల్పన(40), తుంగతుర్తి మండలం రావులపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పోరెడ్డి గీతారెడ్డి(47) మృతి చెందారు. తుంగతుర్తి జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అల్వాల ప్రవీణ్‌కుమార్, అన్నారం జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అల్వాల సునీతారాణి తీవ్రంగా గాయపడ్డారు. కాగా, సునీతారాణి ప్రవీణ్‌కుమార్‌కు సోదరి. పోలీసులు, స్థానికులు కథనం మేరకు.. పైన పేర్కొన్న నలుగురు విధులు నిర్వర్తించేందుకు నల్గొండ పట్టణం నుంచి తుంగతుర్తి మండలంలోని పాఠశాలలకు వచ్చి వెళుతుంటారు. ఎప్పటిలాగే శనివారం ఉదయం 7:15 గంటలకు నల్గొండ నుంచి గీతారెడ్డికి చెందిన కారులో బయలుదేరారు. అర్వపల్లిలో రహదారి పక్కనే ఉన్న ఓ ఇంటి ముందు పోసిన ఇసుక కుప్పను కారు అతివేగంగా ఢీకొట్టింది. దీంతో కారు పల్టీలు కొడుతూ రహదారి కింద ఉన్న పెద్ద బండరాళ్లను తాకుతూ పొలాల్లో పడింది. ఈ క్రమంలో కారు తలుపులు తెరుచుకోవడంతో కల్పన రోడ్డుపై పడగా.. తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. గీతారెడ్డితో పాటు సునీతారాణి పొలాల్లో పడటంతో తీవ్రంగా గాయపడ్డారు. చుట్టు పక్కల వారు వచ్చి కారులో గాయాలతో ఉన్న ప్రవీణ్‌కుమార్, డ్రైవర్ గిరిని బయటకు తీశారు. కల్పన మృతదేహాన్ని, ప్రాణాప్రాయ స్థితిలో ఉన్న గీతారెడ్డిని సూర్యాపేట జనరల్ ఆసుపత్రికి తరలించారు. గీతారెడ్డి పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. డ్రైవర్ అతివేగం వల్లే ప్రమాదం జరిగిందని వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అర్వపల్లి ఎస్సై సైదులు పేర్కొన్నారు.

కార్యాలయం కట్టుకునేందుకు

స్థలం ఇస్తామంటారు.. ఇవ్వరు!

- స్త్రీనిధి సంస్థకు అమరావతిలో భూ కేటాయింపులో తీవ్రజాప్యం
- 45 సెంట్లు ఇచ్చేందుకు సీఆర్‌డీఏ అంగీకరించినా కాలయాపన

ఈనాడు, అమరావతి: డ్వాక్రా మహిళలకు రుణాలిచ్చే స్త్రీనిధి సంస్థకు కార్యాలయ నిర్మాణంలో జాప్యం జరుగుతోంది.. రూ.100 కోట్లతో సొంత భవనాన్ని నిర్మించుకోవాలని ఆ సంస్థ భావిస్తున్నా భూ కేటాయింపులో అలస్యమవుతుండటంతో కార్యరూపం దాల్చడం లేదు. అమరావతిలో తమ కార్యాలయం కోసం స్థలం కేటాయించాలని కోరుతూ స్త్రీనిధి సంస్థ అధికారులు గత నాలుగు నెలలుగా సీఆర్‌డీఏ చుట్టూ తిరుగుతున్నారు. స్థలం కేటాయించాలని గ్రామీణ పేదరిక నిర్మూలన సొసైటీ (సెర్ప్) ఎక్స్ అఫీషియో కార్యదర్శి, స్త్రీనిధి ఎండీ ఇరువురూ వేర్వేరుగా సీఆర్‌డీఏకు లేఖలు కూడా రాశారు. డబ్బు పెట్టి కొనుగోలు చేస్తామని చెబుతున్నారు. సీఆర్‌డీఏ అధికారులు మాత్రం స్థలం ఇవ్వకుండా నాన్చుడు ధోరణితో వ్యవహరిస్తున్నారు.

2019లోనే స్థల కేటాయింపునకు సీఎం చంద్రబాబు అంగీకారం

స్త్రీనిధి సంస్థకు అమరావతిలో స్థలాన్ని కేటాయించేందుకు 2019లోనే ముఖ్యమంత్రి చంద్రబాబు అంగీకారం తెలిపారు. ఆ మేరకే స్థల కేటాయింపునకు స్త్రీనిధి అధికారులు పలు దఫాలుగా సీఆర్‌డీఏ అధికారులతో చర్చలు జరిపారు. భవన నిర్మాణానికి తొలుత 1.50 ఎకరాల స్థలాన్ని కోరారు. డ్వాక్రా మహిళలకు రుణాలిచ్చే బ్యాంకుగా స్త్రీనిధి వ్యవహరిస్తున్నందున.. ఇటీవల రాజధానిలో జాతీయ బ్యాంకులకు శంకుస్థాపన జరిగిన ప్రాంతంలోనే భూమిని కేటాయించాలని విన్నవించారు. 45 సెంట్ల స్థలాన్ని ఇచ్చేందుకు సూత్రప్రాయంగా అంగీకరించిన సీఆర్‌డీఏ అధికారులు ఆ తర్వాత కేటాయించకుండా కాలయాపన చేస్తున్నారు. స్త్రీనిధి సంస్థ వద్ద నిధులకు కొరత లేదు. స్థలం కేటాయించిన వెంటనే నిర్మాణ పనులు చేపట్టేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారు.